# పొలిమెర

## తెలంగాణ సామాజిక వ్యాసాలు

అంబటి వెంకన్న

జాబిలి కళామండలి
నల్లగొండ

జాబిలి కళామండలి ప్రచురణ -1

నవంబర్, 2014
ప్రతులు: 1000

**పొలిమేర**
**తెలంగాణ సామాజిక వ్యాసాలు**

వెల : 100/- రూ॥

**కవర్ డిజైన్** :- గిరి

ప్రతులకు :-
**జాబిలి కళామండలి ప్రచురణలు**
ఇం.నెం. 7-1-155/D9/7
శ్రీనగర్ కాలనీ, పానగల్ రోడ్
నల్లగొండ - 508 001
సెల్ : 9966376072, 9492755448

అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో

ముద్రణ :- చరిత ప్రింటర్స్
హైద్రాబాద్

# అంకితం....



తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగ
టి.ఆర్.ఎస్ పార్టీలో క్రియాశీలపాత్రను పోషించి,
పొలిట్‌బ్యూరో స్థాయికి ఎదిగి
సీమాంధ్ర ఛానెళ్ళకు ముచ్చెమటలు పట్టించి
తెలంగాణ వాదాన్ని ప్రతిధ్వనిపంజేసిన
మా యువ నాయకుడు **కర్నె ప్రభాకర్**
శాసనమండలి సభ్యులు గారికి...

| ఇండ్ల.... | | క్రమసంఖ్య |
|---|---|---|


| | | |
|---|---|---|
| 1. | హైద్రాబాద్ తెలంగాణ గుండె | 01 |
| 2. | ఆటపాటలే తెలంగాణ ఆభరణాలు | 10 |
| 3. | తెలంగాణను అణిచివేస్తే... | 15 |
| 4. | ఇంకెన్నాళ్ళు... | 17 |
| 5. | మనం సాధించగలం | 21 |
| 6. | ఇది ప్రజాస్వామ్యమా..! | 25 |
| 7. | రాష్ట్ర సాధన కోసమే.. | 29 |
| 8. | తెలంగాణ ఐయ్యక తప్పదు | 34 |
| 9. | మీ కమిటీలకు మా నివేదిక | 40 |
| 10. | ఏమైనా జరగొచ్చు | 45 |
| 11. | విభజనతోనే హైద్రాబాద్ రద్ది ప్రశాంతం | 48 |
| 12. | ఇది తెలంగాణ పాట ఇదే తెలుగు బాట | 56 |
| 13. | పాట - కొన్ని ఆలోచనలు | 63 |
| 14. | తెలంగాణ యాస భాషల శ్వాస కాళోజీ | 68 |
| 15. | తెలంగాణ సాహిత్య చరిత్ర | 74 |
| | **అనుబంధ వ్యాసాలు** | |
| 16. | నేటి రాజకీయాలు - నైతికత | 80 |
| 17. | మాది చుండూరు -నాగపూర్‌లోని ఖైర్లాంజి | 83 |
| 18. | పాఠ్యపుస్తకాలు-ప్రభుత్వస్కూళ్ళు | 85 |
| 19. | తెలంగాణ బెస్తోల్ల గోడు విందాం | 93 |
| 19. | బహుజనుల బతుకుల్లో వెలుగు | 100 |
| 20. | ఆదివాసీల కన్నీటి అలుగే పోలవరం | 109 |
| 21. | బతుకమ్మ లేనిదే...బతుకు లేదు | 113 |
| | **రచయిత పరిచయం** | |



ఈ పుస్తకానికి ఆర్థికంగ సహకరించిన మిత్రుడు

మా జాబిలి కళామండలి గౌరవాధ్యక్షులు

ఉప్పల్ టి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు

**శ్రీ తవిడబోయిన గిరిబాబుకు**

**తెలంగాణ ఉద్యమాభివందనాలతో...**

# నా మాట

ప్రపంచ చరిత్రలో ఎక్కడ జరగని ఒక బృహత్తరమైన పోరాటం. నాలుగున్నర కోట్ల ప్రజల అలుపులేని పోరాటం తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమం. మాటల జడివానై, పాటల ప్రవాహమై ఉవ్వెత్తున ఎగిసిపడిన కడలి తరంగం మన తెలంగాణ ఉద్యమం. తీరం చేరడమే లక్ష్యంగ ప్రతి ఒక్కరు రాష్ట్రసాధనే ధ్యేయంగ అడుగులేసింద్రు. అనునిత్యం పోరాటంలో మమేకమయ్యింద్రు. అయితే ఇదే సమయంలో అదును చూసి ఉద్యమంలోకి ఉరుకొచ్చినోల్లు, అవకాశవాదులు లేకపోలేదు. వాస్తవానికి వాళ్ళే ఎక్కువున్నరు. గోడమీది పిల్లుల్లెక్క ఇటైతె ఇటు దునుకుడు, అటైతె అటు దునుకుడు అన్నట్లు కాస్కొని కుసున్నోళ్ళే ఎక్కువున్నరు. అంతర్గతంగ ఎవరి ఎజెండ వాళ్ళ మదిలో పెట్టుకొని, పైకి మాత్రం అంత తెలంగాణ కోసమే అన్నట్టు నడిసొచ్చినోల్లున్నరు. నాటకాలాడినోల్లున్నరు. ఏదేమైన అరవై సంవత్సరాల తెలంగాణ గోడు తెల్లారింది. సుదీర్ఘ పోరాటం విజయం సాధించింది. దేశ చరిత్రలో తెలంగాణ 29వ రాష్ట్రంగ ఆవిర్భవించింది. ఈ క్రమంలో 1996లో దళిత కవిగా మొదలైన నా సాహిత్య ప్రస్థానం క్రమంగ కథలు, పాటలు రాయడం జరిగింది. అయితే తెలంగాణ ఉద్యమం ఉధృతమై ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న సమయంలో తెలంగాణ బిడ్డలు ఎవరు ఏం చేస్తున్నరో దిక్కుతోచని ఒక అయోమయ పరిస్థితి. పోరాటం చేసేవాళ్ళు ఒకవైపు. ఆత్మహత్యలు చేసుకునే వాళ్ళు మరోవైపు. ఈ స్థితిలో కేవలం కవిత్వం రాసి, పాటలు రాసి స్వంత పనుల్లో నిమగ్నమై చేతులు దులుపుకోలేదు. 2000 సంవత్సరంలో తెలంగాణ పాట రాసిన నేను పార్టీలకు, సంఘాలకు అతీతరంగ తెలంగాణ ప్రత్యక్ష ఉద్యమంలో పాలుపంచుకున్న. 2002 నుంచి అప్పటి వరకు పనిచేస్తున్న ప్రైవేట్ స్కూల్ టీచర్ ఉద్యోగానికి స్వస్తి పలికి తెలంగాణ సభలు, సమావేశాలు నిర్వహించడంతో పాటు బంద్‌లు, ధర్నాలు, రాస్తారోకో వంటి ప్రతి కార్యక్రమంలో ముందు వరుసలో నిలబడ్డ. మీడియా అనంగనే ఎగబడి ఫోటోలకు ఫోజులిచ్చేవాళ్ళకు అవకాశం ఇచ్చి ఎప్పుడు ఓ రెండడుగులు ఎనకకు జరిగి నిలబడ్డ.

ముఖ్యంగ వలస పాలకుల చేష్టలకు తెలంగాణ రక్తం సలసల మరిగి, నియంతలను మించిన సీమాంధ్రులను ఇక పొలిమెర దాటించాలని నిర్ణయించుకుంద్రు. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు తెలంగాణ రాదు, రానియ్యరు అన్న భావనలో ఏదో చేయాలె, ఎంతకైన తెగించాలనే ధృఢసంకల్పం కలిగింది. మనసు పరిపరి విధాల ఆలోచించింది. దొంగ కొడుకులను దొరికిచ్చుకొని ఎగిరి గొంతు కొరకాలన్నంత కోపం. పట్టలేని ఆవేశం కట్టలు తెంచుకునేది. ఈ స్థితిలో సీమాంధ్ర మీడియా ఒకవైపు.

సీమాంధ్ర తొత్తులుగా మారిన తెలంగాణ నాయకులొకవైపు తెలంగాణ ప్రజలకు ఊపిరాడకుంట జేసింద్రు. అర్థం లేని టీవీ చర్చల కారణంగ ఆవేశకావేశాలు పెరిగి ఆత్మహత్యల వైపు అడుగులేసింద్రు. నిజానికి తెలంగాణ మలివిడత పోరాటంలో 'ధూంధాం' సభలతో గొప్ప సాంస్కృతిక చైతన్యం కలిగింది. పెద్దలు, ఉద్యమ నాయకులు, మేథావులు చెప్పే మాటల వల్ల పరిణతి చెందిన భావజాల వ్యాప్తి జరిగింది. ఉద్యమం హింసా రూపం దాల్చకుంట ఆపగలిగింది. లేదంటే 1969 పోరాటం లెక్క మారి అణిచివేయబడేది.

తెలంగాణ కోసం ఎంతటి త్యాగానికైన ముందు నిలిసిన ఈ నేల ఇక్కడి వాతావరణాన్ని, ఇక్కడి ప్రజల జీవన విధానాన్ని, భాషను ఎద్దేవ చేస్తూ ఎగతాళి చేసే ఆంధ్రోల్లను ఇంకా భరించ వలసిన అవసరం లేదు. ఏరుబడ్డంక ఎవనింట్లకు వాడు పోవలసిందే. మర్యాదగా మీదేందో మీరు తీసుకొని ఈ నేల ఖాళీజేసి ఎల్లిపోరి. మీ బుడ్డపెత్తనాలు ఇంకా ఇక్కడ సాగవ్. లేకుంటె ఎంటబడి పొలిమెర దాటింటే రోజులొస్తయ్ అని హెచ్చరిస్తున్నాను. ఈ క్రమంలో నేను రాసిన నాలుగక్షరాలే "పొలిమెర" తెలంగాణ సామాజిక వ్యాసాలు. తెలంగాణ ఉద్యమ సమయంలో దాదాపు 2004 నుండి ఇప్పటి వరకు "నమస్తే తెలంగాణ, నడుస్తున్న తెలంగాణ, పోరు తెలంగాణ, సంతకం, 'వర్జి' పత్రికలలో ప్రచురించబడిన తెలంగాణ వ్యాసాలతోపాటు వివిధ సామాజిక అంశాల మీద రాసిన ఈ వ్యాసాలను పుస్తకంగ వేయదలుచుకున్నాను. ఈ పుస్తకం బయటికి రావడానికి సహకరించిన మిత్రులకు, నా వ్యాసాలను ప్రచురించిన పత్రికలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

ముఖ్యంగ నిత్యం నా వెన్నంటి ఉండి తగిన సలహాలు, సూచనలు చేసే సాహితీ మిత్రులు పెద్దలు అంబటి సురెంద్ర రాజు, దుశర్ల సత్యనారాయణ, దేవులపల్లి కృష్ణమూర్తి, నోముల సత్యనారాయణ, దేశపతి శ్రీనివాస్, సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, పాటల మాంత్రికుడు రసమయి బాలకిషన్, వేణుసంకోజు, డా॥ కదిరె కృష్ణ, పగడాల నాగేందర్, డా॥బెల్లి యాదయ్య, మునాస వెంకట్. ఎలికట్టె శంకర్‌రావు, దుర్గాప్రసాద్ అవధానం, డా॥ పోరెడ్డి రంగయ్య, వేముల వెంకటేశ్, బైరెడ్డి కృష్ణారెడ్డి, డా॥కృష్ణ కౌండిన్య, బండమీది అంజన్న, ప్రసాద్ ఫోటోస్ శ్యాంప్రసాద్ ప్రతి ఒక్కరికి పేరుపేరున ధన్యవాదాలు.

**–అంబటి వెంకన్న,** కవి గాయకులు

నల్లగొండ.




**తె**లంగాణను ఆంధ్రతో కలపాల్సిన అవసరం లేదని నాడు ఫజల్ అలీ కమీషన్ సమర్పించిన నివేదికతో పాటు, తెలంగాణ ప్రజలు ఎప్పుడు కోరితే అప్పుడు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు చేయాలని పెద్దలు, తొలి ప్రధాని జవహార్‌లాల్ నెహ్రూ చెప్పిన మాటల్ని గౌరవిస్తూ వారి ఆత్మకు శాంతి చేకూర్చాల్సింది పోయి ఏండ్లకేండ్లు గడుపుకుంట ఎలక్షన్‌లలో గెలిచి, పదవులను అనుభవించి తెలంగాణను ఓట్ల రాజకీయం చేస్తున్నరు.

ఈ కాంగ్రేసు నాయకులు నెహ్రూకు ఆత్మ క్షోభను కలిగిస్తున్నరు తప్ప సమస్యను పరిష్కరించింది లేదు. ఒకరకంగ రాజకీయ నాయకులకు బాగా అచ్చొస్తున్న అంశం తెలంగాణ. తెలంగాణ పదం ఎత్తుకుంటెనే అధిష్టానం దిమ్మతిరిగి పదవులు కట్టబెట్టిన సందర్భాలు కోకొల్లలు.

ఏ పార్టీకైన తెలంగాణ పాటపాడితే కొంత వరకైనా ఓటర్లు కోరస్ ఇస్తరన్న గ్యారంటీ ఏర్పడింది. ఇట్ల వాళ్ళ స్వలాభం కోసం తెలంగాణ పాటందుకున్నరు తప్ప, ఏ ఒక్కరు తెలంగాణ గోసను అర్ధం చేసుకున్న పాపాన పోలేదు. ఆ విధంగ 1969 తెలంగాణ ఉద్యమానికి తూట్లుపొడిచిన చెన్నారెడ్డి, ఇంద్రారెడ్డి, చిన్నారెడ్డి లాంటి ఇతర కాంగ్రేసు నాయకులు అంతకంతకు అన్ని విధాలుగ లాభం పొందింద్రు.

ఏదైతే ఏముంది తెలంగాణ అంశాన్ని మట్టి కప్పి, గవర్నర్‌లుగా, మంత్రులుగా, ముఖ్యమంత్రులుగా దర్జాను ఒలకబోసింద్రు.

ఇలాంటి అనేకానేక పరిణామాల అనంతరం ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగ ఆవిర్భవించిన టి.ఆర్.ఎస్. ఉద్యమ పార్టీగ అవతరించింది.

టి.ఆర్.ఎస్. పార్టీ ఆవిర్భావం నుంచి వ్యూహాత్మక ఎత్తుగడలతో ఉద్యమాన్ని నిర్మించింది. తెలంగాణ ప్రాంతాన్ని బలవంతంగ సీమాంధ్రలో విలీనం చేసిన నాటినుంచి జరుగుతున్న దోపిడి, అవమానాలను ప్రజలకు అర్ధమయ్యేటట్టు చెప్పడంలో విజయం సాధించిండు ఆ పార్టీ అధినేత కేసీయార్.

తెలంగాణ విషయంలో కేసీయార్ ఇప్పటి వరకు వేసిన ప్రతి ముందడుగు, చేపట్టిన ప్రతి కార్యక్రమం గర్వించదగినదే. మొన్నటి ఉప ఎన్నికలు కూడా ఆ ఎత్తుగడల్లో భాగమే. కాని ఉప ఎన్నికల ఫలితాల తర్వాత ఆ పార్టీ విధాన నిర్ణయాలు, కార్యక్రమాలు ఎటువైపు పోతున్నయో అర్ధంగాని ఒక సంధిగ్ధ స్థితి ఏర్పడిన మాట వాస్తవం.

మొన్నటి దాక కేసీయార్ మీద తెలంగాణ ప్రజల్లో అచంచల విశ్వాసం ఉండేది. ఎట్లయిన తెలంగాణ సాధిస్తమనే నమ్మకం ఉండేది. కాని కరుడు గట్టిన సమైక్యవాదులతో ఎన్నికల పొత్తులకు సిద్ధమైన టిఆరెస్ పార్టీ భవిష్యత్తులో తెలంగాణను ఏ గతి పాలు చేస్తదో అనే అనుమానం తెలంగాణ ప్రజలను ఒకింత అయోమయానికి గురిచేసింది. అయితే ఇది కేసియార్ వ్యూహాల్లో భాగమై ఉండవచ్చునని అర్ధం చేసుకున్నవాళ్ళు లేకపోలేదు. కేసీయార్ తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభించిన నాటినుంచి కొన్ని విషయాలలో తన ఒంటెద్దు పోకడలను కూడా సంయమనంతో భరించిన నాయకత్వం తన వెంట ఉండటం ఒక వరం. ముఖ్యంగ తెలంగాణ సిద్దాంత కర్తలు, కవులు, మేధావులు ఎప్పటికప్పుడు ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లే అనేక సూచనలు చేస్తూ, అందరినీ సమన్వయపర్చుకుంటూ సుదీర్ఘ కాలంపాటు ఉద్యమాన్ని నడిపించడం జరిగింది. నాకు తెలిసి ప్రపంచ చరిత్రలో ఏ ఉద్యమం ఇంత బలంగ, దీర్ఘకాలికంగ, సజీవంగ ఉండక పోవచ్చు. ఎందుకంటే ఏ మనిషి పొద్దంత పండ్లు బిగపట్టి కోపంతో ఉండడం సాధ్యం కాదు. అలాంటిది ఉవ్వెత్తున ఎగిసిన తెలంగాణ ఉద్యమం ఇంత దీర్ఘకాలికంగా కొనసాగుతున్నా ఉద్యమ స్వభావంలో ఏ విధమైన మార్పు లేదు. ఎప్పటికప్పుడు లోపాల్ని సవరించుకుంటు లక్ష్యం వైపు అడుగులేసింద్రు. దానికి కారణం కేసియార్ రాజకీయ ఎత్తుగడలతో పాటు మరోవైపు తెలంగాణ సాంస్కృతిక ఉద్యమం బలంగ ఉండటమే.

తెలంగాణ వస్తుప్రధానంగ లెక్కలేనంత సాహిత్యం పుట్టుక రావడం.

అనేక కథలు, కవితలు, నవల వంటి సాహితీ ప్రక్రియల్లో తెలంగాణ వెతలను, తెలంగాణకు జరుగుతున్న నిలువు దోపిడిని ప్రజలకు పూసగుచ్చినట్టు వర్ణించడం జరిగింది.

ఈ వరుసలో పాట ప్రధాన భూమికను పోషించింది.

పాట జన హృదయాలను అంటిపెట్టుకొని వాళ్ళను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసింది. ఉద్యమం వైపుకు నడిపించి, ఒక బలమైన సాహిత్య ప్రక్రియగా నిలిచింది.

తెలంగాణ ఆటపాటల ధూం-ధాంలతో పల్లెపల్లెలో తెలంగాణ నినాదం ఎగిసిపడింది. ముఖ్యంగ టి.ఆర్.ఎస్. పార్టీ వేదికల మీద తన ఆటపాటలతో సంభాషణలతో గంటల తరబడి ప్రజలను నిలువరించిన గొప్ప కళాకారుడు రసమయి బాలకిషన్ బృందం ఒక పార్శ్వమైతే, పార్టీలకు అతీతంగ ప్రజల చైతన్యం కోసమే సాంస్కృతిక ఉద్యమాన్ని భుజాన వేసుకున్న ప్రజాయుద్ధనౌక గద్దరన్న ఒకవైపు. సాంస్కృతిక శాంతియాత్ర పేరుతో తెలంగాణ పల్లెల్లో నిర్వహించిన ఆ యాత్ర తెలంగాణ ఉద్యమానికి ఆయువుపట్టులా నిలిసింది. జనం గుండెల చప్పుడు దప్పు రమేశన్న, ప్రజా యుద్ధభేరి విమలక్క, మాభూమి సంధ్యలు తెలంగాణ సాంస్కృతిక ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడం జరిగింది. కవిగాయకులు కళాకారులు ప్రజల పక్షాన ఉండి ప్రజా తెలంగాణను సాధించుకోవాలనే తపనతో ప్రతి ఒక్కరు ఆటపాటల ధూం..ధాం కార్యక్రమాలలో భాగమయ్యింర్రు.

ప్రధానంగ ధూం ధాం అంటూ ఆట పాటలను మేళవించి జనహృదయాలను దోచుకున్న జానపద కళాకారులు, వాద్యకారులు, కవిగాయకులు ఎందరో తెలంగాణ సాంస్కృతిక ఉద్యమంలో శక్తి వంచన లేకుండా కృషి చేసింర్రు.

వీళ్ళ కృషి అమోఘమైనది. చరిత్ర ఏనాటికి మరువ లేనిది.

తెలంగాణకు విద్యా ఉద్యోగాలలో తీరని అన్యాయం, దోపిడీ జరుగుతున్నప్పటికీ విద్యార్థులు, ఉద్యోగస్థుల పాత్ర ఏమిటి? ఇంత వరకు వాళ్ళు చేసినదేముంది. పెరుగుతున్న సాంకేతికత కారణంగా విద్యార్థులకు సమస్య తీవ్రత తెలుస్తలేదు. ఇయ్యాల వాళ్ళకు కుటుంబం, సమాజం అవసరంలేదు. వాళ్లకు కావలసింది సెల్‌ఫోన్‌లు, ఇంటర్‌నెట్‌లు, పబ్‌లు, ఎస్సెమెస్‌లు, ఎఫ్. ఎమ్ పాటలు, బూతు సినిమాలు ఈ పనులల్లో వాళ్ళు చాలా తీరిక లేకుంట ఉన్నరు.

ఇండ్లల్లో ఆడవాళ్ళు టీవీ సీరియల్స్‌కు అతుక్కపోయినట్టు, యువతరం చేతిలో సెల్‌ఫోన్‌లు బట్టుకొని కన్నార్పకుండ చూస్తున్నరు.

తల్లి దండ్రుల అక్రమ సంపాదనతో అలుపు, ఆయసం ఎరుగని కొడుకులు పెద్దల పట్ల, సమాజం పట్ల కనీస గౌరవ మర్యాదలు లేకుంట అడ్డదిడ్డంగ పెరుగుతున్నరు.

ఇట్లాంటి వాళ్లకు తెలంగాణ గోసను పూసగుచ్చినట్టు చెప్పడంలో మేథావి వర్గం సఫలీకృతం అయ్యింది. విద్యార్థులు స్వయంగ తమ కళాశాలలు విశ్వవిద్యాలయాలను వదిలేసి తెలంగాణ వచ్చేవరకు మాకు చదువులే అక్కరలేదు అన్నంతగా ప్రభావితం చేసిన ఘనత తెలంగాణ ప్రజా ఉద్యమానికే దక్కుతుంది. అయితే ఇదే సంధర్భంలో వలసాంధ్ర పాలకులు

తెలివిగా తెలంగాణ ఉద్యమం ఉధృతం అవుతున్న క్రమంలోనే విద్యార్దులను ఉద్యమానికి దూరంగా ఉంచాలని ప్రయత్నించింది. అన్ని రకాల ఉద్యోగాలను కనీసం పదుల సంఖ్యలోనైనా సరే నోటిఫికేషన్‌లు జారి చేసి, తెలంగాణ విద్యార్థులకు తీరని ద్రోహం తలపెట్టింది. అయినా మన విద్యార్థులు ఉద్యమంతో పాటు ఉద్యోగాలను సాధించడంలో సైతం ముందు నిలిచిండ్రు. టీచర్ ఉద్యోగాలను ఎరవేసి ఏ విధంగానైన సరే విద్యార్థులను తెలంగాణ ఉద్యమానికి దూరం చేయాలని తీవ్రంగా ప్రయత్నించి విఫలమయ్యింది.

ముఖ్యంగ యువకులు సినీ హీరోల మోజులో పైసకు పనికిరాని ఆంధ్ర సినిమాలను చూసి అక్రమ సంబంధాలకు మరిగి వయసు తేడాను మరిచి, వావి వరుసలు విడిచి, నీచాతి నీచంగ వ్యవహరిస్తున్నరు. కాబట్టి ఈ విధమైన ఆంధ్ర సినిమా, సీరియల్ల దుష్ట సంస్కృతిని, ఆంధ్ర చానెళ్ళ ద్వంద్వ నీతిని ప్రశ్నించడం, ఎండగట్టడం కూడ ఉద్యమంలో భాగమేనని గుర్తించాలె. ఆ దిశగా పోరాటం చేయవలసిన అవసరం ఉన్నది.

ప్రతి కార్పోరేట్ స్కూళ్ళు, కాలేజీలలో ఎక్కువ శాతం తెలంగాణ విద్యార్థులే కనుక ప్రతిచోట తెలంగాణ అంశం మీద ఆటపాటల కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఎక్కడికక్కడ ఉద్యమాన్ని విస్తరించవలసిన ఆవశ్యకత ఉన్నది.

ఇక ఉద్యోగుల విషయానికొస్తే "తెస్తే వండిపెడతా–సస్తే ముండమోస్త" అన్నట్టు కనిపిస్తరు. అసలు ప్రధానమైన సమస్యలే వాళ్ళవి. ఒక్క ఉద్యోగి కూడా తెగించి ముందుకొచ్చింది లేదు. భయంభయంగ ఎనక ముందాడుతుంటరు. తెలంగాణ లోని ఉద్యోగులు ఒక్కనాడన్నా విధులను బహిష్కరిస్తూ ఉద్యమంలో పాల్గొన్నరా? గాంధీ సైతం అహింసా మార్గంలోనే సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ఉధృతంగా కొనసాగించలేదా? మరి మనం ఎందుకు చేయలేకపోతున్నం.

వీరులం శూరులం అన్నింట ధీరులం అని ఊదరగొట్టి అవతలి వాడు నవ్వుకునేటట్లు చేస్తున్నం. మనని మనమే తక్కువ చేసుకుని మన వీరత్వానికి నపుంసకత్వాన్ని జోడించి, గుండెధైర్యం కలిగిన మనం పిక్క బలం చూపిస్తూ ఆత్మ గౌరవాన్ని అంగట్ల పెడుతున్నం. లోపం ఎవరిదైనా అభాండం తెలంగాణ పైన వేస్తున్నం.

ఎప్పుడైనా, ఎక్కడైనా వీరుడొక్కడే కాకుంటే అతని చుట్టు తెగించి ప్రాణాలకు సిద్ధపడే వేలాది మంది ఉంటరు.

అట్ల తన చుట్టు ఉన్న అనుచర గనాన్ని తయారు చేసుకుని ఉద్యమ నిర్మాణంలో భాగమై ముందుకు సాగినపుడే ఫలితం లభిస్తుంది తప్ప, ఏదో సెలవు రోజులల్ల చిన్నచిన్న కార్యక్రమాలు చేస్తూ తెలంగాణ కోసం ఎంతో చేస్తున్నట్టు పత్రికల్లో కనపడినంత మాత్రాన తెలంగాణ ఉద్యమానికేం ఒరిగేది లేదు. ముఖ్యంగ తెలంగాణ యువత మూర్ఖమైన గుడ్డి

అభిమానంతో చిరంజీవి వెంట వెళ్ళడం కాకుంట ఎంతో న్యాయమైన డిమాండు, ప్రజాస్వామిక ఆలోచన అయిన ప్రత్యేక తెలంగాణ విషయంలో ఎవరినైన నిలదీయవలసిన అవసరం ఉన్నది. మొత్తం మీద ఇంతకాలం చేసిన తెలంగాణ ఉద్యమాలు, పోరాటాల ఫలితమేనో లేదంటే కడుపులో ఉన్న కుట్రల్ని కనపడకుంట జేసి తెలంగాణనుంచి హైద్రాబాదును విడదీయాలనే ఆలోచనతోనోగాని మొత్తానికి సోనియాగాంధి తెలంగాణ ఇవ్వాలనే నిర్ణయానికి వచ్చినట్లు అనిపిస్తుంది. ఎందుకంటే అన్ని పార్టీలు తెలంగాణ అంటుంటే ఒక్క కాంగ్రేసు లేనిపోని కథలల్లి తెలంగాణకు అడ్డుపడితే జనం చూస్తూ ముడుచుకోవడానికి ఇవి ఎనకటి రోజులు కావు.

అనాదిగా కాంగ్రేసు నాయకులు తెలంగాణకు ద్రోహం చేస్తనే ఉన్నరు.

తెలంగాణకు ముస్లీంలు అంగీకరించడం లేదని, రాయలసీమను ప్రత్యేక రాయలసీమగా చేయాలని అంటున్నరని లేనిపోని కుంటి సాకులు చెపుతూ తెలంగాణ ఇచ్చే క్రమంలో హైద్రాబాదు విషయంలో కుట్రపూరితంగ వ్యవహరించడం క్షమించరానిది.

తెలంగాణ తల్లికి పుట్టిన ఏ బిడ్డ తన కండ్లముందే తల్లి శిరస్సును ఖండిస్తుంటే సహించడు చేతులు ముడుచుకొని కుసోడు. అసలు నాకు ఎర్కలేక అడుగుత గుండె లేని మనిషిని, కాశ్మీర్ లేని భారతదేశాన్ని, హైద్రాబాద్ లేని తెలంగాణని ఊహించగలడురా ఎవడైనా..? ఇప్పుడు జెప్తున్నం హైద్రాబాద్ లేని తెలంగాణ వచ్చినా ఒక్కటే. రాకున్నా ఒక్కటే.

తెలంగాణ ప్రజల మనోభావాలకు, శౌర్యానికి, త్యాగానికి, ప్రేమ గుణానికి ప్రతీక ఈ భాగ్యనగరం. గోల్కొండ నవాబుల కీర్తి పతాకం మన హైద్రాబాద్.

ఇక్కడ కుల మతాలకు తావులేదు. సర్వమత సమ్మేళనంతో అందరూ అన్నదమ్ముల లెక్క పరస్పరం గౌరవించుకుంటూ, ఒకరి పవిత్రతను మరొకరు ఆరాధించుకుంటు, అలయ్ బలయ్ తీసుకొని ఆనందంగ బతుకుతరు.

అలాంటిది ప్రజాస్వామిక తెలంగాణను సాధించుకునే దిశలో హైద్రాబాద్ మీద మెలిక పెట్టి, ఇక్కడ చిచ్చు పెట్టాలని చూస్తే తెలంగాణ ప్రజలు, విద్యార్థులు, యువకులు, మేధావులు, కవులు, కళాకారులు ఊకునే సమస్యే లేదు. ఒకవేళ ఆ పరిస్థితే ఎదురైతే సంపూర్ణ తెలంగాణ సాధన కోసం పెద్దయెత్తున ఉద్యమాలను ఉధృతం చేయవలసిన అవసరం ఉన్నది. తెలంగాణ అంటున్న రాజకీయ పార్టీలు సంఘాలన్ని ఒక్కతాటిమీదికొచ్చి, ఒకే గొంతుకతో నినదించవలసిన అవసరం ఉన్నది. తెలంగాణ పదిజిల్లాలో ఒకేసారి కార్యక్రమం నిర్వహిస్తూ శత్రువుకు దడపుట్టించ వలసిన అవసరం ఉన్నది. అట్ల చేయకుండ ఒకరు అలసిపోయినంక మరొకరు పోరాటానికి దిగి, రాశికి, రంగానికి రాకుంట చేయడమే అయితది. శత్రువు అణిచివేయగల సిపాయిల తిరుగుబాటు చేయడం కన్నా అందరు ఏకమై ఒక్కసారే

క్విట్ తెలంగాణ ఉద్యమాన్ని చేయడం మంచిది. ఆ సమయం కూడ ఆసన్నమైనది. లేకుంటే వాళ్లు కుంటి సాకులతో తెలంగాణను రక్తసిక్తం చేయడమే కాదు, ముక్కలు చెక్కలుగ చేసి వొట్టిపోయిన తెలంగాణను చేతిలో పెట్టి వెళ్ళిపోయే ప్రమాదం ఉన్నది.

ఈ క్రమంలో తెలుగు దేశం పార్టీలో తెలంగాణ విషయాన్ని లేవనెత్తి అవమానానికి గురైన దేవేందర్ గౌడ్ సమైక్యాంధ్ర విధానాన్ని ఎండగడుతూ "ఆకలినైనా భరిస్తాం కాని అవమానాన్ని భరించం. మా ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టం" అంటూ నిజమైన ప్రజా తెలంగాణ కోసం ఆ పార్టీ నుంచి విడిపోయి నవతెలంగాణ పార్టీని స్థాపించడం జరిగింది.

నీరు గారిపోతున్న తెలంగాణ ఉద్యమానికి కొత్త ఊపిరి వచ్చినట్టు అయింది.

నిస్వార్థంగ తను చేస్తున్న కార్యక్రమాలు జనాధరణ పొందడమే కాకుంట ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి గుండె ధైర్యాన్నిచ్చింది. తెలంగాణ ప్రజలు విద్యార్థులు, యువకులు, మేధావులు నవ తెలంగాణ వైపు మొగ్గుచూపుతున్న తరుణంలో రాష్ట్ర రాజకీయాలు మరో మలుపు తిరిగినయ్. అప్పటివరకు తెలుగు సినీ జగత్తులో ధృవతారగా వెలిగిన మెగాస్టార్ చిరంజీవి ప్రజా రాజ్యం పార్టీ స్థాపించడంతో కొంతవరకు తెలంగాణ ప్రజల్లో, నాయకుల్లో సందిగ్ధ పరిస్థితి ఏర్పడింది. అభివృద్ధి పేరుతో అనేక పధకాలను ప్రారంభించి గెలుపు ధీమాతో ఉన్న కాంగ్రెసు పార్టీకి చిరంజీవి రాక ఉలికిపాటును కలిగించింది. అయినా వై.యస్. జబ్బ చరుచుకొని అంతే ధీటుగా సినీ గ్లామర్‌ను ఎదుర్కోవాలని ప్రయత్నిస్తుండు. దానికి ఎన్నో జిమ్మిక్కులు చేస్తుండు. పైసకు కొరగాని అభివృద్దిని చూపించి తెలంగాణ విషయంలో ప్రజలను మభ్య పెడుతుండు.

నోటితోని ఒక్క స్టేట్‌మెంట్ ఇవ్వంగనే సమస్య పరిష్కారమైనట్టు, ఆరోగ్యశ్రీ అంటూ చేతిలో స్టెతస్కోప్ పట్టుకోంగనే రోగాలు నయమైనట్టు ప్రగల్భాలు పలుకుతుండు.

తెలంగాణ ప్రాంత అభివృద్ధికి సాక్షి కేవలం పత్రికా ప్రకటనలే అనుకుంటుండు.

అన్ని రంగాలలో తెలంగాణను మునుపటి కన్నా మించి దోపిడి చేస్తూ ఇక్కడి భూములను కొల్లగొడుతూ, కొండలు గుట్టలను నేలమట్టం చేస్తుండ్రు. పుట్టేటోనికి గంటెడు భూమి దొరకకుంట, సస్తే బొందబెట్టే తావులేకుంట తెలంగాణను సెజ్‌ల పేరుతోని సర్వనాశనం చేస్తుండు. ఇక్కడి సంపదను తరలించుకొని పోయి కోస్తా, రాయలసీమ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తూ రోజులెల్లదీసుకుంట ఆంధ్ర వలస పాలనను కొనసాగిస్తుండ్రు. ప్రాజెక్టుల పేరుతోని ఊర్లకు ఊర్లు తరలిస్తుండ్రు. ఇక్కడ అసంపూర్తి కాల్వలను తవ్విపెట్టి నీళ్ళను సీమాంధ్రకు మల్లుకపోతున్నరు. పైగా ప్రపంచ చరిత్రలో గొప్ప పేరున్న తెలంగాణ ఉద్యమాలకు, త్యాగాలకు పుట్టినిల్లు. ఇంతమంది మేధావులున్నరు, బలమైన నాయకత్వం ఉన్నది. మరి తెలంగాణ వస్తలేదెందుకని? అవకాశం వచ్చినకాడల్లా ఆంధ్రనాయకులు చులకన చేసి

మాట్లాడటాన్ని కూడ మనం వ్యతిరేకించాల్సిన అవసరం ఉన్నది. ఉరుకమని కొంకులుగొట్టే కొడుకులు తెలంగాణ ప్రతి కదలికను గమనించి దాన్ని అడ్డుకునే ఎత్తులు వేస్తూనే ఏమీ తెలువనట్టు నంగనాచి మాటలు మాట్లాడుతూ నవ్వుతున్నరంటే వాళ్ళ కపటబుద్ధి అర్థమైతనే ఉన్నది. గీ ఓట్లు అయిపోయేంత వరకు గిట్నే బుజ్జగిస్తే అయిపోతది. అయిటెంక మల్లెవడు నోరెత్తడని కూడ వాళ్ళు అనుకుంటున్నరంటే తెలంగాణ ప్రజలు ఏ స్థాయితో ఆలోచించాల్నో ఏ రకమైన ఉద్యమ నిర్మానానికి పూనుకోవాల్నో అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉన్నది.

తెలంగాణ ఉద్యమం ఇంత తీవ్రంగ ఉన్న ఈ దశలో కూడ సీమాంధ్ర పాలకులు వాళ్ళ దోపిడిని ఆపడం లేదంటే మనం ఇంకా ఏం చేయగలమో ఆలోచించాలె. ఎట్లయినా స్వాతంత్రం ఇవ్వక తప్పదనుకున్న బ్రిటీషోడు చివరి ఘడియల్లో భారతదేశ సంపదను దోచుకుపోయినట్టు ఈ ఆంధ్ర వలస పాలకులు తెలంగాణ ఇవ్వడంలో జాప్యం చేస్తూ తెలంగాణను కొల్లగొట్టి పీల్చిపిప్పి చేస్తున్నరు. ఇంత జరుగుతున్నా తెలంగాణ ప్రజల్లో తెగింపు లేదంటే ఇన్నేండ్లు ఇడ్లీ దోషతిని మన చేవజచ్చిపోయినట్టుంది.

గుండ్లు గుట్టల్ని, రాళ్ళు రప్పల్ని చదును చేసి చెర్లు బావులు వ్యవసాయభూములుగా మార్చుకొని, ఎద్దెనుక ఎద్దుగా కదిలి మోటగొట్టిన శ్రమజీవి తెలంగాణ బిడ్డ. శారీరక కష్టంతోనే సుఖాన్ని పొందిన తెలంగాణలో ముఖ్యంగా హైద్రాబాదు చుట్టూ కాలనీలుగా ఏర్పడిన వలసాంధ్రులు దగా, మోసంతో ధనార్జనకు మరిగింద్రు. ఒల్లు అల్వకుంట, తనువమ్ముకొని పైసలు సంపాదించే సులువైన మార్గాలతో తెలంగాణను దోపిడీ చేస్తున్నరు.

ఇయ్యాల హైద్రాబాదులో అడ్డ పిటాయించిన ఆంధ్రులు హైద్రాబాదు విషయమై జనాభిప్రాయ సేకరణ జరిపినా కుట్రదారులైన ఆంధ్రులుగాని, ఇదే విషయమై ఏటీవీలోనైనా, సర్వేలోనైనా ఎక్కువ మంది జనం హైద్రాబాదును సపరేటు కావాలనే కోరుకుంటున్నారనే తేల్చి పారేస్తరు. ఎందుకంటే కష్టపడి భూమిని సంపాదించిన తండ్రిని అడుగకుంట రెండో పెండ్లాం కొడుకుతో  భూమిని భేరం జేస్తే వొచ్చిన కాడికే దక్కోలనుకొని అమ్మడానికి సిద్ధపడతడు. అదే కన్న కొడుకైతే తండ్రి కష్టం తెలిసినోడైతే ఏమిచ్చినా భూమి మాత్రం ఇయ్యనని మొండికేసి కూసుంటడు.

తను పస్తులుండి అవతలోని ఆకలి తీర్చే తల్లి మన తెలంగాణ. లేకుంటే ఇయ్యాల ఇంతమంది జనం ఈ హైద్రాబాదు గడ్డమీద హాయిగా ఎట్ల బతుకుతున్నరు? బీహార్, ఒరిస్సా, రాష్ట్రాలకు చెందిన అనేకమందితో పాటు దేశంలోని ఇతర రాష్ట్రాల ప్రజలతో పాటు నేపాల్ వంటి ఇతర దేశస్థులు సైతం హాయిగా ఎట్లుంటున్నరు. అయితే వీల్లెవరితోనూ ఎలాంటి ప్రమాదం లేదు. కాని ఈ సీమాంధ్ర పాలకులు తెలంగాణ ప్రజల మంచితనాన్ని, దానగుణాన్ని, త్యాగనిరతిని అమాయకత్వంగ భావించి, భాష పేరుతోని ఒక్కటై రాబంధుల్లా పీక్కతిన్నరు.

తమిళులతో నెగలలేక కోస్తాంధ్రనించి వలసొచ్చిన గుంటనక్కలు రాష్ట్రానికి పేరుపెట్టడం నుంచి మొదలు అన్ని రకాలుగ తెలంగాణను ముంచి కుసుంద్రు.

హైద్రాబాదు నింద చేరి తెలంగాణను వాళ్ళ ఇష్టారాజ్యంగ చేసుకున్నరు. ఇక్కడి భాషను ఆచార వ్యవహారాలను, కట్టుబాట్లను ఎద్దేవ చేసింద్రు.

బ్రిటీషోడు భారతదేశానికి చాయ, కాఫీ అలవాటు చేసినట్టు తెలంగాణ ప్రజలకు ఆంధ్ర సంస్కృతిని క్రమంగ అలవాటు చేసింద్రు.

ఇక్కడ నడిసే రైళ్ళు వాళ్ళకోసమే, బస్సులు వాళ్ళ కోసమే.

ఆ రైళ్ళలో, బస్సులల్లో తెలంగాణ ప్రజలకు జరిగే అవమానం మాటల్లో చెప్పలేనిది.

పెట్టుకుంటే రోజు పంచాదే. కొట్టుకుంటే రోజు కొట్లాటే.

గాంధీకి పరాయి దేశంలో అవమానం జరిగింది.

కాని తెలంగాణ ప్రజలకు మాత్రం వాళ్ళ సొంతగడ్డ మీదనే అవమానం, అన్యాయం జరుగుతుంది. దీనంతటికి కారణం వాళ్ళకున్న అధికారం కాదా?

"రాజు తల్చుకుంటే దెబ్బలకు కొదవా" అన్నట్టు అయిపోయింది. తెలంగాణది బానిస బతుకైపోయింది. "పటేలు పట్వారి నా పట్టుంటే ఎట్టెట్ట కొడతవొ కొట్టుర మొగుడా" అన్నట్టు ఆంధ్ర నాయకులు పెత్తనాన్ని చలాయిస్తుంద్రు.

ఈ క్రమంలో తెలంగాణ ఉద్యమాన్ని మరింత వ్యూహాత్మకంగా నడిపించాల్సిన అవసరం ఉన్నది. బతుకమ్మ, బోనాల పండుగలో శిగాలు ఊగడమే కాదు, ఈరగోళలు సేతబట్టి ఈరంగానికి దిగాలె.

అందరూ ఒకే గొంతుకతో దిక్కులు పిక్కటిల్లేటట్టు నినదించాలె.

నరం లేని నాలుకను నాలుగు విధాలుగ మలిపి నానా గంధరగోళాన్ని సృష్టించకుంట నాయకులు వాస్తవాన్ని ప్రజలకు వివరించాలె

మన తెలంగాణలో పుష్కలమైన వనరులే కాదు, అద్భుతమైన మేధా సంపత్తి ఉన్నది. గొప్ప సాంస్కృతిక భావన ఉన్నది. అయితే కొందరు దళారులకు మాత్రం పుసక్కున తెలంగాణ ఇస్తే మా ప్రాధాన్యత తగ్గిపోయి, ఆ తరువాత ఏమి చేయాలోనని ఎక్కడ తెలంగాణ ప్రజలకు దూరమైతమేమోననే భయం పట్టుకున్నట్లుంది.

కవులు, కళాకారులకు ఆటపాటలు ఆగిపోతయనే భయం ఉన్నట్లుంది.

సాహిత్యాన్ని క్యాసెట్లు చేసి పుస్తకాలేసి అమ్ముకోలేమనే భయం పట్టుకున్నట్లుంది.

ఉద్యమం పేరుతో బతికేటోళ్ళందరికి ఇంక కొన్నేండ్లు తెలంగాణ రాకుంటేనే బాగుండన్నట్లుంది. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు

"ఏముంది తెలంగాణ వస్తే ఇంతకన్నా అభివృద్ధి జరుగుతుందా" అన్నట్లు మాట్లాడడం చూస్తుంటే రక్తం మరిగిపోతుంది. కార్జం కాలిపోతుంది.

చెర్లకు నీల్లొస్తే ఎట్లనన్న బతుకొచ్చు అనుకొని బెస్తోల్లు, ఊరు ఊరంత సంబూర పడుతుంటే.. చెర్ల బొగ్గుబట్టి పెట్టుకున్నోడు, చెరువుభూమిని కబ్జాచేసి వ్యవసాయం చేసుకుంటోడు, శిఖం భూమిని ప్లాట్లుచేసి ఇండ్లు కట్టుకున్నోళ్ళు చెరువు ఎండిపోతెనే బాగుండునని మొక్కుతుండ్రు. అధికార్లతో భేరమాడుతుండ్రు.

అంతటితో ఆగకుంట రాత్రికి రాత్రే పోయి గండిపెట్టే కొడుకులున్నరు. చెర్లను ఎండబెట్టి డంపింగ్‌యార్డులుగా మార్చే ఎధవలున్నరు.

ఈ విధంగ ఇక్కడి వనరులకు, ఉద్యమానికి గండికొట్టే దుష్ట సంతానాన్ని కనిపెట్టాలె. కాళోజి అన్నట్టు ప్రాంతేతరుడైతే పొలిమెర దాక తరిమికొట్టాలె, ప్రాంతం వాడే అయితే అక్కడ్నే పాతిపెట్టాలె.




# ఆటపాటలు-అనుబంధాలే

# తెలంగాణకు ఆభరణాలు

'నేను తాగుత. చుట్టం మర్యాద కోసం తాగుత.

ఈ నేలకు మీ సమైక్య రాష్ట్రం వల్ల పట్టిన పీడ ఫ్లోరిన్ విషపు నీళ్ళు.

ఆ ఫ్లోరిన్ విరుగుడు కోసం కల్లు తాగుత.

ఆఖరికి పాలు, నీల్లు, కల్లు ప్రతిది ఫ్లోరిన్ విషమైన కాడ నా దిగులును, దుఃఖాన్ని మరిచి పోవడానికి తాగుత.

సీమాంధ్ర పాలన వల్ల పెరిగిన ఆకలి, దరిద్రం, నిరుద్యోగ భారంతో తాగుత. తాగి నేనేతప్పుచేయను. కానీ ఇప్పుడు తాగిన మత్తులో అనేక అరాచకాలకు పాల్పడేటట్టు చేసింది మీ ఆంధ్ర సంస్కృతి. తెలంగాణ జీవన సౌందర్యాన్ని కొల్లగొట్టింది మీ ఆంధ్ర సంస్కృతి" అనేది ఇక్కడి ప్రతి మనిషి మదిలో మెదిలే అంశం.

నీకు తెలుసా తినటం తాగటం వస్త్రాలు ధరించటం అనేది మనిషికి సంబంధించిన గొప్ప ఈస్తటిక్స్‌ని తెలియజేస్తుంది. అయితే ఏది తాగాలి, ఏది తినాలనేది ఇప్పుడు మనముందున్న ప్రశ్న.

గతంలో అయితే ఎవరికి ఏది తినాలనిపిస్తే అది తినేది. ఏది తాగాలనుకుంటే అది తాగేది. ఆహారపంటలకు ఆలవాలమైన తెలంగాణ నేల ఎప్పుడంటే అప్పుడు సద్దలు, జొన్నలు, కందులు, పెసర్లు, బొబ్బెర్లు ఏది కావాలంటే అది వొలిచి చేతుల్లో పోసేది. మరి అట్లాంటిది ఇప్పుడు ఈ ఆంధ్ర సంస్కృతి పెరిగిన తర్వాత, వ్యాపార దృక్పథం పెరిగి, వాణిజ్య పంటల కారణంగా వాళ్ళు నిర్ణయించింది మాత్రమే మనం తినాలె. వాళ్ళు నిర్ణయించింది మాత్రమే మనం తాగాలె. వాళ్ళు నిర్ణయించిన దుస్తులు మాత్రమే మనం

వేసుకోవాలనే పరిస్థితి ఏర్పడింది. అందుకు విరుద్దంగ మన ఇష్టానుసారం చేయబోతే నవ్వులపాలైపోతున్నం.

మరి మనిషి అత్యంతబలవంతంగ ఈ దుస్థితిలోకి నెట్టివేయడం అనేది సమాజ పురోగమనం అందామా? లేదంటే మనిషి తిరుగుప్రయాణంలో తనను తాను చిత్రవథ చేసుకుంటూ తిరోగమనం బాట పట్టిందనుకుందామా?

ఈ అర్థంకాని అయోమయ స్థితిలోకి నెట్టి వేస్తున్నది పాలకులు కానే కాదని అందామా? మీరే ఆలోచించాలె.

ఆదినుంచి తెలంగాణకు ఒక ప్రత్యేక సంస్కృతి ఉంది. అది ఈనాడు అనేక అవమానాలు, అవహేళనలకు గురై క్రమంగ అంతరించిపోతుంది. తెలంగాణలో ఎక్కడా, ఎప్పుడు ఏది అమ్ముకోవడం అనే ఒక వ్యాపార సంస్కృతి లేదు. కనీసం అరువు తెచ్చుకునే సంధర్భాలు కూడ చాలా తక్కువ. అన్ని ప్రేమపూరితమైన ఆత్మీయ బంధాలే. ఒకరికి కలిగింది మరొకరికి ఉచితంగ ఇస్తూ అవసరాలు తీర్చుకుంటూ, ఎక్కడ ఎలాంటి స్వార్థం లేకుండా ఆనందంగ బతకడమే. భారతదేశమంత ఉదారతే తెలంగాణ నేపథ్యం. ఇక్కడ అందరూ బంధాలు, అనుబంధాలు పెంచుకోవడానికే ఎక్కువగ ఆరాటపడతరు. దోస్తాన కోసం ప్రాణాలు సైతం లెక్కచేయని పుణ్యభూమి ఇది. ఇక్కడి ప్రజలు స్థానికులు కానివారితో కూడా సత్సంబంధాలు ఏర్పరచుకొని వారితో కలుపుగోలుగ ఉండడం ఈనేల నైజం.

ఇక్కడ ఒకరికొకరు వికసించడం తప్ప పరిహసించడమనే విష సంస్కృతి కనిపించదు. మరి అట్లాంటి ఈనేల మీద ఇప్పుడంత తీసుకునే సంస్కృతి పెరిగిపోయింది.

ప్రతిది అమ్ముకునే దౌర్భాగ్యం పెరిగిపోయింది. దరిద్రం తాండవిస్తుంది.

ఎంతసేపటికి ఎదుటి వారిది ఏదో కావాలనుకునే సంస్కృతి పెచ్చు పెరిగిపోయింది. దొంగతనాలు చేస్తూ దొరల్లా బతకడం ఫ్యాషనైపోయింది. ఇదంతా ఇక్కడికి వలసొచ్చిన సంస్కృతి కాకపోతే మరెక్కడ్నించి దాపురించింది.

పువ్వు సౌందర్యాన్నిస్తుంది. ఫలాలు ఇస్తుంది. కాని అది ఏమి ఆశించదు. ఆగొప్ప సంస్కృతే తెలంగాణది. అందుకు నిదర్శనం మన బతుకమ్మ పండుగ.

బంధం అంటే ప్రతిబంధకం కాదు– కాకూడదు.

అది ఒక అనుబంధం. అనుసంధానం చేయడం. సమ్మేళనం చేయడం.

అది ఒక్క తెలంగాణకే సాధ్యం.

అందరూ హాయిగ బతకాలని ఆశించే బతుకమ్మలు, ప్రపంచంలో ఎక్కడా లేని అనుబంధాలు ఈనేల సొంతం. ఈ తెలంగాణ నేలమీద ఆడబిడ్డలకు ఎంతో అపారమైన

గౌరవం ఉండేది. అక్క, చెల్లెలకు ఎప్పుడు ఏదో ఒకటి ఇవ్వడం అనేది ఈనేల గొప్ప గుణం. చీరలు, సారెలతో వారిని సత్కరిస్తూ, సంతోషపెట్టడం తప్ప వాళ్ళ కంట నీరొలికిన ఒక్క కథ లేదంటే ఆశ్చర్యం కాదు.

మరి అలాంటిది ఇప్పుడు అంతా వ్యాపారమయం అయిపోయింది.

ప్రతిది లాభ నష్టాల బేరమయ్యింది. చెల్లెలు రాకీ కట్టి, డబ్బులు తక్కువగా ఇచ్చిన అన్నను చూసి చిన్నబుచ్చుకునే కాలమొచ్చింది.

తెలంగాణలోని ఆత్మీయ బంధాలన్ని సీమాంధ్ర మార్కెట్‌లో సరుకులైనయ్.

హాయిగా బతికే తెలంగాణ గడ్డ మీద సీమాంధ్ర పాలన అనుసరణ సంస్కృతిని పెంచింది, అనుకరణ విధానం నేర్పింది. ఒకరిని చూసి ఒకరు ఈర్ష్యపడేటట్టు చేసింది. స్వార్థప్రయోజనాలకు ఊతం ఇచ్చింది. మేము, మనము అనే మాటలకు బదులుగా నేను, నాది అనే విష బీజాలు నాటింది. తల్లి, తండ్రి, అన్నా, చెల్లె వంటి ఆత్మీయ బంధాలకు అర్థం లేకుంట చేసింది. వావి వరుసలు, వయసు తేడాలు లేని అశ్లీల సమాజానికి పునాదులేసింది ఈ ఆంధ్ర సినీ మీడియా సంస్కృతి.

లేదంటే ఈనేల మీద ఏ కల్మశం లేని తంగెడు పువ్వుల్లాంటి ఆడపిల్లలమీద యాసిడ్, బ్లేడ్ దాడుల కల్చరేంది? ఇక్కడికి చైనీస్ ఫుడ్ ఎక్కడినించొచ్చింది.

ఈ ఫాస్ట్‌ఫుడ్ కల్చర్ ఎట్ల పెరిగింది?

నీకు తెలుసా ఇక్కడ ఏనాడు ఇడ్లి బండ్లు ఇతరాలు లేవు. లాడ్జీలు అసలే ఉండేవి కావు. అసలు వీటి అవసరం ఎందుకొచ్చింది?

మనుషుల మధ్య అనుబంధాలు దూరమైనపుడే కదా?

వ్యక్తుల మధ్య అంతరాలు పెరిగినప్పుడే కదా? ఎపుడైతే బలవంతంగ తెలంగాణను ఆంధ్ర ప్రాంతంలో విలీనం చేసింన్రో ఆనాటి నుంచే ఈ అనుబంధాలు దూరమై వ్యాపార సంస్కృతి పెరిగింది.

ఇక్కడ చుట్టం వస్తే వండిపెట్టడం తెలుసు. కాని హోటల్లో పెట్టిచ్చి లాడ్జిల్లో పండబెట్టేది లేదు. ఇది వలసవాదం అలవాటు చేసిన సంస్కృతి.

పైగా అదే గొప్ప గౌరవం అని అనుకునేలా చేసింది? దీంతో ఈ నేలమీద ప్రేమానురాగాలు అంతమై,సీమాంధ్ర సంస్కతి పెచ్చరిల్లింది. మానవీయ సంబంధాలలో పూడ్చలేని అగాథం ఏర్పడింది.

కర్రీ పాయింట్స్ కల్చర్ పెరిగింది. ఇప్పుడు ప్రతిది పార్సెల్ తెచ్చుకొని పాలిథిన్ పాపాన్ని పెంచడమే జరుగుతుంది. ఇదే మనం సాధించిన అభివృద్ధి. మరి మన ముందు

తరాలలో ఇది ఉందా? అంటే ఆనాడు ఇంత అభివృద్ధి లేదంటరు. అభివృద్ధి అంటే ప్రజల ఇష్టా ఇష్టాలకు అనుగుణంగా, ఆచార వ్యవహారాలను గౌరవించేదిగా ఉండాలె తప్ప, నాశనం చేసేదిగ ఉండడమే బాధాకరమైన అంశం.

ఒకప్పుడు ఎవరైన చుట్టాలు, బంధువులు ఇంటికిపోయి తినడం తప్ప బయట ఎక్కడ బడితే అక్కడ, ఏది బడితే అది తినే దుర్గతి తెలంగాణకు లేదు. ముఖ్యంగ సీమాంధ్ర నుంచి తెలంగాణ ప్రాంతానికి వలసొచ్చినోళ్ళు ఇక్కడ మంచి హోటల్ లేదని, ఇక్కడ మంచి లాడ్జ్ లేదని అనడం మనం చాలాసార్లు వినే ఉంటం.

ఎందుకంటే ఇక్కడ ఆ అవసరం లేదని వాళ్ళకు తెలువదు.

వాళ్ళు అట్ల అంటున్నరంటే వాళ్ళకు ఆతిథ్యం ఇచ్చే ఒక్కమనిషి కూడ ఇక్కడ లేడని అర్థం. తిండి మనుషుల మధ్య ఆత్మీయ సంబంధం పెంచుతది.

ఎంతో దూరం నుంచి మన ఇంటిని దేవులాడుకుంట వచ్చిన వాని కడుపునిండ అన్నం పెట్టడం ద్వారా మన ఇంటి పరిస్థితులను అర్థం చేసుకొని మన స్థితి గతులు మనవాళ్ళకు అయిన వాళ్ళకు అందించడం జరిగేది. "ఏంరా అమ్మ ఇంటికాడ అన్ని బాధలు పడుతుంటే నువ్వు మాత్రం ఇక్కడ హాయిగ ఉంటున్నావ్" అనే ఒక హెచ్చరిక ద్వార అక్కడి పరిస్థితులు ఇక్కడ, ఇక్కడి పరిస్థితులు అక్కడికి చేరవేసి ఒకరినొకరు అర్థం చేసుకునే విధంగ ఒక వారధిగ అతిథులు ఉండేవాళ్ళు. ఈ రోజుల్లో అలాంటి పరిస్థితులు లేవు. ఈ దుస్థితి ముఖ్యంగ తెలంగాణకు కల్పించింది, నేర్పించింది, అలవాటు చేసింది ఆత్మీయ సంబంధాలను భ్రష్టుపట్టిచ్చింది ఈ ఆంధ్ర సంస్కృతి కాదా...?

ఇంటికొస్తానన్న మనిషిని బయటినుంచే కలిసి బయటే పనులు చేసుకొని అక్కడ్నే ఏ హోటళ్ళోనో ఇంత చాయతాగి, లేదంటే ఇంత మందు తాగి "మల్లెప్పుడొస్తవ్" అంటూ చేయిచ్చి పంపిచే ఈ దౌర్భాగ్య పరిస్థితులు కల్పించింది ఎవరు?

మనిషిని మనిషి నమ్మలేని అనాగరికత పెరిగిందంటే కచ్చితంగ అది వలసవాద వ్యాపారాత్మక ధోరణే. మనిషిని నైతికంగ పతనం చేసింది కూడా అదే.

మానవ సంబంధాలు అంటే అవేవో గ్రహ సంబంధాలు అయినట్టు, అవేవో మోయలేనివైనట్టు అయిపోయిందిక్కడ.

ఆప్యాయత అనురాగాలు దూరమై ప్రతి ఊరికి కొన్ని వందల వేల మైళ్ళ దూరం పెరిగిపోయింది. ఇదంత చిత్రంగా మన కండ్ల ముందే జరుగుతుంది. తెలిసో తెలియకనో అందులో మనందరం భాగస్వాములం అయితున్నం.

ఈ విధంగా మనలోని గొప్ప మానవీయ కోణాన్ని దెబ్బతీసింద్రు. ఇక దుస్తుల విషయంలో కట్ డ్రాయర్ బయటికొచ్చేటట్టు ప్యాంట్ వేసుకుంటే ఫ్యాషన్ అయింది. ఎక్కడి

పాశ్చాత్య కల్చర్ ఇది. మన తెలంగాణ ఫుడ్‌లో ఎక్కడా ఇంత కొవ్వు లేదు. మన బియ్యానికి ఎంతో ప్రత్యేకత ఉంది. అయినా ఎవరికి పారవు. పనికిరావు. మన నేతన్నలు నేసే కాటన్ ఎండకు చల్లగా, చలికి వెచ్చగా ఉంటుంది. అయినా అయ్యి ఎవరికి నచ్చవు. గొప్ప కాటన్ బట్టలను కాలదన్ని ఏవేవో తొడిగి ఏషాలేసినట్టు, ఒళ్ళంత కంపులేపుకొని ఒకటే ఫోజులు. వర్మ సినిమాల ఖర్మ తప్ప ఈనేలకు ఇంకేమి మిగిలింది? సీమాంధ్ర పాలకుల కుట్రలు, మోసాలు ఎన్నని చెప్పగలం. ఎంత చెప్పినా తక్కువే.

ఆత్మీయంగా ఉండే ఈ ప్రాంతాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయకుంట ఇంత హీనమైన ప్రాంతంగ తయారు చేసింది, ఇక్కడి పాలకులు కాదా? అడుగడుగున అనేక అవమానాలు, మోసాలు చేసింది ఈ సీమాంధ్ర పాలకులు కాదా? ఇక్కడి గొప్ప వనరులను కొల్లగొట్టి ప్లాస్టిక్ దౌర్భాగ్యాన్ని పెంచి, తద్వార అంతులేని రోగాలను వ్యాప్తి చేసింది ఈ వలస పాలనా విధానం కాదా? దిక్కులేని ఆస్పత్రులు కట్టి గోతికాడి నక్కల్లా ప్రజల ఆరోగ్యం పాడయ్యేటట్టు ప్రణాళికలు రూపొందించేది, వాళ్ళు కోట్లు సంపాదించడానికి కాదా? ఎక్కడైనా మెడికల్ ప్రోగ్రామ్ ఒక కౌన్సిలింగ్ కావాలె. క్రమంగ హాస్పిటల్స్ తగ్గాలె. కాని ఇక్కడేం జరుగుతుంది. అభివృద్ధి మాటున ఆస్పత్రులు, తెల్ల రేషన్ కార్డుల సంఖ్య నానాటికి పెరుగుతుంది.

నాకు తెలిసి ఈ ప్రపంచంలో సైన్స్‌కు సంబందించిన అన్ని విషయాలు మానవ సంబంధాలే. అందులో ప్రధానంగా అమ్మతో ఫోన్ సంభాషణ అంత మంచిది కాదు. అమ్మ సమక్షంలో ప్రత్యక్షంగ మాట్లాడాలె.

మరి అలాంటిది ప్రపంచం ఒక కుగ్రామం అని అందమైన పేరు తగిలించి మన ఇష్టం వచ్చినట్టు పేలుతున్నం. అమ్మతోని గూడ పరాష్కం ఆడుతున్నం. కన్నతల్లికి, కట్టుకున్న దానికి తేడా లేకుంట ప్రవర్తిస్తున్నం.

ఎవరికి వారు ఆకాశమై పుట్టిన నేలను మర్చిపోతున్నం.

మనసొక చోట- మనువొక చోట అన్నట్టు గొప్ప సంస్కృతులను మోసుకొచ్చి మన వాకిళ్ళలో నిలబడితే వాళ్ళను యాచకులుగ మనం అసహ్యించుకుంటుంటే ఆ సంస్కతి ఎట్ల నిలబడ్తది? కనీసం మనిషిని మనిషిగా చూడలేని, గౌరవించలేని మనం సంస్కృతి గురించి మాట్లాడడమేంది? అసహ్యంగ, సీమాంధ్ర పాలనంత అనైతికంగా....



## తెలంగాణను అణిచివేస్తే ఈజిప్టు తరహా పరిణామాలు

# పొంచిఉంటాయేమో..

**టు**నీషియాలోని ఒక చిన్న పండ్ల వ్యాపారి ఆదేశ అవినీతి పాలనపై ఆగ్రహించి తనను తాను దహించుకొని ఉద్యమాన్ని రగిలించిన సంగతి మనందరికి తెలుసు.

ఆ నిప్పు రవ్వను అందిపుచ్చుకొని ఈజిప్టులోని హోస్నీముబారక్ నియంత పాలనకు చరమగీతం పాడిన సంగతీ మనకు తెలుసు.

అయితే ఏవో ఆంక్షలు విధించి హాయిగా కాలం సాగిపోతుందిలే అనుకుంటే మటుకు ఎలాంటి పరిణామాలు తలెత్తుతాయో పై ఉదాహరణల ద్వారా మనకు స్పష్టమైతుంది. అయితే ఈ విషయాన్ని ప్రస్తుత తెలంగాణ ఉద్యమంతో సరిపోల్చదగినదిగా నాకైతే అనిపిస్తుంది.

ఇందుకు మనం గమనించవలసిన విషయం ఏమిటంటే తెలంగాణ ఉద్యమం తీవ్ర ప్రతిఘటనకు పోతే నాడు 1969లో జరిగిన సంఘటనలు పునరావృతం అయితయని, ఉద్యమం అణిచివేయబడుతుందని వాళ్ళు గ్రహించింద్రు.

అందుకే శాంతియుత మార్గాన్ని, ప్రజాస్వామ్య పంథాని మాత్రమే వాళ్ళు ఎంచుకున్నరు. అయితే ప్రభుత్వం మాత్రం ఉద్యమ కారులను రెచ్చగొట్టేలా వ్యవహరిస్తుందని, పోలీసులు సైతం దూకుడుగా వ్యవహరిస్తున్నరని నాయకులు పదే పదే అనడం మనం వింటున్నం, చూస్తున్నం. అయితే ఈ పరిణామాలన్నింటికి ఎప్పుడో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అనిపిస్తుంది. ఎందుకంటే ఈరోజు తెలంగాణ ఉద్యమం ఏ రాజకీయ పార్టీలో, ఇంకెవరో నడిపించడం లేదు.

ఇది పూర్తిగా ప్రజా ఉద్యమం. ఈ విషయం 48 గంటల తెలంగాణ బంద్ దిగ్విజయంగా జరగడం ప్రజల్లో తెలంగాణ ఆకాంక్ష ఏమిటో మనకు చెప్పకనే చెబుతుంది.


ఈజిప్టులో అంత పెద్ద ఉద్యమం వస్తుందని ఎవరూ ఊహించలేదు. ఏ నిఘా వర్గాలు సైతం కనిపెట్టలేని విధంగ ఉద్యమం పెల్లుబికి సునామిలా విరుచుకు పడింది. అప్పడిదాకా ఉన్న ఇంటలిజెన్స్ నివేదికలు తప్పు అనే విషయాన్ని బహిర్గతం చేసి కట్టలు తెంచుకున్న ప్రజాగ్రహం నియంతకు మూడుచెరువుల నీళ్ళు తాపింది. ప్రస్తుతం తెలంగాణ ఉద్యమం అంతే తీవ్ర స్థాయిలో ఉండడం మనం గమనిస్తున్నం. ఈ పరిస్థితిలో దీన్ని అణిచిపెట్టడం ఎప్పటికైన ప్రమాదమనే విషయాన్ని అన్ని వర్గాల ప్రజలు, నాయకులు సైతం గమనించింద్రు. కాని ఎవరి రాజకీయ కోణంలో వాళ్ళు మాట్లాడుతున్నరు. ఇది మంచిది కాదు. ఎందుకంటే ప్రజలకు ఎంతో లబ్ధి చేకూర్చే రచ్చబండ కార్యక్రమానికి తెలంగాణ ప్రాంతంలో ఎట్లాంటి వ్యతిరేకత ఎదురయ్యిందో మనకు తెలుసు. ఎవరు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా జరిగిన సంఘటనలు వాస్తవం. ప్రజా జీవితం అనేక ఆటంకాలు ఎదుర్కొంటున్నప్పటికి వారందరికి తెలంగాణ పట్ల ఒక విశ్వాసం ఉన్నట్టు మనకు కనిపిస్తుంది. ప్రభుత్వ పాలన పూర్తిగా స్థంబించిపోయిందని చెప్పడం కాదు గాని, తెలంగాణ కోరిక ప్రజల్లో బలంగా నాటుకుపోయిందని చెప్పడమే సరైనది. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబింపజేసే శాసన సభ్యులను బలవంతంగా బయటకు పంపించివేసి సభను నడిపించుకోవాలని అనుకోవడమంటేనే ప్రభుత్వం ఎట్లాంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటుందో మనం అర్థం చేసుకోవచ్చు.

తెలంగాణ కోసం ఐదు లక్షల మంది ఉద్యోగులు సహాయ నిరాకరణ ఉద్యమాన్ని కొనసాగిస్తున్నరు. బందులతో వేలాది బస్సులు ఎక్కడివక్కడ నిలిచిపోయినయ్. వ్యాపార సంస్థలు స్వచ్ఛందగా బంద్ పాటించారు. విద్యార్థులు తమ భవిష్యత్తును లెక్కచేయకుండా ఛలో అసెంబ్లీ వంటి కార్యక్రమాలను దిగ్విజయం చేసుకున్నరు.

అన్ని వర్గాల ప్రజలు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల్లోని ఉద్యోగులు తెలంగాణ కోసం చిత్తశుద్ధితో, అకుంటిత దీక్షతో ఉద్యమిస్తున్న ఈ తరుణంలో ఇంకా తెలంగాణ విషయంలో నాన్చుడు దోరణి మంచిది కాదు. దీని వల్ల భవిష్యత్తులో ఎవరూ ఊహించలేని మహాప్రళయం జరగడం ప్రస్తుత పరిస్థితుల రిత్యా తప్పదేమోనని అనిపిస్తుంది.

ఇప్పటికైనా ఈ ప్రమాదాన్ని గుర్తెరిగి తక్షణమే పార్టీలకు అతీతంగా తెలంగాణ విషయంలో అందరూ సంయమనం పాటించి సమస్య పరిష్కారం దిశగా కృషిచేస్తే మంచిది.

# తెలంగాణకు
# ఈ నెత్తుటి గాయాలు
# ఇంకెన్నాళ్ళు




**ఈ** ప్రపంచంలో మానవత్వం లేని మనుషులుగా మనకు కనపడేది కేవలం సీమాంధ్ర నాయకులేనని, వాళ్ళకు వత్తాసుపలికే సమైక్యవాదులేనని అనిపిస్తుంది. ఎందుకంటే ఎక్కడ కూడ తెలంగాణ నెత్తుటి గాయాల్ని చూసి అయ్యో అన్నోడు ఒక్కడు లేడు.

ఆరువందల మంది అమరవీరుల త్యాగాల్ని తల్సిన సీమాంధ్ర నాయకులు, పెద్దమనుషులు, బుద్ధిజీవులు ఒక్కరు లేరు. మన కన్నతల్లుల గర్భశోకాన్ని చూసి ఓదార్చినోడు ఒక్కడు లేడు. అయితే ఒక్కటి మాత్రం నిజం. "నా వంటిమీద పెట్రోలుపోసి మంటపెట్టినోడు నాతో కలిసి ఉంటానని కట్టుకథలు చెప్తుంటే నమ్మి, ఇంకా ఆని ఎనక నడిసే అమాయకులెవరూ ఇక్కడ లేరు".

ఈ సమైక్య రాష్ట్రంలో తెలంగాణకు జరిగే మోసాలు, గాయాలు ఎన్నని చెప్పాలె, వేటినని చూపించాలె. నా గోస నీకు ఎగతాళి అయిన కాడ, నా ఉద్యమాలు నీకు ఊటబాయి అయితున్న కాడ, ఎండిపోతున్నది నా బతుకేగా...కృష్ణానది పరివాహక ప్రాంతం సీమాంధ్రలో 31శాతం, తెలంగాణలో 69శాతం ఉంటే ట్రిబ్యునల్ కేటాయించిన నీళ్ళు సీమాంధ్రకు 65శాతం, తెలంగాణకు 35శాతం. వీటిలో కూడ నీటి వినియోగం దగ్గరికి వచ్చేటప్పటికి సీమాంధ్రకు 99శాతమైతే తెలంగాణ కేవలం ఒక్క శాతానికి ఇంక తక్కువగానే ఉంటది.

గోదావరి నదీ పరివాహక ప్రాంతాన్ని తీసుకుంటే ఇది సీమాంధ్రలో 21శాతంగాను, తెలంగాణలో 79శాతంగాను ఉన్నది. నీటి వినియోగం విషయానికొచ్చేటప్పటికీ సీమాంధ్రకు 23శాతంగాను తెలంగాణకు 10శాతానికి తక్కువగా ఉంటుంది. ఇదే నీటి శాతాన్ని టి.ఎమ్.సి.లలో చెప్పితే సీమాంధ్రకు 320 టి.ఎం.సి.లుగాను, తెలంగాణకు 143 టి.ఎం.సిలుగాను వస్తుంది.

తెలంగాణలో నదీ పరీవాహక ప్రాంతం మెండుగా ఉండి, ప్రాజెక్టులు ఇక్కడే ఉండి కూడా నేలంతా బీడువారుతున్న దుస్థితి నుంచి బయట పడాలంటే ఖచ్చితంగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించవలసిందే.

ఎందుకంటే తెలంగాణను ఆంధ్రతో విలీనం చేయడం వలన దాదాపుగా 1200 టి.ఎం.సీ. ల నీటిని ఈ ప్రాంతం ఉత్తగనే వదులుకోవలసి వచ్చింది. దాంతో ఈ ప్రాంతమంతా బీడుగా మారిపోయింది.

తెలంగాణ ప్రాంతంలో ఆనాడు చెరువు కుంటల కింద 11లక్షల హెక్టార్ల సాగుభూమి ఉండేది. అది ఈనాడు ఆంధ్రప్రాంత రియల్టర్ల కబ్జాల పాలై చెరువు కుంటలు మాయమై భూగర్భజలాలు అడుగంటి పోవడమే కాకుండ చెరువు కుంటలకింద సాగయ్యే భూవిస్తీర్ణం 6లక్షల హెక్టార్లకు పడిపోయింది.

అంటే ఇంకా ఎంతకాలం ఈ దోపిడి, వివక్ష కొనసాగాలె. తెలంగాణ ప్రజలు ఇంకెనాళ్ళని చేతులు ముడుచుకోవాలె.

ఇక పరిశ్రమల విషాయానికొస్తే ప్రపంచానికి భారతదేశం ఒక ప్రయోగశాల అయినట్టు సీమాంధ్రులకు తెలంగాణ ఒక ప్రయోగశాల.

సీమాంధ్రులకు అక్రమంగా ఆస్తులు సంపాదించుకోవడానికి అనువైన అడ్డ తెలంగాణ. ఎందుకంటే ఈరోజు తెలంగాణలో ఉన్న దాదాపు 70శాతం పరిశ్రమలు ఆంధ్రపాలకులకు చెందినవారివే. ఆంధ్ర తీరం సశ్యశ్యామలంగ ఉండాలె.

తెలంగాణ కంపు కాలుష్యాలతో నిండిపోవాలె.

ఆంధ్రవాల్లు అందలాలు ఎక్కాలె.

తెలంగాణ వాల్లు అడుక్కతినాలె. ఇది సీమాంధ్ర న్యాయం.

ఎందుకంటే ఏ ఒక్క తెలంగాణవాడు ఆంధ్ర ప్రాంతంలో పరిశ్రమలు నెలకొల్పిన దాఖలాలు లేవు. దీన్నిబట్టి మనం అర్థం చేసుకోవచ్చు. ఒక వేళ ఎవరైనా సాహసం చేసి అక్కడ పరిశ్రమలు పెట్టినా సీమాంధ్రులు అక్కడ తెలంగాణ వారిని నెగలనివ్వకపోవడమే కాకుండ ఉన్న ఫలంగ ఖాళీ చేయించేస్తరు.

అలాంటి సంఘటనలు అనేకం జరిగినయ్ కూడా.

రాష్ట్రంలో వినియోగించబడే విద్యుత్‌లో సగానికి పైగా ఆంధ్ర ప్రాంతంలోని పరిశ్రమలకే అంటే అతిశయోక్తి కాదు.

తెలంగాణ ప్రాంతంలో మాత్రం ఒక్క ఎకరం పొలానికి విద్యుత్ అందక ఉరిబెట్టుకొని సచ్చే కాలం ఉంది. ఎవన్నని అనాలె? ఈ పరిస్థితి ఎట్ల మారాలె?

అందుకే తెలంగాణ కావాలె. కచ్చితంగ తెలంగాణ వచ్చి తీరాలె.

ఇక్కడ ఇంకొక విషయం.

దాదాపు 55 సంవత్సరాల ఆంధ్రప్రదేశ్ చరిత్రలో కేవలం నలుగురు మాత్రమే తెలంగాణ ముఖ్యమంత్రులు. వారి పదవీకాలం కూడా కేవలం 6సంవత్సరాలు మాత్రమే. అంటే సీమాంధ్ర నాయకులు తెలంగాణ వారికి ఏనాడు ఏవిధమైన అవకాశాలు గాని, అధికారం గాని ఇవ్వడానికి సిద్దంగ లేరు.

తెలంగాణ ప్రాంత అభివృద్ధిని గాని, ఈ ప్రాంత నాయకుల అజమాయిషినిగాని వారు భరించలేరు. లేదంటే  దేశంలో ఎక్కడా లేని ఫ్రీజోన్ అంశాన్ని ఇక్కడే ఎందుకు తెచ్చినట్టు? తెలంగాణ ప్రాంతంలోని వనరులను దోచుకోవడానికి కుప్పలు తెప్పలుగా ఇక్కడ వాలిపోయి హైద్రాబాద్ జనసాంద్రతను పెంచింద్రు తప్ప తెలంగాణ వాళ్ళకు ఒరిగిందేమి లేదు. ఇప్పటికీ ప్రభుత్వానికి తెలంగాణ నుంచే అత్యధిక ఆదాయం లభిస్తుంది. ఇదేమిటంటే అది మా వల్లనే అనేంత దిట్టలు సీమాంధ్రులు.

ఎంత మొత్తుకున్నా తెలంగాణ మిగులు బడ్జెట్ సంగేతేందో చెప్పరు.

ఇక్కడి వనరుల దోపిడీ గురించి మాట్లాడరు. ఇగ విద్యారంగం విషయానికొస్తే సీమాంధ్రలో 1700కోట్లకు పైగా ఖర్చుచేస్తూ, తెలంగాణలో కేవలం 163కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నరు. విద్యుత్తు వినియోగం విషయంలో సీమాంధ్రకు చెందిన 13జిల్లాలు 77శాతం విద్యుత్తును వినియోగించుకుంటు తెలంగాణలోని 10జిల్లాలు కేవలం 23శాతం విద్యుత్తును మాత్రమే  వినియోగించుకుంటున్నాయి. ఇంత కన్న వివక్ష ఇంకేంగావాలె.

సీమాంధ్రలో ఎక్కడ కూడ ఇంతగానం ముంపుకు గురయ్యే ప్రాంతం కనపడదు.

తెలంగాణలో ఎటుచూసిన ముంపు బాదితులే.

ఆంధ్ర ప్రాంతంలో లక్షల ఎకరాల సాగుకోసం తలపెట్టిన పోలవరం ప్రాజెక్టుకోసం 260గ్రామాలు ముంపుకు గురైతున్నయ్. దాదాపు 5లక్షల మంది గిరిజనులు నిర్వాసితులుగా మారుతున్నరు. ఈ బాధలు ఎవనికి చెప్పుకుంటే తీరుతయ్?

నాగార్జున సాగర్ ప్రాజెక్టు కింద సీమాంధ్రలో 22లక్షల ఎకరాలు సాగైతుంటే తెలంగాణలో 5లక్షలు కూడా లేదు. వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, రెవిన్యూ వీటన్నింటి మీద వచ్చే ఆదాయం అత్యధికంగ తెలంగాణ నుంచే.

1970 ప్రాంతంలో జూబ్లిహిల్స్‌లో 100రూపాయలకు ఎకరం చొప్పున భూములు కొని హౌజింగ్ సొసైటీను ఏర్పాటు చేసుకున్నరే గాని తెలంగాణ వాళ్ళకు ఒక్కనికి అండ్ల అవకాశం ఇయ్యలేదు.

కన్న బిడ్డలను అమ్ముకుంటూ బతకలేక వలసలు పోతున్న ఈ నేల ఈ గతికి రావడానికి కారణం సీమాంధ్ర నాయకులు, వలసాంధ్ర పాలన కాదా?

ఇట్ల చెప్పుకుంటూ పోతే ఈ గాయాలు వొడువని దుఃఖం. తీరని సోకం.

ఎన్నని చెప్పాలె. ఎవరికని చెప్పాలె.

తెలంగాణ దోపిడి, అవమానం, అణిచివేత మీద ఎంత చర్చ జరగాల్నో అంత జరిగింది. ఏం కావాల్నో అది అయ్యింది.

ఇక మిగిలింది కేవలం తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించడమే. అది మినహా ఈ ప్రాంత ప్రజలు మరేమి కోరుకోవడం లేదు.

ప్రత్యేక జి.వోలు అయినయి. కమిటీలు అయినయి. రాజ్యాంగ రక్షణలు అన్ని అయినయి. ఏదైనా తెలంగాణకు ఒరిగిందేమి లేదు. అంతకంతకు వెనకకు నెట్టేయబడిందే తప్ప ఏనాడు ఆత్మగౌరవంతో ఒక అడుగు ముందుకేసింది లేదు. ఈ పరిస్థితులలో అనేక పరిణామాల అనంతరం డిసెంబర్ 9 2009న ఒక ప్రకటన వెలువడింది. దాన్ని అందరూ గౌరవించాల్సింది పోయి సీమాంధ్ర నాయకులు తిరగబడ్డరు. దీంతో ప్రస్తుత పరిస్థితి నెలకొని ఉన్నది. కాని ఎవరైనా ఒక్కటి ఆలోచించాల్సి ఉన్నది.

ఇన్ని రకాలుగా విడిపోయి బతుకుతున్న ఈ నేలమీద ఇంకా కలిసి ఉందామని మాట్లాడటం సరైనదేనా? సీమాంధ్ర నాయకుల మంకుపట్టువల్ల ఇక్కడ నివసించే ఆంధ్ర ప్రజలు ఇబ్బందులు ఎదుర్కునే పరిస్థితులు వాళ్ళే కల్పిస్తున్నరు తప్ప ఇంకొకటి కాదు. ఉద్యమాన్ని శాంతియుత పద్ధతులలో కొనసాగిస్తుంటే ఇంకెక్కడి తెలంగాణ ఇక తెలంగాణ పని అయిపోయిందని, ఎద్దేవా చేసేది సీమాంధ్ర నాయకులే. ఉద్యమాన్ని ఉధృతం చేస్తే ఇదేం పద్దతి ఇది ప్రజాస్వామ్య దేశం కదా అంటూ నీతులు వల్లించడం వాళ్ళ వంతే.

అంటే ఎప్పుడు ఎట్ల వీలైతే అట్ల నాలుకను మలిపే సీమాంధ్రులకు ఇంకా ఈ తెలంగాణను అడ్డుకునే ప్రయత్నం మంచిది కాదు. ప్రాంతాలుగా విడిపోదాం, మనుషులుగా కలిసుందాం అనే సిద్ధాంతాన్ని పాటించి అన్నదమ్ములుగ విడిపోవడానికి అందరూ కృషి చేయాలె. డిసెంబరు 9కి ముందు పార్టీలు ఏమైతే మాట్లాడినయో, తెలంగాణ విషయంలో ఎలాంటి వైఖరిని అవలంభించినయో దానికే కట్టుబడి ఉండాలె. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అందరు పూర్తి స్థాయిలో సహకరిస్తే తప్ప ఈ పరిస్థితులలో మార్పు రాదు. ఇప్పుడికే సహాయ నిరాకరణ ఉద్యమం ద్వార ఎట్లాంటి తీవ్ర పరిణామాలు ఎదురైతున్నయో మనకు తెలుసు. ఇక తెలంగాణ ప్రజలు ఏక మొత్తంగ రోడ్లెక్కి హైవేలను దిగ్బంధనం చేసేదాకా చూడొద్దు. ప్రజల మధ్య విద్వేషాలు రగిల్చే విధంగ నాయకులు ప్రవర్తించొద్దు. తక్షణమే తెలంగాణ విషయంలో ఒక ఖచ్చితమైన నిర్ణయాన్ని వెలిబుచ్చి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వం, రాజకీయ పార్టీలమీదనే ఉన్నది.






### పార్టీలు, పదవులకన్నా.. తెలంగాణే ముఖ్యమనుకుంటె

# మనం సాధించగలం

### ఈ ఫిబ్రవరి 14 వలసాంధ్రుల కపట ప్రేమకు నిదర్శనం.
### తెలంగాణ నినాదాన్ని సీమాంధ్రుల చీకటి గోడలు దాయలేవు.

**కే**సీయార్ ఆమరణ దీక్ష మొదలు అనేక శాంతియుత పోరాటాలు, ఆందోళనల అనంతరం కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తమని చెప్పింది.

దానితో అప్పటి వరకు రగిలిపోతున్న తెలంగాణ పల్లెల్లో ఒక్కసారిగా శాంతియుత వాతావరణం నెలకొన్నది.

ఈ పరిస్థితిలో తెలంగాణ బిల్లును ప్రవేశపెట్టి సీమాంధ్రుల నోటికి తాళం వేయవలసింది పోయి కేంద్రం తెలంగాణ విషయంలో నాన్చుడు ధోరణి అవలంభిస్తున్నది.

లేదంటే సమగ్ర విషయ పరిశీలన కోసం 'శ్రీకృష్ణ' కమిటీకి రెండు మూడు నెలలకు మించి సమయం అవసరం లేని సంధర్భంలో ఏకంగా పదినెలల గడువు పెట్టడం జరిగింది.

సరే ఆ గడువు సంగతి ఎట్ల ఉన్న కమిటీ విధి విధానాలలో ఏ ఒక్క అంశం (ఇచ్చిన ఏడు అంశాలలో) తెలంగాణకు అనుకూలంగ లేదు. పైగా సమైక్యాంధ్రకు సంబంధించిన అంశాలను పరిశీలించాలని పేర్కొనడం తెలంగాణ ప్రజలను ఆగ్రహానికి గురిచేసే అంశం.

కమిటీ విధి విధానాలలో మొదటి అంశంలోనే 'తెలంగాణ ఇవ్వాల్నా..సమైక్యాంధ్రనే కొనసాగించాల్నా' అని అనడంలోనే కేంద్రం సీమాంధ్రుల కుట్రలకు తలొగ్గిందేమో నని అనుమానించక తప్పదు.

సున్నిత మనుస్కులైన తెలంగాణ ప్రజల్ని ఆత్మహత్యల పాలుచేసింది– చేస్తున్నదీ

కమిటి విధి విధానాల అస్పష్టత ఒకటైతే, తెలంగాణాలోని వివిధ రాజకీయ నాయకుల మధ్య సఖ్యత లేకపోవడం మరో కారణం.

నిజమే చాలామంది విజ్ఞులు, మేధావులు అనుకుంటున్నట్టు ప్రభుత్వం కమిటీ నివేదికను ఆమోదించవచ్చు, తిరస్కరించవచ్చు. అది వేరే విషయం. నాటి ఫజల్ అలీ కమీషన్ కూడా ఆంధ్రలో తెలంగాణ విలీనానికి సంబంధించి తెలంగాణను ఆంధ్రతో కలిపితే ఆంధ్రప్రదేశ్‌కు లాభం చేకూరుతుంది తప్ప తెలంగాణకు పెద్ద ప్రయోజనాలు ఏమి ఉండవని స్పష్టంగా చెప్పింది. తెలంగాణ ప్రజలు అనేక రకాలుగా నష్టపోయే ప్రమాదం కూడా ఉందని నివేదిక సమర్పించింది. అయినా తెలంగాణను ఆంధ్రలో విలీనం చేయాలనుకున్న ప్రతిపాదనను విరమించుకోలేదు. అదే విధంగా ఈరోజు కేంద్రంలో ఉన్న యూపిఎ ప్రభుత్వం కూడా శ్రీకృష్ణ కమిటి ఇచ్చే నివేదికను అమలు చేయవచ్చు చేయకపోవచ్చు. ప్రభుత్వ నిర్ణయమే తుది నిర్ణయం అవుతుంది.

అది కాదనలేని వాస్తవం.

కానీ ఏ పరిస్థితులలో డిసెంబర్ 9న ప్రకటన చేసిండ్రో దానికి కట్టుబడి ఉండి శ్రీకృష్ణ కమిటి విధి విధానాలను ప్రకటించి ఉంటే ఏ సమస్య ఉండేది కాదు. ఇలాంటి ఒక సంక్లిష్టతను సృష్టించి, ప్రజలను అయోమయంలో ముంచడం, శాంతియుత ఉద్యమాన్ని ఉక్కుపాదంతో అణచివేసే కుట్రలు చేయడం అవసరమా అనేదే ప్రశ్న? తెలంగాణ ప్రజలను నెత్తుటేరులో ముంచి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రజల రక్తపు మడుగుల్లో పుష్కర స్నానాలు చేయడం సరికాదనేదే మా భావన.

ఈ ఫిబ్రంరి 14 వలసాంధ్రుల కపట ప్రేమకు నిదర్శనం. ఆంధ్ర సినిమాల అశ్లీల ప్రేమకు తార్కాణం. అన్నింటికి మించి ఇది వలస పాలకుల విద్వేశ దినం.

ఎందుకంటే రాష్ట్ర ప్రభుత్వ పాలన తీరు, సీమాంధ్రుల కుట్రలు, వెకిలి చేష్టలు పరిశీలిస్తున్న ఏ చిన్న పిల్లగాన్నడిగినా 'శ్రీకృష్ణ' కమిటి విధి విధానాలు, తెలంగాణకు అనుకూలంగా లేవనే సమాధానమిస్తడు. కమిటీ విధి విధానాలకు సీమాంధ్రులు సమ్మతిస్తున్నారంటెనే, స్వాగతిస్తున్నారంటెనే ఈ విషయాన్ని మనం అర్థం చేసుకోవచ్చు. అలాంటిది మనవాళ్ళు ఇంకా ఏం సాధిద్దామని పదవులనే పట్టుకొని వేలాడుతున్నారో అర్థం కాదు. ధైర్యంగా గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకోలేని వాళ్ళు, క్యాంపస్‌లో పోలీసు క్యాంపులను కాలీ చేయించలేని వాళ్ళు, అకారణంగ విద్యార్థులను చితక బాదుతుంటే అడ్డుచెప్పని వాల్లు తెలంగాణ విషయంలో ప్రభుత్వ పాలనా విధానాన్ని ఎట్ల స్థంబింప జేస్తరో అర్థం కాదు.

ఇప్పటికే బడ్జెట్ కేటాయింపులు మొదలైనయ్. ఉన్నయన్ని సీమాధ్రులు తరిలించుకపోతుంటే నోరెల్లబెట్టి సూడడం తప్ప ఏంచేయగలిగిండ్రు. జడ్జిల ప్యానెల్‌లో

తెలంగాణ వాళ్ళు లేరనే వార్తలొస్తున్నయ్. వీటన్నింటిని ఎట్ల పరిష్కరించగలరు. కాబట్టి దేనికైనా అంతిమ పరిష్కారం తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోవడమే. అందుకు అందరు కలిసికట్టుగా ఉద్యమించడమే. ఏ పార్టీలో ఉన్నా, ఏ సిద్ధాంతానికి కట్టుబడి ఉన్నా ఒక సమన్వయంతో ముందుకు పోతే తప్ప తెలంగాణ విముక్తి సాధ్యం కాదు.

లేదంటే ఇచ్చేవాడు సిద్ధంగా ఉన్న తీసుకోవడానికి పీక్కోవడం లాగా తయారైతుంది నాయకుల వ్యవహారం. ఎంతసేపు పదవులనే పట్టుకొని వేలాడుతూ అధికార, ప్రతిపక్ష నాయకుల మాదిరిగానే ఆలోచిస్తున్నరు తప్ప తెలంగాణలో జరిగే తీవ్ర పరిణామాలను ఆలోచించే స్థితిలో లేరు. తెలంగాణ ఉద్యమం అంతంత మాత్రంగా ఉన్న రోజుల్లో గవర్నర్ తన ప్రసంగంలో కనీసం 'తెలంగాణ విషయంలో సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటామని' మాట్లాడటం జరిగింది.

కానీ ఫిబ్రవరి 15న ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించిన గవర్నర్ ప్రసంగంలో ఎక్కడా తెలంగాణ విషయం లేవనెత్తలేదు.

తెలంగాణ విషయం ఇంత పెద్దఎత్తున చర్చ జరుగుతుంటే, కేంద్రం ప్రక్రియను ప్రారంభిస్తామని శ్రీకృష్ణ కమిటీని నియమిస్తే గవర్నర్ ఎక్కడ కూడ ఆ విషయాన్ని ప్రస్తావించక పోవడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటీ? ఇంతకన్నా తెలంగాణ నాయకులకు, ఉద్యమానికి అవమానం ఏముంటది.

అసెంబ్లీ హాల్లో 'జైతెలంగాణ నినాదాలు చేస్తున్నపుడు సీమాంధ్ర నాయకులు వెకిలిగా నవ్వుకోవడమే కాకుండ, జై సమైక్యాంధ్ర అంటూ పోటీ నినాదాలు చేయడం జరింగింది. అయినా సరే తెలంగాణ నాయకులు చీము, నెత్తురు లేని వాళ్ళలెక్క సచ్చుబడి పోవడం ఏంది? తెలంగాణ వస్తే నేనే ముఖ్యమంత్రినని ప్రగల్భాలు పలికే జానారెడ్డి, రోషయ్య స్థానంలో ముఖ్యమంత్రిగా ఎందుకు కాలేక పోయిండు.

సీమాంధ్ర నాయకుల ముందు ఇంకెంతకాలం చేతులు కట్టుకొని, మూతులు నాక్కుంట ఉంటరో అర్థంకాదు.

చంద్రబాబునాయుడు సగం నాలుక మీద నడిసి ఎంగిలి గతికే తెలంగాణ తెలుగుదేశం నాయకుల మాటలు, ప్రవర్తన భరించలేకుంట ఉన్నది. వెరసి తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగేటట్టున్నది.

ఇంకా ఎందరో విద్యార్థులు నేలకొరిగే ప్రమాదమున్నది.

రాజీనామాలు సమర్పించిన వాళ్ళు కాస్త తొందరపడినట్టు అనిపించినప్పటికి అంతకు మించి గత్యంతరం లేదు. లేదంటే నాయకులకు మద్దతుగ, శాంతియుతంగా ర్యాలీ చేస్తున్న విద్యార్థులపై పోలీసులు విచక్షణా రహితంగ లాఠీచార్జ్ చేయడం అంటే ఇది కచ్చితంగ

వలస పాలకులు తమ పగను, ప్రతీకారాన్ని తీర్చుకోవడానికే ఈ విధంగ ప్రవర్తించారనడం అక్షర సత్యమే తప్ప అతిశయోక్తి కాదు. "మీరైనా ఉద్యమాలు చేస్తారా- తెలంగాణ అంటారా, మా తడాఖా ఏందో చూపిస్తాం" అంటూ అటు నాజీలను, ఇటు రజాకార్లను మించిన రీతిలో సీమాంధ్ర పాలకులు తెలంగాణ బిడ్డల్ని కొట్టికొట్టి కోలగుదేసిన సంఘటనలు అనేకం ఈ నేల మీద జరుగుతున్నయ్. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, న్యాయం, ధర్మం అనే పదాలకు అర్ధం లేకుంట పాలిస్తు, ఏదో సాధించినట్టు వెర్రిగా ఆనంద పడుతుంది సీమాంధ్ర నాయకత్వం.

తెలంగాణ పిచ్చుకల మీద బ్రహ్మాస్త్ర ప్రయోగం జరిగింది. అమాయకులైన లేడిపిల్లలను కొట్టికొట్టి కోలగుదేసింద్రు. రబ్బరు బుల్లెట్లతో కాల్పులు జరిపింద్రు. 1969 నుంచి మొదలు పెడితే ఇప్పుడిదాకా తెలంగాణ కోసం ఎందరు ఆత్మబలిదానాలు చేసుకున్నరో లేక్కెలేదు. ఇంక ఎంతమందిని చంపుతరో కూడా అంతు దొరుకుత లేదు. తెలంగాణ ప్రజలు శోక సముద్రంలో మునిగిపోతే వలసాంధ్రులు హాయిగా నవ్వుకుంటూ, ఒకరినొకరు ముద్దులు పెట్టుకుంటూ, పార్టీలకు అతీతంగా ఒకరినొకరు కౌగిలించుకుంటు ప్రేమికుల రోజులను మరిపించే విధంగా పార్టీలు, విందులు చేసుకుంట ఆంధ్ర పెత్తనాన్ని కొనసాగిస్తనే ఉన్నరు. ఇంత జరుగుతున్న తెలంగాణ నాయకులు కొందరు వాళ్ళ ఎంగిలి గతుకుతూ, వాళ్ళ బూట్లు నాకే కుక్కల్లా తోకాడిస్తూ కుర్చీల కోసం తిరుగుతనే ఉన్నరు.

రాజీనామాలు చేయడం సరికాదు. మనం తెలంగాణను సాధించాలంటే అసెంబ్లీలోనూ, పార్లమెంటులోనూ కొనసాగుతున్న పాలనను స్థంబింపచేయాలని మాట్లాడిన మొనగాళ్ళు కనీసం ఆ పని చేసినా బాగుండు. గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకుంటామని ప్రగల్భాలు పలికి జై తెలంగాణ అంటూ పిల్లి కూతలు కూసి, పోసిన పాలు తాగి బయటికొచ్చిన దద్దమ్మలను ఎట్ల నమ్మాలె. నిజమైన ప్రజా ప్రతినిధులుగా మిమ్మల్ని ఎట్ల చెప్పుకోవాలనేదే ప్రజల ఆవేదన.

ఇంకెంతకాలం జనం సావులతో రాజకీయాలు చేస్తరు. తెలంగాణ ఉద్యమాన్ని తలోతీరుగా మలుచుకొని మసిబూసి మారేడు కాయ జేస్తరు. నిజాన్ని ఎంత ప్రయత్నించినా నీలల్ల దాయడం సాధ్యం కాదు. ఎప్పటికైనా పైకి రావల్సిందే! ఒడ్డుకు చేరవల్సిందే. సరిగ్గా ఈ రోజు తెలంగాణ విషయం ఆ స్థితిలో ఉంది. ఎవరెన్ని ఏషాలేసినా సోనియా మదిలో తెలంగాణ ఉంది. ఆడిన మాట తప్పే ఆంధ్ర తత్వం ఆమెలో లేదు. కచ్చితంగ తెలంగాణ ఇచ్చి తీర్తది.

పోరాటాల గడ్డ తెలంగాణ బిడ్డలుగా మరో మార్గాన్ని అన్వేషించైనా తెలంగాణకు అడ్డంగా నిలబడ్డోన్ని మెడలు వంచుతం. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి తీరుతం.




# ఇది ప్రజాస్వామ్యమా...
# వలస పాలకుల
# నిరంకుశ ప్రభుత్వమా...!



**స**మైక్యాంధ్ర ప్రదేశ్‌లో తెలంగాణ ప్రజలు అనేక అవమానాలకు గురైతున్నరని, పాలనా పరమైన వివక్షను ఎదుర్కొంటున్నరని కేంద్రం గ్రహించింది. అన్ని విధాల సమాలోచనలు జరిపి, అన్ని పార్టీలు తెలంగాణకు ఆమోదం తెలిపిన తర్వాతనే, తెలంగాణకు మేమందరం ఎప్పుడైన అనుకూలమేనని తేల్చి చెప్పిన తర్వాతనే, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తమని చిదంబరం చేత ప్రకటన జరిగింది. ఈ ప్రకటనతో కేసియార్ దీక్షను విరమింప జేయడం, ఉవ్వెత్తున ఎగిసిన తెలంగాణ విద్యార్థి ఉద్యమాన్ని శాంతింప జేయడం జరిగింది.

కేంద్రం చేసిన ప్రకటన నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల్లో స్వేఛ్ఛా వాయువులు, స్వాతంత్ర సంబరాలు నింపింది. కాని కేంద్రం నుంచి ఈ విధమైన ప్రకటనను ఊహించని కరుడు గట్టిన వలసాంధ్ర పాలకులు, నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం అర్థం లేని సమైక్యాంధ్ర నినాదం లేవనెత్తి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను అడ్డుకునే ప్రయత్నం జరిగింది.

ఈ క్రమంలో ఇక్కడి ప్రభుత్వం పక్షపాతంతో వ్యవహరించడం సమంజసమేనా?

శాంతియుతంగా ఉద్యమం చేస్తున్న విద్యార్థులపై అక్రమ కేసులు బనాయించి, జైళ్ళలో నిర్బంధించడం న్యాయమేనా? ఇది ప్రజాస్వామ్యమా–వలసపాలకుల నిరంకుష ప్రభుత్వమా అర్థంకాని అయోమయ స్థితి నెలకొని ఉంది.

తెలంగాణ ప్రజల నెత్తురుకు మరిగిన ఈ పాలక పక్షాలు వేలాది మంది పోలీసు బలగాలను దింపి ప్రజల్ని భయాందోళనలకు గురిచేస్తున్నరు.

శాంతియుతంగా నిరసనోద్యమాలు చేసే తెలంగాణ విద్యార్థుల మీద లాఠీలు ఝళిపించి, సోయితప్పి కింద పడ్డోన్ని కూడా సచ్చిందాక కొడుతున్నరు. ఇదేనా ప్రజాస్వామ్యం. ఇదేనా పక్షపాతం లేని పాలన? మేము చేసిన పాపం ఏంది? నెహ్రూ చెప్పిన మాటల్ని నిజం చేయమని అడగడం తప్పా? ఫజల్ అలీ కమీషన్ నివేదికను అమలు చేయమని అడగడం తప్పా? నాలుగుకోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను గౌరవించాలని కోరుకోవడం తప్పా? ఏంది మా తెలంగాణ విద్యార్థులు, ఉద్యమకారులు చేస్తున్న నేరమేంది?

సమైక్యాంధ్ర ఉద్యమంలో ఒక్క విద్యార్థికి కూడా ఎక్కడ ఒక్క లాఠి దెబ్బ తగిలిన దాఖలాలు లేవు. విధ్వంసాలకు పాల్పడిన విద్యార్థులు సైతం పోలీసుల నడుమనే ఉండి నినాదాలు చేస్తున్న దృశ్యాలను ఎన్నింటినో వాళ్ళ ఛానెళ్ళలోనే చూడడం జరిగింది. లగడపాటి లాగెత్తుకొని దొంగొచ్చినట్టొస్తే రాష్ట్ర ప్రభుత్వం గుర్రు బెట్టిందట. కేంద్ర ప్రభుత్వానికి సెమటలు బట్టినయట. ఏం ఆంధ్ర నాటకంరా బాబు. రంకు నేర్చినోడు బొంకకేంజేస్తడన్నట్టుంది ఆంధ్రోళ్ళ కథ. అబద్దమైనా అతికినట్టు చెప్పడం రావాలె. తప్పుజేసినా తప్పించుకోవడం రావాలె. మన తెలంగాణకు అది సేతగాదు. అట్లాంటప్పుడు ఇట్లాంటి మాయగాళ్ళతోని కలిసి ఉండమంటే ఎట్ల సాధ్యమైతది. ఈ అర్థంలేని ఉత్తుత్తి సమైక్యాంధ్ర ఉద్యమానికి టీవీలల్ల లెస్స ప్రచారం జరుగుతున్నది. ఏదో అయిపోతున్నట్టు, ఇంకేదో జరగబోతున్నట్టు, ఛానెల్లు పనిగట్టుకొని భగభగ మంటలు మండిస్తున్నయ్. తెలంగాణ వాదాన్ని తప్పుదోవ పట్టించే చర్యలకు, చర్చలకు ఆస్కారమిస్తున్నరు. తెలంగాణ అంశాన్ని బలంగా వినిపించే క్రమంలో వాళ్ళ గొంతు నొక్కుతూ పత్రికా స్వామ్యాన్ని చేతుల్లోకి తీసుకొని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే విధంగ వ్యవహరించడం ఏ జర్నలిజం.

తెలంగాణ ప్రజలు వివిధ రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు కవులు, కళాకారులు అంతా ఏకమై రాజకీయాలకు అతీతంగ రాష్ట్ర సాధనే ఏకైక ఎజెండాగ ముందుకు సాగుతున్న ప్రస్తుత తరుణంలో కొందరు స్వార్ధ రాజకీయ నాయకులు ఇందుకు విరుద్దంగా ప్రవర్తించడం వాళ్ళ దళారి తనాన్ని తేట తెల్లం చేస్తుంది. తెలంగాణ ప్రజలను, విద్యార్థులను ఆవేశానికి గురి చేస్తుంది. పదిమందిలో నిలబడి పనికిరాని మాటలు మాట్లాడితే తలోదెబ్బ కొట్టకుంట ఎట్లుంటరు? తెలంగాణ ప్రకటన జరిగిన మరుక్షణమే సీమాంధ్ర నాయకులు మూకుమ్మడి రాజీనామాలు చేయడంతో పాటు పార్టీలను ప్రక్కన పెట్టి ఒకరినొకరు కౌగిలించుకొని, బహిరంగంగానే ముద్దులు పెట్టుకొని ఇవే ఉద్యమాలు అని చెప్పి కేంద్రాన్ని నమ్మించిన వాళ్ళ పని తనాన్ని చూసినంకనైన మనకు బుద్ధి రాకపోతే ఎట్ల? వాళ్ళకు ఎవరికి, ఏ పార్టీ సిద్ధాంతాలు ఎక్కడ అడ్డు రాలేదుగా..!



అంబటి వెంకన్న

అందుకే కవులారా–కళాకారులారా, రాజకీయ నాయకులారా, మేథావులారా, విద్యార్థులారా, విద్యావంతులారా బుద్ధిమంతులారా... మనదసలే నిజాం వారసత్వం. ఎవరికి వారే నవాబులం. “మా భూములు మాయేనని భూములాపలేదు/మా నీల్లు మాకేనని నీల్లు దాపలేదు/మా బొగ్గు మాకేనని బొగ్గునాపలేదు/ఆరొొందల పది జీవో అమలు జేయించలేదు/అక్రమ ప్రాజెక్టు కట్టడాలను ఆపింది లేదు/అడుగడుగునా మనకు అవమానం దప్తలేదు...../ఇగనన్న మనమంతా పార్టీలను పంతాలను వీడి/ముసలోల్లు ముడిగోల్లు, ఆడోల్లు మొగోల్లు/పిల్లలూ పెద్దలూ అందరొక్కటై/రాజస్థాన్ గుజ్జర్ల లెక్క పట్టుబడితె తప్పు పనిగాదు బిడ్డా.../ఓ పౌరుషాల తెలంగాణ బిడ్డా../అదును మించిపోతే /అమ్మ అన్నారాదు.. అయ్య అన్నారాదు../ముంతెడు నీళ్ళకు మురిసి/వొొచ్చెడు నీళ్ళని ఆగం జేయకురి బిడ్డా/నా తెలంగాన వీర పుత్రులారా..../పార్టీల నాయకులారా... కవులు కళాకారులారా.../రచయితలు మేధావులారా... పత్రికా పెద్దలారా, విద్యార్థులారా/రంగుబొమ్మల పెట్టె అధినేతలారా.../పేరు పేరున మీకు పబ్బతి బడుతున్నా..../చేతులెత్తి తెలంగాణ ఉద్యమ దండాలు బెడుతున్నా...” .మీ అందరికి చేతులెత్తి దండాలు పెట్టి చెప్పేది ఒక్కటే. మన ఐక్యతను విచ్ఛిన్నం చేయాలని చూసే అవతలి వానికి అవకాశం కల్పించొద్దు. పగోని ముందు పలసన కావొొద్దు. నలుగుర్లో నవ్వుల పాలు కావొొద్దు. దీర్ఘకాలికంగా కొనసాగించాల్సిన ఈ ఉద్యమంలో మనం మనమే పీకులాడుకునేటట్టు చేసే వలసాంధ్రుల కుట్రలకు బలి కావొొద్దు. ఆంధ్రా బాబులను సంకనెత్తుకుంటే మన లక్ష్యం నెరవేరదు. రాజకీయ పార్టీల జెండాలు, సిద్ధాంతాలు పక్కన పెట్టి తెలంగాణ సమిష్టి ఉద్యమాన్ని కొనసాగిద్దాం. అంతేగాని పేపర్లో, టీవిల్లో బొమ్మల కోసమో, రాజకీయ ఆధిపత్యం కోసమో కొట్లాడుకోవద్దు. వచ్చే పావులకు, ఆటానకు పంచాది పెట్టుకోవద్దు. తెలంగాణ కోసం అసువులు బాసిన అమరుల త్యాగాలను మనం బతికుండి వృధా చేయొద్దు. ఆంధ్రా ఛానెళ్ళ నిఘా కెమెరాల ముందు ఇజ్జతి తీసుకునే విధంగా ప్రవర్తించొద్దు.

తెలంగాణ పౌరుషాన్ని సీమాంధ్రులకు తాకట్టు పెట్టొద్దు. ఎవరేమైనా, ఏపార్టీ సిద్ధాంతం ఏదైనా, అంతా కలిసి ఒక్కటిగా నడుద్దాం. తెలంగాణ ఉద్యమం ఈరోజు ఏ ఒక్క నాయకుడో ఆజ్ఞాపిస్తే నడిచే పరిస్థితిలో ప్రజలు లేరు. పాటే లీడరుగా ప్రజలే తెలంగాణ ఉద్యమాన్ని ఉరకలెత్తిస్తున్నరు. ఎక్కడికక్కడ ఎవరికి వారు తక్షనమే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించవలసిందిగా అనేక పద్దతులలో నిరసనలు తెలియ జేస్తున్నరు. ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నరు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో కేంధ్ర ప్రభుత్వం సత్వర నిర్ణయం ప్రకటించక పోతే, తెలంగాణ ప్రతి ఇంటి ముందల జై తెలంగాణ అని రాసి తెలంగాణ చిత్రపటం, చార్మినార్, గోల్కొండ, ఓరుగల్లు కోట వంటి చిత్రాలను ముగ్గులుగా వెయ్యాలె. అదే విధంగ వలసాంధ్రుల విద్యాలయాలను, సినిమా ప్రధర్శనలను బహిష్కరిస్తూ సహాయ నిరాకరణ

ఉద్యమం చేపట్టాలె. విశ్వ విద్యాలయాలలో మన విద్యార్థులకు మద్దతుగా మనం హైద్రబాదును చేరుకునే జాతీయ రహదారులనే కాకుండా, ప్రధాన రహదారులన్ని ఎటూ యాబై, వంద కిలోమీటర్ల వరకు ట్రాక్టర్లు ఎడ్లబండ్లల్ల తరలి వచ్చి, రోడ్డు పక్కన పొయిరాళ్లతో, ఉప్పు, నిరపకాయ, సింతపండు, కారంపొడి, పొయిల కట్టెలు సిద్దంజేసుకొని అక్కడ్నే వండుక తినుకుంట రోడ్లను దిగ్బంధనం చేసి శాంతియుతంగ నిరసనలు తెలియజెయ్యాలె. తెలంగాణ ఏర్పాటు చేసే వరకు మన వనవాసం కొనసాగుతనే ఉండాలె.

తెలంగాణ ఉద్యమానికి మద్దతు పలికే అన్నలారా మీకు వందనాలు. ఆంధ్ర నాయకుల కుటిలనీతి మీద, వాళ్ళ చేతల మీద మీ యుద్ధం జరగాలె. నోరు సేత బట్టుకొని ఉరుకొచ్చే రాయపాటి, లగడపాటి, మోహన్‌బాబు లాంటోల్లకు తగిన గుణపాఠం చెప్పాలె. అప్పుడే ఈ ప్రాంతానికి ఇక్కడి నేలకు మద్దతు ప్రకటించిన నిజమైన వాళ్ళుగా చరిత్రలో మిగిలిపోతం.

ముఖ్యంగ ఇక్కడ తెలుగుదేశం సస్తెనే తెలంగాణ వస్తది. లేకుంటే తెలుగో తెలుగని గగ్గోలు పెట్టి గంధరగోళం సృష్టిస్తరు.

మనది భరతజాతి, భారతదేశం అంతేగాని ఆంధ్రోళ్ళు చెబుతున్నట్టు తెలుగుదేశమో, తెలుగుజాతో కాదు.

మల్ల గట్టిగ మాట్లాడితె తెలంగాణ ఒక ప్రత్యేక అస్థిత్వం గల రాజ్యం.

సమైక్యాంధ్ర, సమైక్యాంధ్రని గొంతు చింపుకుంటరేంది? తెలంగాణ ఏర్పడితే మిగిలేది సీమాంద్రే..! మీ ఆంధ్రే! మీకంతగ కేంద్రపాలిత ప్రాంతం మీద మోజుంటే గ్రేట్‌గా గ్రేటర్ కావాలనుకుంటే రాయలసీమను చేసుకోరి.

అంతేగాని అటు తెలంగాణ విషయంలో గాని, ఇటు హైద్రాబాదు విషయంలో గాని పల్లెత్తు మాటంటే జనం ఎంటబడి పొలిమెర దాటించడం ఖాయం.

అసలు తెలంగాణంటెనే హైద్రబాదురా దద్దమ్మల్లారా.!

చరిత్ర తెలువని వాజమ్మల్లారా..!

ఇంతదాకా వచ్చినంక ఇంక తెలంగాణను ఆపడం ఎవనబ్బ తరం కాదు-ఇంత జేసిన మీరు మాతో కలిసి ఉండడమూ సాధ్యం కాదు.

తెలంగాణ ఏర్పడితే ఎట్ల అభివృద్ధి చేసుకోవాల్నో మాకు తెలుసు.

అసలు జరిగే నష్టానికి, హింసకు కారకులే మీ వలసాంధ్ర నాయకులు, పాలకులు. ఇంకా మీ నీతి వచనాలు మాకెందుకు? మీ పీడ విరగడైతే మాకదే తెలంగాణ.

**ఉద్యమాలు, పోరాటాలు, ఆత్మబలిదానాలు అన్నీ...**

# తెలంగాణ రాష్ట్ర సాధన కోసమే

**"ఘర్జనలు, పొలికేకలు, ధర్నాలు, రాస్తారోకోలు, వంటావార్పులు, బంద్‌లు, ధూంధాంలు ఉద్యమాలు ఉద్యమాలేగాని తెలంగాణ రాదా? నాలుగుకోట్ల తెలంగాణ ప్రజల మొర ఆలకించే నాయకుడే లేడా? సీమాంధ్ర కుటిల ప్రయత్నాలకు ఉన్నంత గౌరవం, ఇచ్చే ప్రాధాన్యం తెలంగాణ ఉద్యమానికి ఇయ్యరా? తెలంగాణ బతుకంతా పోరాటమేనా? ఎప్పటికైనా సీమాంధ్ర చెప్పులకింద అనిగిమనిగి బతుకుడేనా?" ఇవి ఈరోజు తెలంగాణ సగటు మనిషిని వేధిస్తున్న ప్రశ్నలు.**

తెలంగాణ ప్రజలకు ఇష్టం లేకపోయినా ఆనాడు సీమాంధ్ర పెద్దమనుషులు విలీనాన్ని కోరుకున్నరు. తెలంగాణ నాయకులను అతి బలవంతంగా ఒప్పించి, అనేక ప్రలోభాలకు గురిచేసి, ఇక్కడి పెద్దమనుషులను లొంగదీసుకున్నరు. నవంబరు 1, 1956న తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవతరించిందని ఆర్భాటంగా ప్రకటించుకున్నరు. ఆ క్షణం నుండి ఇప్పటి వరకు, ఈనాటి వరకు తెలంగాణ ప్రజలు, నాయకులు బానిసలుగానే బతుకుతున్నరు. సర్వస్వం కోల్పోతూ నిస్సహాయులుగా మిగులుతున్నరు. ఆత్మగౌరవాన్ని చంపుకొని అనాధల్లా బతుకీడుస్తున్నరు.

అనేక నిస్సహాయతల్లోంచి, తెలంగాణ బానిస బతుకుల విముక్తి కోసం అనేక ఉద్యమాలు, పోరాటాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నవి. ఈ ఉద్యమాలు–పోరాటాల ఫలితంగా కొందరు అమరులైతే, మరికొందరు అందలాలు అందుకుంటున్నరు. తెలంగాణ అంశాన్ని ఆయుధంగా వాడుకుంటూ వారికి కావలసింది రాబట్టుకుంటున్నరు. అంతేగాని తెలంగాణ గోడును, గర్భశోకాన్ని పట్టించుకున్నోడు లేడనే విషయం ఇప్పటికీ అనేకసార్లు

రుజువైంది. ఆంధ్రప్రదేశ్ శరవేగంగ అభివృద్ధి అయితుంటే తెలంగాణ బికారిదై కన్నబిడ్డల్ని అమ్ముకుంటుంది. ఆంధ్రప్రదేశ్ అన్నపూర్ణగ వెలిగిపోతుంటే తెలంగాణ ఆత్మహత్యలు, ఆకలిచావులతో అల్లాడిపోతుంది. చెమటోడ్చి రెక్కలు ముక్కలు చేసుకొని పండించిన పంటను కొనే దిక్కులేదు. గిట్టుబాటు ధర కాదుగదా పుట్లకొద్ది పంట నేలపాలై పోతుంటే పట్టించుకోని సంధర్భాన్ని మనం ఇప్పుడు కళ్ళార చూస్తున్నం. తెలంగాణ ప్రాంత రైతులకు సరిపడ బస్తాలు కూడా అందించలేని ఈ ప్రభుత్వం తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిస్తమంటే ఇక్కడి ప్రజలు ఎట్ల నమ్ముతరు. విత్తనాలు కొనడానికి లాఠి దెబ్బలు తినడం, కరెంటు కోసం పడిగాపులు గాసి ఎండిన పంటచేలో ఉరి పెట్టుకోవడం తప్ప ఈ సమైక్యాంధ్రలో తెలంగాణకు మిగిలింది ఏముంది? ఇగ హైద్రాబాద్ విషయానికొస్తే అదొొక చిత్రమైన సమస్య. ఎంతో చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపద కలిగిన ఈ మహానగరాన్ని మేమంటే మేం అభివృద్ధి చేసినమని డంబాలు పలుకుతున్నరు. అనాదిగా హైద్రాబాదులో ఉండే స్థానికులకు సిప్ప సేతికిచ్చి క్రమంగా వాళ్ళను సిటీ బయటికి గెంటివేస్తూ కాలనీలు నిర్మించుకుంటున్న సీమాంధ్రులకు అడ్డు, అదుపు లేకుంట పోయింది.

రోడ్లు, ఔటర్ రింగురోడ్లు, మెట్రోలైన్ల పేరిట ఇక్కడి సాంస్కృతిక సంపదను కొల్లగొడుతూ అభివృద్ధి అని ప్రచారం చేస్తుంటే వినేవాడికి, చూసేవాడికి నిజమేననిపిస్తుంది తప్ప తెలంగాణ గుండెకోతను అర్థం చేసుకున్న వారెవరు లేరు?

ప్రాజెక్టుల పేర నిర్వాసితులైన తెలంగాణ ప్రజలను ఆదుకున్న వారెవరు?

తెలంగాణ ప్రజలు ప్రతిచిన్న విషయానికి రోడ్లెక్కి మొత్తుకోవడం తప్ప ఇక్కడ ఏ చిన్న సమస్య పరిష్కారం కాదు. ఈ నిర్వాసితులు ఎప్పుడైనా, ఎక్కడైనా నిలువ నీడ లేకుంట సంవత్సరాల తరబడి పరిహారం కోసం పాకులాడవలసిందే. ముంపు ప్రాంతాల ప్రజలు సర్వస్వం కోల్పోయి సావలేక బతకవలసిందే. ఏ ముంపుకు గురికానివాల్లు,ఎక్కడినించో ఇక్కడికి వలస వచ్చిన వాళ్ళు అన్ని రకాలుగా ఆనందంగ బతుకుతుంటే ఇక్కడ పుట్టి పెరిగిన పాపానికి తెలంగాణ ప్రజలు నిత్యం పోరాటాలలో మునిగి తేలవలసిందే. ప్రజల ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధులు కొందరు ఇక్కడి ప్రజల మనోభీష్టానికి అనుగుణంగ నడుచుకోవడానికి బదులు సీమాంధ్రుల మోచేతి నీళ్ళతో సంతృప్తి పడుతున్నరు. అందుకే ఇక్కడి ప్రజలకు ఇన్ని బాధలు. నిజంగా ప్రజల కోసం పనిచేసే నాయకులైతే తెలంగాణలో ఇన్ని సమస్యలు ఎందుకుంటయ్? ఇన్ని పోరాటాలు చేస్తున్నా, అనేక నిరసనలతో నెత్తురోడుతున్న, ప్రాణత్యాగాలు చేస్తున్నా తెలంగాణ ఎందుకు రాదు? ఇది కచ్చితంగ ఇక్కడి నాయకుల డొల్లతనమే. వాళ్ళ స్వార్థ ప్రయోజనాల కోసం నాలుగుకోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను తాకట్టు పెడుతుండడమే. లేదంటే 60 సంవత్సరాలుగా జరుగుతున్న తెలంగాణ ఉద్యమానికన్నా, రాత్రికి రాత్రే పుట్టిన సమైక్య ఉద్యమానికి ఎక్కువ ప్రాధాన్యతనిచ్చి

తెలంగాణను అనిచివేసే ప్రయత్నాలు చేస్తున్నరంటే దాని అర్థం ఏమనుకోవాలె. ఏ విధంగ అంచనా వేయాలె?

అయితే కుట్రలతో కావచ్చు, మరొకటి కావచ్చు గాని సీమాంధ్ర ఉద్యమంలో నాయకులంతా ఒకటేననే సంకేతాలిచ్చింద్రు. అనేక సందర్భాలలో అదే జరుగుతూ వచ్చింది.

అది కృత్రిమ ఉద్యమం కావచ్చు. కుట్రదారుల పని గావచ్చు

ఏదేమైనా సీమాంధ్ర లాబీయింగ్‌ల ముందు తెలంగాణ తెర్లయ్యేటట్టు కనపడుతుంది.

మన ధర్మపోరాటం మొక్కుబడి యవ్వారం అయ్యేటట్టుంది.

తెలంగాణలో ఒక్కపార్టీలోను మూడు రంగులు మూడు జెండాలు, ముండమోపి మాటలే ముసురుకుంటున్నయ్. అందరు ఏకమయ్యేదెప్పుడు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించేదెన్నడు? రాజకీయి నాయకులను అందరినీ చెట్లకు గట్టేసే ప్రయత్నాలు ప్రజా సంఘాలు చేయాలి. ముఖ్యంగా జెఎసి ఈ బాధ్యత చేపట్టాలి. 5మందితోని, 10మందితోని కార్యక్రమాలు చేయకుండా ఎవరిది వారు చేసినప్పటికి అందిరికి ఒక సంయుక్త కార్యచరణ ఉండాలె.

అనేక మిలియన్ మార్చ్‌లు జరగాలె. ఛలో జూబ్లిహిల్స్, ఛలో కె.పి.హెచ్.బి. అంటూ ఆంధ్రోళ్ళ అడ్డలమీద కార్యక్రమాలు జరగాలె.

ఇప్పుడు తెలంగాణ పత్రికలు, డోర్‌పోస్టర్‌లు, వాల్‌పెయింటింగ్స్‌తో సీమాంధ్రులకు తెలంగాణ తీవ్రత తెలిసొచ్చేటట్టు చెయ్యాలె. ఈ క్రమంలో చిన్న చిన్న స్టిక్కర్‌లు ఎంతో పనిచేస్తయ్. చిన్నచిన్న శ్లోగన్స్‌తో సీమాంధ్ర నాయకులకు కనువిప్పు కలిగేటట్టు చెయ్యాలె. తెలంగాణకు సంపూర్ణ మద్దతు ప్రకటించేటట్టు చెయ్యాలె. "మంచి మనిషికో మాట–మంచి గొడ్డుకో దెబ్బ" అన్నరు. మంచి మాటతోని చెప్పినపుడు ఇనక పోతే ఇగ దంచుడు తప్పదు. పొలిమెర దాటిందాక గెదుముడు తప్పదు.

తెలంగాణ ప్రాంత పార్టీల నాయకులను, ఇక్కడి సంఘాలను, వారు (టి.ఆర్.ఎస్. మినహా) చేపడుతున్న కార్యక్రమాలను చూసి జనం నవ్వుకుంటున్నరు. పిచ్చోల్లను చూసినట్టు చూస్తున్నరు. ఎంత చేసినా తెలంగాణ రాదన్న అహంభావంతో సీమాంధ్ర నాయకులు మాట్లాడుతున్నరు. నిజంగానే ఇన్ని చేసినా ఏం జరిగింది. వర్లుడు మనదైతుంది. వండుకతినుడు వాళ్ళదైతుంది. సంపుడు వాళ్ళవంతయ్యింది – సచ్చుడు మనవంతయ్యింది, ఆనాటి నుండి ఇదేగా జరుగుతుంది. మరి దీనంతటికి కారణం ఎవరు? మనమంతా ఒక్కతీరుగ మాట్లాడి ఒక్క గొంతుక వినిపించక పోవడమేగా..! ఎవ్వడు జూసినా కాసేపు ఎగుర్తడు తెల్లారె ఎల్లెల్కల పడ్తడు. ఇదేగా జరుగుతుంది.

ఇట్ల కాకుండా ఉద్యమం మరో రూపం ధరించాలె.

తెలంగాణ ద్రోహులను, సమైక్యవాద తొత్తులను మూకుమ్మడిగ ముట్టడించాలె.

ఒక్కో జిల్లాలో ఒక్కో నాయకున్ని అన్ని సంఘాలు, తెలంగాణ వాదులు మూకుమ్మడిగా ఒకే ఐక్య కార్యాచరణగా వేలాది మందితో ఉద్యమాన్ని ఉధృతం చేయాలె. ఎక్కడికక్కడ నిలదీయాలె. సత్తాలేని సమైక్యవాదం కోసం పడరాని పాట్లు పడుతుంటే ఇంకగూడా తెలంగాణ నాయకులలో చిత్తశుద్ధి లేకపోవడం విచారకరం. "కొమటిరెడ్డి వెంకటరెడ్డి గావొచ్చు,



ఉత్తమ్‌కుమార్ రెడ్డి గావొచ్చు, దామోదర్ రెడ్డి గావొచ్చు. వీళ్ళందరు ఏంజెప్పింంద్రు. శ్రీకృష్ణ కమిటీ వేసిందే తెలంగాణ ఇచ్చేటందుకని చెప్పింంద్రు. లేదంటే మేం వెంటనే రాజీనామాలు చేస్తమని చెప్పింంద్రు. మరి చూద్దాం". **-కేటియార్, టి.ఆర్.ఎస్. శాసనసభ్యులు**

ఎవరి నాయకుడు వాళ్ళకు ఉన్నంత కాలం, ఎవరి ఎజెండాలు వాళ్ళకు ఉన్నంత కాలం తెలంగాణ బతుకు నెత్తుటి గాయాలు కాక మరేమైతదీ?అయితే ఈ తరహా దారుణాలు,దోపిడీలు, దొంగ నాటకాలు ఇయ్యాలతో వచ్చినవి కావు. తెలంగాణను బలవంతంగా సీమాంధ్రతో ముడిపెట్టిన నాటి నుండి జరుగుతునే ఉన్నయి. ఇంకొక గమ్మత్తయిన విషయం ఏమిటంటే తెలంగాణ ఉద్యమం ఎప్పుడు తీవ్రరూపం దాల్చితే అంతే తీవ్రంగా సీమాంధ్రుల దోపిడి పెరిగి అధికార మధం తీవ్రతరమైతది. అయ్యాల 1969 తెలంగాణ ఉద్యమం ద్వారా అత్యధికంగా లాభపడ్డది సీమాంధ్రులే. 1970-71 జైఆంధ్ర ఉద్యమం ద్వారా తెలంగాణ మీద పూర్తిస్థాయి పట్టుని సంపాదించి ఇక్కడి వనరులను కొల్లగొట్టుకొని పోవడానికి అన్ని హంగులు ఏర్పాటు చేసుకున్నది వాళ్ళే. ఆనాటి నుండి తెలంగాణ నాయకులను కీలుబొమ్మల్ని చేసి ఆడించడం మొదలు పెట్టింంద్రు. పనిలో పనిగా సీమాంధ్ర పాలకులు తమ పాలనా విధానాన్ని మార్చుకున్నరు.

తెలంగాణను తెర్లుజేసే కార్యక్రమాలకే పెద్దపీట వేసుకుంటొస్తున్నరు.

తెలంగాణ విద్యార్థులు ఉద్యమాలతో తలమునకవుతుంటే నోటిఫికేషన్లమీద నోటిఫికేషన్లు విడుదల చేసి, ఉన్న ఉద్యోగాలు ఊడ్చుకొని పోయే ఎత్తుగడలలో సీమాంధ్రులున్నరు. తెలంగాణ పల్లెల్ని, ప్రజల్ని పోలీసు బలగాలతో నింపుతున్నరు. భయకంపితుల్ని చేసి ఉద్యమాన్ని అనిచివేసే ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నరు. ఇయ్యాల 2001 నుండి 2011 దాకా జరిగిన, జరుగుతున్న వాస్తవాలు గమనిస్తే ఈ విషయం మనకు అవగతమవుతుంది.

గత 30 సంవత్సరాలలో జరిగిన సీమాంధ్రుల దోపిడి ఈ పది సంవత్సరాలలో అన్ని రంగాలలోనూ రెట్టింపు స్థాయిలో ఉంది. మరీముఖ్యంగా 2008 నుండి తెలంగాణకు

సంబంధించిన విద్యా, ఉద్యోగాలు, నీటి వనరులను దోచుకుపోవడమేసీమాంధ్ర పాలనా విధానం అన్నంత మూర్ఖంగ వ్యవహరిస్తున్నరు. అయినా ఎవరినని ఏం ప్రయోజనం.

మన కావలి కుక్కలు మంచివైతే దొంగలు ఇంట్లకెట్లొస్తరు?

ఇంటోడు మంచోడైతే బైటోడు ఎందుకు బడాయిజూపిస్తడు. లేకుంటే అన్నందాల కష్టపడి నోటికాడికి తెచ్చుకున్న తెలంగాణ ముద్దను గద్దలు తన్నుకపొయినట్టు తన్నుకపోయే ప్రయత్నంలో సీమాంధ్రులు రాబందులై ఎట్ల ఎగర గలుగుతున్నరు. అయినా మన కండ్ల ముందే ఇన్ని జరుగుతున్న ఇంకా గుడ్లెల్లబెట్టి సూసుడేంది? అన్నింటికి మించి ఇంతపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేని చేతగాని ఈ ప్రభుత్వ పాలనెందుకు? ఎవరిని ఉద్ధరించడానికి? ఇంకా ఎంత మందిని పొట్టన పెట్టుకోవడానికి?

ఏ దొంగలకు సద్దులు మోసి సాటుంగ బొజ్జలు పెంచడానికి?

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తమని 2009 డిసెంబర్ 9న చేసిన ప్రకటన పిల్లలాట ఎట్లయింది? ప్రధానమంత్రి, సోనియాగాంధి అనుమతి లేకుండానే చిదంబరం చిచ్చుబెట్టిండని మాట్లాడేటోనిది నాలికెట్లయితది? ఆ మాటను వెనకకు తీసుకున్న వాడు మనిషెట్ల అయితడు. బాధ్యత గల ప్రజా పాలకుడెట్లయితడు?

కేంద్రం నుండి ప్రకటన వెలువడక ముందు తెలంగాణకు సై అన్నోల్లు, జై అన్నోల్లు, ఎన్నికలనంగనే తెలంగాణ జపం చేసినోల్లు, తెలంగాణ చుట్టు కుక్కల్లా తిరిగినోల్లు తెలంగాణ ప్రక్రియ ప్రారంభిస్తామని చెప్పంగనే ఒక్కొక్కని నోట్ల రాయి బడ్డదేంది? ఒక్కొక్కనిది పియ్యిదిన్న నాలికయిందేంది? ఒక్క భుజం మీద నాలుగు కండువలు గప్పుకొని సక్కసక్క నడిసినోడు ఒక్కడు మాట్లాడడేంది? రెండు కండ్లు,రెండు నాలుకలని అడ్డదిడ్డమైన సిద్ధాంతాలను అడ్డమేస్తడేంది? ఏదేమైనా ఇంక సహించేది లేదు. బలగాలెన్ని దింపినా భరించేది లేదు. కండ్లుండి చూడలేని గుడ్డి సిద్ధాంతాలను కాలరాయాలే. ఎవడి జెండాలు వాడు పట్టుకొని, ఎవడి ఎజెండాలు వాడు నడుముకు సుట్టుకొని తెలంగాణ కిరీటంతో తెగఫోజులు గొట్టేటోని భరతం పట్టాలె. తెలంగాణని కుల,మతాల కుమ్ములాటగా జేసెటోన్ని కూలదొయ్యాలె. వేర్పాటువాదమనే వాన్ని వేరుజెయ్యాలె. ఇంకా ఈ నాయకులు గోడమీది పిల్లి వాటంతో ఇంకెంతమంది ప్రానాలు తింటరు? అందుకే ఇగ ఈ ఈ నక్కజిత్తుల నాయకుల మాటలు నమ్మేది లేదు.

తెలంగాణ పల్లెలన్ని మూకుమ్మడిగా రాజధానికి కదందొక్కాలే.

మిలియన్‌మార్చ్ కవాతులతో మహానిర్మాణానికి బునాది దొవ్వాలె.

తెలంగాణ రాష్ట్రాన్ని నిర్మించి తీరాలె.











**అణిచివేత, అవమానం, దీక్షలు, ఎన్నికల ఫలితాలు- విద్యార్థుల ప్రాణ త్యాగాలు**

# తెలంగాణ ఇయ్యక తప్పని పరిస్థితులు

తెలంగాణది ఎపుడు న్యాయబద్ధమైన ప్రజాస్వామిక పోరాటం. నిండు బతుకమ్మ సాక్షిగ పది జిల్లాల తెలంగాణ తథ్యం.

సమైక్యవాద జెండాలు భూజాన మోసే చేతగాని తెలంగాణ నాయకుల పుణ్యమే కదా అనాదిగా ఉద్యమం నీరుగారిపోయేది.తెలంగాణ బతుకంతా పోరాటమే అనే ఒక నిస్సహాయ స్థితికి నెట్టివేయ బడేది.

సీమాంధ్ర పార్టీల రెండు కండ్ల సిద్దాంతం, ఆంధ్ర మీడియాలో అర్థంలేని చర్చలే కదా ఈ ఆత్మ బలిదానాలకు దారి తీసింది. ఇక్కడి కుటిల నాయకులకు బుద్ధి రావాలనే దృఢ సంకల్పమే కదా మన విద్యార్థులు ఈరోజు అగ్గిని ఆలింగనం చేసుకొని, ఉరికొయ్యలను ముద్దాడి, పురుగులమందును పెరుగు బువ్వోలిగతిని చివరికి దేవతల మొక్కులు చెల్లించింది.

గోడమీది పిల్లులకు, సమైక్యవాద తొత్తులకు ఒక హెచ్చరిక కదా ఈ వీరుల త్యాగాలు, ఆత్మ బలిదానాలు. ఈ సంధర్భంలో ఇక్కడ కొందరు నాయకులు ఎవరికోసం పనిచేస్తున్నరో పనిగట్టుకొని ప్రచారం చేయవలసిన అవసరం లేదు. కచ్చితంగ సమీప

భవిష్యత్తులో అట్లాంటి ద్రోహులను, సీమాంధ్ర నాయకులను ఈ అగ్నికీలలు అంటుకొని దహించడం ఖాయం. అంతేగాదు ఇగ ఇక్కడి గ్రామ దేవతలు సీమాంధ్ర విద్యార్థులను బలితీసుకోవచ్చు. ఒక్కోవీరుడు వేలమంది సమైక్యవాదులను సంకనేసుకొని ఎగిరిపోవచ్చు.

తెలంగాణలో ఆంధ్రపత్రికలు, టీవీల కుట్రల్ని ధ్వసం చేసే దిశగా అడుగులు వేయడం ఖాయం. ఇది జాతకం కాదు. వాస్తవం. సహనం సచ్చినంక సతీసావిత్రయినా మొగని పీక పిస్కదా?ఇంత జరుగుతుంటే పిల్లి పులి గాదా? వీరతెలంగాణ, పోరు తెలంగాణగా నెత్తుటి బేరలు గీయదా? ఇవే ఇపుడు మేథావుల ముందున్న సవాలక్ష ప్రశ్నలు. మస్తిష్కాన్ని తొలిచేసే ప్రశ్నలు.



**"తెలంగాణ ఉద్యమ పరిణామ క్రమంలో ఇది గొప్ప మలుపు. ఈ ఎన్నికల తర్వాత తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో కాంగ్రెసు పార్టీకి బాధ్యత పెరిగింది. ఇకనైనా ప్రకటనలకు పరిమితం కాకుండా, ఎంతమాత్రం జాప్యం చేయకుండా తెలంగాణ ఏర్పాటును వేగవంతం చేయాలి" -జీవన్‌రెడ్డి**



**"తెలుగు దేశం పార్టీ ఖచ్చితంగా తెలంగాణ ద్రోహుల పార్టీ. తెలంగాణకు అడ్డొస్తే అడ్డంగా ఓడిస్తాం. కాంగ్రేస్, టి.డి.పిల మీద తెలంగాణ ప్రజలు పట్టలేని ఆవేశంతో ఉన్నారు" -విజయశాంతి**

తెలంగాణ ప్రజల్లో ఒక స్పష్టమైన ఆవేదన, ఆవేశం మిళితమై ఉన్నట్టు కనిపిస్తుంది. ఎందుకంటే ఇప్పటికే వాళ్ళు అనేక పరీక్షలలో నెగ్గిండ్రు. అగ్ని ప్రవేశం చేసిండ్రు. ఆహుతయ్యిండ్రు. ముడిపెట్టిన కానించి విడగొట్టమని మొత్తుకుంటుండ్రు. అన్యాయం జరిగిన కానించి మొత్తుకున్న ఆగొంతు ఎవరికి వినపడలేదనే ఆవేదన. పైగా బలవంతంగా ఆ గొంతును నొక్కిపెట్టిండ్రనేది వాళ్ళ మాటల అంతరార్థం. తెలంగాణ వాదులే విద్యార్థులను

రెచ్చగొడుతున్నారని, రాజకీయ నిరుద్యోగులే తెలంగాణవాదాన్ని బలపర్చుతున్నారని సీమాంధ్రుల వాదన. అయితే ఊకదంపుడు ఉపన్యాసాలకు, రాజకీయ నాయకుల ప్రసంగాలకు రెచ్చిపోయి, సినిమావాళ్ళు మీటింగు పెడితే టిక్కెట్లు కొనిపోయే ఆచారం ఇక్కడి ప్రజలకు లేదు. ఏ కోశాన రాదు. ఇట్ల అనేక విషయాలలో, ఆచార వ్యవహారాలలో, సంస్కృతి, సంప్రదాయాలలోను, భాషా విషయంలోను ఆంధ్ర తెలంగాణకు స్పష్టమైన తేడా ఉందని తెలంగాణ వాదన.

అందుకె ఏ కోశాన ఆంధ్ర తెలంగాణ కలిసి ఉండే పరిస్థితి లేదని వారు తేల్చేస్తున్నరు. ఈ సంధర్భంగా మనం ఇక్కడ ఒక విషయాన్ని గమనించ వలసిన అవసరం ఉంది. ఇప్పటికే ప్రజల్లో పూర్తిగా విడిపోవాలనే భావన బలంగ నాటుకుంది.

వాల్లు ఈ పాటికే మానసికంగా వేరుపడి జీవిస్తున్నరు. తెలంగాణకు వ్యతిరేకంగా ఒక వార్త ఏ ఛానెల్లో ప్రసారం చేసినా దాన్ని నిలిపేస్తున్నరు.

తెలంగాణకు సంబంధించిన విషయాల పట్ల ఏటీవి, ఏ పత్రిక ఏంరాస్తుందో, ఏం ప్రచారం చేస్తుందో దానికి ఎట్ల బుద్ధి చెప్పాల్నో కూడా వాళ్ళు ఆలోచిస్తున్నరు. ఇక తెలంగాణ నాయకులు, విద్యార్థులు యుద్ధమే ప్రకటించింఁడ్రు. హైకోర్టులో లాయర్లు విడిపోయింఁడ్రు.

అన్ని ప్రభుత్వ శాఖల్లో వేరువేరుగా ఎవరి పని వాళ్ళు చేసుకుంటుంఁడ్రు.

రాజకీయ పార్టీలు రెండుగా చీలి, శృతిలేని సంసారం సాగిస్తున్నయి. రాష్ట్ర మంత్రివర్గం సైతం రెండుగా విడిపోయింది.

పైకి కలిసి విందులు స్వీకరించిన, చిందులు వేసినా ఎవరి మదిలో ఏముందో వాళ్ళకే కాదు జనానికి కూడ తెలుసు. వాస్తవాల్ని పక్కకు పెట్టి వితండ వాదం చేసే సీమాంధ్రులతో మాట్లాడినా ప్రయోజనం లేదనే అభిప్రాయాన్ని నాలుగు కోట్ల తెలంగాణ బిడ్డలు వెలిబుచ్చుతున్నరు.

పోరాటమే శరణ్యమని గిరిగీస్తున్నరు. యుద్దానికి సిద్దమంటున్నరు.

అరవయేండ్లుగా అణిచివేతకు, అవమానానికి గురైన తెలంగాణను వేరుచేయాలని అంటుంటే ఒకరు ఉత్తరాంధ్ర అని, మరొకరు రాయలసీమ అని ఇంకేదో అని మాట్లాడటం ఎంతవరకు న్యాయమని అడుగుతున్నరు. ఇగ చంద్రబాబునాయుడైతే అహంకార మదంతో వెటకారంగ "ఉత్తర తెలంగాణ, దక్షిణ తెలంగాణ అంటే అసలు తెలంగాణ వాదులు ఎటువైపని" అర్థం లేని వ్యాఖ్యలు చేయడం ఇక్కడి ప్రజల్ని కలిచివేస్తుంది. సరిగ్గా ఇలాంటి స్థితిలోనే ఆత్మహత్యలు జరుగుతున్నయని నెత్తినోరు కొట్టుకుంటున్నరు. ఏమి చేయలేని అయోమయ స్థితిలో తెలంగాణ ప్రజలు, విద్యార్థులు సెల్‌టవర్లు ఎక్కడం లాంటి చర్యలకు పాల్పడుతున్నరని తెలంగాణ వాదులు ఆందోళన చెందుతున్నరు.

అసలు తెలుగు దేశం అని పార్టీ స్థాపించడమే భారతదేశ ఐక్యతకు బంగం కలిగే అంశం కదా అనే విషయం ఇప్పుడు తెర మీదికొస్తుంది.

నాకైతే తెలుగు దేశం అనడంలోనే వేర్పాటువాద తీవ్రత కనపడుతుంది.

అసలు వేర్పాటువాద ఆలోచనతో మొదలైన సీమాంధ్రులు దేశ సమైక్యతకు, తెలంగాణకు ముడిపెట్టటం ఏంది? తెలంగాణ ఉద్యమం బలపడినప్పుడల్లా ఆంధ్ర శబ్దం అంతరించి "మన తెలుగోడు, మన తెలుగు" అన్న పదాలకు ప్రాధాన్యత సంతరించుకోవడం ఏమిటి? ఏ ఎండకాగొడుగు పట్టేదెవరో ఇట్టే అర్థమైపోతుందని, మోసకారితనం, కపట విధానాలు ఎవరు అవలంభిస్తున్నరో కళ్లకు కట్టినట్టు కనపడుతుందని పెద్దలు, బుద్ధిజీవులు దీన్ని గమనించాలని వారు ఆవేదన చెందుతున్నట్టుగా మనకు అర్థం అయ్‌తుంది.

అయితే ఈ పరిస్థితులు ఎట్ల ఉన్న డిసెంబర్ 9 తర్వాత తలెత్తిన పరిస్థితులను అంచనా వేయమని కదా శ్రీకృష్ణ కమిటినీ నియమించింది. అసలు ఆంధ్రప్రదేశ్‌లో ఏం జరిగిందో తెలుసుకొమ్మని గదా కమిటీని ఏర్పాటు చేసింది.

అన్ని పార్టీలు తెలంగాణకు అంగీకరించి వెనుకకు గుంజుకున్న పరిణామాల వల్ల కదా ఇంత జరిగేది. ఈ పరిస్థితులను ఆలోచించవలసిన అవసరం ఉంది. అంతేగాని ఉప ఎన్నికలే లేకపోతే ఇక్కడ ఉద్యమమే లేదనే విషయం గురించి కాదనేది మరో వాదన.

మొత్తానికి తెలంగాణకే కట్టుబడి రాజీనామా చేసిన అభ్యర్థులను ఈ ఉప ఎన్నికల్లో సగటున 65వేల పై చిలుకు మెజార్టితో గెలిపించి తెలంగాణ ప్రజలు శ్రీకృష్ణ కమిటీకి ఒక బలమైన నివేదిక ఇచ్చింద్రు.

తెలంగాణకు రెఫరెండంగా భావించిన కొందరు ఇప్పుడు నోరు మెదపకుంట కూర్చున్నరు. ఇంత జరిగినా సీమాంధ్రులు కపటంతో మాట్లాడటం, వక్రభాష్యంతో పత్రికలు, ఛానెళ్ళలో చర్చలు చేయడం తెలంగాణ ప్రజల్ని విస్మయానికి గురిచేస్తుందని, వారిని ఆత్మహత్యలకు పురికొల్పుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నరు.

నీతికి, న్యాయానికి కాలం లేదని గుత్పందుకుంటేనే బర్రె చేతికొస్తదనే దృక్పథాన్ని పాలకులలే కల్పిస్తున్నరనే ధోరణికూడా వాళ్ళలో లేకపోలేదు.

మొదటినుంచి తెలంగాణకు, ఉప ఎన్నికలకు ఏదో అవినాభావ సంబంధం ఉన్నట్టు కనిపిస్తుంది. అయితే ఇక్కడ ఒక విషయాన్ని పాఠకుడు జాగ్రత్తగా గమనించాలె. 2006లో కరీంనగర్ ఉప ఎన్నిక సమయంలో వై.యస్.ఆర్. బతికే ఉన్నడు. మందీ మార్బలం, హంగూ ఆర్భాటంతో తన మంత్రి వర్గం అంతా అక్కడ పని చేసింది. కోట్లాది రూపాయలు వెదజల్లింది. అయినా కేసియార్ విజయాన్ని ఆపడం ఎవరి తరం కాలేదు.

కేసియార్ గెలుపు ముమ్మాటికి తెలంగాణ విజయానికి ప్రతీక. అది నాలుగు కోట్ల ప్రజలు సాధించిన అఖండ ఘన విజయం.

ఈరోజు వై.యస్.ఆర్ బతికి ఉంటే ఎన్నికల ఫలితాలు మరోలా ఉండేవని, జగన్ తెలంగాణలో యాత్ర చేపడితే కాంగ్రేస్ విజయం సాధించేదని సీమాంధ్ర వాదులు, వారికి అనుకూలంగా వ్యవహరించే కొందరు తెలంగాణ నాయకులు కూడా మాట్లాడటాన్ని ప్రజలు నిశితంగా గమనిస్తున్నరు. తెలంగాణ ప్రజలు ఎప్పుడు నివురు గప్పినా నిప్పులా ఉంటారని హెచ్చరికలు చేస్తున్నరు. లేదంటే ఉప ఎన్నికలలో వారు ఇచ్చిన తీర్పు ఏ విశ్లేషకునికి, ఎంతటి జ్యోతిష్యునికైనా అందకుండా ఉందంటేనే మనం అర్థం చేసుకోవచ్చు.

సిద్దిపేటలో హరీశ్‌రావు సాధించిన మెజార్టి చూసి కొందరికి గుండె దడ పుట్టందంటే ఆశ్చర్యం కాదు. ఇది చాలదా  కాంగ్రేసు అధిష్టానానికి, ఇకనైన తెలంగాణ ఇవ్వడానికి అనే కోణంలో తెలంగాణ వాదులు ఆలోచిస్తున్నరు.

ఈ విజయంతో సీమాంధ్రులు సైతం తెలంగాణ ఇవ్వక తప్పదనే నిర్ణయానికి వచ్చింద్రు. ఇది వాస్తవం.

అయితే ఆ విజయాన్ని, వాస్తవికతను జీర్ణించుకోలేక లేనిపోని రాద్ధాంతాలు చేస్తున్నరు. వాస్తవానికి ఈ విజయం ఏ పార్టీకో, వ్యక్తులకో చెందింది కాదు. ఇది మొత్తంగ తెలంగాణ విజయం.

కేంద్రమంత్రి చిదంబరం ప్రకటనకు, సోనియాగాంధీ మాటకు చేకూర్చిన బలమే ఈ ఉప ఎన్నికల విజయం.

ఇక ఏ దుష్టశక్తి తెలంగాణను అడ్డుకునే సాహసం చేయదు. ఒకవేళ చేసినా తెలంగాణ శక్తి ముందు నిలబడదు అనే సందేశము, సంకేతానికి నిదర్శనమే మొత్తంగా ఈ పరిణామాలు. ఇక్కడ ఎవరికి ఉపముఖ్యమంత్రి పదవి అవసరం లేదు. మా బోనాలు, బతుకమ్మ పండుగల్ని మీరు జరుపుకుంటే మాకు వచ్చేది ఏమిలేదు.

మా భాషని మీ సినిమాలో పెట్టినా మాకు ఒనగూరేది ఏమిలేదు. ఇపుడు మాకు కావల్సిందల్లా తెలంగాణ. మీరు చేసిన అభివృద్ధి చాలు.

ఇక చేస్తామన్న అభివృద్ధి సంగతి అనవసరం అనే ఒకేఒక ఖచ్చితమైన నిర్ణయానికి ఇక్కడి ప్రజలు వచ్చింద్రు. అందుకే ఈ విజయాన్ని పువ్వుల్లో పెట్టి నిండు బతుకమ్మలా అందించింద్రు.

ఇక సోనియాగాంధీ నేత్రుత్వంలోని యూపిఎ ప్రభుత్వం కూడా తెలంగాణ ఇవ్వాలని నిర్ణయించుకున్నట్టు మనం భావించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే ఏవిధమైన విభజన జరగాల్సిన అవసరం ఉందో దానిపై దృష్టి సారించినట్టు కన్పిస్తుంది.

హైద్రాబాద్ లేని తెలంగాణను ఇక్కడి ప్రజలు అంగీకరించే పరిస్థితి లేదు కాబట్టి కోరి కొత్త సమస్యలు తెచ్చుకోవడం ఎందుకని పది జిల్లాల భౌతిక తెలంగాణను ప్రకటించే అవకాశాలే మెండుగా ఉన్నాయని భావించవచ్చు.

కాకపోతే తెలంగాణ ఇస్తే కోస్తాంధ్రతో కలిసి ఉండలేం అంటున్న రాయలసీమను గ్రేటర్ రాయలసీమగా ప్రకటించి కేంద్రపాలిత ప్రాంతంగా చేస్తే ఇటు ఫ్యాక్షనిజాన్ని తగ్గించడంతో పాటు పాలనా సౌలభ్యం పెరిగే అవకాశం ఉందని కూడా ఆలోచన చేసే అవకాశం ఉన్నది.

ఇప్పటికి దాదాపుగా 370 మంది ఆత్మ బలిదానాలు చేసింద్రు.

వాళ్ళకు ఎవరూ ఏమి ఇచ్చింది లేదు.

తెలంగాణను సాధించడమే వాళ్ళకు మనం ఇచ్చే నిజమైన నివాళి. ఆ అమర వీరుల ఆత్మకు శాంతి. ఇంతకు మించి మాట్లాడే ఏ నాయకున్ని ఉద్యమం క్షమించదు.


ఎట్టి పరిస్థితిలోను ఉప ఎన్నికలలో తిరిగే మొకం లేకనే తెలుగుదేశం పార్టీ నాయకుడు చంద్రబాబు బాబ్లీ నాటకానికి తెరతీసిండని అందరికీ అర్థమయింది.

ఇక పార్ట్‌టైం తెలంగాణ వాదులకు కాలం చెల్లిందనడానికి ఇదే నిదర్శనం. ఇక తెచ్చేది మేమే–ఇచ్చేది మేమే అంటే నడవదు.

తెలంగాణ తెచ్చి ఇచ్చినపుడు మాత్రమే ప్రజలు నమ్ముతరు.

మీ వెంట నడుస్తరు అని ఈ ఎన్నికల ఫలితాలు చెప్పకనే చెప్పినట్టయ్యింది.





# మీ కమిటీలకు మా నివేదిక

**ఆనాడు తెలంగాణ ప్రజల అభిప్రాయానికి విరుద్ధంగానే విలీనం జరిగింది. కుట్రలు పన్నడంలో దిట్టలైన వలసాంధ్ర నాయకుల కుటిల నీతికి తలొగ్గిన పెద్దమనుషులు ఎంతసేపటికి ఇంటోల్లను బెదిరించి మొనగాళ్ళమని అనుకుంటరు మన తెలంగాణ నాయకులు. పజాప్రతినిధులుగా వీళ్ళు ఇక్కడి ప్రజల పక్షం వహించకుండా,నిర్లక్ష్యం చేస్తున్నరు. ఇదేందని నిలదీసిన విద్యార్థులను కేసులపాలు చేస్తూ, పార్టీ సిద్ధాంతాలంటు, పదవులంటూ ఎంగిలి మెతుకులకు ఆశపడి మొరుగుతున్నరు. పరీక్షలను లెక్కచేయకుండా, ప్రాణాలకు తెగించి పోరాటం కొనసాగిస్తున్న విద్యార్థులను పట్టించుకోకుండా తెలంగాణ అంశాన్ని రాజకీయం చేసి నానా విధాలుగా మాట్లాడుతున్న దగుల్బాజి నాయకులకు ప్రజల చేతిలో సావు తప్పదు.**

**భా**రతదేశానికి స్వాతంత్రం సిద్ధించినా మన తెలంగాణ సంకెళ్ళు తెగలేదన్న సంగతి మనకు తెలుసు. దేశంలోని కొన్ని ఇతర ప్రాంతాలను కలుపుకొని తెలంగాణ మొత్తం హైద్రాబాద్ రాష్ట్రంగా మనుగడ సాగిస్తుందన్న సంగతి తెలుసు.

తెలంగాణ అంటేనే హైద్రాబాద్ అన్న సంగతి తెలుసు. తెలంగాణ ప్రాంతంలో మిగులు నిధులు, అన్నిరంగాలకు సరిపడా పుష్కలవనరులున్న సంగతి తెలుసు. అప్పటికి నాలుగేండ్ల క్రితమే అభివృద్ధి చేసిన రాజధాని ఉందన్న సంగతి తెలుసు. ఇవన్నీ గమనించిన కొంతమంది విశాలాంధ్ర వాదులు తెలంగాణ విలీనం కోసం అనేక కుట్రలు చేసిండ్రు.

తెలుగుభాష పేర తమవాదనకు బలాన్ని చేకూర్చుకున్నరు.

సహజంగ ఆంధ్రప్రాంతపు నాయకులకు నేషనల్ కాంగ్రేస్‌తో ప్రత్యక్ష సంబంధాలు ఉండడం మూలంగ ఆనాడు అనేక షరతులతో కూడిన విలీనం చేయవలసి వచ్చింది.

అంతేగాని తెలంగాణ ప్రజలకు గాని, ఇక్కడి నాయకులకు గాని తెలంగాణ ప్రాంతాన్ని ఆంధ్రలో కలపడం ససేమిరా ఇష్టం లేదు. అయ్యాల తెలంగాణ ప్రజల

అభిప్రాయానికి విరుద్ధంగానే విలీనం జరిగింది.

సకల సంపదలతో సస్యశ్యామలంగా అలరారుతున్న తెలంగాణను ఆంధ్రతో విలీనం చేయవలసిన అగత్యమేమి లేదని ఆనాటి ప్రధాని జవహార్ లాల్ నెహ్రూతో పాటు, ఫజల్ అలీ కమీషన్ కూడ అభిప్రాయ పడింది.

నిజానికి మసిబూసి కుట్రలు పన్నడంలో దిట్టలైన వలసాంధ్ర నాయకుల కుటిల నీతికి తలొగ్గిన పెద్ద మనుషులు బలవంతంగానైనా విలీనం చేయడానికే సిద్ధ పడ్డరు.

అయితే విలీనం తప్పదని గ్రహించిన తర్వాత వారు ఒక విషయాన్ని స్పష్టం చేసింద్రు. అదేమిటంటే "భవిష్యత్‌లో తెలంగాణ ప్రజలు ఎప్పుడు తెలంగాణను కోరుకున్న తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడటానికి అందరు సహకరించాలని" చెప్పడం జరిగింది. అందులో భాగంగనే అనేక ఒప్పందాలు చేసుకోవడం జరిగింది.

నీల్లు, నిధులల్లో వాటాలతో పాటు ముల్కీ నిబంధనలు, ఐదు, ఆరు సూత్రాల పథకం, ఆరొందల పది జీవో వంటి ఒప్పందాలు వలస పాలకుల దాష్టీకాన్ని తట్టుకోవడానికి కాలక్రమేణా ఒక్కటొక్కటి అవతరించినయ్. అయినా ఏఒక్కటి వాళ్ల ఆగడాలను అరికట్టలేకపోయింది.

తెలంగాణ అభివృద్ధి కొరకు ఆ ప్రాంతంలో లభ్యమయ్యే వనరులు అక్కడే ఖర్చుపెట్టాలని, మిగులు నిధులను ఆ ప్రాంతపు అభివృద్ధి కొరకే ఖర్చుచేయాలని స్పష్టంగా అనుకున్నప్పటికి ఇక్కడి మిగులు నిధులను పూర్తిగా తరలించుకుపోయే ప్రయత్నంలో సీమాంధ్రులు సఫలమయ్యింద్రు.ముల్కీ రూల్సును ఉల్లంఘించి దాదాపు ముప్పయ్ వేల పై చిలుకుగా వ్యక్తులను ఆంధ్ర ప్రాంతం నుండి రప్పించి ఇక్కడ ఉద్యోగాలు ఇవ్వడం జరిగింది. వాళ్ళు ఇక్కడి భాషను సంస్కృతిని గౌరవించకపోగా అనేక అవమానాలకు గురిచేయడం జరిగింది. ఈ నేపథ్యంలోనే 1969లో తెలంగాణ ఉద్యమం జరిగింది. తెలంగాణ రక్షణల కోసం 1969 జనవరిలో కాసు బ్రహ్మానంద రెడ్డి ప్రభుత్వం జి.ఓ.36 ను విడుదల చేసినట్టే చేసి, సీమాంధ్ర ఉద్యోగులను రెచ్చగొట్టడంతోని అది అమలుకు నోచుకోకుండ చేయగలిగిండు. విచారణ నిమిత్తం కుమార్‌లలిత్ కమిటిని ఏర్పాటు చేసి కాలయాపన చేసిండు. ముల్కీ నిబంధనలు రాజ్యాంగ సమ్మతమేనని హైకోర్టు తీర్పు ఇవ్వడంతోని సీమాంధ్రులు తట్టుకోలేక పోయింద్రు. కుమార్ లలిత్ ఇచ్చిన రిపోర్టును విచారించడం కోసం వశిష్టభార్గవ్ అనే మరో కమిటీని నియమించడం జరిగింది. ఈ విధంగ 1985 నాటికి దాదాపు 60వేల మంది ఆంధ్రా ఉద్యోగులు తెలంగాణలో ఉన్నట్టు జైభారత్ కమిటీ రిపోర్టు ఇచ్చింది. ఆ రిపోర్టును మరింత జాప్యం చేయడం కోసం నాటి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు సుందరేశన్‌తో ఏకసభ్య కమిటీని నియమించిండు. ఈ రెండు కమిటీల ఆధారంగ 610జి.ఓ వెలువడింది. అయినా ఏ విధమైన మార్పులేదు. ఆ తర్వాత 610జి.ఓను సమీక్షించడానికి 2001లో

జి.యం. గిర్‌గ్లాని ఏకసభ్య కమిటీని చంద్రబాబు నాయుడు నియమించిండు. మెజారిటీ ప్రభుత్వ శాఖలు సరైన సమాచారం ఇవ్వక ఆ రిపోర్టు తప్పుల తడకగా మారింది. అనంతరం ఇక్కడ అక్రమంగా ఉద్యోగాలలో చేరిన వారు వెళ్లిపోవాలని, నిధులు లెక్క తేల్చడం వంటి విషయాలు చర్చకు తీసుకురావడంతో ఉద్యమాన్ని ఉక్కు పాదాలతో అణిచి వేసింద్రు.

పోరాటాలు తెలంగాణ వంతుగా, పొంగి పొర్లటం ఆంధ్ర వంతుగా మారింది. తెలంగాణ వాళ్ళు హోంమంత్రులు, ముఖ్యమంత్రులైనా వాళ్ళ పదవులు కాపాడుకోవడానికే ఉన్న పుణ్యకాలం సరిపోయిందనేది తెలంగాణ వాదన. నదీ పరివాహక ప్రదేశం తెలంగాణలో ఎక్కువగా ఉన్నప్పటికినీ సాగుభూమి మాత్రం ఆంధ్రలో ఎక్కువగా ఉండడానికి కారణం ఏదైనా తెలంగాణ ప్రాంతాన్ని నిష్పక్షపాతంగా అభివృద్ధి చేయదలుచుకుంటే ఎన్ని కష్టాలైనా, ఎత్తిపోతలు పెట్టయినా అభివృద్ధి చేయవచ్చు. నిజమే తెలంగాణ ప్రాంతం సముద్రమట్టం కన్నా అత్యంత ఎత్తులో ఉన్న మాట వాస్తవమే. కానీ గలగలా ఉరుకొచ్చే నీళ్ళతో రెండు పంటలు పండించుకుంట మూడోపంట నీటి కోసం తెలంగాణ ప్రాంతాన్ని ముంపుకు గురిచేసే ప్రాజెక్టులు కట్టుకొని చుక్కనీరు తెలంగాణ ప్రాంతానికి చెందకుండా సీమాంధ్రకు తరలించుక పోయే కుట్రలే జరుగుతున్నయనేది నేటి బలమైన వాదన.

అంతే కాకుండా మిగులు నిధులతో ఆంధ్రలో విలీనం కాబడిన తెలంగాణ ఎనుకబడ్డ ప్రాంతం ఎట్లయింది. ఖచ్చితంగా వలస పాలకుల చేతుల్లో అణచి వేయబడి వెనుకకు నెట్టివేయబడ్డ ప్రాంతం తెలంగాణ. మరి ఆ వెనుకబడ్డ ప్రాంతాలకు వచ్చే గ్రాంట్స్ కూడా ఇక్కడ ఖర్చుచేయకుండా వాటిని కూడా అనేక కుంటి సాకులు చూపించి ఆంధ్రకే తరలించుకు పోవడం జరిగిందని, తెలంగాణ ఉద్యమం ఇంత తీవ్రంగా పల్లె పల్లె ప్రజలంతా కదిలి వస్తున్న తరుణంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నాబార్డు నిధులు129 కోట్లలో కేవలం తొమ్మిది కోట్లు మాత్రమే తెలంగాణ ప్రాంతానికి కేటాయించి మిగతా 120 కోట్లను సీమాంధ్రకు తన్నుకొని పోవడం జరిగిందంటే, భవిష్యత్తులో తెలంగాణ ప్రజలను ఏగతి పాలు చేస్తరో అర్థం చేసుకోవచ్చు.

సీమాంధ్ర నాయకులు తియ్యగ నీతి వచనాలు వల్లిస్తుంటే తెలుగు పాట పాడుతుంటే వినడానికి బాగనే ఉంటది. కాని అరవయ్యేండ్లుగ ఒక్కటి అమలుకు నోచుకోలేదంటే ఓపిక పట్టండంటూ మాట్లాడం వెనుక ఉన్న ఆంతర్యం ఏంది?. ఈ విధంగా తెలంగాణ ఎప్పుడు దోపిడి, అన్యాయానికి, అవమానానికి బలై తలవంచుకు బతకాల్సిందేనా?

డిసెంబరు 9వ తేదీన తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తమని చెప్పిన కేంద్రప్రభుత్వం క్రమంగా తోకముడుచుకునే ఎవ్వారం చేస్తున్నట్టుగా తెలంగాణ ప్రజలు భావిస్తున్నరు. దీనికి కారణం వలస పాలకుల పెట్టుబడీదారి ఉద్యమం, వాళ్ళు కేంద్రాన్ని ప్రలోభపెట్టే కుట్రలు, లేదంటే సీమాంధ్రులు పంపిస్తున్న డబ్బుసంచులు ఇంకా ఇతరత్రా అంశాలకు కేంద్రం ఏమైనా తలొగ్గిందా అనే అనుమానం తెలంగాణ ప్రజల గుండెల్ని

పిండేస్తుంది. తెలంగాణ ఏర్పాటు విషయంలో మొదట అన్ని పార్టీలు, వ్యక్తులు సంపూర్ణ అంగీకారం తెల్పడం జరిగింది. అటు కేంద్రంలో గాని, ఇటు రాష్ట్రంలో గాని సై అంటు చేతులెత్తిన వాళ్ళే. కమ్యునిస్టులు కూడ తెలంగాణ ఇస్తే మేము అడ్డు రామని చెప్పిన వాళ్లే. మరి అలాంటిది తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తామని చెప్పిన మరుక్షణమే మాటమార్చి, మడతపేచీలు పెట్టడం ఎక్కడి నీతి. కేంద్రం ఈ విధమైన ద్వంధ విధానాన్ని అనుసరించే పార్టీలను, వ్యక్తులను ప్రజా ప్రతినిధులను మందలించి బుద్ధిచెప్పాల్సింది పోయి శ్రీకృష్ణ కమిటీ ద్వారా వాళ్లకు అనుకూలంగా అభిప్రాయ సేకరణ అంటూ, నాటినుంచి నేటి వరకు జరిగిన అభివృద్ధికి సంబంధించిన వివరాలు కోరడం అర్ధం లేనిదని కోట్లాది తెలంగాణ ప్రజల అభిప్రాయం. ఇక్కడ అస్సలు అర్థం కాని విషయం ఏందంటే తెలంగాణ ఏర్పాటు విషయంలో సీమాంధ్రులను సంప్రదించి, వాళ్ళ మనోభావాలను గురించి ఆలోచిస్తరు తప్ప సమైక్యంగా ఉండడానికి తెలంగాణ ప్రజలు ఇష్ట పడడం లేదని సమైక్యంగా ఉండాలనడం తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీయడమేననే విషయాన్ని ఎందుకు పరిగణనలోని తీసుకోరు. ప్రత్యేక తెలంగాణ అంటే తెలంగాణ నాయకులుంటరు. జై ఆంధ్ర అంటే ఆంధ్ర నాయకులుంటరు.

మరి సమైఖ్యాంధ్ర అంటే అన్ని ప్రాంతాల నాయకులుండాలె కదా.

తెలంగాణ ఏర్పాటుకు సీమాంధ్రులు ఒప్పకోనట్టే సమైఖ్యాంధ్రకు తెలంగాణ వాల్లు ఒప్పుకోవడం లేదుకదా. తెలంగాణ ఏర్పాటుకు ఆంధ్రుల అభిప్రాయం కావాలిగాని, సమైఖ్యాంధ్రకు తెలంగాణ ప్రజల అభిప్రాయంతో సంబంధం లేదా? అనేది వేయి డాలర్ల ప్రశ్న. సీమాంధ్రులకు ఒకన్యాయం. తెలంగాణ ప్రజలకు ఇంకొక న్యాయమా? లేదంటే తెలంగాణ ప్రజలు నోట్లో నాలుక లేనోల్లు, సేతిలో తడిలేనోల్లు ఏంచేసినా గిట్నే పోరాడి పోరాడి సచ్చిపోతరనే చులకన భావమా అనేది తెలంగాణ ప్రజల్ని నిలువునా దహిస్తున్న ప్రశ్న. ఈ అర్దంలేని సమైఖ్యాంధ్ర కుట్రలతోని తెలంగాణ ప్రజలు గుండెపగిలి చస్తున్నరు. అమరవీరుల సంఖ్యపెరిగి, పెరిగి స్థూపం సుక్కల్లో చేరుతుంది. అయినా ఈ రోజు విడిపోతానని ఒక్క కేసియారో లేదంటే టి.ఆర్.ఎస్ పార్టీనో అంటున్నది కాదు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు ముక్త కంఠంతోని జై తెలంగాణ నినాదంతో, తెలంగాణ బిల్లును పార్లమెంటులో ప్రవేశ పెట్టాలన్న లక్ష్యంతో రగులుతున్న ఉద్యమం. ఇప్పడికే ఇరు వర్గాల ప్రజలు, ప్రజా ప్రతినిధులు, విధ్యార్దులు, ఉద్యోగులు మానసికంగా విడిపోయి జీవిస్తున్నరనేది వాస్తవం. హైకోర్టు అడ్వకేట్ల విషయంలో జరిగిన బహిరంగ సంఘటన గాని ఇంకా అనేక విషయాలలోను ఆంధ్ర, తెలంగాణ ప్రజలు పాలనా పరంగా ఖచ్చితంగా కలిసి ఉండలేని పరిస్థితి ఏర్పడింది.

ఈ పరిస్థితులలో కేంద్రం మూర్ఖంగా ఆలోచించి సమైఖ్యాంధ్రకే కట్టుబడి ఉంటే మాత్రం వలస పాలకులు తెలంగాణ ప్రజలను అంతకంతకు అణగదొక్కడం ఖాయం. అన్నింటికి మించి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న నాయకులమీద కసిదీర్చుకోవడం ఖాయం.

ఇలాంటి తీవ్ర పరిస్థితులలో కమిటీల పేర కాలయాపనచేసి తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను నిర్లక్ష్యం చేస్తే వేలాదిమంది తెలంగాణ బిడ్డలు ఆత్మహత్యలే శరణ్యమని గుండెపగిలి సచ్చే ప్రమాదం ఉన్నది. అంతేకాదు నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు హింసాయుత మార్గం పట్టే అవకాశం లేకపోలేదు. నాటి తెలంగాణ సాయుధ పోరాటాన్ని తలపించే విధంగా రోకలిబండలు, కారంపొట్లాలతో రోడ్లెక్కే ప్రమాదమూ లేకపోలేదు.

ఎంతసేపటికి ఇంటోల్లను బెదిరించే తత్వం కలిగిన మా నాయకులు తెలంగాణ ప్రజల పక్షం వహించకుంట పార్టీసిద్ధాంతాలంటు, పదవులంటూ మాట్లాడేవాళ్ళను ఇక జనం సహించరు. ఎందుకంటే తెలంగాణే లక్ష్యంగ, ఏకైక ఎజెండాగ ముందుకొస్తున్న కొట్లాదిమంది ప్రజలు, తమ భవిష్యత్తే తెలంగాణ అంటూ చదువులను, పరీక్షలను లెక్కచేయకుండా ప్రాణాలకు తెగించి పోరాటం కొనసాగిస్తున్నరు. ఇటు ప్రజలను అటు విద్యార్థులను పట్టించుకోకుంట తెలంగాణ అంశాన్ని రాజకీయం చేస్తే రాజకీయ నాయకులకు ప్రజల చేతిలో సావు తప్పదు. ఆమరణ దీక్షలు, విద్యార్థి ఉద్యమ తీవ్రతను గమనించి డిసెంబర్ 9వ తేదీన తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించినట్టు ప్రకటించినది. దీంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డ సీమాంధ్ర నాయకులు తమ కుటిలనీతిని ప్రదర్శించింద్రు. తెలంగాణ విషయాన్ని మళ్ళీ మొదటికి తెచ్చే కుట్రలు పన్నుతున్నరు. ఈ విధంగా ద్వంద్వనీతిని అవలంబించే సమైక్యవాదులకు తగిన బుద్ధి చెప్పవలసిన అవసరం ఉన్నది. లేదంటే ఇచ్చిన మాట నిలబెట్టుకోలేని చేతగాని ప్రభుత్వంగా కాంగ్రేసు ప్రభుత్వానికి ముద్ర పడడంతో పాటు, ఎంతో పేరు ప్రఖ్యాతులు సంపాదించిన సోనియాగాంధీ ప్రతిష్ట దిగజారిపోతదన్న విషయాన్ని గమనించాలె. ఇది చేయకుంట మీకు కావలసింది అభివృద్దేగా అయితే ఇకనుంచి చేస్తరని, మీకు కావలసింది 610జివో కదా ఇకనుంచి అమలు చేస్తరని, మీకు కావలసింది ఉపముఖ్యమంత్రి పదవే కదా అయితె ఇకనుంచి అదీ ఇస్తమని ఏవో నాలుగు అభివృద్ధి పనులను చూపించో, లేదంటే హైద్రాబాదును ముడిపెట్టో తెలంగాణ పట్ల జాప్యం వహిస్తే ప్రభుత్వాలు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

మాకు అభివృద్ధితో పాటు ఆత్మగౌరవం ముఖ్యమేనన్న సంగతి మరీమరీ గుర్తుంచుకొని, మా తెలంగాణ మాకు ఇచ్చే విధంగా నివేదికలు తయారుచేస్తే తప్ప ఈ రాష్ట్రంలో శాంతియుత వాతావరణం నెలకొనే పరిస్థితి లేదు.

కాబట్టి ఇగ ఎంతమాత్రం జాప్యం చేయకుండా తక్షణమే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు చర్యలు చేపట్టవలసిందిగా కేంధ్రప్రభుత్వానికి నివేదిక ఇవ్వడంతో పాటు, వెంటనే పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి తెలంగాణ రాష్ట్రం ఇవ్వవలసిన అవసరం ఎంతగానో ఉన్నదనే సిఫార్సు చేయవలసిందిగా, తెలంగాణ ప్రజలకు ప్రాణబిక్షపెట్టి, ఆత్మగౌరవాన్ని నిలబెడతారని, సీమాంధ్రుల అవమానాలు, దోపిడీ పాలననుండి మాకు విముక్తి కలిపిస్తరని వేడుకుంటున్నాము.

**అంబటి వెంకన్న**

### తెలంగాణ ఉద్యమం నిద్రాణ అగ్నిపర్వతం లాంటిదే

# ఏమైనా జరగొచ్చు

**తె**లంగాణ ప్రజలకు ఇష్టం లేకపోయినా, ఫజల్ అలీ కమీషన్ వ్యతిరేకించిన బలవంతంగా 1956 నవంబరు 1న తెలంగాణను విలీనం చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఏర్పాటు చేసిండ్రు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రం కావాలని ఇంత గగ్గోలు పెడుతున్నా సకల జనులు సమ్మెజేసి సతమతమైనా గాని ఈ సీమాంధ్ర నాయకుల చెవికెక్క లేదు.

డిసెంబర్ 9న రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తామని మాట ఇచ్చిన కేంద్రం మాటమార్చి మాయ మాటలతో కాలం ఎల్లదీస్తుంది.

అమాయకుల ప్రాణాలతో చెలగాటమాడుతుంది.

విద్యార్థులు, ఉద్యోగులు, కవులు కళాకారులు అన్ని వర్గాల ప్రజలు ఇంత పెద్దఎత్తున సమ్మెలో పాల్గొని తెలంగాణ ఉద్యమం చేస్తుంటే కరుడు గట్టిన సీమాంధ్ర ప్రభుత్వం ఉద్యమ కారులమీద విరుచుకుపడడం, నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షను ఉక్కుపాదంతో అణచాలని చూడడం ఏ రకమైన ప్రజాస్వామ్యమో అర్థం కానటువంటి పరిస్థితిలో తెలంగాణ ప్రజలు ఉన్నరనుకుంటే పొరపాటే అవుతుంది. తెలంగాణ ప్రజలు వారి హక్కుల్ని సాధించుకోవడానికి, అధికారాన్ని నిలబెట్టుకోవడానికి, రాష్ట్రాన్ని మనం సాధించుకోవడానికి ఇంత నెత్తురు ధారపోయవలసిన అవసరం ఉందా అనేది ఊహకందని ప్రశ్నేంకాదు.

బ్రిటీషు పాలకులను మించిన నిరంకుశ పోకడలతో ఒక ప్రజాస్వామ్య ప్రభుత్వం వ్యవహరిస్తుంటే ఇంకా ఈ రాజ్యాంగం మీద, ఇక్కడి చట్టాల మీద ప్రజలకు ఏ రకంగా విశ్వాసం ఉంటుందనేది అసలు ప్రశ్న. తెలంగాణ ప్రజలు రాజ్యాంగ వ్యతిరేక శక్తులుగా మారే పరిస్థితుల్ని కల్పించి ఇక్కడి వారంతా అరాచకులనే ముద్రవేసి అణగదొక్కడం అనాదిగా కొనసాగుతూనే ఉంది.

ఎంతో మంది యువకులు తమ విలువైన ప్రాణాలను తృణప్రాయంగ సమర్పించి తెలంగాణ ఆకాంక్షను బలంగా వినిపించిండ్రు.

తెలంగాణ రాష్ట సాధనే లక్ష్యంగా నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు సకల జనుల సమ్మెతో పెద్ద ఎత్తున ఉద్యమిస్తుంటే చేయని నేరాలను మోపి జైళ్ళలో నిర్భందించడం ఎంతవరకు సమంజసం? కావాలని ఇక్కడి రైతులకు కరెంట్ కట్‌చేసి వారి పొలాలను ఎండబెట్టి కక్ష్యగట్టడం ఎంతవరకు న్యాయం?

ఈ విధమైన దమన నీతిని ప్రదర్శించి ఇంకా ఈ నేలను ఏ మొఖం బెట్టుకొని పరిపాలిస్తరనేది ఇక్కడి ప్రజల అంతు చిక్కని ఆవేదన.

ఒకే పద్ధతిలో ఒకే లక్ష్యం కోసం అన్ని విధాల సంయమనంతో ఆలోచించి సమర్పించిన రాజీనామాలలో కొందరివి ఆమోదించబడటం, మరికొందరివి తిరస్కరించబడటం ఏ సంకేతాలను ఇస్తుందో అర్థం చేసుకోలేనంత అజ్ఞానంలో ప్రజలు ఉన్నరనే భ్రమల్లో కాంగ్రేసు పార్టీ ఉండటం కొంత దురదృష్టకరమే.

తెలంగాణను తేల్చకుండా ఎవ్వరు ఏ పేరుతో ఇక్కడ అడుగుబెట్టిన రణరంగం అవుతూనే ఉంది.

రచ్చబండ పేరుతో సీమాంధ్ర పాలకులు కావచ్చు, యాత్రల పేరుతో జగన్, చంద్రబాబులు కావచ్చు. కేవలం వారి సీమాంధ్ర జులుంను ప్రదర్శించడానికి తప్ప వారికి రైతుల పట్ల కానీ, ఇక్కడి ప్రజల పట్ల కానీ ఏమాత్రం ప్రేమ లేదనే విషయం ఇప్పటికే తెలంగాణ ప్రజలకు స్పష్టంగా అర్దమయ్యింది.

వాస్తవానికి సీమాంధ్ర నాయకత్వం అనుకుంటున్నట్టు తెలంగాణ ఉద్యమం ఆగిపోలేదు. అది నిద్రాణ అగ్నిపర్వతంలా లోలోపల అగ్గి రాజేసుకుంటుంది.

అయితే కొంతమంది అమాయక ప్రజలు కొంత నిర్లిప్తతకు, సంధిగ్ధతకు లోనైన మాట వాస్తవమే కాని తెలంగాణ రాష్ట్రం సాదించే వరకు ఈ అశాంతి, ఆవేశం కొనసాగుతూనే ఉంటదనేది మాత్రం ఖచ్చితంగా చెప్పగలం. ఎందుకంటే పొద్దున్నే రోడ్లమీద ఎక్కడ ఎవర్ని పలకరించినా ఒక అసహాయత, కొంత ఆవేశం, కొంత దు:ఖం, ఎంతో వేదన అన్నీ కలిసి అత్యంత భారంగా ఒక మాట "ఇక మన తెలంగాణ బతుకింతేనా" అందరిలోనూ అదే సందిగ్ధత ఉన్నప్పటికీ ఎప్పటికైనా తెలంగాణ సాధించాలనే గట్టి పట్టుదల ప్రతిఒక్కరిలో మరింతగా బలపడినట్టు కనిపిస్తుంది.

ఈ అంతర్మథనం జరిగి జరిగి ఎప్పుడో లావా పైకి ఎగజిమ్మి అగ్నిపర్వతం బద్దలైనట్లు ఎక్కడ ఏ పెను ఉప్పెన ముంచుకొస్తుందోనన్న భయం సీమాంధ్రుల్లో లేకపోలేదు.

42 రోజులుగా సకల జనులు సమ్మె చేస్తుంటే, ప్రజాస్వామ్య బద్దంగా పోరాటం చేస్తుంటే తెలంగాణ మంత్రులు, ప్రజాప్రతినిధులు ప్రత్యక్ష ఉద్యమంలోకి రాకుండా ఇంకా పదవులను పట్టుకొని వేలాడటం వల్ల ప్రజలకు రాజకీయ నాయకుల మీద నమ్మకం సన్నగిల్లింది. ఈ పరిస్థితులలో కూడ మంత్రి పదవులకు ఆశపడి తెలంగాణ ఉద్యమానికి తీరని ద్రోహం తలపెట్టాలని చూసే ఈ కుటిల రాజకీయ నాయకుల వల్లనే తెలంగాణ దారుణంగా నష్టపోతుంది.

శాంతియుత పద్దతిలో పోరాటం చేస్తున్న ఉద్యమ కారుల మీద ఈ సీమాంధ్ర ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తుంటే, ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలని కూడా చూడాకుండా కుట్రపూరితంగా వ్యవహరిస్తుంటే ఇంకా ఆ మంత్రివర్గంలో కొనసాగడం ఖచ్చితంగా తెలంగాణకు ద్రోహం తలపెట్టడమేనని ఇప్పటికే ప్రజలు తీర్మాణించడం జరిగింది.

అయ్యా..! మూడుకండ్ల బాబు...

తెలంగాణ మీద ఒక స్పష్టమైన వైఖరి ప్రకటించకుంట రెండుకండ్ల సిద్దాంతంతో "దూడెను సీకమని – బర్రెను తన్నమనే" చందంగా వ్యవహరిస్తున్న చంద్రబాబు ఎక్కడిదక్కడ ఎగేసుకుంట ఏ మొఖం బెట్టుకొని "రైతుపోరుబాట" చేస్తడు.

తెలంగాణ మొత్తంగా సకలజనుల సమ్మెలో పాల్గొంటే, కావాలని కక్ష్యగట్టిన ఈ సీమాంధ్ర సర్కారు కరెంట్ కట్‌జేసి తెలంగాణ రైతు పంటని ఎండబెడుతుంటే నోరు విప్పని చంద్రబాబు ఏ మొఖంబెట్టుకొని తెలంగాణలో అడుగు బెడతడు.

రగులుతున్న మా గుండెల మీద అడుగుపెడితే మీరు మాడి బూడిదయ్యే ప్రమాదముందని హెచ్చరించడం న్యాయమైనదేనని ఇక్కడి ప్రజల వాదన.

కాదని ఎవరైనా అంటే మరి ప్రజాస్వామ్య దేశంలో ప్రజల ఆకాంక్షలను సాధించుకోవడాని ఏ పద్దతిలో నిరసన తెలియజేయాలో సూచించవలసిన ఆవశ్యకత కూడా ఏర్పడిందని అడిగిన సంధర్భాలు అనేకం ఉన్నయ్.

తెలంగాణ కోసం ఎంతటి త్యాగానికైనా సిద్దమే. "కెరటం నాకు ఆదర్శం. ఎగిసి ఎగిసి పడుతున్నందుకు కాదు పడినా లేస్తున్నందుకు" అనే స్పూర్తిని నింపుకున్న తెలంగాణ ప్రజలు నూతన ఉత్తేజంతో రాష్ట్ర సాధనకు కంకణ బద్దులయ్యే అవకాశాలే మెండుగా కనిపిస్తున్నయి తప్ప ఏ కోశాన వెనకడుగు వేస్తరని అనుకోవడానికి ఆస్కారం లేదు.





## రాష్ట్ర విభజన జరిగితేనే...

# మన హైద్రాబాద్ రద్దీ ప్రశాంతం

**ఆంధ్రకు వరదలొస్తే హైద్రాబాద్‌ల ఒండు నింతది.సంక్రాంతికి సగం కాలీ అయితది. వలసవాదుల వల్ల తెలంగాణ సంస్కృతి దెబ్బతిన్నది. కన్నతల్లిని కాదని వచ్చినోడు పెంపుడు తల్లిని ఎట్ల ప్రేమిస్తడు.**

**తె**లంగాణ సమైక్యాంధ్ర ఉద్యమాన్ని పక్కకు పెట్టి, ఎవరు ఎవరిని దోచుకుంటున్నారన్న విషయాన్ని పక్కకు పెట్టి, ఒక్క క్షణం హైద్రాబాద్ రద్దీని, జనసాంధ్రతను దృష్టిలో పెట్టుకొని ఆలోచిస్తే ఈ రాష్ట్రంలో మరొక రాజధాని అవసరం ఎంతైనా ఉందేమోనని అనిపిస్తుంది. హైద్రాబాదుకు ధీటుగా మరికొన్ని నగరాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉన్నది. అయితే ఇది కేవలం రాష్ట్ర విభజన తర్వాత మాత్రమే సాధ్యమవుతుందనే విషయం కూడా మనకు అవగతం అవుతుంది.

ఏ సాధారణ వ్యక్తిని అడిగినా ఇదే మాట అంటడు. వాస్తవానికి ఇంత జనాభా గల నగరాన్ని అదుపు చేయడం కూడా భారమే. ఇది రోడ్ల వెడల్పు ద్వారానో, షాప్స్ కూలగొట్టి స్థానికులను దెబ్బతీయడం ద్వారానో, రోడ్లు వెడల్పు చేసి, ఫ్లైయ్యోవర్ బ్రిడ్జిలు నిర్మించడం ద్వారానో జనాన్ని అదుపు చేయడం సాధ్యం అయితే కావచ్చు గాక, కాని రాష్ట్ర విభజనతో పాటు కొత్త జిల్లాలను కూడ పెంచవలసిన అవసరం ఉన్నది.

400 సంవత్సరాల చరిత్ర కలిగిన హైద్రాబాద్ మహనగరం ఎటూ 50నించి 60 కిలో మీటర్ల మేర విస్తరించి ఉన్నది. సీమాంధ్ర పెత్తందారులు గాని, చంధ్రబాబు, వైయస్ లాంటి ముఖ్యమంత్రులుగాని హైద్రాబాద్‌ను కొత్తగా అభివృద్ధి చేసింది ఏమి లేదు.

ఆంధ్రలో ఎన్నికలప్పుడు హైద్రాబాద్ కాలీ అయితది.

సంక్రాంతి పండుగొస్తే సగం కాలీ అయితది.

ఆంధ్రనుంచి వలసల్ని పెంచి రద్దీని పెంచింద్రు. రోడ్డు ప్రమాదాల్ని పెంచింద్రు. ప్రేమ సినిమాలతో ఉన్మాదాన్ని పెంచింద్రు. జనసాంద్రతను పెంచి సైకోలను తయారు చేసింద్రు. సుందర భాగ్యనగరంలోని సహజత్వాన్ని దెబ్బతీసింద్రు. మత కలహాలను రెచ్చగొట్టే చర్యలకు పూనుకున్నరు.

ట్యాంక్‌బండ్ మీద విగ్రహాలు పెట్టుకున్నరు.

హుస్సేన్‌సాగర్‌ను మురికి కూపంగా మార్చింద్రు.

నాటి విదేశీ యాత్రికుడు టావెర్నియర్ లాంటి వారే హైద్రాబాద్ అతి సుందర నగరమని వర్ణించడం జరిగింది. మత సామరస్యానికి గుర్తుగా అనేక దేవాలయాలు, మసీదులు, చర్చీలు సర్వమత సమ్మేళనంగా అభివృద్ధిని సాధించినయి.

ప్రజలంతా ఒకరి సంప్రదాయాలను మరొకరు గౌరవిస్తూ హాయిగా, ఆనందంగా అన్నదమ్ముల వలె కలిసి జీవించిన చరిత్ర హైద్రాబాద్‌కు ఉన్నది.

1724 నుంచి 1948 వరకు పాలించిన అసఫ్‌జాహీలలో చివరివాడైన మీర్ ఉస్మాన్ అలీఖాన్ (1911–1948 సెప్టెంబర్17) కాలంలో ఇక్కడ ఎంతో అభివృద్ధి జరిగింది. 1913లోనే అసెంబ్లీ నిర్మాణం జరిగింది. 1915–19 మధ్య కాలంలో హైకోర్టు నిర్మాణం జరిగింది. 1925లో ఉస్మానియా ధర్మాసుపత్రి నూతన భవన నిర్మాణం పూర్తి అయింది. 1656, 1820, 1908లలో మూసీనదికి భయంకరమైన వరదలు వచ్చినయి.

2000 సంవత్సరంలో భారీ వర్షాలతో నగరం తడిసి తల్లడిల్లింది.

పది చినుకుల రాలితే అతలా కుతలమైతున్న హైద్రాబాద్ నగరంలో వరదలు వస్తే పరిస్థితి చాల తీవ్రంగా ఉంటది.

మూసీ, ఈసా నదులకు నీల్లుతెచ్చే 800ల పై చిలుకు కాల్వలు ఎక్కడబోయినయో జాడ లేదు. మూడు వేల చెరువులు మాయమైనయ్. 2004 నాటికి హైద్రాబాద్‌లో మిగిలిన 169 చెరువులు ఏమైతయో తెలువదు. ఇలాంటి సమస్యలకు పరిష్కారం కూడ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విభజించి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడమేనని చెప్పక తప్పదు.

1930 వరకు బంజారహిల్స్ ప్రాంతంలో అధికసంఖ్యలో లంబాడీలు ఉండేవారు. వాళ్ళంత ఎక్కడ పోయింద్రు. ఎవరి పాలన వాళ్ళ హక్కులను కాలరాసింది.

పోర్టుల పేర బెస్తోల్లను తీరానికి దూరం చేసినట్టు, అన్నల పేర ఆటవికులను, గిరిజనులను అడవులు కాలీ చేయించినట్టు, సీమాంధ్ర పాలన బంజరాహిల్స్‌ను

ఆక్రమించిందంటే తప్పు. వలసాంధ్ర పాలన తెలంగాణను అణచివేసిందంటే తప్పు. ఆంధ్రరాష్ట్రం కోసం పోరాటాలు చేసిన పొట్టి శ్రీరాములును ఆంధ్రప్రదేశ్ కోసం అసువులు బాసినట్టు మాట్లాడే సీమాధ్రుల నోటికి అదుపు ఎక్కడుంది.

అధిక జనాభాగల మహానగరంలో ఒక నేరస్థున్ని పట్టుకోవడం, గంపెడు గడ్ల్య గంతంత సూదిని దెవులాడినట్టయితుంది. అదేవిధంగ యాక్సిడెంట్‌లతో వికలాంగుల సంఖ్య పెరిగి అమెరికోడొచ్చినా అడకతింటోడే ఎదురుంగొస్తడు. ఎవన్నని దాస్తరు. ఎక్కడని దాస్తరు.

ఏ ఫ్లైయ్యోవర్ కింద మూస్తరు? రోడ్డు ప్రమాదాల నివారణ, లా అండ్ ఆర్డర్ ప్రాబ్లెమ్, ఉగ్రవాదులను నివారించడం లాంటి విషయాలలో మనం విఫలం చెందుతున్నం. జనాభాకు తగిన నిష్పత్తిలో పోలీసులను పెంచుకోలేకపోవడం కూడ ఒక కారణం. ముఖ్యంగా ఉన్నతోద్యోగులు, పాలనలో కీలక భాగస్వాములైనవాళ్ళు సీమాంధ్ర ప్రాంతం వారే కావడం వల్ల కూడా తెలంగాణ, హైద్రాబాద్ సమస్యలు పేరుకుపోవడానికి కారణం.

ఇదీ కాకుండా ఎక్కడైతే జనసాంధ్రత ఎక్కువగా ఉంటదో అక్కడ మనుషుల మధ్య కోపోద్రిక్తత పెరిగి, చికాగుగా వ్యవహరించే అవకాశం ఉందని మానసిక నిపుణుల వాదన.

ఇదే విషయాన్ని సైంటిఫిక్‌గా కూడా రుజువు చేయడం జరిగింది. ఒక పది ఎలుకలను ఒక బుట్టలో వేసి అదే సైజు బుట్టలో వంద ఎలుకలను వదిలితే అవి ఒకదాన్ని ఒకటి కరవడం లాంటి పనులు చేస్తున్నయ్.

మనుషుల మధ్య అసహనం, కోపం పెరిగిపోవడానికి కూడ అత్యధిక జన సాంద్రతే కారణమని అన్నారు.

ఒక చదరపు కి.మీ. జనసాంధ్రత ఆదిలాబాద్ 149, కోస్తాంధ్ర 369, అయితే హైద్రాబాద్ జనసాంధ్రత 18వేల పైచిలుకు ఉన్నది.

ఈ స్థితిలో హత్యలు, ఆత్మహత్యలు, దోపిడీలు, ఉగ్రవాద కార్య కలాపాలు కూడా అతి సునాయాసంగా జరిగిపోతయనేది నిర్వివాదాంశం.

"ఇపుడు జరుగుతున్న హత్యల్లో అత్యధిక శాతం అతిచిన్న కారణాల చేత జరిగినవే" అంటాడు హసన్‌ఖాన్ . వాడు అదోలా చూస్తున్నాడని, మాటిమాటికి నన్నే చూస్తున్నాడనుకొని, అర్ధరహితమైన కారణాల చేత మనుషుల్లో ఒక ఇరిటేషన్ వచ్చి అసహనం పెరుగుతుందని దాని మూలంగానే ఇదంతా జరుగుతుందని ఆయన వివరించిండు. కాబట్టి ఈ స్థితిలో ఇంత జనాభాకు ఒకటే రాజధాని అనడం కూడా సరికాదు. హైద్రాబాదును కేంద్రమనుకొని అందరు వచ్చి ఇక్కడ చేరడం వలన విశాఖపట్నం, విజయవాడ వెనుకబడిపోయినాయనే వాదన కూడ ఒకటున్నది. కాబట్టి ఈ కోణంలో చూసినా మరో రాజధాని అవసరం కచ్చితంగా ఉన్నది. ఒక రకంగా అక్కడ జరగాల్సిన అభివృద్ధి కుంటుపడుతున్నది. ఈ స్థితిలో అక్కడ

ప్రజలకు అన్యాయం చేస్తూ తెలంగాణ విషయంలో మొండిపట్టు పట్టడం కూడా న్యాయం కాదు. నూతన రాజధాని ఏర్పాటు చేయడం వల్ల అక్కడ కూడ నిరుద్యోగులు లక్షలాది ఉద్యోగాలు, ఉపాధి పొందే అవకాశం ఉన్నది. అదే విధంగా ఎవరి సంస్కృతీ, సంప్రదాయాలను వారు పరిరక్షించుకునే అవకాశం ఉంటది.

ముఖ్యంగా తుఫాన్ సమయంలో అక్కడి ప్రజల ఆపదలను దగ్గర ఉండి చూసుకున్నట్టు ఉంటది. అట్లని మిమ్మల్నేమి హైద్రాబాద్ వదిలిపెట్టి పొమ్మని ఎవరు ఆనరు.

ఇక్కడి నుంచి మీ పాలన పోవాలంటున్నం. అధికారం మా చేతికి రావాలంటున్నం.

రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ఒకరి మోచేతి కింద బతికినట్టే కదా అని కొందరు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉన్నది. అంటే ఇంతకాలం మేం మీ మోచేతి నీల్లు తాగుతున్నట్టే కదా. తెలంగాణ ఆత్మగౌరవాన్ని సంపుకొని బతుకుతున్నట్టే కదా. ఇంతవరకు విశాఖపట్నం చూడని వాల్లు శ్రీకాకుళం చూడని వాల్లు ఎందరో తెలంగాణలో ఉన్నరు. అదేవిధంగా హైద్రాబాద్ చూడని వాల్లు, తెలంగాణకు రాని వాల్లు ఎందరో సీమాంధ్రలో ఉన్నరు. వాళ్లకెవరికి ఈ రాష్ట్రం విడిపోతుందంటే ఎలాంటి భయం లేదు బాధ అంతకన్నా లేదు. కేవలం కొంతమంది పెట్టుబడి దారులు అక్రమంగా తెలంగాణను దోచుకోవాలని అనుకుంటున్న వాళ్ళకు తప్ప తెలంగాణ ఏర్పడితే ఎవరికి ఎలాంటి ఇబ్బంది లేదు. మరి అలాంటి ఒక్కరిద్దరి ప్రయోజనాల కోసం వందల మంది ప్రాణాలతో చెలగాటమాడటం ఎంతవరకు న్యాయం.

ఇక్కడి సమైక్య పార్టీలు, సంఘాలకు హైద్రాబాదులో ధర్నాలు చేయడానికి తప్ప ఆంధ్ర ప్రాంత పేదలు హైద్రాబాదుకు వచ్చే అవకాశం లేదు. ఆంధ్రప్రాంతంలో సంభవించే అకాల వరదల్లో అక్కడి శవాలమీద డబ్బులు దండుకోవడానికి, వరద బీభత్సాన్ని రాజకీయం చేయడానికి తప్ప నాయకులకు అదనపు ప్రయోజనం లేదు.

వాస్తవంగ కన్నతల్లి లాంటి ఊరుకు దూరమైన సీమాంధ్రులు హైద్రాబాద్‌లో చేరి అనేక అవస్థలు పడుతున్నరు. సంవత్సరాల తరబడి అన్నింటికి దూరంగ బతుకును కోల్పోయి బతకడం దేనికి?

ప్రానానికి ప్రాణమైన పల్లెకు దూరమై బతకడం దేనికి?

గంటలు, రోజుల తరబడి ప్రయాణం చేసి, హైద్రాబాద్‌లో మకాం పెట్టి ఇక్కడి స్థానికుల ఉద్యోగాలను కొల్లగొట్టడం దేనికి? అల్లంత దూరంనుంచి రావడం చేత ఇక్కడినుంచి పోవాలంటే ఇబ్బంది అనిపించి స్థిరంగా ఇక్కడే పాతుకు పోవడం జరుగుతుంది. తుఫాను, సునామి సమయాలలో తల్లికి పిల్లకు ఎడబాసి దుర్మార్గమైన బతుకు బతకడం జరుగుతుంది.

అదే తెలంగాణ వాల్లు ఎప్పుడు హైద్రాబాద్‌కు పోయిన మల్లి తన ఊళ్లో ఉన్నట్టుగానే

రాకపోకలు నిర్వహిస్తూ ఉంటరు. నిజానికి సీమాంధ్రలోని సామాన్య పేదజనానికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ఎలాంటి అభ్యంతరం లేదు. కేవలం నాయకుల దుర్నీతి తెలంగాణను అడ్డుకుంటుంది. తెలంగాణకు సముద్రమార్గం లేదు కాని ఉంటే ఇంకా దారుణంగా అత్యంత వేగంగా తెలంగాణను దోపిడి చేసేవారు.

ఏనాడైన ఆంధ్రప్రదేశ్ రవాణా వ్యవస్థ మొత్తం సీమాంధ్రుల కోసమే. ఫోర్‌వేలు, సిక్స్‌వేలు, రింగురోడ్లు, బైపాస్‌లు ఇవన్ని వాళ్ళకోసమే. వాల్లు వేగంగా తమ ప్రాంతానికి అతి ఖరీదైన కార్లలో, గరుడ, కామినేని, గోగినేని లాంటి బస్సులు ఎవనికి దొరకకుంట ఎక్కి పోవడం కోసమే. తెలంగాణోళ్ళకు ఒక్కటి ఉపయోగపడదు.

పైగా వాళ్ళ వేగానికి అక్కడక్కడ రోడ్లమీద బలయ్యేది మన తెలంగానోల్లు.

యాక్సిడెంట్లల్ల సచ్చిపోయి అనాదలయ్యేటోల్లు ఇక్కడి అమాయక జనాలు.

అవుట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా పెద్దమొత్తంలో ఇక్కడ చేరి అనేక ఆలోచనలు చేస్తుంటరు. బస్సులు వాళ్ళ కోసమే, రైళ్ళు వాళ్ళ కోసమే. రైళ్ళల్లో పొరపాటున రిజర్వేషన్ డబ్బాలలో ఎక్కిన తెలంగానోల్లకు జరిమానాలు, శిక్షలు, అవమానాలు.

అదే సీమాంధ్ర ప్రాంతంలో అవి తక్కువ. అక్కడి నుంచి వచ్చే జనం సీటు కాస్త ఖాలిగా ఉన్నా మనని కూర్చోనియ్యరు. హైద్రాబాద్ టు ఆంధ్రకు ఎన్ని ప్రభుత్వ, ప్రైవేటు బస్సుసర్వీసులు ఉన్నయో లెక్కే లేదు. కొత్తవి వాళ్ళకు.

పాత డొక్కు బస్సులు మనకు.

హైద్రాబాద్‌నుండి గుంటూరు వెళ్ళే బస్సుల్లో నల్లగొండ వాళ్ళని ఎక్కించుకోరు. ఎందుకని అడిగితె ఇప్పుడు పోదంటడు. ఎప్పుడైన పోనియ్యని ఎక్కబోతే బైపాస్ నించి పోతదంటడు. ఆ బస్సులు ఖాలిగా ఉన్న మన వాళ్ళని ఎక్కనియ్యరు. కనీసం గుంటూరు ఇతర సీమాంధ్ర ప్రాంతాలలో ఆర్.టి.సి లో పనిచేసే తెలంగాణ సిబ్బందిని కూడా ఎక్కనియ్యరు. అంటే వాళ్ళ అజమాయిషి ఎట్ల ఉంటదో, మన ప్రజల ఆప్యాయత ఎట్లుంటదో చూడు.

పాలన వాళ్ళది కాబట్టి వాల్లు ఏంచేసినా చెల్లుబాటైతది. ఎంతసేపటికి వాళ్ళకు అనుకూలమైన జీవోలు తయారు చేసుకుంటరు. ముల్కీ నిబంధనను 15 సంవత్సరాలనుండి 7సంవత్సరాలకు, 7 నుండి ఇప్పుడు 4 సంవత్సరాలకు మార్చుకున్నరు. నాబార్డు నిధులు ఎత్తుక పోతరు. హైకోర్టు జడ్జిలందరు వాళ్ళే అయితరు. అంతట వాళ్ళే ఉంటరు. ఇక తెలంగాణకు ఎక్కడ న్యాయం జరుగుతది. ఇట్లాంటి అనేక కారణాల రిత్యా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ఇతర రాష్ట్రాల ఏర్పాటుతో ముడిపెట్టటం సమంజసం కాదు. తెలంగాణకు ఒక రాష్ట్రంగా ఏర్పడడానికి కావలసిన అన్ని అర్హతలు, హంగులు ఉన్నయి.

కాబట్టి ప్రజలు డిమాండ్ చేయడం జరుగుతుంది. ఈ విషయాన్ని సీమాంధ్రులు

గుర్తించి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సహకరించాల్సిన అవసరం ఉన్నది.

జాతీయ స్థాయిలో దొరికే ఉగ్రవాదులకు హైద్రాబాద్ ఒక అడ్డాగా మారడానికి కారణం కూడా సీమాంధ్రులే. చుట్టుప్రక్కల రాష్ట్రాల నుంచి, బంగ్లాదేశ్, నేపాల్ వంటి దేశాలనించి రోజుకు కొన్ని వందలు, వేల మంది వచ్చిపోయే వాళ్లు ఉన్నరు. ఈ స్థితిలో నిఘా ఏ విధంగా ఉండాలి. ఎవరిని అనుమానించాలి అనేది కష్ట సాధ్యమైన అంశమే తప్ప, పోలీసుల వైఫల్యంకాదు. హైద్రాబాద్ జనాభా దృష్ట్యా ఐదారు జిల్లాలుగా విభజించి ప్రతి జిల్లాకు కలెక్టర్లు, ఎస్.పి.లను నియమించుకొని, ఒక జిల్లా యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకుంటే తప్ప నేరాలను అరికట్టడం సాధ్యం కాదు. ఎట్ల చూసినా ఈ రాష్ట్రం విడిపోవలసిన అవసరం ఉన్నది. దాన్ని గుర్తించకుండా మాట్లాడటం ఒక రకమైన మూర్ఖత్వమే. అధికారం హైద్రాబాద్‌లో కేంద్రీకృతం కావడం వలన వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న సీమాంధ్రలో జరగాల్సిన అభివృద్ధి జరగడం లేదు. కొత్త రాష్ట్రం ఏర్పడుతుందంటే వేల ఉద్యోగాలు ఆంధ్ర ప్రాంతంలో ఏర్పడే అవకాశం ఉన్నది. ఎంతో మందికి ఉపాది లభించే అవకాశం ఉన్నది. అదంతా కాదని కాళ్ళదన్నుకునే వాళ్లు ఎవరుంటరు.

సముద్ర తీరంలో ఉండవలసిన సునామీ కేంద్రాన్ని హైద్రాబాద్ లో ఏర్పాటు చేసుకుంటే ప్రయోజనం ఏం ఉంటది.

వరద తాకిడికి అల్లాడే ఆంధ్రకు, కనపడని కరువుతో గోసెల్లదీసే తెలంగాణకు ఎట్ల పొత్తు కలుస్తది.

కరువుకు కాలానికి, వానకు ఎండకు పొత్తు కలవదు. ఆంధ్రకు తెలంగాణకు ఏ కోశాన కలవదు. విడిపోతే తప్ప తెలంగాణకు బతుకు లేదు.

వరదలనంగనే అదొక జాతీయ విపత్తు అయితుండే.

అదే తెలంగాణ ఎంత కరువుతో అలమటిస్తున్నా కానెటోడెవడు.

వేల కిలోమీటర్ల దూరంలో జరిగే ఈ వరద భీభత్సాన్ని కనీసం పాలకులు చూడలేని స్థితి. హెలికాప్టర్‌లో వెళ్ళాల్సిన యంత్రాంగం తీరా వాతావరణం సరిగ్గా లేదంటే ఇక్కడే ఆగిపోవడం జరుగుతుంది. హైద్రాబాదు నుంచి ఆంధ్రకు ఆహార పదార్థాలు చేరాలంటే కూడా కష్టమే. కడలి బీభత్సానికి మిమ్మల్ని ఆదుకోవడం కూడా కష్టమే. ఇదంతా ప్రత్యక్షంగా గమనించాలన్నా, అక్కడి పరిస్థితుల్ని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ అక్కడి ప్రజల్ని ఆదుకోవాలన్నా ఈ రాష్ట్రం విడిపోక తప్పదు. లేదంటే రెక్కలు ముక్కలు చేసుకొని కాయ కష్టం జేసి సంపాదించిన నాలుగు మెతుకులు సీమాంధ్ర శరణార్థి శిబిరంలోకి చేరుతుంటే తెలంగాణ బాగుపడేదెప్పుడు. ఎవనికుండ ఆనికైతనే నిమ్మలంగ ఉంటది.

ఎవని బతుకు ఆడు బతికితెనే స్వేచ్ఛ ఉంటది.

అందుకే సీమాంధ్ర తెలంగాణ రెండు రాష్ట్రాలుగ ఏర్పడితేనే నిమ్మలంగుంటది.

కాబట్టి ఇకనైనా సీమాంధ్ర ప్రజలు ఆలోచించాలె. సీమాంధ్రలో ఉన్న దొంగ రాజకీయ నాయకులను నిలదియ్యాలె. ఆపదకాలంలో ప్రజలకు అందుబాటులో ఒక అధికారిక కేంద్రం ఉండాలంటే, మీకంటూ ఒక ప్రత్యేక రాష్ట్రం కావాలని డిమాండ్ చేయడం అత్యంత ఆవశ్యకం.

వరదలు, విపత్తుల కారణంగా అదనపు బడ్జెట్ ఆంధ్ర ప్రాంతానికే తరలి పోతుంది.

ఆంధ్ర సంస్కృతి సంప్రదాయాలను తెలంగాణ మీద రుద్ది ఇక్కడి ప్రజల్ని ఇబ్బంది పెట్టడం భావ్యమా? భిన్న సంస్కృతులను ఒకే దగ్గర మేళవింపు చేసే ప్రయత్నంలో ఎగిసిన ఉద్యమమే తెలంగాణ.

ఆంధ్ర కల్చర్‌ని అధ్యయనం చేసే దుస్థితి ఇక్కడి ప్రజలకు అవసరమా? తెలంగాణని అణగదొక్కుతూ, ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తు, అక్కడ సీమాంధ్ర పేదజనాన్ని అనేక కష్ట నష్టాలకు గురిచేస్తూ నీతి మాలిన రాజకీయాలతో సాధించేది ఏమిటి? రాజధాని అంటే అధికార కేంద్రమనే కాకుండా అక్కడి ప్రజల కల్చర్‌కు అద్దం పట్టేదని గుర్తుంచుకోవాలి. సీమాంధ్రులు అధికులుగా, పాలకులుగా తెలంగాణ కల్చర్‌ను ఆగం చేస్తున్నది నిజం కాదా? ఇక్కడి అటవీ సంపద, ఔషధ మూలికలతో పాటు అనేక విలువైన ఉత్పత్తులు నిర్లక్ష్యం చేయబడినవి. ఆ విధంగానే తాటి ఉత్పత్తులు అడుగంటి కొబ్బరి కల్చర్ వచ్చింది. ఈత పొరకలు పోయి కొండ చీపురుల గిరాకి పెరిగింది. ఇక్కడ రియల్ ఎస్టేట్లు పెంచి వాగులను మాయం చేసి అద్భుత కల్చర్‌ను నాశనం చెయ్యలేదా? ఇక్కడి చెరువులను ఆక్రమించి, పంట భూములను పాడు జేసింది నిజం కాదా? అసలు ఇక్కడి వాతావరణానికి కొబ్బరి చెట్టే బతకదు. అలాంటిది నీవు కొబ్బరిచెట్టుకు మందులేసి మమ్మల్ని శాసిస్తున్నవు. ఇదేది ఉద్దేశపూర్వకం కాకపోవచ్చు గాక. కాని అంతిమంగా జరిగేది అదే. మీ ఉత్పత్తులకు రవాణా సౌకర్యాలుంటయి. మీరు అనేక కుట్రలతో ఏర్పాటు చేసుకున్న ప్రతిది మీ కోసమే. మాకు ఏది అందదు. మార్కెటింగ్ సంటర్లన్ని మీ ఆక్రమణలోనే ఉంటయి. ఇక్కడి ద్రాక్ష తోటలు, ఇతర పంటలు నాశనం అయినయి. మీరెక్కడబోయినా, ఏదేశమేగినా ఆంధ్ర అంటరు. ఆంధ్రప్రదేశ్ అనే పరిస్థితి కూడా లేదు.

ఈ విధంగా రాష్ట్ర అస్తిత్వాన్ని దెబ్బ తీసి, పక్షపాత ధోరణితో పాలించింది మీరు కాదా? ఇన్ని చేసి ఇంకా ఇక్కడ్నే మీతోనే కలిసి ఉంటామని ఏ మాత్రం సిగ్గు-ఎగ్గు, జంకు-గొంకు లేకుండ చెప్పడం అత్యంత ప్రమాదకరమైన అంశం.

మనిషి సహజ ప్రవర్తనకు విరుద్దం.


# ఇది తెలంగాణ పాట-ఇదే తెలుగు బాట

శ్రమజీవుల నెత్తుటిలో తడిసి ముద్దయినదీ పాట. ఆకలి, అలుపు, ఆయసాన్ని మరిపించేదీపాట. చావు పుట్టుకలకు సంబంధమున్నది పాట. తరతరాలుగా అక్షర జ్ఞానం లేకపోయిన ఆత్మ తత్వమెరిగినదీ పాట. జానపదుల జీవనాడి ఈ పాట. లాలపోసి జోలపాడే కన్నతల్లిదీ పాట. కర్మగాలి కన్నకొడుకు లోకానికి దూరమైతే కంటికి పుట్టెడు సోకం ఈ పాట. కష్టాన్ని మరిపించే కమనీయమైనదీ పాట. ఇది తెలంగాణ పాట. ఊడిగానికి ఎదురుదిరిగి దొరఘడీలను కుప్పగూల్చినదీ పాట. న్యాయమైన పోరాటానికి నడుముగట్టినదీ పాట. "పాటా నువ్ బుట్టినావు కొండా కోనలలోన /బతికి బట్టగట్టినావు ఎండా వానలలోన

పాటా నువ్ బుట్టినావు రగిలే గుండెలలోన పాటా... ఆ..ఆ..

పనిలో తోడుంటనంటవు ఓ...ఓ... శ్రమజీవులనల్లుకుంటవు ఆ...ఆ...

మదినిండిన భావాలు పురిటి నొప్పులా తీరై / పుడమిని జూడంగ నువ్వు పురుడుబోసుకుంటవు"

ఈ పాట గారెడోల్లది, జంగమోల్లది, బాలసంతులదీ పాట. మద్దెల దరువుల్లో సిందుభాగోతులోల్ల సెమట సుక్కల నుండి రాలిందీ పాట. బండెడు కష్టము జేసి అలసిపోయినపుడు గుండెనిండా గూడు గట్టుకున్న బాధను మరిపింపజేసే మహామంత్రమే ఈ పాట. ఇది తెలంగాణ పాట. ఉద్యమాలకు పుట్టినిల్లయిన తెలంగాణలో ఉవ్వెత్తున ఎగిసిన అగ్నిశిఖ ఈ పాట. తల్లి తెలంగాణ కోసం తల్లడిల్లుతున్నదీపాట.

ఏడేండ్లుగా తెలంగాణ ఉధ్యమాన్ని సజీవంగా ఉంచుతున్న ఈపాట, ఆట పాటల మూటగా అడుగుల సవ్వడిగా, ధూంధాం చేస్తూ సెలయేరై దునుకుతున్నదీ పాట. తెలంగాణ ఉధ్యమ రణ నినాదమై సాగిపోతున్నదీ పాట. ఉవ్వెత్తున ఎగిసిన ఈ తెలంగాణ సాంస్కృతిక ఉద్యమంలో ప్రజాయుద్దనౌక గద్దర్, రసమయి బాలకిషన్, గూడ అంజయ్య, గోరటి వెంకన్న,

అందెశ్రీ, కోదారి శ్రీను, విమల, జయరాజు, మిత్ర, మిట్టపల్లి సురెందర్, నేర్నాల కిషోర్, మాభూమి సంధ్య, తేలు విజయ, రమాదేవి, అంబటి వెంకన్న, సాయిచంద్, ఏపూరి సోమన్న, దరువు ఎల్లన్న, ఆదూరి సంతోష్, బైరాగి, బిక్షపతి, దరువు అంజన్న, ప్రహ్లాద్ వంటి ఎందరో కవి గాయకులు, కళాకారులు, కళాబృందాలు, జానపద కళారూపాలు, వాద్యకారులు చిచ్చర పిడుగులై చెలరేగి లక్షలాదిమంది ప్రజలను ఉద్రూత లూగించారు. ముఖ్యంగా తెలంగాణ పాటను భుజాన మోస్తూ బొంబాయి, దుబాయిలలో సైతం ధూంధాంలు నిర్వహించి తెలంగాణ ఉద్యమానికి పెద్దఎత్తున మద్దతు కూడగట్టిన ఘనత రసమయి బాలకిషన్ బృందానికే దక్కుతుంది.

"పుడితొక్కటి సత్తెరెండు రాజిగ ఒరె రాజిగ

ఎత్తుర తెలంగాణ జెండ రాజిగి ఒరె రాజిగ" అంటూ ఇయ్యాల జస్తే రేపటికి రెండు. మనకోసం కాకపోయిన మన పిల్లల కోసమైన తెలంగాణ కావాలని, ధైర్యాన్ని కూడగట్టుకొని ముందుకు తెగించే సంధర్భంలో నిత్యం ప్రజలు వాడుకునే పదాలనే పాటలుగా మలిచిన సామాజిక చైతన్య కవి గూడ అంజయ్య. తెలంగాణ ఇంత దోపిడి, అన్యాయానికి గురవుతుంటే ఇంక సావుకు భయపడుడేందని ప్రజలను ఉత్తేజపరిచిండు.

"అమ్మోనివా నువ్వు అయ్యోనివా/ తెలంగాణకు తోటి పాలోనివా" అంటూ ఆంధ్రకు తెలంగానకు మొదటి నుంచి ఎలాంటి ఆత్మీయ సంబంధం లేదని, నీభాష వేరు నీ బతుకు వేరు, నాభాష వేరు నా బతుకు వేరు. హైద్రాబాద్ నిర్మాణంలోగాని ఇక్కడి అభివృద్ధిలోగాని ఆంధ్రులది ఇసుక రేణువంత సాయం లేదు. ఆంధ్రోల్లు తెలంగాణకు ఏ వంకన సుట్టాలు కారు. మానవ సంబంధం తప్ప మరొకటి లేదు. కేవలం స్వార్ధంతో ముసుగులు కప్పుకొని వచ్చి ఇక్కడి అమాయక ప్రజలను మోసంచేసి ఇక్కడి వనరులను దోపిడి చేయడానికే ప్రేమను ఒలకబోస్తున్నరనే విషయాన్ని స్పష్టం చేస్తాడు. తెలంగాణ ప్రజలు ఆకలి చావులు, ఆత్మహత్యలతో విలవిలలాడుతూ బతుకుదెరువు లేక వలసబాటలు పట్టి బొంబాయికి పయనమైన కూలి బతుకుల గోసను "ఉండు పైలంగుండు అమ్మ మాయమ్మా" అన్న పాటలో కొదారి శ్రీను వలసకూలి బతుకులను ఉద్యమం వైపు పురిగొల్పుతాడు. ఈ పాటను పల్లె పల్లెలో ప్రతిధ్వనిపంజేసిన పైలం సంతోష్, వేముల పుష్ప, స్నేహాల ప్రదర్శన తెలంగాణ ప్రజలను కన్నీరు పెట్టించింది. ఈ పాట ప్రాంతేతరులను సైతం ఆలోచింపజేసిందంటే అతిశయోక్తి కాదు. తెలంగాణ వస్తే తప్ప మన బతుకులు బాగుపడవనే విప్లవాత్మక సందేశాన్నిచ్చిందీ కోదారి పాట.

"ఇద్దరం విడిపోతే భూమి బద్దలవుతుందా

ఇండియ పాకిస్తనోలె ఇనుప కంచె బడుతుందా

పొమ్మంటె పోవేందిర పోదా ఓ వలసవాది" అంటూ గోరటి వెంకన్న బలమైన

విప్లవ గొంతుకను వినిపిస్తాడు. ఈ దేశంలో స్వాతంత్రం ఏర్పడిన తర్వాత వివిధ సంధర్భాలలో కొత్త రాష్ట్రాలు ఆవిర్భవించాయి. అలాంటిది తెలంగాణ అన్న ప్రతిసారి ఏదో కొంపలు మునిగిపోతున్నట్లు, ప్రళయమే సంభవిస్తదన్నట్లు ప్రవర్తిస్తూ, ప్రచారం చేసే ఆంధ్ర తొత్తులకు, వలసవాదులకు ఈ పాట ఒక చెంప దెబ్బలాంటిది. తెలంగాణ విడిపోతే ఏమవుతుంది.

"తెలంగాణ వేరైతే కిలోగ్రాము మారుతుందా
తెలంగాణ వేరైతే చెలిమి తుట్టె పడుతుందా
వానపడక ఉంటుందా చెలిమలెండిపోతాయా'' అన్న కాళోజి గొడవకు కొనసాంగిపుగ తెలంగాణ ఉద్యమానికి ఎన్నో అద్భుతమైన పాటలను అందించి ప్రజలను చైతన్యం చేయడంలో కీలక పాత్ర పోషించిన ప్రజా వాగ్గేయకారుడు గోరటి వెంకన్న. గానమే ప్రాణంగా తెలంగాణమే జనగానంగా దుంకులాడిన గొంతు.

"జయహే జయ తెలంగాణ జననీ జయకేతనం/ తరతరాల చరిత గల తల్లీ నీరాజనం
పదిజిల్లల నీ పిల్లలు ప్రణమిల్లిన శుభతరుణం" అంటూ తరాలనాటి తెలంగాణ వైభవాన్ని కళ్ళకు కట్టినట్టుగా వర్ణించి తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని రగిలించిన గొప్ప కవి గాయకుడు డా॥అందెశ్రీ. ఇక తెలంగాణ సాంస్కృతిక ఉద్యమంలో పాటల ఊటబాయి మిత్ర అందించిన సాహిత్యం తెలంగాణ ఆటపాటల దూంధాంను అలరించిన అరుణోదయ విమల గానం ఎందరికో కర్తవ్యాన్ని బోధించింది. పదం పదం కలిపి కదనరంగంలో కాలుమోపె తెగింపు నిచ్చింది.

"ఛలో ధూం ధాం తెలంగాణ జాతరొచ్చెరా
మత్తడి దునికి అలుగు తన్నుకొని పారినట్టు
మెత్తటి గుండెలు సైతం నగారయ్యి మోగినట్టు
నెత్తినా బోనమెత్తి శివసత్తులు దునికినట్టు
నాటి మున్నూట ప్రాణాల మునుమే ఇదిరా
అది ఎగిలీవారే పొద్దు ఎరుపే గదరా
సుడిగాలై కరీన్నగరు సుట్టుకొస్తే రంగు రంగుల జెండలన్ని వెలసిపాయెరా
మన రాష్ట్రం వచ్చేదాక పన్నులు కట్టొద్దురా" అంటూ తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన అమరుల సాక్షిగ జాతర జనమై ముందుకు కదలాలె. ఇంతకాలం మెత్తటి మనసున్న తెలంగాణ ప్రజల్ని అమాయకుల్ని చేసి ఆడుకుంటున్న వాళ్ళను, ఆంధ్ర కలోసియం క్రీడలో మనని కకావికలం చేస్తున్న వాళ్ళను, హైద్రాబాదుకు, అభివృద్ధికి మెలికపెట్టి మనని మోసం జేసేటోళ్ళను తరిమి కొట్టడానికి డప్పుల దరువై, శివసత్తులై చీల్చి చెండాడుదాం రారి. తెలంగాన జాతరొచ్చింది పోరి అంటూ అమాయకులు ఆత్మగల్ల జీవులు ఎదురుతిరిగితే జరిగే పరిణామాలను గుర్తుచేస్తాడు ప్రజాకవి మిత్ర. కరీన్నగరులో ఎన్ని జెండాలు ఏకమైనా,

డబ్బు, అవినీతి, అధికారం కలెగలిసినా తెలంగాణ ఉద్యమం ముందు నిలువలేక పోయారన్నది నిజం. మరి అలాంటిది ఇంకెంతకాలం తెలంగాణ శక్తిని పరీక్షిస్తారని, తెలంగాణ ప్రజలను ఉద్యమాలను అవమానిస్తరని పాటల ఈటెలను ఎక్కుపెట్టి

"ఆడుదాం డప్పుల్లో దరువెయ్‌రా/ పల్లే తెలంగాణ పాటపాడరా" అంటూ తెలంగాణ ఉద్యమంలోకి పిలుస్తున్న సామాజిక చైతన్య విప్లవ గొంతుక, పాటకు నిలువెత్తు నిండుదనం ప్రజా గాయని విమల. ఇంకా ఎందరో కవులు, కళాకారులు, గాయకులు, రచయితలు, మేధావులు, విధ్యార్థులు, విద్యావంతులు, జర్నలిస్టులు ఒకరేమిటి ప్రతి ఒక్కరు తెలంగాణ ఉద్యమంలో మమేకమై ముందుకు నడిసింద్రు. ఇదంతా ఒక పార్శ్వమైతే ప్రజాతెలంగాణ పాటను అందుకుని ప్రజలముందుకొచ్చిన ప్రజా యుద్ధనౌక గద్దర్ మరొక వైపు.

"నన్నుగన్న తల్లులారా / తెలంగాణ పల్లెలారా

మీ పాటనై వస్తున్నానమ్మో / మీ పాదాలకు వందనాలమ్మో" పాటంటేనే తెలంగాణ. తెలంగానంటేనే పాట. పాటను గన్న తెలంగాణ పల్లెలకు వందనాలంటూ పాటై ప్రవహించిన తెలంగాణ సాంస్కృతిక ఉద్యమ నిర్మాత గద్దర్.

జానపదులు, జానపద సాహిత్యం తరువాత ఆశువుగా పాటలల్లుతూ సామాజిక విప్లవ చైతన్యం తేవడంలో ప్రధాన భూమికను పోషించిన గొంతు. పొరక మీద పాట. పోలీసుమీద పాట. పొద్దుపొడుపు మీద పాట. యుద్ధభూమి మీద పాట. ఒక్కటనేముంది గోషి, గొంగడి, చేతిలో కర్రతో తెలుగు పాటకు ఒక రూపాన్ని కల్పించిన మహా గాయకుడు గద్దర్. లక్ష గళాలను మించిన కంఠంతో కోట్లాది తెలంగాణ ప్రజలను ఉద్యమంలో భాగస్వాములను చేసిన సామాజిక విప్లవమూర్తి.

"అమ్మా తెలంగాణమా ఆకలి కేకల గానమా
అమ్మనీకు వందనాలమ్మో కమ్మని ప్రేమా నీదమ్మో
ఎట్టోళ్ల మట్టి సిప్పవొ గాయిదోల్లా గాంద్ర గొడ్డలివో
ఖమ్మం మెట్టు అడవులతోని కట్టుకుంది పచ్చని చీర
ఆదిలబాదు ఆకు నులిమి పెట్టుకుంది నొసట బొట్టు
నాగారం అడవి తుమ్మతో దిద్దుకుందీ కళ్ళ కాటుక
కుసుమా పువ్వులు నూరమ్మొ పసపు రాసుకుందమ్మో
నిండు ముత్తయిదా తెలంగాణము ముండమోసినట్లెందుకుందీ" అంటూ తెలంగాణ బౌగోలిక, మానసిక స్థితిగతులను కమ్మనైన తెలుగు(తెలంగాణ) పదాలతో ఈ దశాబ్దపు ఉత్తమ తెలంగాణ సాహిత్యాన్ని గుమ్మరించిన ప్రజా వాగ్గేయకారుడు, లయకారుడు గద్దర్. సకల సంపదలతో నిండు ముత్తయిదులా ఉండవలసిన తెలంగాణ ముండమోసినట్లుండడానికి కారణమెవ్వరు? అంటూ ప్రశ్నించి పదాలల్లిన ఘనుడు. తెలంగాణ ప్రేమను ఆత్మీయతను,

ఆవేశాన్ని తన పాటల ద్వారా మాటల ద్వారా చెబుతూ పల్లె పల్లెలో ప్రజా చైతన్యాన్ని పాదుకొలిపి, తెలంగాణ విప్లవ చైతన్యాన్ని నింపిన వీరజవాన్ గద్దర్.

ప్రజా ఉద్యమ లక్ష్యాలను నెరవేర్చుటలో పాట ఒక పదునైన ఆయుధం. తెలంగాణలో దోపిడి, అవమానాలను దునుమాడడానికి అస్సోయి ధులా దర్వులతో గజ్జెగట్టినదీ పాట. ఊడిగానికి ఎదురు తిరిగి రజాకార్లను, భూస్వాములను తరిమికొట్టినదీ పాట. తెలంగాన సాయుధ పోరాటంలో పెన్ను, గన్ను చేతబూని విప్లవ శంఖమూది నిజామోని గోరి కట్టినదీ పాట. ఇది సుద్దాల హన్మంతు పాట. బండి యాదగిరి, వట్టికోట ఆళ్వారుల బాట. అలాంటి పాట మూగబోయింది. ఆ పోరాట వారసత్వం అడుగంటి పోతుంది. రాజకీయపు ఎత్తుగడలతో పాట అవిటిదైపోతుంది. వలసాంధ్ర పాలకుల కుట్రల్లో పాట నలిగిపోతుంది. పరిపరి విధాల వ్యాప్తి చెందిన పాట తెప్పరిల్లిపోతుంది. చెమటబొట్లు తాళాలై పడుతున్నకాడ, కరిగిన కండరాల నరాలు స్వరాలు కడుతున్నకాడ ఉద్యమాల ఉగ్గుపాలే ఊపిరిగా రంగరించుకున్న కాడ అప్పుడో ఇప్పుడో పుట్టిన ఒక రాగమే ఉద్యమానికి ఊపిరినిచ్చింది. అయితే తెలంగాణ గోసకు, భాషకు, జానపద జవసత్వాలకు మసిబూసి మాయజేసి తనదిగా చలామని అవుతూ ప్రగల్భాల పెన్ను ఝులిపించే ప్రబుద్ధులు ఎందరుంటే ఏముంది. పాటల విలుకాల్లు సినిమా, టీవి మాధ్యమాల ముందు చేతులు కట్టుకొని కూర్చుంటుండ్రు. వలసాంధ్ర పాలకుల వైభవాన్ని పొగుడుతూ ఆస్థాన కవులుగా అందలాలెక్కాలని ఆరాట పడుతుండ్రు. సీమాంధ్ర పాలకుల మోచేతి నీళ్ళకు మరిగి కూనిరాగాలు తీస్తూ కునికిపాట్లు పడుతుండ్రు. తెలంగాణే ప్రానమని జయనినాదాల హోరెత్తిన గొంతులు వివిధ ప్రలోభాల్లో కూరుకుపోయి కుట్రల్లో నలిగిపోతున్నయి. ఇన్నేండ్ల తెలంగాణ ఉద్యమం సీమాంధ్రులకు ఇంకా ఎక్కువ దోపిడి చేయడానికి, వేగంగా ఇక్కడి వనరులను తరలించుకొని పోవడానికి వలస పాలకులను ప్రేరేపించినట్లయింది తప్ప తెలంగాణను సాధించుకున్నది లేదు. పాము తొకను తొక్కి ఇడిసిపెట్టినట్లయితుంది. వేయి పడగల సీమాంధ్ర విషనాగును అంతమొందించింది లేదు.

తెలంగాణ పేరుతో వ్యక్తిగత స్వార్ధానికి మరిగిన నాయకులు, పార్టీలు తెలంగాణకు ద్రోహం తలపెట్టేదిగా ఉన్నది. అర్ధంలేని రాజకీయ పొత్తులతో తెలంగాణను అంగట్ల సరుకును జేస్తుంటే ఒక్కరు గొంతెత్తరేంది? అగ్రకుల నాయకుల పోకడలను వెర్రి, మొర్రి చేష్టలను ఒక్కడు ప్రశ్నించడేంది? బలహీన వర్గాల నాయకులనైతే బదునాం జేస్తరు. అంత మాత్రపోల్లే కదాని తోకతోనే కొడతరు. నాటి తెలంగాణ ఉద్యమానికి చెన్నారెడ్డి చేసిన మోసం మొదలు నేటి చిన్నారెడ్డి ఇతర అగ్రకుల నాయకులు వాళ్ళకు వంతపాడే వెన్నెముక లేని నాయకుల పుణ్యమాని ఉద్యమానికి ఈ గతి పడ్తుంది. ఉద్యమ నిర్మాణ క్రమంలో ఎక్కడా కానరాని అగ్రకులాలు ఉద్యమ చరమాంకంలో ప్రధాన స్థానాన్ని సంపాదిస్తరు. బడుగు బలహీనుల పక్షాన వకాల్తా పుచ్చుకుంటరు. రాజకీయం, కళలు, ఉద్యమాలు ఏ రంగమైనా సరే పెత్తనంజేసి

పేనుగొరుగుడు గాల్లయితరు. లేదంటే అయ్యాల కాంగ్రేసుతో జతగట్టుడేంది? అభివృద్ధి పేరుతో కట్టుదిట్టమైన కాల్వలు ఆంధ్రకు తవ్వి, తెగిపోయె కాల్వలు తెలంగాణల తవ్వి ప్రాజెక్టుల పేర ఊర్లకు ఊర్లు ముంచుతున్న కాంగ్రేసును అడ్డుకోక నక్కమొఖాన కుక్కబిత్తినట్టు వచ్చిపోవుడేంది? సమైఖ్యాంధ్రే ఎజెండాగా బరిలో నిలిసిన మహాకూటమిని నమ్మి తెలంగాణను తెర్లు జేసుడేంది?

"ఎర్రజెండలు పసుపు జెండలు గులాబిజెండలు
గుట్టుసప్పుడుగ పూలదండలై మెడలు నిండెను
ఎవడు రాసినా సిద్దాంతలివీ ఏకమైన ఈ పద్దతి ఏంది
ఎట్ల అడుగుతరు ఓట్లు వెయ్యమనీ
తెలంగాణను తేల్చని మీరు ఆంధ్ర తొత్తులయ్యో నాయనా
తెగువ జంపుకొని బుడదగుంటలో పందులైతిరయ్యో నాయనా
సక్కధనాల తెలంగాణరా ఒక్కతీరుగా రగులు తుండెరా
వాళ్లో కొచ్చిన తెలంగాణరా
మహా మాయల అగ్రకులమురా కుళ్ళిన కూటమి ఎత్తుగడలతో
కుప్పగూల్చగా తయారయ్యెరా
తెలంగాణపై తలో తీరుగా మాటలాడుతుండ్రో నాయనా
తెగువజంపుకొని మంది మూతులు నాకుతున్నరేందో నాయనా"

ఈ ఉద్యమాలు సప్పున సల్లారడంలో ప్రధానంగా అగ్ర కులాల పాత్ర మొదటినుంచి కొనసాగుతుందనేది అందరికి తెలిసిన విషయమే. తెలంగాణ రాజకీయ పార్టీల నాయకులకు తెలంగాణ పట్ల చిత్తశుద్దే ఉంటే చెప్పుల కావలి కూర్చునే వాళ్ళేకాదు. వలస పాలకుల బూట్లను నాకే వాళ్ళేకాదు. వేలాదిమంది కళాకారులతో లక్షలాది మంది ప్రజలతో తెలంగాణ కోసం ఎన్ని సభలు నిర్వహించినా వలస పాలకులు నిమ్మకు నీరెత్తినట్టుగా తమాషా చూస్తున్నారే తప్ప తెలంగాణ ఆవేదనను అర్థం చేసుకున్న వారు లేరు. కరీన్నగరు ఉప ఎన్నికతోనే తెలగాణ బలమేందో రుజువయ్యింది. పాలకులకు నిజంగా స్వార్ధం లేకుంటే, తెలంగాణను అమాంతం దోచుకోవాలనే ఆలోచనే లేకుంటే తక్షణమే తెలంగాణ ఇచ్చే సంధర్భం అది. అలాంటిది ప్రత్యేక తెలంగాణ కోసం రూపకల్పన చేయకుండా దాటవేసి తెలంగాణ అంశాన్ని నీరుగార్చే ప్రయత్నం చేసింద్రు. నాకు తెలిసీ ప్రపంచంలో ఏ ఉద్యమం ఇంత సుదీర్ఘ కాలంగా, ఇంత సజీవంగా లేదు. ఒక్క తెలంగాణ ఉద్యమం తప్ప. ఇండ్ల కవులు కాళాకారుల పాత్ర అమోఘమైనది, అది మాటల్లో చెప్పలేనిది. తెలంగాణ ఉద్యమ స్థాయి, తీవ్రత, నడిచిన కాలం వంటి అంశాలను పరిఘుననలోకి తీసుకుంటే గిన్నీస్‌బుక్‌లోనైనా స్థానం సంపాదించవచ్చునేమో కాని వలసాంధ్ర పాలకుల మనసును మార్చలేక పోయింది.

ఎందరో వీరులగన్న నేల ఇదని, వీరులకు పుట్టినిల్లని, వీరభూమి ఇదని ఎన్ని మాటలు జెప్పినా, పాటలు పాడినా వీరుడెవ్వడు లేడు కదా! ఆయింత మనిషితనం కోల్పోయి, ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టి బతికే నీచమైన దుస్థితికి దిగజారినట్టనిపిస్తుంది. "నా ప్రియమైన కవులారా కళాకారులారా మీరెటువైపు? ప్రజల వైపా ప్రభుత్వం వైపా? పత్రికా విలేఖరులారా మీరెటువైపు? ప్రజల వైపా ప్రభుత్వం వైపా?" అని ఉద్యమకారులు అనేక సార్లు ప్రశ్నించి ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నా వాళ్లపని వాళ్ళు చేస్తనే ఉన్నరు. తెలంగాణ ఉద్యమాన్ని కాంగ్రేసుతో లెంకబెట్టినా సప్పుడుజేయక పోతిమి. సమైఖ్యాంధ్రని సంకదింపని చంద్రబాబుతో జోడు గట్టినా ఒప్పుకుంటిమి. ఆ వ్యూహాలు, ఎత్తుగడల్లో ఎక్కడో లక్ష్యం చేరే అంశం దాగి ఉందని బలంగ నమ్మిన మాట వాస్తవం. అందుకే ఓట్లేసి గెలిపించాలని వంతపాడిన మనం కూడ ఎటువైపో తేల్చుకోవల్సిందే. పత్రికలు ఇతర మాధ్యమాలు పూర్తిగా పాలక పక్షాల చుట్టూ ప్రధక్షణ చేస్తూ ప్రజా సమస్యలను, ప్రజాస్వామిక ఉద్యమాలను పక్కకు పెడుతున్న తరుణంలో ప్రజల పక్షం వహించాల్సిన కవులు, రచయితలు గాయకులు, కళాకారులు రాజకీయ పక్షాల చేతిలో కీలుబొమ్మలుగా మారుతున్నరు. వాళ్ళకు అనుకూలమైన రాతలు రాస్తున్నరు. వాళ్ళను పొగడుతూ నాయకుల చప్పట్లతో, రాజకీయ దుప్పట్ల ముసుగులో తన్నుకుంటున్నరు. ఉద్యమ మూలాల్ని, బాధ్యతల్ని మరిచి గంగిరెద్దుల్లా తలలూపుతున్నరు.

"తెలంగాణ సిద్దాంత కర్తలు విద్యావంతులు బుద్ధిమంతులు
కవులు కొందరు కళాకారులు
అలిసిపోయినరు అమ్ముకున్నరు తెలంగాణను తెర్లు జేసినరు
కూటమి అంగడి సింగిడన్నరు
పెదాలపైనే పదాలుబాడే అగ్రకులము జూడో నాయనా
అదును జూసుకొని అంతామేమే ఎవ్వరు లేరనెరో నాయనా"

ఇన్నేండ్లుగా వలసపాలకుల సావాసంతో సద్దికూడుకు, ఇడ్లి, దోసెకు అలవాటు పడి చేవజచ్చి చేతులు ముడుచుకున్నట్లనిపిస్తుంది. సావాస దోషంతో తెలంగాణ పౌరుషం సచ్చిపోయినట్లనిపిస్తుంది. నాలుగు రోజులు సోపతిజేస్తే ఆడు ఈడైతడన్నట్టు అయిపోయింది. లేదంటే వీరులగన్న తెలంగాణకు ఈ పరిస్థితి ఏంది? ఉద్యమ విలువల్ని దిగజార్చి వ్యక్తిగత స్వార్థం కోసం తెలంగాణను ఫణంగా పెట్టే ద్రోహులకు బుద్ధి చెప్పడానికి ఒక్కడు నిప్పయ్ రాజుకోడేంది? ఎక్కడా ఒక కొత్తపాట పుట్టదేంది? అగ్రకుల, ఆంధ్ర పద్మవ్యూహంలో చిక్కుకున్న అభిమన్యులు కదా నా తెలంగాణ బిడ్డలు.

తెలంగాణ అంశం చివరి దశకు చేరుకున్నదని తెలిసిన వెంటనే తెలగుభాష గొప్పదనం, తెలుగుభాష తియ్యదనాన్ని చప్పరించడానికి తెలుగుతల్లి ఉత్సవాలు, శ్రీశ్రీ జయంతులు, కన్నాంబ వర్ధంతులు, అన్నమాచార్య లక్షగళ కీర్తనలు తెలుగువాడి ఆత్మగౌరవం

పేర కుట్రపూరితమైన ప్రయోగాలతో సమైఖ్య రాగ తాళాలు ఇంకెంతకాలం. సిలికానాంధ్ర పేరుతో మభ్యపెడుతూ గిన్నీస్‌బుక్ రికార్డు ఉచ్చు పెడుతున్న వలసవాదులారా ఇకనైన మీ కుట్రలు ఆపాలె. అందితె జుట్టంటరు. అందకుంటే కాళ్ళంటరు. తెలుగుభాషతోని నువ్వునేను అల్లుకున్నదెక్కడ. నన్నెచోడుని పక్కకునెట్టి, నన్నయను ముందుపెట్టి తెలుగుకు ప్రాచీన హోదాఇచ్చెకాడ తగువు పెట్టింది మీరుకాదా? నిజానికి ఆంధ్ర తెలుగు తెలుగే కాదు. అది ఖచ్చితంగా ఆంధ్రం, కాదంటే మరొకటి. లేదంటే భాషా ప్రయుక్త రాష్ట్రంగా తెలుగు శబ్ధం ధ్వనించె తెలంగాణ పేరుండాలె తప్ప ఆంధ్రప్రదేశ్ ఎట్లయింది. భాష పేరుతో కుట్ర జరగలేదా? యాసను అవమానించలేదా? ఆది కవులమని అంతటా మేమేనని విర్రవీగలేదా?

అందుకే మీది ఆంధ్ర భాష. మాది తెలుగు భాష.

మీది ఆంధ్ర, మాది తెలంగాణ. ఎక్కడ నువ్వు ఎక్కడ నేను. ఏనాడు ఆడుకున్నది లేదు పాడుకున్నది లేదు. ఒక్కటై కూడిపోయింది లేదు.

ఆదినుంచి అంతటా నువ్వు నువ్వే..నేను నేనే.

"వనరులెన్నో ఉండి ఒంటిసేతా బతికే దమ్ము నీకున్నా
దమ్మిడ్కి గోరగాని లమ్డీకొడుకుల ముందు సెయ్యి జాపుడేందీ
కాయకష్టము జేసి గంజి గట్కలు దాపి ఇల్లు గడుపుడేందీ
కుటిల నీతితోని కుట్రజేసినోల్ల పంచ జేరుడేందీ
ఆదినిష్ఠూరాన్ని వదిలిపెట్టుకోని పోరుజేసుడేందీ
మోసగించినోల్ల మెడలు వంచకుంట ఇడిసి పెట్టుడేందీ
వందనాలు వందనాలు వందనాలమ్మో తెలంగాణ తల్లీ నీకు దండాలోయమ్మో"

అన్నాను తెలంగాణ ఉద్యమ సంధర్భంలో...

మా పదునైన పాటమీద ఎప్పుడు మీ ఆంక్షలు, అణిచివేతలేగా! కడుపురగిలి, గుండెపగిలి మేము పాడే పాటకు నిఘా ఉంటది. పల్లవందుకోంగనే పరేషానుంటది. అధికారం మీదికదా! "రాజు తల్చుకుంటే దెబ్బలకు కొదవా" అన్నట్టు మా పాటను పటాపంచలు జేస్తరు. కడుపునిండిన మీ పాటకు, ఉప్పుకారం లేని సప్పిడి పదాలకు అవార్డులుంటయ్. పురస్కారాలుంటయ్. పూజలుంటయ్. కుట్రపూరిత లక్షగళ రాగాలుంటయ్. మరి ఇంకెంత కాలం ఈ మోసాల్ని, దారుణాల్ని సహిద్దాం. సర్వం కోల్పోయి ఆత్మత్యాగం చేసే బలి చక్రవర్తులుగా ఎన్నాళ్ళు బతుకుదాం.

తెలంగాణ ప్రజల మంచితనం, త్యాగ గుణాన్ని అలుసుగా తీసుకున్న వలసాంధ్ర పాలకులకు, నాయకులకు తగిన బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైనది. ఇగ ఇప్పుడు కొత్త పల్లవులతో కోటి గొంతులు కొత్త రాగాన్ని పలికిస్తాయి. మూడున్నర కోట్ల తెలంగాణ ప్రజలు ఉద్యమ రణ నినాదంతో మీ చెవులను హోరెత్తించి పొలిమేర దాటిస్తయి.





# పాట కొన్ని ఆలోచనలు

## (అనేక నడకల పాట)

"టపటప టపటప చెమటబొట్లు తాళాలై పడుతుంటే

కరిగి కండరాల నరాలే స్వరాలు కడుతుంటే

పాట పనితో పాటే పుట్టింది పనీ పాటతో పాటే జత కట్టింది" అంటూ సుద్దాల అశోక్ తేజ పాట పుట్టుకను గురించిగానీ, ఆది మానవుని భావ వ్యక్తీకరణకు పడ్డ ప్రయాసను గురించిగాని కవి ప్రసవ వేదనను తలపించాడీ పాటలో. అత్యంత అద్భుతంగా పదపదమున ప్రతీకలతో ఒక దృశ్య కావ్యాన్ని చేసి మనకు అందించిన ఉత్తమ కవిగా సుద్దాలను అభివర్ణించక తప్పదు. అయితే పాట శ్రమజీవుల చెమటబొట్లలోనుంచి రావడంతో పాటు అనేక సంధర్భాలలో వివిధ నడకలుగా పాట పల్లవిస్తుంది. అందులో భాగంగానే జానపదులు పాడుకున్న పాటల్ని అనేక భాగాలుగా విభజించడం జరిగింది.

పురాణగాథలు, ఇతిహాసాలకు సంబంధించిన పాటలు, స్త్రీలకు సంబంధించిన పాటలు, పిల్లల పాటలు, సరసంతో కూడిన పాటలు, విషాద గీతాలు, దేనికదే వేరు వేరుగా ఉంటూ పాట ఎప్పుడూ దాని అస్తిత్వాన్ని చాటుకుంటూ ఇప్పటిదాకా సమాజంలో దాని ప్రాధాన్యతను, అవసరాన్ని పెంచుకుంటూ పోయింది. తెలంగాణ ప్రాంతంలో తిరునాలలు, జాతర్లు మరియు దసరా పండగ వంటి ఉత్సవ సంధర్భాలో చిడతల భజన, కోలాటం వంటి కళారూపాలద్వారా గాయకులు ఆలపించే పాటలు ఇప్పటికీ నా మదిలో మెదులుతూనే ఉన్నయి.

"ఉంగారమా ముద్దుటుంగారమా

రామ రంగైన రామునేలుంగారమా

ఎగురా రెక్కలు లేవు– నడువా కాళ్ళు లేవు

ఏలాగు వస్తివే ఉంగారమా"

"ఎవ్వరేనీ వనములోనా – హెచ్చరించావే లలనా, ఎవ్వరే నీ వనమూలోనా

ఎవ్వరైతే నేమీ పొమ్మీ – చాలు సరసములోయ్ రాజా, ఎవ్వరైతే నేమీ పొమ్మీ" లాంటి ఎన్నో పాటలు లయబద్ధంగా పాడుతూ హుషారెత్తించి, జనాలను ఆకర్షించడమే కాకుండా ఆలోచింపజేసే విధంగా ఉండేవి. పాట జానపదుల హృదయాల్లో జవసత్వాలు నిండి ఉండడం చూసిన వాన్ని. ఒకానొక సంధర్భంలో పాటకు సంబంధించి నేను కూడ నాలుగు పదాలు రాసే క్రమంలో..

"పాటా నువ్ బుట్టినావు కొండ కోనలలోన బతికీ బట్టగట్టినావు ఎండా వానలలోన

పాటా నువ్ బుట్టినావు రగిలే గుండెలలోన .. పాటా..

పనిలో తోడుంట నంటవూ.. ఓ.ఓ.. శ్రమజీవులనల్లుకుంటవూ..

మది నిండిన భావాలు పురిటినొప్పులా తీరై

పుడమిని జూడంగ నువ్వు పురుడు బోసుకుంటవూ...

ఆట కోయిలలు బాడే కోయిలమ్మదీ పాట–రివ్వు రివ్వునా వీచే కొండగాలిదీ పాట

గూ గూ గూ గూసింత గువ్వపిట్టెలా పాట

ఊటబాయి మోట గిరుకలో ఈ పాట ఊడిగానికెదురు దిరిగెరా

పాటా పదునెక్కుతుంటదీ..ఓ..ఓ.. జనపథమై సాగుతుంటదీ" ఈ విధంగా అనడం వెనుక గూడా పాటకు శ్రమైక జీవనానికి విడదీయరాని సంబంధం ఉన్నదనే. అంటే పాట పల్లె బతుకుల కష్టానికి చేదోడుగా, శ్రమను మరిపింపజేస్తూ, ఉత్సాహాన్ని నింపే ఆత్మీయ బంధువుగా మారుతుంది. పాట ఎల్లపుడూ పెదాల చాటున పదమై జాలువారుతుంది. సముద్రాన్ని సంకలో పెట్టుకొని తిరిగే బెస్తలకు "జోర్సెయ్.. బార్సెయ్... జోరు.. జోరు.. జోర్సెయ్..." గుండె ధైర్యాన్నిస్తుంది." హైలెస్సో... హైసా.. "అంటూ హాయినిస్తూ అలల ఊయలలూపుతుందీ పాట. ఇనుప ఖర్మాగారాలల్ల, రైల్వే నిర్మాణాలల్ల పాట నెత్తురోడుతది. ఆత్మగౌరవం దెబ్బతింటే ఆయుధాన్నెక్కు పెట్టిందీ పాట. దొర ఘడీలను కుప్పగూల్చి, నిజామోని గోరి గట్టిందీ పాట. ఇప్పుడు ఈ వలసాంధ్ర పాలనను తుద ముట్టించడానికి ఒంటరి పోరాటానికి సిద్ధమైతున్నదీ పాట.

పాటకు నిలువెత్తు రూపం తెలంగాణ. పాటల ఊటబాయి తెలంగాణ.

సంధర్భమో, అసంధర్భమో ఇక్కడ ఒక విషయం చెప్ప దలుచుకున్నాను.

ఈ భూమి మీద అనేక రకాల జీవులు, జంతువులు, పక్షులు, వృక్షాల ఆవిర్భావం తరువాతనే మానవుని అవతరణ జరిగింది. అంటే మన విజ్ఞానం మేధస్సు ప్రకృతి ప్రసాదించిన వరమే తప్ప నిజానికి మన గొప్పతనం ఏమీ లేదు.

నువు నేర్చుకున్నదంతా నీ చుట్టు ఉన్న పరిసరాల నుంచే. ఆదినుంచి మానవుడు జంతువుల అరుపులను, పక్షుల కిలకిలా రావాలను మాటలుగా మలుచుకొని, పాటలుగా గొంతెత్తి, గంభీర ప్రకృతితో మమేకమై జీవించడానికి అనేక శబ్దాలను సృష్టించిండ్రు. కాని కాలక్రమంలో అవకాశవాదులు వాటిని పరిపరి విధాలుగా ప్రచారం చేసి వారివారి పబ్బం గడుపుకుంటూ వచ్చారు. లేదంటే ప్రకృతితో ముడిపడిన మానవ జీవితంలో నాగరికత పేరుతో అనాగరిక సమాజానికి ఆజ్యం పోస్తున్నదెవరో మనకు తెలియనిది కాదు. విజ్ఞానం పెరిగి మనుషులందరూ సాంకేతికతకు దగ్గరవుతున్న కొద్దీ సంకుచిత స్వభావం, మూఢ నమ్మకాలు పెరిగిపోతున్నయి. ఈ మొత్తానికి కాకపోయినా కొంతలో కొంతైనా ఇందులో పాటకూ భాగస్వామ్యం ఉన్నది. ఎందుకంటే మొదట మీడియా అంటే పాట తప్ప మరొకటి కాదనేది నా అభిప్రాయం.

ఊరూరా తిరిగి ఉన్నది లేనిది ప్రచారం చేసే పదునైన ప్రసార మాధ్యమం పాట.

అన్నింటి లాగే పాట కూడా స్వార్థపరుల చేతుల్లో పడింది. దాని అస్తిత్వాన్ని కోల్పోయింది. ఎందుకంటే ఈ సంధర్భంగా మరొక విషయం గుర్తు చేస్తాను. ఇప్పటి వరకూ దొరికిన లేదా ప్రచారంలో ఉన్న జానపద సాహిత్యం చాలా మటుకు ఇతరులు (ఆదిపత్య వర్గాల వారు) జానపద గాయకులు, వాద్య కారులపై బలవంతంగా రుద్ది అనేక ఆంక్షలు విధించి (ముఖ్యంగా పౌరాణిక, చారిత్రక, ఇతిహాసాలకు సంబంధించినవి) వాళ్ళతో ప్రచారం చేయించినదే తప్ప ఇంకొకటి కాదు. లేకపోతే అడవిలో ఏ సెలయేటి గలగలల సుడులలోనో, చిమ్మచీకట్లో వెలుగులు విరజిమ్మే మంటల చుట్టో, చల్లని వెన్నెల రాత్రులలోనో హాయిగా పాడుకున్న పాటలు కాకుండా నాటినుంచి నేటి వరకూ జానపద గాయకులు, కళాకారులు ఆలపిస్తున్న గేయాలు, కథాగానాల సంగతేమిటి?

రామాయణ, భారతాలు, వేదాంత తత్వాలు, భాగవత సంబంధాలు, పలనాటి వీరుల చరిత్ర, రెడ్డి రాజుల ఘనత ఇవే కదా నా బుడిగ జంగాలు, బుట్టి దాసర్లు, సిందులు, ఇంకా ఇతర భిక్షుక గాయకులు ఆలపించినవి. తరతరాలుగా తనది కాని పూర్వీకుల కథలు, చరిత్రలను అక్షరం పొల్లుబోకుండా మౌఖిక గేయ వారసత్వంతో గానం చేస్తూ వాళ్ళకు లేని గొప్పలను చరిత్రను, గానం చేస్తరు. ముఖానికి రంగులు పూసి సిందులు తొక్కుతూ ఆడి, పాడితె వాళ్ళకు మనం ఇచ్చే బహుమానం అడ్కతిని బతుకమనే కదా..!

ఎక్కడ ఎవ్వరు వాళ్ళకు మడులూ, మాణిక్యాలు ఇచ్చినోల్లు లేరు.

రాత్రి పూట రాజులు–తెల్లారితే బూజులు అన్నట్టు కళాకారుల జీవనం అడుగంటుతుంది. పాట ఎప్పుడూ పాడినోనికి, రాసినోనికి చేసింది పావుల సాయమే. పాడినోనికి అదనంగా పదిపైసల పేరు దొరకొచ్చు.

ఇట్లగాకుండా పాటని ఎవడైతే అంగడి సరుకు జేసి అమ్ముకుంటడో ఆన్నే నమ్ముకుంటది. ఆనెమ్మటే ఉంటది. ఆడెట్ల జెప్పితే అట్ల గొంతును సవరించుకుంటది. పసిపిల్ల నుంచి పండు ముసలి దాకా పాటంటే పరితపించే మాట వాస్తవం అయినప్పటికీ దానికి మల్లా కొన్ని వేరు వేరు సంధర్భాలు లేకపోలేదు.

ఏదేమైనప్పటికీ  ఇయ్యాల పాటలు తప్ప మాటలు ఇనేటోడు లేడు.

ప్రతి ఒక్కరు పాటల ఊటబాయిలో గొంతు తడపాలనే చూస్తుంటరు. అంతెందుకు ఈరోజు ఏ దేవుడైనా పాట లేందే కనీసం పాలైనా తాగుతుండా..!

పాటపాడందే నైవేద్యం ముట్టుకుంటుండా..!

పాట పాడందే పండుకుంటుండా..?

పాట లేందే పాపం పోనీ అని భక్తులకు ఓ వరమైనా ఇస్తుండా? అందుకే పాటలే పాటలు. ఎక్కడ ఏ గుడిలో చూసినా పాటలే.

ఈ కోవలో అయ్యప్ప, వినాయకుడు ముందు వరసలో నిలబడతరు.  ఆ తరువాతే ఎంకన్న ఇంకెవరైనా. దేవుడు, మనిషి, మృగం ఏవరైతే ఏముంది. అదే రాగం అదే తాళం, పదాల తారుమారు. కొంగు నడుముకు జుట్టిన పాట అదిగో అల్లదిగో శ్రీ హరివాసమని కొడవలి ఆకాశానికేసి వెన్నెలలు జుబుక్కొవచ్చు. నక్షత్రాల్ని వొళ్ళో వేసుకోవచ్చు. ఈ సంధర్భంగా నాకొకటి గుర్తుకొస్తుంది. అదేందంటే చరిత్ర పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రశ్నలకు జవాబులు రాయాలంటే పెద్దగా చదవాల్సిన పనిలేదని, రాజుల పేర్లుమార్చి ఉన్నదున్నట్టు రాస్తే సరిపోతదని అనుకునే వాళ్ళం. ఎందుకంటే అందరూ దండయాత్రలు జేసినోల్లే, యుద్ధాలు జేసినోల్లే అన్నట్టు ఈ దౌర్భాగ్యం ఇప్పుడు పాటకు అంటుకుంది.

అయ్యప్ప మీద ఒక్క పాటొస్తే ఆయినే అంజన్న, ఆయినే వినాయకుడు, ఆయినే రాజశేఖర్‌రెడ్డి, ఆయినే రాజకీయ నాయకుడు అన్నీ అంతే ఆలిన్ వన్.

ఎవరైతే ఏముంది కాస్త అటీటుగా అంతా ఒక్కటేననేది సారాంశం.

ఇప్పుడు సినిమాలు, సీరియల్‌లో మాత్రమే కాదు. అడ్వర్టయిజ్‌మెంట్‌లలో కూడా గ్రూప్‌సాంగ్స్, సోలోసాంగ్స్, డ్యూయెట్స్ ఉంటయ్. 'రసికా...' అంటూ రాగాలు దీస్తది మజాగా. "దగ్గరగా...రా" అంటూ క్లోజప్ నవ్వుల్ని వెదజల్లుతది.

ఇవన్నీ పాటలే. ఇప్పుడన్నీ పాటలే.

మాటలు లేవు. ఇక కొన్ని సినిమా పాటల్ని మినహాయిస్తే అసలు వాటిని గురించి మాట్లాడుకోక పోవడమే మంచిది. ఇట్లాంటి పరిస్థితులలో కూడా పాటకు ఒక నిండుదనాన్ని ఇస్తున్న నేల మన తెలంగాణ. పాటను బతికిస్తున్న నేల మన తెలంగాణ.

మారుతున్న మనుషులతో పాటు మనమూ మారకపోతే చిన్నచూపు చూస్తరేమోననే భయంతో మనకు తెలువకుండనే మనలో కొన్ని మార్పులు చోటు చేసుకోవడం మనం గమనించకపోవచ్చు కాని అది వాస్తవం. సరిగ్గా ఇక్కడే మన అస్తిత్వాన్ని కోల్పోతున్నం. మన ఆలోచనలను పరిమితం చేసుకుంటున్నం. మనది కాని దాని గురించి గొప్పగా మాట్లాడుకుంటం. కానీ తనదైన జీవితాన్నే పదిమందికి గొప్పగా పరిచేయం చేస్తుంటడు. అస్తిత్వ మూలాల్లోనే సంచరిస్తుంటడు. అటువైపుగా నలుగుర్ని పోగేసుకుంటడు.

ఆ కోవకే చెందిన పాటగాడు, ప్రజా వాగ్గేయకారుడు గోరటి వెంకన్న.

ఎవనిచేతనో ఎక్కిరించబడి, మనవాళ్ళచేత మరుగున బడుతున్న అనేక పదాలను, పల్లె జీవభాషను ఆధునిక పదాల సరసన కాకుండా అందనంత ఎత్తులో అందంగా పొదిగిన అగ్రజుడు గోరటి వెంకన్న.

కనుమరుగై పోతున్న తెలంగాణ జానపదుల జీవభాష మాధుర్యాన్ని తన పాటల ద్వారా వొంపుతూ పులకింప జేస్తున్నవాడే గోరటి వెంకన్న.

అతి సామాన్యుల నాలుకల మీద నడయాడే పదబంధాలను బందించి తన పాటకు పల్లవులుగా చేసుకొని జీవద్భాషను సృష్టిస్తున్న తీరు నాలాంటి కవిగాయకులు, రచయితలకు మాత్రమే కాకుండా ఎందరో సామాన్య పాఠకులకు సైతం స్ఫూర్తినిచ్చే గుణం ఆ పాటలలో దాగి ఉన్నది. ప్రజల వాక్కునే పాటలుగా, గేయాలుగా అల్లగలిగిన నేర్పరి ప్రజా వాగ్గేయకారుడు గోరటి వెంకన్న "ఇద్దరం విడిపోతే భూమి బద్దలైతుందా

ఇండియ పాకిస్తనోలే ఇనుప కంచె బడుతుందా

రావొచ్చు పోవొచ్చు రొయ్యలమ్ముకోవచ్చు

నువు పద్యం బాడితే నేను వన్స్‌మోరు గొట్టొచ్చు

గా సెక్రటేరియెటుల మాత్రం నీ చక్రం దిప్పనీయం

పొమ్మంటే పోవేందిర పోరా ఓ వలస వాది" అంటూ తెలంగాణ ఉద్యమ స్వభావాన్ని కళ్ళకు కట్టినట్టు చూపిస్తాడు. ఏ పాటకైన దాని భావంతో పాటు సాహిత్యమూ ముఖ్యమే. రెండు బలంగా ఉంటేనే ఆ పాట ప్రజల నాలుకపై నాట్యం చేస్తుంటది. పదికాలాల పాటు బతికుంటది. అన్ని విలువలతో కూడిన పాటలు తెలంగాణ సమాజంలో ప్రవహించాలని పది జిల్లాల నేల నిండు బోనం కుండలా గడ్డిపూల బతుకమ్మలా వర్ధిల్లాలని కోరుకుందాం.

*పోరు తెలంగాణ ద్వైమాస పత్రిక*

*ప్రారంభ సంచిక మార్చి-ఏప్రిల్ 2010.*



# తెలంగాణ యాస-భాషల శ్వాస కాళోజీ

**ఒక జీవిత కాలమంతా తన ప్రాంత విముక్తి కోసం పరితపించిన అంతులేని దుఃఖంలోంచి, అనేక నిస్సహాయతల్లోంచి ఉబికి వచ్చిన ఉద్యమగీతం కాళోజీ. ఒకరి మీద మరొకరి ఆదిపత్యాన్ని, అహంకార పూరిత స్వభావాన్ని సహించని ధిక్కారస్వరం కాళోజీ.**

**బతుకంతా ప్రజల పక్షమే నిలిచి, నిరంతరం తెలంగాణ కోసం పరితపించిన ప్రజాకవి కళోజీ. నిత్యజీవితంలో మనిషి పడుతున్న కష్టాలు, ముఖ్యంగా రాజ్యం పేదవాని పట్ల ప్రవర్తించే విధానాన్ని తీవ్రంగా విమర్శించిన మహాకవి కాళోజీ.**

**మనిషికి పలుకుబడుల భాష కావాలి తప్ప బడి పలుకుల భాష కాదని, తెలంగాణ యాస భాషకు నిజమైన శ్వాసను అందించిన భాషావేత్త కాళోజీ. ఆత్మబలిదానాలు, అమరుల త్యాగాల నుంచి పుట్టుకొచ్చిన ఆగ్రహ జ్వాల కాళోజీ. తెలంగాణ మట్టిలో చిగురించిన త్యాగాల జమ్మిచెట్టు కాళోజీ.**

**ప్రపంచ యుద్దంతో పుట్టిన తెలంగాణ విముక్తి గీతం కాళోజీ.**

కాళోజీ రంగారావు, రమాబాయి దంపతులకు 1914లో ప్రపంచ యుద్ధసమయంలో జన్మించిన సుప్రసిద్ధ తెలంగాణ సాహితీ శిఖరం కాళోజీకి సరిగ్గా వంద సంవత్సరాలు నిండడంతో, తెలంగాణ వ్యాప్తంగా ఈ శతజయంతి సంవత్సరాన్ని ఘనంగా జరుపుకుంటున్నరు.

ఇందులో భాగంగానే అనేక సంస్థలు కాళోజీ శతజయంతిని అత్యంత వైభవంగా చేసుకుంటున్నరు. తెలంగాణ రచయితల వేదిక లాంటి అనేక సంఘాలు, సంస్థలు కాళోజీ జీవితమే భవిష్యత్ తరాలకు ఆదర్శప్రాయమని తలచి, విద్యార్థులలో కాళోజీ స్ఫూర్తిని నింపే ప్రయత్నంలో భాగంగా "కోటిమంది విద్యార్థులచే ప్రతిజ్ఞ" కార్యక్రమాన్ని చేపట్టి ఘనంగా నిర్వహించడం జరిగింది. నల్లగొండ జిల్లా రచయితల వేదిక ఆధ్వర్యంలో కాళోజీ శతజయంతిని పురస్కరించుకొని విద్యార్థుల నడుమ నెలనెలా పెద్దఎత్తున సాహిత్య కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది.

ఈ సంధర్భంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర మహోద్యమంలో కాళోజీ అడుగులను, కవిత్వ పుటలను కొన్నింటిని మీ ముందుంచే ప్రయత్నం చేస్తున్నాను.



**అంబటి వెంకన్న**

ఈరోజుల్లో చాలా మంది మైకందుకొని మహా ప్రసంగం చేసేవాళ్ళంత, మేము చెప్పేవాళ్ళమే గాని, చేసేవాళ్ళం కాదు అన్నట్టు కనపడతరు. అదే విధంగా ఎక్కడికక్కడ చత్రాలు భిగించుకొని, మేం విశ్వకవులం, మాకు ఎల్లలేందనే భ్రమల్లో బతుకుతున్న సాహితీవేత్తలను చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. మేము రాసేవాళ్ళం–రాగాలుదీసేవాళ్ళమే గాని, ఆచరించేవాళ్ళం కాదు అన్నట్టు ఉంటుంది వాళ్ళ ధోరణి.

కాళోజీ తన అరవై సంవత్సరాల జీవితాన్ని కవితలు రాయడం, ఉపన్యాసాలు చేయడంలోనే గడిపిన కాళోజీ చెప్పిందే చేసి, రాసిందే ఆచరించిన వారిలో అగ్రగణ్యుడు.

విలువల పతనంపై తీవ్రస్థాయిలో ఆగ్రహించిన అసలు సిసలైన మనిషి కాళోజీ. ప్రాణమున్నంత వరకు ప్రజలపక్షమే నిలిచి, శత్రువుకు చెమటలు పట్టించిన అరుదైన వ్యక్తి కాళోజీ. ఎక్కడ కూడ కాళోజీ కవిత్వాన్ని, జీవితాన్ని వేరువేరుగా చూడలేము.

వేమన పద్యం పాడని తెలుగువాడు ఉండనట్టు, కాళన్న కవిత్వం చదవని తెలంగాణవాడు ఉండడనేది అక్షర సత్యం.

ఎందుకంటే కాళోజీ మాటలే కవిత్వం.

ఆయన కవిత్వమే జీవితం.

కాళోజీ గొడవకు కారణం అసమ్మతి.

మనిషిని మనిషిగా చూడని సమాజం పట్ల నిరసన.

కాళోజీ కళ్ళలో శత్రువును శాసించే మెరుపు కదలాడుతుంది. పసివాడు, యువకుడు, వీరుడు, జ్ఞాని ఏక కాలంలో కాళోజీని ఆవహించినట్టు అనిపిస్తుంది. కఠోర సత్యాలను అవలీలగా విశ్లేషించి, మనిషిని క్రాంతి పథంలో పయనింప జేయడమే. అందుకే "బతుకనదగు బతుకు బతుకదలిచినట్టి మనిషి బతుకు తిరుగుబాటు" అంటాడు కాళోజీ. మనిషి సహజంగా ఆలోచించి, స్వంత నిర్ణయానికి రాకుండా ఉండడానికి అనేక ఇజాలు, చాదస్తాలు అడ్డు తగులుతున్నాయంటాడు కాళోజీ.

1941లో "అణాకథలు" మొదలు తెలంగాణ ప్రజల గోడును తన గొడవగా గొంతెత్తిండు. ఆరుగాలం శ్రమించే రైతు అందరి ఆకలి తీర్చినట్టు ఎడతెగని గొడవతో ఎదురు తిరిగిండు. విశాలాంధ్రలో ప్రజారాజ్యం అంటే స్నేహం, ప్రేమ, స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలతో నిండిన తెలుగునేల అవుతుందని ఆశించిండు. అందుకే కాళోజీ "ఎవరనుకున్నారు ఇట్లౌనని" ఆవేదన వ్యక్తం చేసిండు. నిజంగా కరుడుగట్టిన సీమాంధ్రులు తెలంగాణను విలీనం చేసిన వెంటనే వారి నైజాన్ని, దోపిడీతత్వాన్ని బయట పెట్టుకున్నరు.

తెలంగాణ ప్రజల యాస–భాషను, కట్టు–బొట్టును అవమానించడం మొదలు అనేక ఆకృత్యాలకు పాల్పడ్డరు. అందుకే కాళోజీ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగానే ఉండాలని ఆశించిండు. "తెలంగాణ వెలసి నిలుచు భారతాన" అని గట్టిగా విశ్వసించిండు.

మనసులోని భావాలను బహిర్గతం చేయడానికి, మన ఆలోచనలను ప్రకటించడానికి భాష ఎంతగానో ఉపయోగ పడుతుంది. అయితే ఈ భాషకు రెండు తీర్ల భాష్యాన్ని చెప్పిన మహాకవి కాళోజీ. ఒకటి బడి పలుకుల భాష, రెండవది పలుకుబడుల భాష. కాళోజీ తనది పలుకుబడుల భాష అని తానే ప్రకటించడం జరిగింది. మనం చెప్పే విషయం ఏదో అవతలి వాడికి అర్థం కానప్పుడు, అది ఎంత గొప్పదైనా పనికిరానిదే అంటడు కాళోజీ.

తెలుగుభాషకు పుట్టినిల్లు తెలంగాణ. తెలుగు పదాలకు ప్రామాణికమైన ప్రాంతం తెలంగాణ. ఈ విషయాన్ని నిక్కచ్చిగా చెప్పదలచిన కాళోజీ "వాక్యంలో మూడు పాళ్ళు ఇంగ్లీష్ వాడుకుంటు తెలంగాణీయుల మాటలో ఉర్దూపదం దొర్లగానే హిహీ అని ఇగిలించెడి సమగ్రాంధ్ర వాదులను ఏమనవలెనో తోచదు.

'టీ' అంటె తేట తెనుగు, 'చా' అంటే తౌరాక్యము. బర్రె అంటే నవ్వులాట.

గేదంటెనే పాలు. చక్కెర శుగరయ్యి ఉప్పు సాల్టయ్యెను" అంటూ మాటల ఈటెలను విసిరిండు కాళోజీ. తెలంగాణ భాషను భ్రష్టుపట్టించిన విధానాన్ని, తెలుగుతల్లి సృష్టిని తీవ్రంగా విమర్శించిండు కాళోజీ. భాషపేరుతో వచ్చి ఒక్కటైన సీమాంధ్రులు తినిన్నిటి వాసాలు లెక్కపెట్టే నీచులని తేట తెల్లమయింది. తెలుగు భాషంటే తెలంగాణే అని బుద్ధితక్కువ సీమాంధ్రులకు అర్థమయ్యేటట్టు చెప్పడం కోసం, వాళ్ళ తెలుగులోని తెగులును, వ్యాకరణ దోశాలను విడమరిచి చెప్పిండు కాళోజి. అయితే ఒక్కమాటలో "వచ్చింది" అన్న పదం స్త్రీలింగం అయినపుడు, అది పురుషలింగంలో "వచ్చిండు" కావాలి తప్ప "వచ్చాడు" ఎట్లయితదని ఆంధ్రభాషా పండితులను ప్రశ్నించిన ధీరుడు కాళోజీ.

"మైత్రి, అది అక్కెర తీర్చుకోవడానికి వేసే వల కాకూడదు. జీవిత విధానం కావాలి"అంటాడు కాళోజీ. ఒక మనిషి జీవితంలో ఏవిధమైన మార్పు రావడానికైన మొదట తల్లి, ఆ తర్వాత తండ్రి ప్రభావమే ఉంటుందని అంటారు ఎంతటి మనో విజ్ఞానవేత్తలైన. మరి మనిషి ఎదుగుదలతో పాటు గుణ గణాలలో వచ్చే మార్పులలో జన్యు ప్రభావం ఉంటుందా? పరిసరాల ప్రభావం ఉంటుందా? అనే తాత్విక ధోరణిలోకి వెళ్ళాల్సిన సంధర్భం ఇదైతే కాదు కానీ, జన్యువులు, పరిసరాలు రెండింటి ప్రభావంతో ఒక మహోన్నతమైన వ్యక్తిగా ఎదిగిన ప్రజాకవి, రచయిత, రాజకీయ నాయకుడు ఒకటేమిటి, ఒక మనిషి స్వేచ్ఛగా, స్వతంత్రంగా బతకడానికి స్నేహం, ప్రేమ, ఆత్మీయత, అనురాగాలతో ఆనందంగా జీవించడానికి అనువైన ప్రతిదాన్ని అన్వేషించిన తపస్వి–తెలంగాణ స్వాప్నికుడు కాళోజీ.

కాళోజీ ఖలీల్‌జిబ్రాన్, సానే గురూజీల రచనలను తెలుగులోకి అనువదించడం జరిగింది. స్త్రీలు, శ్రమజీవులు, మానవత్వం, మనిషితనం, నీతి, నిజాయితీ, భారతజాతి పట్ల కాళోజీకి ఉన్న అపారమైన గౌరవాన్ని మనం వీటిలో చూడవచ్చు. కాళోజీ "నా గొడవ" కు రాసిన ముందుమాటను పరిశీలిస్తే మొత్తంగా కాళోజీ జీవితం మన కళ్లముందే

కదలాడుతుంది. మనని బతికినంత కాలం మనిషిగా బతకమని శాసిస్తున్నట్టు అనిపిస్తుంది. "ఎట్ల జీవించాలని కోరిక. సంతసముగా జీవింపగ సతతము యత్నింతు గాని, ఎంతటి సౌఖ్యానికైనా ఇతరులను పీడింపలేను" అంటాడు కాళోజీ.

అమాయకులను మోసంచేసి బతికేవాళ్ళు కొందరైతే – అమ్మను మరిచి హాయిగా బతికేవాళ్ళు మరికొందరు. ఆత్మగౌరవాన్ని అమ్ముకునేవాళ్ళు కొందరైతే– ప్రజాఉద్యమాన్ని తాకట్టుపెట్టి పదవులను పొందేవాళ్ళు మరికొందరు. అనేక వైరుధ్యాల నడుమ మనిషి మనిషిగా బతకడమే దుర్లభం అయిపోయింది. ఎవరు ఏమైపోయినా మన ప్రతి కదలికలో జీవం ఉండాలి. మన బతుకు శాశ్వతమైన జీవితం కావాలి. అనే అతి సూక్ష్మమైన విషయమేదో కాళోజీ కవితా పాదాలలో కనిపిస్తుంది. ప్రాణం–జీవం రెండింటి మధ్య పెద్ద తేడా ఏమున్నది. ఏమి లేదనే అనిపిస్తుంది. ఎవరికైనా ఏదో ఉందని కూడా అనిపిస్తుంది కొన్నిసార్లు.

సమాజంలో తన కండ్లముందు జరిగే సంఘటనను చూసి ఏదో రూపంలో స్పందించని వాడు మనిషైతే కావచ్చు కాని జీవం లేని వాడే. ప్రాణం తను కదలడానికి మాత్రమే పనికొస్తుంది. జీవం పదిమందిని కదిలిస్తుంది. తన చుట్టూ ఉన్న సమాజాన్ని మేలుకొలిపే ప్రయత్నం చేస్తుంది. ఆ జీవితమే ఎందరికో స్ఫూర్తిని ఇస్తుంది. భావి తరాలకు జీవం పోస్తుంది. అలాంటి అరుదైన జీవితం కాళోజీది. ఈ భూమ్మీద ఎంతోమంది బతకొచ్చు కానీ జీవించలేరు. బతకడం వేరు. జీవించడం వేరు. బతకడానికి, జీవించడానికి మధ్య విశిష్టమైన విభజన రేఖ ఏదో ఉన్నది. అందుకే "మనదీ ఒక బతుకేనా సందులలో పందులవలె" అంటాడో కవి. కాని కాళోజీ మాత్రం ఏ బతుకు బతికితే నీ జీవితం సఫలం అవుతుందో, ఏ బతుకు బతికితే ఈ సమాజం హాయిగా వికసిస్తుందో చెప్పిండు.

"గుమ్మడి పూలు పూయగ బతుకు/ తంగెడి పసిడి చిందగ బతుకు/ గునుగు తురాయి కులుకగ బతుకు/ కట్ల నీలిమలు చిమ్మగ బతుకు/ అమ్మను మరవని సంతానము కని/ బతుకమ్మా బతుకు" అంటాడు. మానవత్వం పరిమళించేలా, త్యాగ నిరతి వికసించేలా, ఆట–పాటలతో అందంగా హాయిగా బతుకు. కన్నతల్లిని మరువక బతుకు. నీకున్నదేదో నలుగురికి పంచు. నాలుగు కాలాలు జీవించు అంటాడు. మనిషి జీవన తత్వాన్ని అద్భుత దృశ్యకావ్యం చేసిన  మహాకవి కాళోజీ.

కాని ఇప్పుడు ముసలి తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో చేర్పించి చేతులు దులుపుకునే కొడుకులున్నరు. ఇయ్యాల వృద్ధాశ్రమాలు, అనాథ ఆశ్రమాలు పెరుగుతున్నయంటే మానవ సంబంధాలు దెబ్బతింటున్నయని వేరే చెప్పవలసిన అవసరం లేదు. మనుషులు మనుషులుగా కాకుండ మాయా ప్రపంచంలో రంగుల ఊహల్లో రాజ్యమేలుతుండ్రని అర్థం.

నీ బతుకు బతుకైతే, నువ్వు నిజంగా కన్నతల్లిని మరువని సంతానమే అయితే, సూర్యచంద్రులు, సుక్కలతోపాటు, కాలచక్రంతో కలిసి కదులుతూనే ఉంటావు అనేదే కాళోజీ

జీవిత సత్యం. తన పదహారవ ఏటనే కాళోజీ ప్రిన్సిపాల్‌ని ఎదిరించి అనుకున్న కార్యం సాధించిండు. ఆ తర్వాత శిక్షను అనుభవించిండు. కాళోజీకి బాల్యం నుంచే తిరగబడే తత్వం ఎక్కువ. తన సహజ స్వభావంతో 1969 నవంబరు 1న వరంగల్ పోచమ్మ మైదానంలో తెలంగాణ జెండ ఎగరవేసిండు. 1996లో "ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ మహాసభ" వేదికకు బాంబు బెదిరింపులు వచ్చినా, ధైర్యంగా అందరికంటే ముందు తానే సభా వేదికిపైకి చేరి సవాలు విసిరిన ధీశాలి.

మీకు దమ్ముంటె "ముందు నాపైనే బాంబు వేయండని" గర్జించిన ప్రజా సింహం కాళోజీ. ఒకరు చేసేది ఇంకొకరికి తప్పు అనిపించ వచ్చు. ఒకరికి హాయినిచ్చేది మరొకరికి బాధ కలిగించొచ్చు.

కానీ కచ్చితంగా ఇది తప్పుఅని, ఇది ఒప్పు అని చెప్పడం క్లిష్టమైనదే. అందుకే వాటిని సరిదిద్దడం సాధ్యమయ్యే పని కాదంటడు.

అట్లని ఎదుటివాని కష్టాన్ని చూస్తూ తాను సంతోషంగా ఉండలేనని కూడ అంటడు. అందుకే "అవనిపై జరిగేటి అవకతవకలు చూసి ఎందుకో నా హృదిని ఇన్ని ఆవేదనలు, పరుల కష్టం చూసి కరిగిపోవును గుండె, మాయ మోసం చూసి మండిపోవును ఒళ్ళు" అంటాడు కాళోజీ.

మనిషి అంతర్గతాన్ని తొలిచే అనేక ప్రశ్నలకు సమాధానం కాళోజీ. అందుకే "చిరకాలం బతకాలని ఉండగా చావొస్తే ఎట్లా అని కాదు నా ప్రశ్న. అనుక్షణం చావుకై నిరీక్షిస్తూ బతకడం ఎట్లా అన్నది నా ప్రశ్న. పరిస్థితులు ఎట్లా ఉన్నాయన్నది కాదు. ఉన్న పరిస్థితుల్లో మనం ఎట్లా ఉన్నామన్నదే" అంటడు కాళోజీ.

1975 ఎమర్జెన్సీ టైంలో కాళోజీ రాసిన ఒక చిన్న కవిత మొత్తం కాళోజీ వ్యక్తిత్వాన్నే మనకు అవగతం చేస్తుంది. భైరాన్ కవితా పాదాలను కోడ్‌చేస్తూ తనలోని అసహనాన్ని వెళ్ళగక్కిన వైనం ఎంతోమంది ఉద్యమకారులకు ఒక మేలుకొలుపు. ఎప్పటకప్పుడు తనను ఆత్మ విమర్శ చేసుకుంటూ సమాజాన్ని తూర్పారబట్టడంలో దిట్ట కాళోజీ. "నేను ఒలకబోసిన సిరా సీసాలకొద్ది కాదు, పీపాల కొద్దీ. ఏ ఒక్క మెదడు కదిలినట్లు లేదు. మొదట నా మెదడులో ఉంటేగా కదలిక, మరొకన్ని కదిలించ" అంటాడు.

వివిధ సంధర్భాలలో అనేక సంఘర్షణలకు లోనైన, కాళోజీ జీవితమే కవిత్వంగా, కవిత్వమే ప్రాణంగా కడవరకు బతికిన మహామనీషి.

కాళోజీ కండ్లు సైతం కవిత్వాన్ని ఒలికిస్తయి అని చెప్పడానికి 1961లో కాళోజీ రాసిన "చెమ్మగిల్లిన కన్నులలో కమ్మలెన్నో చదివాను. నలుగురి వలె మనము కూడా వెలితిపడుట తగదు తగదు. కల్తిలేని ప్రేమ మనది. కలకాలం మనగలదు". అనడంలో కాళోజీ ఓర్పును, సహనాన్ని గమనించవచ్చు.

స్వచ్ఛమైన తెలంగాణ మట్టి తత్వాన్ని మనం కళోజీలో చూడవచ్చు.

వెలితిపడటం, వెకిలిగా మాట్లాడటం ఈ నేల స్వభావం కాదంటడు. సరిగ్గా తెలంగాణ ప్రకటన వెలువడిన తర్వాత సీమాంధ్రులు చేస్తున్న, ప్రవర్తిస్తున్న తీరు వాళ్ళ వెలితి గుణానికి అద్దం పడుతుంది. అది ఎ.పి.ఎన్.జి.ఓ.ల సభ కావొచ్చు. సీమాంధ్రుల మాటలు కావొచ్చు.

జగన్ సమైక్య శంఖారావం కావొచ్చు. ఒక అజ్ఞాని అంధకారంలో నిలబడి అధికారం కోసం అర్రులు చాచినట్లు అనిపిస్తుంది తప్ప, వాళ్ళ ఏ ఒక్క మాటలోను నిజాయితీ లేదు.

ఒక్కనికి వాళ్ళ సమస్యల పట్ల స్పష్టమైన అవగాహన లేదు. పైగా సీమాంధ్రులు హైద్రాబాద్ నడిబొడ్డున ఎల్.బి. స్టేడియంలో నిర్వహించిన రెండు సభల్లోను తెలంగాణ బిడ్డల మీద దాడులు చేసింద్రు. 'జై తెలంగాణ' అన్న కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను, దూదిమెట్ల బాలరాజును అమానుషంగా కొట్టడం జరిగింది. కానీ అరవై సంవత్సరాల సుదీర్ఘ తెలంగాణ ఉద్యమంలో ఎక్కడా సీమాంధ్రులకు ఒక చిన్నచీమ కూడా కుట్టిన సంధర్భం లేదు.

తెలంగాణ గడ్డమీద కాసోజు శ్రీకాంతాచారి, యాదన్న లాంటి వేలాదిమంది వీరులు ఆహుతయ్యింద్రు. ఆత్మబలిదానాలు చేసుకున్నరు తప్ప, ఏ ఒక్కరికి ఎలాంటి హానీ తలపెట్టలేదు.

తెలంగాణది ఒక ధర్మబద్ధమైన పోరాటం.

ప్రజాస్వామిక ఆకాంక్షతో, రాజ్యాంగబద్ధంగా ఉద్యమించి రక్తసిక్తమైన త్యాగాలపురిటిగడ్డ. అందుకే అడుగడుగునా ప్రకృతి సైతం ఈ ఉద్యమానికి అండగా నిలుస్తుంది.

అడ్డంకులను అధిగమించడంలో నాలుగుకోట్ల ప్రజలతో కలిసి నడుస్తుంది.

తన వంతు సాయాన్ని అందిస్తుంది.

"హింస తప్పు, రాజ్యహింస మరీ తప్పు, ప్రతిహింస తప్పు కాదు" అంటాడు కాళోజీ.

అంతటితో శాంతించకుండ "నేను పిరికితనం కన్నా హింసను సమర్థిస్తాను" అంటాడు.

"గుండె మండిపోతుంటే, బతుకు చితికిపోతుంటే, ఎముక విరిగిపోతుంటే ఇంకెక్కడి శాంతి" అంటూ తిరుగుబాటు జెండాను ఎగరేసిండు కాళోజి. మనిషిని యుద్ధోన్ముఖున్ని చేసి లక్ష్యసాధన వైపు నడిపించిండు.

సరిగ్గా ఇలాంటి సంధర్భంలో స్వేచ్ఛ, సమానత్వం, స్నేహం, న్యాయం, శాంతి, యుద్ధం కోరుకునే సరికొత్త విప్లవకారుడిలా కనిపిస్తడు కాళోజీ.

ఆ మహనీయుడు ఇచ్చిన స్ఫూర్తితో ఇంచు భూమిని ఇడువకుండా, హైద్రాబాద్‌తో కూడిన పది జిల్లాల తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుందాం.

అదే కాళోజీకి మనమిచ్చే అసలు సిసలైన నివాళీ...



ప్రపంచ
సీమాంధ్ర
తెలుగు



# మహాసభలను బహిష్కరిద్దాం
# తెలంగాణ సాహిత్య చరిత్రను ప్రపంచానికి చాటుదాం

మనిషి మస్తిష్కంలో జరిగిన భావ సంఘర్షనే శబ్దం. అనేక శబ్దాల కలయికే అక్షరం. అక్షరాల కలయికే పదం. పదాల సమాహారమే పాదం. లయబద్ధమైన పాదాల నడకే రాగం. ఆ రాగమే పాట. శబ్ధానికి మనిషిని మేల్కొలిపే గుణమున్నది. మనిషి అంతరాల్లోని మనసును పరవశింపజేసే లక్షణం ఆ పాటకున్నది. అక్షరాల పొందికను బట్టి, పదాల అల్లికను బట్టి ఇది సాధ్యమవుతుంది. పద్యము, పాట కన్న ముందు పుట్టింది పదమే . ప్రతి మనిషి తనకు ఆనందం కలిగినపుడు చిందులు వేస్తూ కూని రాగం తీస్తాడు. ఎక్కడైనా పదసాహిత్యమే మొదలు అనే విషయాన్ని దాదాపు అందరూ ఏకీభవించిండ్రు. అట్లాంటి పద సాహిత్యానికి పుట్టినిల్లు మన తెలంగాణ. జాజర పాటలకు, పేరిణి నృత్యాలకు నిలయమైనదీ నేల. అన్నమయ్య జాజర పాటలు తెలంగాణ జాజర పాటలకు సంబంధించినవేనని ఎంతో మంది పండితులు అభిప్రాయపడ్డరు. ఒకానొక సమయంలో ఆంధ్ర బ్రాహ్మణుడు మంచనశర్మ తన చెలికాడు టిట్టిభశెట్టితో కలిసి ఓరుగల్లు పట్టణానికి విచ్చేసి ఈ ప్రాంతపు సాహిత్య, చారిత్రక వైభవాన్ని చూసి అనేక పద్యాలు పాడినట్లు తెలుస్తుంది. నాగరికత ప్రారంభానికి ముందే నాట్యం పుట్టినట్లు అనేక చరిత్ర పుస్తకాల ఆధారంగ మనం తెలుసుకున్నం. పగలంత కష్టపడిన మనిషి రాత్రి వేళలందు ఆట పాటలతో సేదతీరడం, నలుగురు ఒక చోట గుంపుగా చేరి నృత్యం చేయడం మనం చూస్తం. ఇట్ల మొదలైన పాట క్రమంగా ఆయా పనులు చేసేటపుడు పనిలో భాగమై ఆ శ్రమ జీవులతో కలిసిపోతుంది. ఆ పనుల్లో వారి అలసటను మరిపింప జేస్తుంది పాట. అవే దంపుడు పాటలు. రోకటి పాటలు. శ్రామిక గేయాలని అనేక రకాలుగా విభజింపబడినాయి. జానపద గేయానికి మౌఖిక ప్రచార లక్షణం ఎక్కువ, కాబట్టి అది ఎన్ని తరాలైనా మనుషుల నాలుకల మీద నాట్యం చేస్తూనే ఉంటుంది. లయ ప్రధానంగా సాగే ఈ పాటల్లో ప్రతి పాదానికో లేదా రెండు మూడు పాదాలకో ఒక వాక్యం పునరావృతం

అవుతుంది. అది క్రమంగా పల్లవిగా, అనుపల్లవిగా మారి జానపద పాటతో వేరుపడి మరో కొత్త రూపాన్ని సంతరించుకుంది. వివిధ సాహిత్య ప్రక్రియల్లో పాటకు, పద్యానికి ప్రత్యేక స్థానం ఉన్నది.

## మన సాహిత్య చరిత్ర:

తెలంగాణ సాహిత్యంలో కాకతీయుల కాలాన్ని స్వర్ణయుగంగా చెప్పుకోవచ్చు. ఒక్క తెలంగాణలోనే కాదు మొత్తం తెలుగు సాహిత్యంలోనే స్వతంత్ర రచన చేసిన పాల్కురికి సోమనాధుడు(1160–1240) ఆదికవిగా అవతరించవలసిన అవసరం ఉంది. దేశీయ భాష, నుడికారం, చంధస్సును తీసుకొని తెలుగు భాషకు ఒక స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించిన కవి. అదేవిధంగ కాకతీయుల కాలంలోనే మరొక గొప్ప కవి గోన బుద్దారెడ్డి (1300ల ప్రాంతం) రంగనాధ రామాయణం'. ఎంతో ప్రసిద్ధి చెందిన భారత, భాగవత, రామాయణాల్లో భాగవతం, రామాయణం రెండు తెలంగాణ వారిచే రచించబడటం గర్వించదగిన విషయం.

తెలుగులో చంపువుగా వచ్చిన మొదటి రామాయణం భాస్కర రామాయణం. ప్రతాపరుద్రుని ఆస్థాన కవియైన హుళక్కి భాస్కరుడు, తన కుమారుడు మల్లికార్జున భట్టు, శిశ్యుడు రుద్రదేవుడు ఈ రామాయణ రచన గావించినట్లు, ఆ తర్వాత మిగిలిన భాగాన్ని నల్లగొండ జిల్లా వాసియైన అప్పయార్యుడు పూర్తిచేసినట్లు తెలుస్తుంది. యావద్భారత ఖ్యాతినార్జించిన సింగ భూపాలునిచే ఘనంగా సత్కరించబడిన మల్లినాధ సూరి మెదక్ జిల్లా కొలిచెలిమ వాసి. క్రీ.శ. 14,15 శతాబ్దాలకు చెందినవాడు. ఈయన అభిజ్ఞానశాకుంతలం, మేఘసందేశం వంటి మహా గ్రంధాలకు వ్యాఖ్యానాలు రాసి జగత్ప్రసిద్ధి గాంచిండు. అదేవిధంగా రాచకొండ నివాసియైన గౌరన (1380–1450) మరో గొప్ప కవిగా వెలుగొందిండు. నల్లగొండ జిల్లాకు చెందిన ఏర్చూరి సంగన (1450) కువలయాశ్వ చరిత్రను రచించిండు. రమాధీశ్వర శతకం నాగేంధ్ర కవి (1400) భువనగిరి ప్రాంత వాసి, పాలుర్కి తర్వాత ద్విపదను స్వీకరించి హరిశ్చంద్రోపాఖ్యానం రచించిండు. నల్లగొండ జిల్లాకు చెందిన పాల్కురికి సోమన వేయి సంవత్సరాల క్రితమే ప్రత్యామ్నాయ తాత్విక, సాంస్కృతిక సిద్దాంతాన్ని ప్రతిపాదించిండు. వైదిక మతాన్ని వీరశైవంతో ప్రశ్నించి రాజాస్థానాన్ని చాపకూడుతో ధిక్కరించిన ఘనుడు. సంస్కృత చందాన్ని దేశి చంధస్సుతో నిరాకరించిండు. శార్ధూలాలు, మత్తేభాల స్థానంలో ద్విపదను నిలబెట్టిండు. పండితారాధ్య చరిత్ర, బసవపురాణం అనే వీరశైవ గ్రంధాలను ద్విపద చందస్సులో రాసిండు. తెలుగు ప్రజా సాహిత్యానికే ఆధ్యుడు పాల్కురికి సోమన. తెలుగులో మొట్టమొదటి శతకం 'వృషాదిప శతకం'. అయినా ఎక్కడా ఆ జాడ కానరాదెందుకు? దిగంబర కవుల్లోని నిఖిలేశ్వర్, చరబండరాజు నల్లగొండ వాళ్ళే.హరిభట్టు ఖమ్మం 1475–1535, రతిరహస్యం, వరాహా పురాణం, మత్స్యపురాణం, నరసింహ పురాణాలు రచించిండు. పాల్కుర్కి తర్వాత తెలంగాణ సాంఘిక జీవితాన్ని వర్ణించిన కవి కొరవి గోపరాజు 1470

'సింహాసన ద్వాత్రింశిక" తొలి కవయిత్రి గంగాదేవి మధురావిజయం 1370, కాకతీయుల ఆడబిడ్డ తెలుగులో మొదటి సంస్కృత కవయిత్రి. తొలి తెలుగు చరిత్రకారుడు ఏకామ్రనాథుడు ఓరుగల్లుకు చెందినవాడు. ఈయన ప్రతాపరుద్ర చరిత్రము (1490-1590) తో పాటు 'ద్వాత్రింశత్సాలభంజికల కథలు' అనే గ్రంథాన్ని రాసిండు. 'ప్రతాపరుద్రచరిత్రము' తెలుగులోనే మొట్టమొదట వచ్చిన చారిత్రక గ్రంథంగా చెప్పుకోవచ్చు. దాశరథి, భాగి నారాయణ మూర్తి, వెల్దుర్తి మాణిక్యరావు, వానమామలై వరదాచార్యులు, కణ్వశ్రీ లాంటి ఎందరో కవులకు పుట్టినిల్లు మన తెలంగాణ.

## తెలంగాణ సాహిత్యం మీద సీమాంధ్రుల వివక్ష:

క్రీ.శ. 940 ప్రాంతం నాటికే 'కుర్క్యాల' శాసనంలో మొదటి సారిగా పద్యాలు లభించినట్టు వీటిని పంపకవి సోదరుడైన జినవల్లభుడు రచించినట్లు తెలుగు చరిత్ర పరిశోధకులు అంటున్నరు. జినవల్లభుని మిత్రుడైన మల్లియరేచన తెలుగులో మొదటి లక్షణ గ్రంథం 'కవిజనాశ్రయం' రచించినట్టు తెలుస్తుంది. అంటే అప్పటికే తెలుగు లక్షణ గ్రంథం రాయవలసిన అవసరం ఏర్పడిందంటే ఇంకా ఎన్నో కావ్యాలు గ్రంథ రూపంలో వెలివడినట్టు మనం అర్థం చేసుకోవచ్చు. కాని వాటి జాడ ఎక్కడా కానరాదు. ఓరుగల్లుకు చెందిన పోతనను, మహబూబ్‌నగర్‌కు చెందిన అప్పకవిని, నిజాంబాద్ (బిక్కనవోలు) దోమకొండ ఆస్థానకవి కామినేని మల్లారెడ్డిలను తమ ప్రాంతం వారుగా వలసాంధ్రులు ప్రచారం చేసుకున్నరు. తెలంగాణ వాళ్ళు ఎంత బలంగా ప్రతిఘటించినా, ఎన్ని సాక్ష్యాలు, ఆధారాలు చూపించినా ఫలితం లేకుండ పోయింది.

1865లోనే ఎన్నో సాంఘీక దురాచారాలకు వ్యతిరేఖంగా పోరాడిన సంఘ సంస్కర్త రాజా రామేశ్వర రాయలను విస్మరించి నేటికీ ప్రథమ సంఘ సంస్కర్తగా ఆంధ్ర ప్రాంతానికి చెందిన కందుకూరి వీరేశలింగం పంతులును చూపిస్తున్నరు. తెలుగు సాహిత్య చరిత్రలో తొలి యక్షగానం "సారంగధర చరిత్ర" సర్వజ్ఞ పద్మనాయక భూపాలుడు ఉండడానికి బదులుగా పోలుగంటి చెన్నశౌరి రచించిన 'సౌబరిచరితం' మొదటి యక్షగానంగా విరాజిల్లుతున్నదంటే ఇది కుట్ర కాదా. సీమాంధ్ర పాలకులకు తెలంగాణ పట్ల వివక్ష లేదా? మద్రాసు రాష్ట్రంలో ఇమడలేని కోస్తాంధ్రులు తెలుగుభాష పేర తెలంగాణ వనరుల్ని కొల్లగొట్టాలనే లక్ష్యంతో విలీన కుట్రకు తెర తీసింద్రు. అండ్ల ఎట్లాంటి అనుమానం లేదు. కచ్చితంగా తెలంగాణ చారిత్రక, సాంస్కృతిక సంపదను దోచుకునే ప్రయత్నంలో వారు అధర్మ విజయం సాధించింద్రు.

వలసాంధ్రుల దమన నీతిని, సాహిత్య కుట్రలను సురవరం ప్రతాపరెడ్డి ఆనాడే ధీటుగా ఎదిరించిండు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడక ముందే తెలుగులో తొలి సాహిత్య అకాడమీ అవార్డు (1955) అందుకున్న సురవరం ప్రతాపరెడ్డి ఘనతను తెలంగాణ సాంస్కృతిక

చరిత్రను అణిచిపెట్టే ప్రయత్నం చేసింది. తెలుగు భాషకే గర్వ కారణమైన సురవరం ప్రతాపరెడ్డిని కూడా ఈ సీమాంధ్ర ప్రభుత్వం విస్మరించింది. హైద్రాబాద్ నడిబొడ్డున నాంపల్లిలో ఏర్పాటు చేసిన తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు పెట్టి తెలంగాణ ప్రజల్ని, మొత్తం సాహిత్య లోకాన్ని ఘోరంగా అవమానించింది. ఈ అవమానాలు ఈ నాటివి కావు. ఆచార్య కురుగంటి సీతారామయ్య, "నవ్యాంధ్ర సాహిత్య వీధులు" అనే గ్రంథంలో ఎక్కడా తెలంగాణ సాహిత్య విషయ ప్రస్తావన లేదు. 250 సంవత్సరాల పైచిలుకు చరిత్ర కలిగి, మైసూరు మహారాజుల మెప్పు పొందిన గద్వాల సంస్థాన కవిపండితుల చర్చలేదు. చరిత్ర లేదు.

నవ్య సాహిత్య పరిషత్తును గురించి చెపుతూ "ఎనిమిదవ సాహిత్య సభ హైద్రాబాద్‌లో నిర్వహించవలసి ఉండగ అక్కడి వారిలో ఉండే గర్భశౌత్యాల వల్ల జరుగలేదు" అన్నాడట. అంటే సీమాంధ్రుల అహంభావం ఎట్ల ఉంటుందో అనడానికి ఇదొక మచ్చుతునక మాత్రమే. ఈ విధంగ సీమాంధ్రులు ఏ విషయాన్నయిన ఎట్ల మసిబూసి మాయం జేస్తరో మనం గ్రహించ వలసిన అవసరం ఉన్నది.

ఏది ఏమైనా ఉబుసుపోని కబుర్లకు ఊతమీయకుండా నిజమైన సాహిత్యాన్ని సృజించింది ముమ్మాటికి తెలంగాణ వాళ్ళేనన్నది స్పష్టం. తెలుగు భాషను బతికిస్తున్నది కూడా తెలంగాణ కవులు రచయితలు తప్ప సీమాంధ్రులు కాదు. జానపద గేయ సాహిత్యాన్ని అప్పటికీ, ఇప్పటికీ బలంగా నిలబెడుతున్న వాళ్ళు కూడా తెలంగాణ వాళ్ళే. అభ్యుదయ కాలంలో ఆంధ్ర ప్రాంతం నించి నాజర్ వస్తే ఇక్కడినుండి సుద్దాల హన్మంతు, బండి యాదగిరి, రాజారాం లాంటి వాళ్ళు ఇంకా ఎందరో ఉన్నరు.

విరసం కాలంలో ఆంధ్ర నుంచి వంగపండు వస్తే ఇక్కడ నుంచి గద్దర్, గూడ అంజన్న, గోరటి వెంకన్న, అందెశ్రీ వంటి వాగ్గేయకారులెందరో ఉన్నరు.

1944 వరకు హరికథలు చెప్పుకుంటూ తిరిగిన సుద్దాల 1945 తెలంగాణ సాయుధ పోరాట ప్రభావంతో నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాటలు కైగట్టి పాడడమే కాకుండా, తుపాకి పట్టి ప్రత్యక్ష పోరాటం చేయడం జరిగింది. బండి యాదగిరి దొరలు భూస్వాముల దౌర్జన్యాలను ప్రత్యక్షంగ ఎదుర్కొంటు తన పాటల ద్వార పల్లెను చైతన్యం చేసిండు. బండి యాదగిరి అనేక పాటలు రాసినప్పటికి "బండెనుక బండి కట్టి పదహారు బండ్లుకట్టి" అనే పాటతో తెలంగాణ సాయుధ పోరాటంలో నిలిచిపోయిండు. తెలంగాణ గోర్కీగా పిలువబడే ప్రజల మనిషి వట్టికోట ఆళ్వారు స్వామి(1915-61) వారసత్వం జిల్లాలో కొనసాగుతనే ఉన్నది. వట్టికోట 1940లో "గంగు" నవల, 1944లో "చిన్నపుడే" కథ, 1955లో "ప్రజలమనిషి"తో పోరాటానికి నిలువెత్తు గుండె ధైర్యంగా నిలిచిండు. కాంచనపల్లి చిన వెంకటరామారావు అరుణరేఖలు(1955) కవితా సంకలనం, "మన ఊళ్ళో కూడానా"

కథల సంపుటిలో తెలంగాణ సాయుధ పోరాటాన్ని చిత్రించిన తీరు అమోఘమైనది. గెరిల్లా పోరాట యోధులు, రచయిత ఆవుల పిచ్చయ్య 1946–48ను ఏనాటికి మరిచిపోలేం. శ్రీనాథున్ని మించిన కవిగా పేరున్న సర్వజ్ఞ సింగభూపాలుని సాహిత్య కృషి చెప్పనలవి కానిది.

## తిరుపతిలో సీమాంధ్ర తెలుగు మహాసభలు:

సీమాంధ్ర ప్రభుత్వం డిసెంబర్‌లో "ప్రపంచ తెలుగు మహాసభల" పేర నిర్వహించ తలపెట్టిన సభలు కేవలం సీమాంధ్ర తెలుగు మహాసభలు మాత్రమే. ఎందుకంటే ఎక్కడైనా ప్రపంచమంటే వివిధ దేశాల ప్రతినిధులు ఇక్కడికి రావడం చూశాం కాని, ఇక్కడి నుండి పోయిన ఆంధ్రవాళ్ళు, ఎక్కడో అమెరికాలోనో, ఆస్ట్రేలియాలోనో లేదంటే మన దేశంలోని ఇతర రాష్ట్రాలలోనో ఉన్న వాళ్ళందరిని ఒక కాడికి చేర్చి, అవే ప్రపంచ తెలుగు మహాసభలంటే ఎట్లా? ఇంకా ఎంత కాలం ఈ అన్యాయం? పైగా చరిత్ర పుట్టిన నాటి నుండి నేటి వరకు ఎక్కడా చూసినా తెలుగు భాషను బతికిస్తున్న ఘనత తెలంగాణ వాళ్ళది. సాహిత్యంలోని అన్ని ప్రక్రియల్లో కూడా ఆది అయిన వాళ్ళు తెలంగాణ వాళ్ళు. అలాంటి మహా చరిత్రను మరుగు పరిచి, అనేక కుట్రలతో అనాదిగా తెలంగాణకు అన్యాయం చేస్తనే ఉన్నరు. 900 వందల సంవత్సరాల చరిత్ర కలిగిన కాకతీయులను, వారి చరిత్రను విస్మరించిన ఈ సీమాంధ్ర ప్రభుత్వం రాయల ఉత్సవాలను మాత్రం అత్యంత ఘనంగా నిర్వహించుకుంది. తెలంగాణ సాహిత్య చరిత్రను ఈ ప్రపంచానికి చెప్పకుండా, తెలంగాణ ఉనికి లేకుండా చేయాలని చూసే సీమాంధ్ర ఎత్తుగడలు ఇంకా అర్థం కావనుకోవడం పొరపాటు. తెలుగు భాష పేరిట, సాహిత్యం పేరిట తెలంగాణ ఉద్యమాన్ని మసిబూసి మారేడుకాయ చేయాలన్న తలంపుతో ఈ ప్రభుత్వం ఉన్నట్లు అన్పిస్తుంది. ఎంత నిర్బంధానికి గురిచేసైనా, తెలాంగాణ ఉద్యమాన్ని, ఉద్యమకారులను ఉక్కుపాదంతో అణిచివేసి అనేక సభలు (ప్రపంచ జీవ వైవిధ్య సదస్సు) హైద్రాబాద్‌లోనే నిర్వహించిన ఈ సీమాంధ్ర ప్రభుత్వానికి ఇప్పుడు ఏ "గర్భశౌత్యల్యం" ఆవహించింది. అంటే ఖచ్చితంగా అది తెలంగాణ ఉద్యమ ప్రభావమే. తెలుగంటేనే తెలంగాణ అని ఎక్కడ అంగీకరించవలసి వస్తుందోనని వాళ్ళ భయం. తెలుగు పదానికి, పాదానికి జీవం పోసిన ఈ తెలంగాణను విస్మరించిన ఈ "ప్రపంచ తెలుగు మహా సభలను మేము బహిష్కరిస్తున్నాం" తెలంగాణ గడ్డమీద పుట్టిన ఏ ఒక్క బిడ్డ కూడా తెలంగాణ ఉనికినే ప్రశ్నార్థకం చేసే ఈ కుట్ర పూరిత తెలుగు సభలను ఆహ్వానించడు. అట్ల ఎవరైనా చేసిన పక్షంలో తల్లిపాలు తాగి రొమ్ముగుద్దిన చందమే నని భావించక తప్పదు. ఈ సభల్లో ప్రపంచలో వివిధ ప్రాంతాలలో బతికే సీమాంధ్రులు ఉన్నరు.

వాస్తవానికి అక్కడ తెలుగు లేదు.

వాళ్ళకు ఎవరికీ తెలుగు పలకడం కూడా సరిగ్గా రాదు.

వాళ్ళంతా బ్రిటీషాంధ్రులు, అంతా వలసవాద దొపిడికి అలవాటు పడ్డ ఆంగ్లేయుని వారసులు. వాళ్ళది మొదటి నుంచి మమ్మీ, డాడీల సంస్కృతి.

ఈ సీమాంధ్ర పాలకుల కుట్రల వల్ల తెలంగాణ జిల్లాలోని అనేక కళారూపాలు అడుగంటి పోతున్నయి. మన చరిత్రను, మన కళల్ని పరిరక్షించుకునే మార్గం లేదు. అనేక గొప్ప సాహిత్య, చారిత్రక వారసత్వ సంపద మాయమైపోతుంది. కవులు, రచయితలకు ఆదరణ లేక ఆకలి చావులు చచ్చే కాలం వచ్చింది. అదే సీమాంధ్ర కవులు పనికి మాలిన చెత్త సాహిత్యంతో అనేక అవార్డులు, పురస్కారాలు, పొందుతున్నరు. తెలంగాణ కవులు, కళాకారులకు సరైన ప్రాధాన్యత లేక తెలంగాణ సాహిత్యం (కథ, కవిత, నవల, పాట) చిన్న చూపు చూడబడుతుంది. తెలుగు భాష పరిరక్షణ పేర జరిగే ప్రతి కార్యక్రమంలోను తెలంగాణకు మొండిచేయి మాత్రమే మిగులుతుంది. అనాదిగా ఇక్కడి కవులు, రచయితలకు అవమానమే ఎదురైతుంది. ప్రపంచ జీవవైవిధ్య సదస్సును పట్టుబట్టి హైద్రాబాద్‌లో నిర్వహించిన ప్రభుత్వం ప్రపంచ తెలుగు మహాసభలను మాత్రం తిరుపతిలో పెట్టుకుంది. ఎందుకంటే ఈ సీమాంధ్ర ప్రభుత్వం తెలుగు పేర తెలంగాణకు చేసే అన్యాయం ఎక్కడ ప్రపంచానికి తెలిసిపోతదో ననే భయం. ఇంత పెద్ద ఎత్తున తెలంగాణ ఉద్యమం జరుగుతున్నప్పటికీ తెలంగాణ పట్ల వివక్ష కొనసాగుతనే ఉంది. రాయల ఉత్సవానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేసిన ఈ ప్రభుత్వం కాకయతీయ ఉత్సవానికి కేవలం 25లక్షలు కేటాయించి సీమాంధ్ర నీతిని బయట పెట్టుకుంది. తెలంగాణ ప్రజలు అత్యంత భక్తిశ్రద్దలతో నిరాడంబరంగ జరుపుకునే బతుకమ్మ పండుగకు ప్రకటించిన కనీస సహాయం కూడా సమయానికి అందించక జాప్యం చేసింది. క్రమంగ తెలంగాణ కళల్ని కనుమరుగు చేసే కుట్రల్ని ఈ సీమాంధ్ర ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేస్తున్నది. కంప్యూటర్, టి.వి, సెల్‌ఫోన్ వినియోగం విరివిగా పెరగడంతో మనిషి మస్తిష్కంలో ఆలోచనలు గడ్డకట్టుకొని పోతున్నయ్. దీనితో ఎంతో విలువైన సృజనాత్మక శక్తి నశించి పోతుంది. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ సమాజంలో విలువలు పతనమవుతున్నయ్. అభివృద్ది జరుగుతున్న కొద్దీ మనుషుల మధ్య ఆత్మీయ సంబంధాలు దెబ్బ తింటున్నయ్. దీనంతటికి ప్రధాన కారణం సామాజిక మార్పులకు అనుగుణంగా మన విద్యావిధానంలో ఏ విధమైన మార్పులు చేయకపోవడం, సమాజం పట్ల యువతకు తమ బాధ్యతను గుర్తుచేసే వీలు లేకుండా పోయింది. దీంతో యువత చెడు మార్గాలను అన్వేషిస్తూ అరాచక శక్తులుగా, సమాజానికి ప్రమాద కారులుగా మారుతున్నరు. కాబట్టి మన కళలు, సాహిత్యం ద్వార సంస్కృతిలో విప్లవోద్యమ మార్పులకు ప్రణాళికలు సిద్ధం చేయవలసిన అవసరం ఉంది. అందుకు అనుగుణంగ మన పాఠ్యాంశాలను పూర్తిగ మార్చుకోవలసిన బాధ్యత మనపైనే ఉంది. ఇదంత మనరాష్ట్రం ఏర్పడితెనే, మన తెలంగాణ మనకొస్తెనే సాధ్యమైతది.

# నేటి రాజకీయాలు-నైతికత

గ్రామస్థాయి రాజకీయాల నుంచి రాష్ట్ర, దేశ రాజకీయాలలో ఎక్కడ కూడ నైతికత అనే పదానికి కనీస స్థానం కూడ లేదు.

నేడు చట్టసభలు నడిచే తీరులోగాని, చట్టాలు శాసనాలు రూపొందించే విధానంలోగాని ఎన్ని అవకతవకలు జరుగుతున్నయో మనందరికి తెలుసు. రాష్ట్రంలో ప్రాజెక్టుల విషయంలో గాని, విదేశీ పెట్టుబడులను ఆహ్వానించడంలోగాని నిన్న మొన్నటి సంఘటన, యం.పి ల్యాడ్స్ విషయంగాని, అవినీతి యం.పి ల బాగోతంగాని ఇలా చెప్పుకుంటూపోతే మన రాజకీయాలలోని అవినీతిని గురించి కొండవీటి శాంతాడంత లిస్టును తయారు చేయవచ్చు.

ప్రజాస్వామ్య ప్రభుత్వంలో పౌరునికి కొన్ని హక్కులు సంక్రమించినట్టే కొన్ని బాధ్యతలు కూడా నిర్వర్తించవలసి వున్నది. కాని హక్కులకు మాత్రమే రాజ్యాంగ భద్రత వుందన్న విషయం గమనించాలి. విధులు లేదా బాధ్యతలు అనేవి కేవలం నైతికపరమైనవి.

అంటే ఆయా వ్యక్తుల నీతి నియమాలపై మాత్రమే ఆధారపడి వుంది.

ఉదాహరణకు, ఎన్నికలలో ఓట్ల కోసం మద్యాన్ని, కరెన్సీ నోట్లను ఎరవేసి ప్రజలను ప్రలోభాలకు గురిచేయకూడదు.

కులం, మతం ప్రాతిపదికన ఎన్నికల ప్రచారం నిర్వహించకూడదు.

లంచం తీసుకోకూడదు. ఇలాంటి చర్యలన్ని నైతిక భాద్యతగా స్వీకరించి సమాజంలో మనుగడ సాగించాలి తప్ప వాటిని నియంత్రించడానికి మన దగ్గర ఎలాంటి ఆయుధాలుగాని, అవకాశాలుగాని లేవు. ఎందుకంటే అది ఒక వ్యక్తికి సంబంధించిన విషయం కాబట్టి. అయితే ఒక్కోసారి కొద్దిమంది వ్యక్తుల ప్రవర్తనే పూర్తి సమాజాన్ని ప్రభావితం చేస్తుంది. నేను చెప్పేదేమిటంటే ఒక పార్టీ అధ్యక్షుడే అవినీతి పరుడైతే ఆ కళంకం కేవలం ఆ వ్యక్తికే కాకుండా మొత్తం పార్టీనే శంకించే పరిస్థితి ఏర్పడుతుంది. అదే విధంగా దేశ రాజకీయాలలో కీలక పదవులలో వున్నవారు ఎవరైన నీతిమాలిన చర్యలకు పాల్పడితే అది మొత్తం దేశ ప్రతిష్ఠనే దిగజార్చుతుందనడం అతిశయోక్తి కాదు.

స్వాతంత్ర్యం సిద్ధించిన తొలినాళ్లలో డాక్టర్లు, లాయర్లు, మేధావులు, రాజకీయ పండితులు, లేదంటే ఒక మంచి సామాజిక కార్యకర్తకు మాత్రమే చట్టసభలకు పోటీ చేయడానికి ఆయా పార్టీలు టికెట్లు ఇచ్చేవి.

నేడు ఆ సంస్కృతికి చెక్ పెట్టి రౌడీలకు, గూండాలకు డబ్బును విచ్చలవిడిగా ఖర్చుపెట్టి ఓటర్లను మభ్యపెట్టే దగుల్బాజీలకు రాజకీయాలలో ప్రవేశం కల్పించడం పరిపాటైంది.

కాబట్టి ఈ దుస్థితి నుంచి భారత ప్రజాస్వామ్యం బతికి బట్టకట్టాలంటే పకడ్బందీగా కొన్ని సంస్కరణలను అమలుచేస్తూ ఆయా రాజకీయ పార్టీలు ప్రక్షాళన చెందాల్సిన అవసరం ఎంతయినా వుంది. కాని అది సాధ్యమైతుందా అనేదే ఇపుడు మన ముందున్న మిలియన్ డాలర్ల ప్రశ్న. కొల్లేరు పరిరక్షణ విషయంలో ఇది రుజువయ్యే అవకాశం వచ్చింది.

ఎందుకంటే ధన,మాన,ప్రాణాలలో దేన్నయినా తీయడానికి వెనుకాడని జడవని బడాబాబులను నియంత్రించడం సముద్రాన్ని మధించినంత పనే. అరాచక శక్తులకు గొడుగులు పట్టి, అవినీతిని నిర్మూలించలేని చట్టాలున్నంత కాలం ఇది కష్ట సాధ్యమే.

సాక్ష్యాత్తు న్యాయమూర్తి కళ్ళెదుటే ఘోరం జరిగినా సాక్ష్యం లేనిదే తీర్పుచెప్పలేని చట్టాలు ఎందుకనే ఆవేదన కలుగుతుంది.

ఎంతమంది అమాయకులను బలి తీసుకోవడానికి? ఎంతోమందిని కిరాతకంగా చంపి, సాక్ష్యాత్తు నేరాన్ని అంగీకరించిన గుండాలు పోలీసుల మధ్య తిరుగుతూ మీడియాముందు ఫోజులిచ్చే స్వేచ్ఛని కల్పిస్తున్నం.

చివరకు సాక్ష్యం లేదనే నెపంతో కేసును కొట్టివేయడం ఎంత వరకు సమంజసం.

అయితే ఇదంత కేవలం ఆయా వ్యక్తుల నైతిక ప్రవర్తన మీద మాత్రమే ఆధారపడి వుంది. కాబట్టి సమాజంలో నైతికాంశాలను పెంపొందించే దిశగా అడుగులు వేయాల్సిన అవసరం వున్నది. ఎంతో కొంత మేరకు స్వార్థాన్ని వీడి నైతిక భాద్యతను నెరవేర్చినందుకుగాను సమాజంలో కొన్ని కుటుంబాలు అత్యంత పేరు ప్రతిష్టలు గడించినయ్. నైతికంగా నిలబడలేని కొన్ని కుటుంబాలు అప్రతిష్ట పాలైనయ్. అయితే ఇక్కడ ముఖ్యంగా మనం ఒక విషయాన్ని గమనించాల్సిన అవసరం వుంది.

ఏమిటంటే ప్రస్తుత సమాజంలో కావల్సినదానికన్నా అధికంగానే సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందింది. ఈ పెరుగుదల ముఖ్యంగా ఎలక్ట్రానిక్ మీడియాలో విపరీతమైన పోటీ నెలకొల్పింది. ఈ పోటీ తత్వం వల్ల ఆరోగ్యకర అంశాల కన్నా, అనారోగ్యకర విషయాల ప్రచారం ఎక్కువగా జరుగుతుంది. ఇదే కాకుండా ఒక వ్యక్తికో, వర్గానికో, లేదంటే ఒక రాజకీయపార్టీకో తలొగ్గి పనిచేయవలసిన దుస్థితి ఏర్పడుతుంది.

ఏదైతే దళితవర్గం (ఎస్సీ, ఎస్టీ, బీసి, మైనారిటీ) అనుకుంటున్నామో ప్రతి విషయంలో వారినే టార్గెట్ చేసుకొని దుష్ప్రచారానికి పూనుకున్నట్టు అనిపిస్తుంది.

ఈ పరిస్థితిలో అణగారిన వర్గాల ప్రజల పేరు ప్రతిష్ఠలను ఇంకా దిగజార్చే ప్రయత్నమే జరుగుతుంది. ఏదైనా అత్యున్నతస్థాయిగాని ఇంకా తక్కువ స్థాయిలో వున్నటువంటి దళితుల మీదనే ఈ కెమెరా కండ్లు నిఘావేసి ఉంచడం సరైన పద్ధతి కాదు.

అంటే వీరి చర్యలను కప్పిపుచ్చాలనేది నా ఉద్దేశ్యం కాదు.

కాకపోతే సామాజిక వెనుకబాటు తనం వల్లనో, ఆర్థిక పరిస్థితులు చిన్నా భిన్నం కావడం వల్లనో, రాజకీయంగా చిన్నచూపు వుండడం వల్లనో కర్ణుని చావుకి సవాలక్ష కారణాలన్నట్టు ఈ దళితుల పై చర్యలు తీసుకోవడానికి చట్టానికి చాలా పెద్ద చేతులుంటయని చెప్పడానికి మాత్రం ఎలాంటి సందేహం లేదు.

ఈనాటి రాజకీయాలలో నైతికతను గురించి మాట్లాడటం అనేది హాస్యాస్పదమే.

రాజకీయ నాయకుల స్వార్థానికి, కుసంస్కృతికి నీతి, న్యాయం ఎప్పుడో చచ్చిపోయింది. అయితే ఇక్కడ ఇంకొక విషయం చెప్పాల్సిన అవసరం ఉంది.

రాజకీయాలలో నైతికత కొరవడిందని ఇప్పుడు అనుకోవడంలో అర్థం లేదనేది వాస్తవం. ఎందుకంటే భూమ్మీద మనిషి పుట్టి మాటలు నేర్వకముందే స్వార్థం పుట్టింది. నాది నీది అనే బేధ భావం ఏర్పడింది.

ఇంటివానికో నీతి బయటివానికో నీతి అనేది ఎప్పటినించో వుంది. ప్రతి జీవిలో అది సహజమే కావచ్చు. కాని బుద్ధిజీవులైన మానవుల్లో అది పరాకాష్ఠకు చేరడమే చర్చకు తావిచ్చింది. స్వార్థం, సంకుచితం ప్రతివ్యక్తిలోను వుంటుంది. కాదని,లేదని ఎవరైనా అనగలరా? ప్రతి మనిషిలో ఏదో ఒక స్థాయిలోనో, ఏదో ఒక సంధర్భంలోనో ఇవి తొంగిచూడక తప్పదు. ఒక్కసారి గుండె మీద చేయివేసుకొని ఆలోచిస్తే ఆ విషయం తేటతెల్లమవుతుంది. 'ఫలానావాడు త్యాగశీలి, నిస్వార్థజీవి' అని పొగడడానికో, వ్యాసాలలో అతిశయోక్తిగా వ్రాసుకోవడానికో బాగుంటుంది. అంతే, కాని ఆ వ్యక్తిని గురించి అతని సన్నిహితులు, సంభంధీకుల దగ్గర వాకబు చేసినప్పుడు ఖచ్చితంగా ఎక్కడో ఒక దగ్గర అతని స్వార్థబుద్ధి బయట పడుతుంది.

ప్రజాప్రతినిధిగా ప్రజల పక్షాన దేశాభివృద్ధికి బాటలు వేసే కార్యకలాపాలలో నిమగ్నమై ఉన్నప్పుడు స్వార్థాన్ని విడనాడి సామాజిక సమస్యల మీద నైతికంగ పోరాడవలసిన అవసరం వుంది. కాని మొదటి పార్లమెంటు సమావేశంలోనే, నెహ్రూ కాలంలోనే ఒక అవినీతి యం.పి. బయటపడి బహిష్కరణకు గురయ్యాడన్న సంగతి మర్చిపోవద్దు. నాటినుంచి ఈనాటి ఈ సంఘటన వరకు అందరు నైతికంగ తమ తమ పదవులకు న్యాయం చేస్తుండ్రంటే నమ్మాల్సిన అవసరం లేదు. అవినీతిని బయటపెట్టిన వ్యక్తుల గొంతునొక్కో, వాడిచేతులను కరెన్సీనోట్లతో కట్టేసో విషయం బయటికి పొక్కకుండా చూసుకున్నారనేదే జగమెరిగిన సత్యం. అంతేగాని ఇలాంటి అవినీతిపరులు లేరని మాత్రం ఖచ్చితంగా చెప్పలేం.

కాబట్టి ఇకనైనా రాజ్యాంగచట్టాలను గౌరవిస్తూ 'మత్స్యన్యాయానికి' స్వస్తిపలికి మచ్చలేని రాజకీయనాయకులుగా ఎదిగేందుకు అవకాశం కల్పించాలని అందుకు తగు విధంగా చట్టాలలో కట్టుదిట్టమైన మార్పులు చేయాలనేదే నా అభిప్రాయం.

# మాది చుండూరు - నాగపూర్‌లోని ఖైర్లాంజి

1857లో మొదలైన భారత స్వాతంత్య్ర పోరాటం 1947తో ముగిసింది. ఈ 90 సంవత్సరాల కాలంలో, లేదంటే గాంధీజీ ఉద్యమాలు ప్రారంభమైన దాక సామాన్య ప్రజలెవరు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న దాఖలాలు లేవు. అదంతా అగ్రవర్ణాల వారికి సంబంధించిన వ్యవహారమే. గాంధీజీతో సమానంగ విదేశాలలో పేరు ప్రఖ్యాతులున్న వ్యక్తి డా॥ బి.ఆర్. అంబేద్కర్ ఎక్కడ కూడ స్వాతంత్ర్యం కోసం పెద్దఎత్తున ఉద్యమించిన సంఘటనలు లేవు. దానికి కారణం భారత దేశంలో బ్రిటీష్ వారికన్న అత్యంత ప్రమాదక రమైన వాళ్ళు అగ్రవర్ణాల వాళ్ళేనని, దేశంలో అగ్రకుల ఆదిపత్యం ఉన్నంత వరకు దళితులకు న్యాయం జరగదని, వారి స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు హరించబడుతనే ఉంటయనేది అంబేధ్కర్ వాదన. వాదనే కాదు అదే వాస్తవం కూడ. అది మనం కళ్ళార చూస్తూనే ఉన్నాం. చేతులు ముడుచుకుంటూనే ఉన్నం. నాగపూర్‌లోని బందర జిల్లా ఖైర్లంజి గ్రామానికి చెందిన అగ్రవర్ణాల వారు భయ్యాలాల్ భొట్మంగే అనే దళిత కుటుంబాన్ని దారుణంగ హింసించి అతని భార్యను, కూతుర్ని నగ్నంగా బండిపై ఉరేగించి తల్లీ కూతుళ్ళపై సామూహిక అత్యాచారం జరిపి, వారి ఇద్దరు కొడుకులను తీవ్రంగ కొట్టి చంపిన సంఘటన హృదయాన్ని ముక్కలు చేస్తుంది. ఈ సంఘటనతో నిజంగా మనం ప్రజాస్వామ్య దేశంలోనే బతు కుతున్నమా! అనే అనుమానం వస్తుంది. లేకుంటే స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని సంవత్సరాలైనా పట్టణాలలో ఒక విధంగ, పల్లెల్లో మరో విధంగా చిత్రహింసలు పెట్టి మరణ శాశనాల రాసే విధం కొనసాగుతుందా? ఒక్కసారి ఆలోచించాలె. ఎప్పటికీ ఆదిపత్యం అగ్రవర్ణాల వారిదేనా? వారేంచేసినా, చేస్తున్నా చూస్తూ పోవల్సిందేనా? చట్టాలు, ప్రభుత్వాలు వాళ్ళకు వంత పాడటానికేనా!? దేశంలో ఒక రాష్ట్రమని గాదు, ఒక ప్రాంతమని గాదు ఎక్కడ చూసినా ఇవే అరాచకాలు అల్లకల్లోలాలు పెరిగిపోతున్నయ్. దీనికి ప్రధానమైన కారణం దళితులు తెలివికలవారుగా మారుతూ, అన్ని రంగాలలో ప్రవేశించడమేనా? అన్యాయాన్ని ప్రశ్నించడమేనా? అగ్రవర్ణాలు చేసే ఏ చర్యలనైనా చూస్తూ వారి చేతుల్లో కీలుబొమ్మలుగా మారితే ఏ సమస్యా ఉండక పోయేదేమో. వారి ఆదిపత్యాన్ని ఒప్పుకుంటే ఏ పంచాది లేక పోయేదేమో. ఎదిరించి ఒక్క మాటంటే అది చుండూరు కావచ్చు. నాగపూర్‌లోని ఖైర్లాంజి కావచ్చు. మరి ఈ ఆదిపత్యం ఇంకెంతకాలం? ఈ అవమానాల్ని ఇంకెన్ని రోజులు భరించాలి? ఈ మారణకాండకు అంతం లేదా? భారత రాజ్యాంగంలోని ప్రాధమిక హక్కులు సక్రమంగ అమలు కాకపోవడానికి కారణమైన ఈ అగ్రవర్ణాల వారిని, కులమస్తీ గాళ్ళని ఏంచేయాలి? ఎలా ఎదుర్కోవాలి? అనేది ఈరోజు దళిత బహుజన యువతీ యువకులు, మేధావి వర్గం ముందున్న అతి భారమైన ప్రశ్నగా నేను భావిస్తున్నాను.

శంభూకుని శిరస్సును ఖండిస్తిరి ఏకలవ్యుని ఏలు నరుక్కుంటిరి
ఎందరి నాలుకలో తెగ్గోస్తిరి

ఇంకెందరివో మానాలు దోస్తిరి, ప్రానాలు దీస్తిరి. అదేదో చతుర్వర్ణ కాలమను కుంటిమి. పూర్వజన్మలో మేం చేసిన పాపమనుకుంటిమి

చరిత్ర నిండా అనేక ఘోరమైన సంఘటనలు, భీతిగొల్పే భయానక దృష్యాలు. అవన్నీ దళిత వర్గాలపై జరిగినవే. ఎందుకంటే పాలించేవాళ్ళు అగ్రవర్ణాల వారైనపుడు శిక్షించే అధికారం వాళ్ళకే ఉంటుంది. ఇది ఎప్పుడంటే ఏ రాజుల పరిపాలనా కాలంలోనో, లేదంటే నిరంకుశ ప్రభుత్వాలున్నపుడో ఇలాంటివి సహజం. కాని భారత దేశం స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు పోంది శాంతి, సమానత్వ మంటూ లౌకికంగా, ప్రజాస్వామ్య బద్దంగ ప్రభుతాలు పనిచేస్తున్నపుడు ఇలాంటి సంఘటనలకు తావుండకూడదు. ఒక వేళ ఎక్కడైనా సంఘ వ్యతిరేక కార్యకలాపాలు జరిగినపుడు, హత్యలు అరాచ కాలు చెలరేగినపుడు ప్రభుత్వం తగిన విధంగా స్పందించి రాజ్యంగం ప్రకారం కఠిన చర్యలు తీసుకున్నట్లయితే ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండ ఉండేది. కాని 60 సం॥లుగా దళితులను అణగదొక్కుతూ కారంచేడు, చుండూరు సంఘటనలు మొదలు నేటి నాగపుర్ వరకు ఒక వర్గం పాలనే కొనసాగుతుందనేది నగ్నసత్యం. ఈ సిగ్గు మాలిన చర్యలు అనేకం జరుగుతనే ఉన్నా, అగ్రవర్ణాల కుట్రలు, ఆదిపత్యం కొనసాగు తనే ఉన్నా చట్టం చెవిటితనం ముందు, న్యాయం గుడ్డిదైతనే ఉంది. ఈ పరిస్థితిలో ఆ న్యాయదేవత కళ్ళ గంతలు విప్పేదెవరు? నలుగురికి సమానంగ న్యాయం దక్కేదెన్నడు?

“బాంచన్ నీ కాల్మోక్తా” అనే రోజులు పొయినయని, అస్పృశ్యత అన్నది ఎక్కడా లేదని కూసేది ఎవడోగాని ముందు వాళ్ళనోరు మూయించాలె. ఎందుకంటే అదే వాస్తవమని చట్టసభల్లో శాశనాలుగా రూపోందే ప్రమాదం ఉన్నది. అగ్రవర్ణాల వారు ప్రతి నిత్యం ఏదో విధంగా దళితులను చిత్రహింసలు పెడుతున్నారనేది ఏ పత్రికను తిరగేసిన కనిపిస్తుంది. ఈ పరిస్థితులలో దళితులు ఏంచేయాలి. పిల్లిని ఇంట్లో వేసి కఱ్రతీసుకుంటేనే ఎగిరి గొంతు పడుతుంది. అలాంటిది ఈ అగ్రవర్ణాలవాళ్ళు అనాది కాలం నుంచి నేటి వరకు బహిరంగంగానే ఇంత నీచానికి వడిగడుతున్నా సమాజ పరంగాగాని, చట్టపరంగాగాని ఏ విధమైన చర్యలు తీసుకోలేక పోవడం శోచనీయం. లోపం ఎక్కడుందో తెలుసు. కాని ఆ లోపాన్ని సవరించడానికి ఆ సవాళ్ళను ఎదుర్కోవడానికి మాత్రం ముందుకు రాలేక పోతున్నం. ‘ముల్లును ముల్లుతోనె తియ్యాలి, వజ్రాన్ని వజ్రంతోనే కొయ్యాలి’ అనే సామెత పాతదే కావచ్చు. పూర్వకాలంలో కొన్ని దేశాలలో కన్నుకు కన్ను, కాలుకు కాలు, ప్రాణానికి ప్రాణం అన్న పంథాలో న్యాయవిధానం ఉండేది.కుల మతాలకు బంధుప్రీతికి అతీతంగా శిక్షలు అమలు పరచబడేవి. కఠిన శిక్షలకు కాలం చెల్లి స్వతంత్ర భారతదేశంలో న్యాయం అమ్మబడుతుంది. కొనగలిగే దమ్ముండాలే గాని ఎంతటి విషయాన్నయినా మసిబూసి మారేడుకాయ చేయగల సమర్థులు మన సమాజంలో కోకొల్లలు. ఈ అగ్రవర్ణ, అవినీతిమయమైన పాలన నుంచి విముక్తి పొందాలంటె దళితులంత ఏకమై తగిన చట్టాల రూపకల్పన కోసం ఉద్యమించాలె.



**అంబటి వెంకన్న**

# పాఠ్యపుస్తకాలు-ప్రభుత్వ స్కూళ్ళెందుకు..!? దండగ

## కొసెన్‌బ్యాంకులే మీ ర్యాంకులు- కార్పోరేట్ స్కూళ్ళే మీ బతుకు బళ్లు



మీ పిల్లల స్కూల్ ఫీజులు భారంగా ఉన్నయా? అయితే వెంటనే ఈ 040 69996399 నెంబరుకు ఫోన్ చేయండి. మీ ఏరియాకు నీల్లు రావడం లేదా? దొంగల భయం పెరిగిందా అయితే ఈ నెంబరుకు ఫోన్ చేయండి. ఉగ్రవాదులని అనుమానంగా ఉందా అయితే ఇగో గీ నెంబరుకు ఫోన్ చేయండి. ఒక్కఫోన్ చాలు మీ సమస్య పరిష్కారం అయిపోతుంది. "ఒక ఐడియా మీ జీవితాన్నే మార్చివేస్తుంది". అన్నట్టుగా "చదువుకుంటుంది ఇండియా ఇపుడే ముందడుగు వేస్తుంది ఇండియా" ఇది ఈనాటి వరస. ఒక్క దెబ్బతో సమస్యలన్నీ పరిష్కారమైపోయినట్టు, ప్రజలంతా హాయిగా బతుకుతున్నట్టు ప్రకటనల దేముంది ఏన్నయినా చేయవచ్చు.

ఇది సెల్‌పోన్ యుగం, గ్రాఫిక్స్ మయం ఏమైనా చేయవచ్చు.

లేనిది ఉన్నట్టు, ఉన్నది లేనట్టు. నెరవేరని ఆశలు, ఆశయాల కోసం ఆన్‌లైన్లు, పరిష్కార యోగ్యమైన పనుల కోసం కమీషన్లు, హెల్ప్‌లైన్లు, టోల్ ఫ్రీ నెంబర్లు ఇలాంటి డొంక తిరుగుడు యవ్వారంతో చేతులు దులుపుకోవడం తప్ప ఎక్కడ ఒక సమస్య పరిష్కారమైంది?ఏ పనిలో నిబద్దత ఉన్నది? ప్రతిది తమ స్వార్ధం, తన వాళ్ళ కోసం తప్ప సమాజం పట్ల గౌరవం గాని, పేదల పట్ల సానుభూతిగాని ఎవరికున్నది?

అన్ని రంగాలలో దోపిడి, అవినీతి ఘననీయంగా పెరిగి, మన విధ్యావిధానం దారుణంగా మారి పెను ప్రమాదంలో కూరుకుపోతున్నది.

అందరికీ ఆదర్శమైన మన విద్యావిధానం ప్రైవేట్, కార్పోరేట్ వ్యవస్థల పుణ్యమా అని ఆపదల్లో చిక్కుకుంటుంది.

ఉద్యోగాల సంగతి ఎలా ఉన్న, మనం బోధించే విద్య సమాజం పట్ల నీతితో, నిజాయితితో అంకిత భావంతో పనిచేయడానికి పురికొల్పే విధంగా ఉండాలె.

సేవా దృక్పథాన్ని పెంపొందించేదిగా ఉండాలె. ఎంతటి సాంకేతిక ప్రగతిని సాధించినా వ్యక్తుల ప్రవర్తనలో సమతూకం ఉండాలె. కాని ఇందుకు విరుద్ధంగా వ్యవహరించడానికి కారణం మన విద్యావ్యవస్థలోని లోపాలు. ప్రైవేటు, కార్పోరేటు విద్యాలయాల దోపిడీ సంస్కృతిని, నియంత్రించలేక తన వాళ్ళనో, తన ప్రాంతం వాళ్ళనో చేష్టలుడిగి చూస్తున్న పాలనా యంత్రాంగం వెరసి ఈ దుస్థితికి దారితీసింది. సమాజానికి తీరని అన్యాయం జరుగుతుంది. ఇంజనీరింగ్, ఐఐటి వంటి సాంకేతిక విద్యే లక్ష్యంగా పేద, మధ్య తరగతి కుటుంబాలను నిలువు దోపిడి చేస్తూ వాళ్ళ భవితవ్యాన్ని నిర్వీర్యం చేస్తుంది.

మన విద్యా విధానంలో అత్యంత కీలకమైన +2 విద్యను కార్పోరేట్ వ్యవస్థ ప్రహసనంగా మార్చింది. మెడిసిన్, ఇంజనీరింగ్ తప్పితే మీ బతుకే వేస్ట్ అన్నంతగా ప్రచారం చేసి, ప్రభుత్వ అండ, ఆదరణ సంపాదించి ర్యాంకుల మాయాజాలంతో మభ్యపెడుతుంది.

ఈ రోజుల్లో ఎంత దరిద్రానికైనా ఇంటర్ చదివించాలంటే కనీసం లక్ష రూపాయలు ఖర్చు చేయనిదే సాధ్యమయ్యే పరిస్థితి లేదు. ఒక్కో కార్పోరేటు వ్యవస్థ తమ ఇష్టానుసారం వ్యవహరిస్తూ కోట్లాది రూపాయలను ప్రోది చేసుకుంటున్నా అడిగే నాధుడు లేడు.

పి.జి.చేయడానికి లేని ఖర్చు ఎల్.కె.జి సదువుకు ఉన్నది. తెలివైన విధ్యార్థికి మంచి మార్కులు రావడం గొప్ప విషయం ఏమి కాదు. కాని అదే కార్పోరేట్ కళాశాలల్లో ర్యాంకులు సాధించిన విధ్యార్థులతో పాటు ర్యాంకులు రాని మిగతా వారుకూడా అంతకన్న ఎక్కువ డబ్బులేగా చెల్లించింది. మరి వాళ్ళ పరిస్థితి ఏంది? ఇంటికాడ ఉన్న భూమి అమ్మి పిలగాన్ని చదివించిన వాళ్ళ గతేంది?

వచ్చిన ఒక్క ర్యాంకును బట్టుకొని నెంబర్ వన్‌గా సాగిపోతే మిగతా వాళ్ళ సంగతేంది? మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన అనేక మంది విద్యార్థుల సంగతేంది.

అందుకే ఇక్కడ కూడా రిజర్వేషన్ పాటించాలె. కార్పోరేట్ కాలేజిలో చదివిన విద్యార్థులకు, ప్రభుత్వ కళాశాలల్లో చదువుకొని వచ్చిన విద్యార్థులకు మధ్య మార్కుల విషయంలో ఉన్న తేడాను గమనించి వీరికి కొంత రిజర్వేషన్ కల్పించాలె. లక్ష రూపాయలు పెట్టి చదువుకొన్న విద్యార్థికి తొమ్మిది వందల మార్కులకు సీట్ వస్తే, కష్టపడి చదువుకుని వచ్చిన విద్యార్థులకు ఆరు వందల మార్కులొచ్చినా సీటియ్యాలె. ఈ విషయంలో తప్పకుండా కొంత రిజర్వేషన్ (కుల, మతాలకు అతీతంగా) కల్పిస్తేనే సామాన్యునికి న్యాయం జరుగుతుంది. లేదంటె కార్పోరేట్ వ్యవస్థను పూర్తిగా ధ్వంసం చెయ్యాలె. ఆవ్యవస్థను పూర్తిగ ఎత్తెయ్యాలె. లేదంటె పేద, మధ్యతరగతి విద్యార్థులు ఎంతటి ప్రతిభావంతులైనా చదువులకు స్వస్తి చెప్పవలసి వస్తుంది.

పెరిగిన ధరల దృష్టా సామాన్యులు బతికే పరిస్థితి లేదు.

ఇంక పిల్లలకు మంచి చదువులు చదివించాలంటే వాళ్ళ వశం కాదు.

పెరుగతున్న అవినీతితో పోటీపడి అడ్డదారిలో డబ్బులు సంపాదించడం తెలియని వాళ్ళకు ఉన్నంతలో కనీస సౌకర్యాలు లేకపోతే అంతకంతకు పేదరికంలో కూరుకుపోయి ఆగమైంద్రు. అలాంటి వాళ్ళను ఆదరించాల్సిన బాధ్యత తప్పకుండ ప్రభత్వం పైనే ఉన్నది.

ఖచ్చితమైన సర్వేలతో వ్యవస్థను సమూలంగా మార్చుకోవలసిన అవసరం ఉన్నది.

విద్య విషయంలో ప్రాథమిక స్థాయిలో ప్రైవేటు, కార్పోరేటు దోపిడి తక్కువేమి కాదు. వేలం వెర్రిగా ప్రచారం చేసే ప్రసార మాధ్యమాలను ఉపయోగించుకొని వచ్చిన ఒక్క ర్యాంకుతో, లేదంటే గతంలో వచ్చిన ర్యాంకుతోనో అర్థంలేని ప్రకటనలు చేస్తూ తమ విద్యా సంస్థలను అక్కడక్కడ మర్రి ఊడల్లా విస్తరింప జేసింద్రు.

కేవలం ఆ పేరుపెట్టుకొని కాన్సెప్ట్ స్కూల్లంటు, సక్సెస్ మీవెంటే ఉందంటూ, ఆకర్షనీయమైన ఈటెక్నో అని, ఆటెక్నో అని బ్రోచర్లు, అడ్వర్టయిజ్‌మెంట్లతో బోల్తా కొట్టిస్తరు.

అద్భుతమైన 'మెను' తో లక్షల రూపాయలు కొల్లగొడతరు. జనాన్ని పీల్చి పిప్పి జేసింద్రు. అరకొర సౌకర్యాలను ప్రశ్నిస్తే టి.సి. చేతికిస్తరు. ఇగ ఏవిషయంలో ఫోన్‌జేయాలె? ఎవరికని ఫోన్ జేయాలె?

మానవ జీవితంలో భవిష్యత్ భావనలు, ప్రవర్తనలు రూపుదిద్దుకునే అత్యంత కీలకమైన పాఠశాల దశలో పిల్లల్లో మంచి భావనలు పెంపొందింప చేస్తే తప్ప మంచి సమాజం రూపుదిద్దుకోదని తెలిసి అనేక తప్పులు చేస్తున్నం. "మొక్కయ్ వంగనిదే మానై వంగదు'' అన్న అక్షర సత్యం తెలిసి వ్యవస్థను భ్రష్టు పట్టించే కార్యక్రమాలకు పూనుకుంటున్నం. అర్థంలేని సినిమా సంస్కృతిని వ్యాపింప జేసి పిల్లలపై చెడు ప్రబావం పడడానికి కారణం అవుతున్నం.

అదేమంటే "చెడు వినవద్దు, చెడు కనవద్దు, చెడు అనవద్దు" అనే గాంధీజి మాటలు వల్లెవేస్తం. కాని దారిపొడవునా చెడుమాత్రమే వినపడుతుంటే, చెడుమాత్రమే కనపడుతుంటే ఎంతకని కండ్లు మూసుకొని నడవగలం. చెవులు మూసుకొని ఉండగలం.



ప్రస్తుత సినిమాలు, టీవీల ప్రభావం వల్లనే సమాజంలో హింస, అరాచకం వంటి సంఘటనలు చెలరేగుతున్నాయనేది వాస్తవం.

అయితే "చెడ్డసినిమాలను చూడొద్దు ప్రజలే తిరస్కరించాలే" అంటూ ప్రజావేదికలో పరుచూరి గోపాలకృష్ణలాగా అంత తీరికగా, నిర్లక్ష్యంగా మాట్లాడటం ఎవరికి చేతనైతది. అసలు ప్రతి సినిమాలో విలన్లతో పాటు హీరోలు కూడా "ప్రేమించకపోతే చస్తాను లేదంటే యాసిడ్ పోసి చంపుతాను" అన్న డైలాగు లేకుండా ఏమంచి సినిమా అయినా సరే ఉందా? "ఇంట్లో ఎలుకలుంటే ఇల్లు తగులబెట్టుకుంటామా" నీతి బాగనే ఉన్నది. కానీ కనీసం ఎలుకలకు మందు పెట్టి చంపాలిగా. మందు పెట్టడం చేతగానపుడు ఇల్లు తగులపెట్టుకోవడమే ఉత్తమం. సినిమాలు సీరియల్స్ ద్వారా తమిళ సంస్కృతిని దిగుమతి చేసుకుంటూ, మూఢభక్తిని, చేతబడి వంటి మూఢ విశ్వాసాలు పెంపొందింప జేసే ఈ మాధ్యమాలు అవసరమా? పిల్లల దృష్టిని చదువుల మీదనుంచి మరల్చి ప్రేమ పేరుతో ఆత్మహత్యలకు పురికొల్పడం అవసరమా? సమాజంలో అడ్డు అదుపూ లేకుండా సాగే ప్రతి పనిలో ప్రభుత్వ నియంత్రణ నియమ బద్ధంగా, ఖచ్చింతంగా ఉండాలి. స్వార్థానికి, రాజకీయ వత్తిళ్ళకు తావీయనిదై ఉండాలి. తాగి రోడ్లమీద పండేవాన్ని తీసుకెల్లి స్టేషన్లో పడేస్తే మళ్లీసారి తాగి ఇంట్ల ఉంటడు.

ఇక్కడ వచ్చే చిక్కు ఏమిటంటే చేసే ప్రతి సంస్కరణ అక్రమార్కులకే ఉపయోగపడుతుంది. వాళ్ళ అవసరాలను తీర్చుతుంది.

దీంతో ఎన్ని చట్టాలు చేసినా ఎంత సంస్కరణ జరిగినా ఎక్కడేసిన గొంగడి అక్కడే ఉంటుంది. నిజానికి ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తే వాళ్ళ సామాజిక హోదాకు బంగం వాటిల్లుతుందా? పిల్లల భవిష్యత్తు అగమ్య గోచరంగా మారుతుందా?

అంటే ఉన్నత వర్గాల విషయంలో మొదటి దానికి ప్రాధాన్యత ఉంటుంది. పేద, మధ్యతరగతి వర్గాల వారి విషయంలో రెండవదానికే ప్రాధాన్యత ఉంటుంది.

దీనికి కారణం కార్పోరేట్ విద్యావ్యవస్థల అర్థంలేని ప్రచారమే. ఈ పరిణామం ఎంతగా విస్తరించిందంటే అసలు ప్రభత్వ పాఠశాలలు ఉన్నయో, లేవో కూడా తెలిసే పరిస్థితి లేదు. జూన్ రెండవ వారంలో ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమైతే ప్రైవేట్, కార్పోరేట్ విద్యా సంస్థల వారు మే నెల మొదటి వారం నుంచే, మంచి ఎండాకాలం రోజుల్లోనే గ్రామ, గ్రామాన తిరిగి పత్రికలు, టీవీల ద్వార హోరెత్తించే (ఎన్నికల ప్రచారాన్ని మరిపించే విధంగా ) ప్రచారం చేసి టెస్ట్‌లు నిర్వహించి, వాళ్ళ స్కీంలు పరిచయం చేసి బస్సులు, ఇతర వాహనాల ద్వారా జూన్ నాటికే గ్రామాలు, పట్టనాలలో ఒక్క స్కూలు విద్యార్థి లేకుండా ఊడ్చేసుక పోయినంక అప్పుడు మొదలైతది మన బడిబాట. ప్రభుత్వ సదువాట. బడిబాట బద్దది, నడిసెటోడు లేడు. పంతుల్లు పన్నెండు మంది, అధికార్లు ఐదుమంది, నాయకులు నలవైమంది, అంగిఉంటే లాగు లేనోడు, లాగుంటే అంగి లేనోల్లు ఓ ఐదు పదిమంది పోరగాల్లు. అంగరంగ వైభవంగా బడిబాట, పేపర్లల్ల పెద్దఎత్తున మద్దతు. అంతే అయిపోయింది.

ఈ యాడాది గండం గట్టెక్కింది. ఇగ బడికి పోయినా ఒకటే పోకున్నా ఒకటే.

వచ్చిన పదిమంది విద్యార్థుల్ని తీర్చిదిద్ది బంగారు భవిష్యత్తును అందించవలసిన ఉపాధ్యాయులు వారి స్వంత వ్యాపారాలు, చిట్‌ఫండ్‌లు, తోటలు, ఇతరత్ర వ్యాపారాలతో తీరికలేకుండా ఉంటరు. అటెండర్లు, విద్యా వాలంటీర్లతో పాఠశాలలు నడిపిస్తుంటరు.

ఉద్యోగానికి సంబంధించి ఎక్కడైనా వత్తిడి వస్తే రాజకీయ నాయకుల అండ ఉండనే ఉన్నది. ఇంకా ఏంగావాలే. ఎవరెట్లబోతే ఏంది? ఈ సమాజం ఏమైపోతే ఏంది? ఇదీ ప్రస్తుత పరిస్థితి. ఇక ప్రైవేట్, కార్పోరేట్ వ్యవస్థల్లో వేలకు వేలు ఫీజుల మోతను భరిస్తూ, అనేక అవస్థలు పడుతూకూడ అక్కడే చదివించడానికి కారణం ప్రభుత్వ విద్య మీద నమ్మకం పోయింది. పాలనా యంత్రాంగం నిర్వహణ తీరే ఈ దుస్థితికి కారణం. కార్పోరేట్ స్కూళ్ళలో చేరింది మొదలు డోనేషన్లు, స్కూల్ ఫీజులు, యూనిఫాం (డ్రెస్, టై, బెల్ట్, షూ, ఐడెంటిటీ కార్డు, బ్యాడ్జ్), స్కూల్ బ్యాగులు, పుస్తకాలు, ప్రోగ్రెసివ్ కార్డులు, ఐఐటి, యోగ, కరాటే క్లాసులు, బస్‌ఫీజులు ఒక్కటిగాదు. ప్రతిదానికి పిల్లల్ని పీడించి ముక్కుపిండి వసూలు చేయడమే. లేదంటే అన్ని కలిపి మోయలేనంత ప్యాకేజి మన నెత్తిన బెట్టడం. దాన్ని ఆరు నెల్లకో, మూడు నెల్లకో ఇంత చెల్లించి బరువు దింపుకోవాలె. ఏ అండ ఆదెరువు లేకుండ అధిక ధరలతో బతుకే భారంగా గడుపుతున్న లక్షలాది కుటుంబాలు తమ పిల్లల భవిష్యత్తును ఊహించుకొని రెక్కలు ముక్కలు చేసుకుంటూ చెమట, నెత్తుటి రొక్కాన్ని వాళ్ళ చేతుల్లో పోస్తుంటరు. వాళ్ళకు వచ్చిందాట్లో సగానికి పైగా పిల్లల సదువులకే ఖర్చు పెడతరు.

అప్పులు చేస్తరు. అవమానాల పాలైతరు. ఏమైతే ఏముంది. వాళ్ళకు ఫీజులు గట్టాలె. లేదంటే ఇంట్ల గుసోవాలె. ఈ విధంగా వేలకు వేల డోనేషన్లను భరిస్తూ నెలనెలా ఫీజులు కడుతూ చదువుల్ని గట్టెక్కియ్యాలె.

ప్రతి నెలా చెల్లించాల్సిన స్కూలు ఫీజలు ఒక్కరోజు ఆలస్యమయితే పిల్లల్ని కొట్టడం, ఎండలో నిలబెట్టడం, ఫీజులు తీసుకురమ్మని ఇంటికి పంపించడం ఫస్ట్ తారీఖునించి పదిరోజుల వరకు ఇదేపని. ఎందుకంటే వాళ్ళ తల్లిదండ్రులు నెలసరి ఉద్యోగులు కారు. అక్రమ కాంట్రాక్టులతో, అవినీతి సొమ్మును లక్షలకు లక్షలే బ్యాంకు బ్యాలన్సులు కలిగిఉన్న వాల్లు కాదు. ఏడనో ఒక దగ్గర అప్పుదెచ్చి అయినా సరే ఫీజులు కట్టవలసిందే. ఈ తంతు ముగిసే నాటికి తమ పిల్లలకు తోటి విద్యార్థులముందు అవమానం తప్పదు. ప్రైవేట్ యాజమాన్యాలు ముఖ్యంగా పరీక్షా సమయాలల్లో ఫీజులకు నరక యాతన పెడతరు. ఫీజు తేకుంటే పరిక్ష రాయనియ్యరు. యూనిట్ పరిక్షలు మొదలు, క్వార్టర్లీ, హాఫియర్లీ అని సంవత్సరం పొడుగునా ఏదో ఒక ఫీజు ఉంటనే ఉంటది. తల్లిదండ్రులు తమ పిల్లల్ని కొట్టుకుంటూనో, తిట్టుకుంటూనో, సదువుల తల్లిని శాపనార్థాలు పెడుతూనో ఏ యేడుకాయేడు ఎల్లదీసుకొస్తుంటరు.

యూనిఫాం (టై, బెల్ట్, షూ, ఐడెంటిటీ కార్డు) వారానికి రెండు, మూడు రకాలు. ఎంత రేటయినా ఆ స్కూళ్లోనే తీసుకోవాలె. చాలా వరకు బయట దొరకవు గూడా. డాక్టర్ దగ్గర మందుల షాపు ఉన్నట్టు. అవసరమున్నా లేక పోయినా అన్ని రకాల పరీక్షలు చేసినట్టు. ఇరవై రూపాయల టై, బెల్టుకు యాభైనించి వంద వరకు వసూలు చేసే పాఠశాలలు ఉన్నయి. ఐడెంటిటీ కార్డుకు పైసలే. ప్రోగ్రెసివ్ కార్డుకు పైసలే. ఆటల పోటీలకు, జాతీయ పండుగలకు అన్నిటికీ పైసలే. సంవత్సరం పొడుగూత పైసలే ఐదో, పదో, ఎంతో కొంత వచ్చిందే డక్కోలు. ఇవన్నీ చెప్పుకుంటే సిగ్గుబోతది. ఆ మాత్రం పిల్లల కోసం ఖర్చు చేయలేరా అన్నట్లు అనిపిస్తది. వాళ్ళకు వాళ్ళకే అవమానం అనిపిస్తది. ఎవనికన్న జెపితే చిన్నచూపు జూస్తరని భయమైతది. చెప్పకుంటే గుండెనిండ బాధ గూడు గడతది.

ఆపూటకు ఐదు రూపాయలు కూరగాయలకు లేనోల్లు అనవసరమైన వాటికి పదులు, ఇరవైలు ఇవ్వాల్సిన పరిస్థితి ఎంత భయంకరంగా ఉంటుందో చెప్పలేం.

లేదంటే తన పిల్లవాడు తోటి పిల్లల ముందు అవమానించబడతడని, పంతుల్లు కొట్టి సంపుతరని భయం.

చదువు విషయంలో శ్రద్ధ తక్కువ. ఫీజుల విషయంలో శిక్షలు ఎక్కువ.

ఈ పనులు చేయడంలో మైనారిటీ విద్యాసంస్థలు తక్కువేమి తినలేదు. అందిరికందరు యములే. అలిమిగాని వాళ్ళను యమపాశానికి పంపడానికి తయారుగుంటరు. ఆపూటకు లేని వాళ్ళను బెదిరిస్తుంటరు. వాళ్ళ బతుకులతో, భవిష్యత్తుతో ఆటాడుకుంటరు.

ఇక తల్లిదండ్రులకు ఇష్టం ఉన్నా లేకున్నా పిల్లల్ని ప్రేరేపించి ఆరవ తరగతి నుంచే ఐఐటి క్లాసులు. యోగ, కరాటే, డాన్స్ అన్నిటికి ఫీజులే. ఎక్స్‌కర్షన్ టూర్‌కు తల్లి దండ్రుల చేతిలో చావు దెబ్బలు తినైనా పిల్లలు అందుకోసం డబ్బులు సమకూర్చుకుంటారు. ఇవన్నీ ఉండకూడదని కాదు. ప్రతి పనికి కొంత పరిమితి ఉంటుంది ఒక హద్దు ఉంటుంది. అంతే కాని ఎవరి స్వార్థం కోసమో ఇంకొకరినీ బలిచేయడం అనేది సరైన పద్ధతి కాదు. చేసే పనిలో కొంతైనా నిజాయితీ ఉండాలి.

రైతు దగ్గర నాలుగు రూపాయలకు కిలో టమాట తెచ్చి నలభై రూపాయలు మార్కెట్లో అమ్మితేనే ఇబ్బంది అనిపిస్తుంది. ఐదు రూపాయలతో పోయే విషయాన్ని యాభై రూపాయలతో ముడిపెట్టినపుడే పానం ఎల్లిపోతది. ఇంకొక గమ్మత్తయిన విషయం ఏమిటంటే పాఠ్య పుస్తకాలు. నాకు తెలిసీ అసలు పాఠ్య పుస్తకాలు అక్కెరే లేదు. అనవసరంగా పాఠ్యపుస్తకాలు అందడం లేదని గగ్గోలు పెట్టడం తప్ప ఎవరికి కావాలె పాఠ్యపుస్తకాలు. ఇయ్యాల ఏ ఉపాధ్యాయుడు పాఠ్య పుస్తకాన్ని ఉపయోగించి విద్యార్థులకు విజ్ఞానాన్ని బోదిస్తుండు. మొత్తం గైడ్‌లు, కొసెన్‌బ్యాంకులు, వర్క్‌బుక్‌లు. కరదాల కాపీలలో రాసిచ్చే ఉపాధ్యాయుడు లేడు.

నలభై, యాభై రూపాయలు పెడితే ఏ వి.జి.ఎస్ వాళ్ళదో, ఏ షిరిడి సీరీస్ వాళ్ళదో ప్రింట్‌తో రాయబడి ఉంటుంది. పిల్లలచేత అది కొనిపిస్తే సరిపోతుంది.

పాఠ్యపుస్తకాలు ఉన్నా లేకున్నా గాని కొసెన్ బ్యాంకులు ముఖ్యం. విజిఎస్. విక్రమ్. షిరిడి వంటి ఇంకా ఎన్నో పబ్లికేషన్స్‌తో కుమ్మక్కై పర్సేంటేజిలు మాట్లాడుకొని వాళ్ళ సలహా మేరకు పిల్లల్ని, వాళ్ళ తల్లిదండ్రుల్ని ముప్పు తిప్పలు పెట్టి మూడు చెరువుల నీల్లు తాపుతరు.

ఈ కొసెన్ బ్యాంకులు అవసరమా? అంటే అదేంది? ఈరోజు కార్పోరేటు సంస్థలు ర్యాంకులు సాధిస్తున్నయంటే కొసెన్ బ్యాంకులే ఆధారం. జవాబులు బట్టీపట్టీ విషయ పరిజ్ఞానాన్ని కోల్పోయి ఎన్ని మార్కులు సాధించినా ఏమీ తెలియని దద్దమ్మల్లాగా తయారు చేయడం, కూడికలు, తీసివేతలు రానివాళ్ళకు మార్కుల కుంభవృష్టి కురిపించడం కార్పోరేట్ ఘనత. “మా పిల్లవాడు స్కూల్ ఫస్ట్,” అని మురిసే తల్లిదండ్రుల ఆనందం. అంతే ప్రస్తుత మన విద్యా విధానం.

ఎల్.కె.జి. పిల్లలకు ఎన్ని పుస్తకాలో లెక్కే ఉండదు. అసలు వీళ్ళ దృష్టిలో ప్రభుత్వం ప్రచురించి పంపిణీ చేసే పుస్తకాలు ఎందుకు పనికిరానివి. వీళ్ళకేమైనా ప్రైవేట్ పబ్లికేషన్స్ మాత్రమే విజ్ఞానాన్ని సంపాదించి పెట్టే మార్గాలు. నాలుగు బొమ్మలున్న పుస్తకం నలభై రూపాయలుంటది. ఈ లెక్కన ఎల్.కె.జి., ఫస్ట్‌క్లాస్ చదివే వాని పుస్తకాలు తడిసి మోపెడైనా ఇబ్బంది పడరు. అది ముద్దు పలుకుల దశ కద. అప్పుడేమి అనిపియ్యదు. పోతుంటె ముందు ముందు తెలుస్తది. అసలు పాఠ్యపుస్తకాలే అక్కెర లేకుండా పాఠశాలలు నడుస్తున్నయ్. ప్రైవేట్ పబ్లికేషన్స్ వ్యాపారం జోరు పెరిగింది. ఒకప్పుడు సీమాంధ్ర నుంచి ఇక్కడికి వచ్చి నెత్తిన పెట్టుకుని బడి బడి తిరిగి అమ్ముకున్న ప్రైవేట్ పబ్లికేషన్స్ వాళ్ళు ఈరోజు పాఠశాలల్ని, విద్యార్థుల్ని, తల్లిదండ్రుల్ని పిచ్చికుక్కల జేసి రోడ్లమీద తిప్పడంలో సక్సెస్ అయింద్రు. క్రమంగ కార్పోరేటు వ్యవస్థల తొత్తులయ్యింద్రు. ఈ ప్రైవేట్, కార్పోరేటు సంస్థలు లేని నాడు మట్టిలో మానిక్యాల్లాంటి బిడ్డలు ఎన్నో స్టేట్ ర్యాంకులు సాధించిన చరిత్రలేదా? ఇప్పటికీ కొన్ని పోటీ పరీక్షలలో ఎక్కడ ఎలాంటి శిక్షణ పొందకుండా ఇంటి వద్దనే చదువుకుని ర్యాంకులు సాధించిన ఈ మట్టి బిడ్డలను వెంపర్లాడి, వేదించి వాళ్ళ ర్యాంకును కొనుక్కొని ప్రచారం చేసుకున్న దుష్ట సంస్కృతి, ఈ కార్పోరేటు వ్యవస్థది. అవినీతి సొమ్ముతో వక్రమార్గాన పోయి సాధించిన ర్యాంకులు వీళ్ళయి.

ఈ పరిస్థితిలో సాపకింద నీరులా పారిన ఈ ప్రైవేట్, కార్పోరేట్ దోపిడీ విధానాన్ని, మనకు తెలువకుండానే కడుపులో పేగుల్ని మాయం జేసే విధానాన్ని ఎవరికని ఫోన్ జేయాలే. ఏమని చెప్పాలే. మనమే అప్పుజేసి, ఉన్నభూమిని తాకట్టు పెట్టి, బతిలాడి పిల్లవాన్ని అందులో చేర్చడానికి సిద్దపడినపుడు వాళ్ళను ప్రశ్నించే అధికారం ఎక్కడుంటది. ఒకవేళ ప్రశ్నిస్తే తరువాత పరిణామాలకు ఎవరు బాధ్యులు.

ఈ అయోమయ స్థితిలో అతివిలువైన విద్యా రంగం. ఆపద సమయాలలో అత్యవసర ఫోన్‌లు పనిచేయక, పనిచేసిన న్యాయం జరగక బిక్క మొకంతో కుమిలిపోవడమే జరుగుతుంది.

అందుకని ఈ విషయంలో ఖచ్చితమైన ప్రభుత్వ నియంత్రణ ఉండాలె. కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలె. రాజ్యాంగం ప్రకారం పధ్నాలుగు సంవత్సరాల లోపు విద్యాలకు ఉచిత నిర్భంధ ప్రాధమిక విధ్యను అందించాలె. అలాంటి ప్రాథమిక విద్యకు అయ్యే ఖర్చు ఏ ఫోన్‌కాల్ తీర్చుతుంది. ఈ బడిబాధ ఎన్నడు తప్పుతది. విధ్యార్థులకు పుస్తకాల బరువు, తల్లిదండ్రులకు ఫీజుల మోత ఎన్నడు తప్పుతది. ఏఫోన్‌కు తీర్చే దమ్ముంది. కొరడా చేతిలో ఉంచుకొని కొట్టకుండా ఉంటే అదే కొరడాతో ఉరిపెట్టే ప్రమాదం ఉన్నది. ప్రస్తుతం విద్యారంగం పరిస్థితి అంతే. డి.ఇ.ఓ. లకు ఖచ్చితమైన ఆదేశాలు జారీచేసి ఆయా పాఠశాలల వసతులు, సౌకర్యాలను బట్టి గ్రేడ్‌లుగా విభజించి ఈ గ్రేడ్ వాళ్ళు ఇంతకు మించి ఫీజలు వసూలు చేయరాదనే ఒక కఠిన నిబంధనను తీసుకు రావాలె. అంతే కాకుండా ఫీజులు తప్ప ఇతర ఎలాంటి అంశాలలోను డబ్బులు వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలె. గైడ్‌లు కొసెన్‌బ్యాంకు పద్ధతిని పూర్తిగా నిర్మూలించాలె. ఆగైడ్‌లో, కొసెన్ బ్యాంకులో ఉపాధ్యాయులు అధ్యయనం చేసి పిల్లలకు బోధించాలె. రాయించాలె, చదివించాలె తప్ప పూర్తిగా పాఠ్య పుస్తకాలను గాలికొదిలేసి కొసెన్‌బ్యాంకులను ఫాలో కావడం చేతగానితనమే.

పిల్లల చదువు విషయంలో ఏమీ అర్దం కాని ఒక అయోమయ స్థితిలోకి నెట్టివేయబడుతున్నం. అర్థం లేని అభివృద్దిని, పెరుగుతున్న సాంకేతికతను గుడ్డిగా అనుసరిస్తున్నామే తప్ప అది ఎంతవరకు అవసరం అన్న సంగతే మరిచిపోతున్నం.

సమస్యను ఎక్కడికక్కడే పరిష్కరించే విధంగా పాలన యంత్రాంగం ఉండాలె తప్ప గోరంత అంశాన్ని కొండంతలు చేస్తూ సమస్యలు జఠిలం కావడానికి పరోక్షంగా కారకులవడం ఎంతవరకు సబబు. ఏదైనా సమస్య తలెత్తినపుడు మంత్రులు, ముఖ్యమంత్రి స్థాయిలో ఒక ప్రకటన చేయగానే సరిపోతుందా? ప్రకటించిన లేదా ఆజ్ఞాపించిన అంశం కింది స్థాయిలో అమలు జరిగే విధంగా దిగువ యంత్రాంగాన్ని కదిలించలేనపుడు ఎన్ని హెల్ప్‌లైన్లు, టోల్‌ఫ్రీ నెంబర్లు అందుబాటులోకొస్తే ఏం ప్రయోజనం ఉంటుంది. వాటి సక్రమ నిర్వహణకు కనీస బాధ్యత వహించనపుడు, కఠిన చర్యలు తీసుకోనప్పుడు ఎన్ని ప్రసంగాలు చేస్తే ఏం ప్రయోజనం.

అవినీతిని అక్రమాలను బట్టబయలు చేసినపుడు తనకు ఉన్న డబ్బునో, రాజకీయ శక్తినో ఉపయోగించి దొంగలంతా దొరల్లా చలామణి అవుతుంటే ఇగ సామాన్యుడు ఎట్ల బతక గలడు. అవినీతిని ఎలా ఎదిరించగలడు? ఫోన్‌చేసి ఎట్ల సమాచారాన్ని అందియ్యగలడు?

మన విద్యావిధానంలో సరళత పెరగాలె గాని మరింత సంక్లిష్టతలు ఎందుకు? చదువుల భారంత తగ్గాలె గాని వృత్తలేఖిని పట్టరాని చేతుల్లో భారీ ప్రాజక్టులెందుకు?



**నవంబరు 21 ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సాక్షిగా...**

# తెలంగాణ బెస్తోల్ల గోడు విందాం

మొత్తం ఈ భూమండలం మీద మూడొంతులు విస్తరించి ఉన్న నీటిలో అనేక రకాల జీవులు, విషపు పురుగులను గుర్తించి, వాటిలో మానవాళికి ఉపయోగకరమైన చేప జాతుల్ని సమాజానికి అందించే క్రమంలో ప్రాణాలను త్యాగం చేసిన మహనీయుల వారసత్వమే బెస్త కుటుంబం. సప్త మహాసముద్రాలను అలవోకగా దాటగల సామర్థ్యం గల బెస్తలు, ఆటు పోటులను లెక్క చేయక కెరటాలకు ఎదురీదుతూ, నిత్యం నీటిపై తేలియాడుతూ ఉప్పెనలు, సునామి గండాలను సైతం దాటుతుంటరు.

మనిషి విజ్ఞానానికి దోహదపడే అత్యంత విలువైన పోషక పదార్థాలు కలిగిన చేప మాంసాన్ని అందించిన ఘనత బెస్తలది.

గుండె ధైర్యంలోను సాహసవంతమైన జీవితంలోను బెస్తలు సమాజంతో ముందు వరుసలో ఉంటారని చెప్పడానికి ఎలాంటి సందేహం లేదు. సముద్రపు ఘోషను ఆలకిస్తూ అలల జూలు పట్టి సవారి చేసే సాహసం ఎలాంటిదో ఒక్కసారి ఊహించండి. బావిలో తొంగి చూస్తందుకు భయపడే మనుషులు, నీటిని చూసి ఆమడ దూరం పరిగెత్తే మనుషులున్న సమాజం మనది. అలాంటిది అతి భయంకరమైన, ప్రమాదకరమైన వృత్తిలో అను నిత్యం ప్రానాల్ని ఫణంగ పెట్టి జీవనం గడిపే బెస్తల్ని మించిన సాహసవంతులు ఎవరుంటరు? అంతే కాకుండా స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా 1857 లో జరిగిన సిపాయిల తిరుగుబాటును

ఒక బలమైన ఉద్యమంగా చెపుతున్నాం. కాని వాస్తవానికి దీనికన్న ముందు అనేక చిన్నచిన్న తిరుగుబాట్లు జరిగినయ్. అందులో భాగంగానే 1830 లో కోల్‌లు (బెస్తలు)జరిపిన తిరుగుబాటుకు ఎంతో ప్రాధాన్యత ఉందన్న సంగతి మరువరాదు.

అంతే కాదు ఈ రోజు రాష్ట్రంలోనే కాదు మొత్తం దేశంలోనే రాజకీయ నాయకులకు ప్రత్యక్షంగానో పరోక్షంగానో వాళ్లకు రక్షణ కల్పించే అతి కీలక స్థానాలలో బెస్తవాళ్ళు ఉండడం మనం గమనించవచ్చు.

తను నమ్మిన సిద్ధాంతం కోసం, వ్యక్తుల కోసం, పార్టీల కోసం ఎంతటి త్యాగానికైనా వెనుకాడని గొప్ప త్యాగధనులు బెస్తవాల్లు.

రాజులు, నవాబుల కోటలలో మహారాణులు సైతం బెస్తవాళ్ళు ఇంటిలో సేవకులుగా ఉన్నపుడు కూడా వాళ్ళ ముందు పరదాపద్దతి పాటించకుండ, ముఖం చాటేసుకోకుండా తిరిగే వాళ్ళంటే బెస్తలు ఎంత నమ్మకస్థులో మనం అర్థం చేసుకోవచ్చు.

అయితే దేశంలో గుజరాత్ తర్వాత రెండవ అతిపెద్ద తీరరేఖ 974 కి.మీ. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే ఉన్నది. కృష్ణా, గోదావరి, పెన్నా, మంజీర, మూసి వంటి నదులే కాక దాదాపుగా 103 రిజర్వాయర్లు, కొల్లేరు, పులికాట్ వంటి సరస్సులు, 72 వేల చెరువులు ఉన్నాయి.

మన చేపల ఎగుమతి వలన దేశానికి 6400కోట్ల విదేశి మారక ద్రవ్యం లభిస్తుంది. దీనిలో మన రాష్ట్ర వాటానే అధికం. దాదాపు 2500కోట్ల పైచిలుకు ఆదాయాన్ని సమకూర్చుతుంది. మనిషికి కావాల్సిన అత్యంత విలువైన పౌష్టికాహారాన్ని అందించడానికి ఎంతగానో కృషి చేస్తున్నది బెస్త జాతి బిడ్డలే.

చేపలలో అనేక రకాల ప్రోటీన్లు, విటమిన్లు మరెన్నో ఖనిజ లవణాలు సమృద్ధిగా లభిస్తున్నాయి. చేపలలో కొవ్వు శాతం చాలా తక్కువని, ఆహారం జీర్ణం కావడానికి చేపలు ఎంతగానో ఉపయోగపడతయని అనేక పరిశోధనలు, సర్వేలు తేల్చి చెప్పినయ్.

మానవ శరీరంలోని ఎముకల దృఢత్వానికి, దంతాల పటుత్వానికి, గుండె జబ్బుల నివారణకు, ఎర్రరక్త కణాల వృద్ధికి, కంటి జబ్బుల నివారణకు ఇలా అనేక రకాలుగా సర్వరోగ నివారిణిగా ఉన్న చేపలను అందించడంలో ఇక్కడి బెస్తలు, ఇతర మత్స్యకారులు ఎంతగానో కృషి చేస్తున్నరు.

అయినప్పటికినీ వారికి చేపలు అమ్ముకోవడానికి మార్కెట్లు కరువు. పైగా గ్రామాలలో వారికి అనేక రకాలు సమస్యలు. ఆక్రమణలు, అణిచివేతలు పెత్తందార్ల చెప్పుచేతుల్లో బెస్తలు, ఇతర మత్స్యకారులు అగమ్యగోచరంగ బతుకు ఈడుస్తున్నరు.

ఇక తెలంగాణలో దాదాపు 50,000 పెద్ద, చిన్న చెరువులు లెక్కలేనన్ని కుంటలే కాకుండ పాకాల, రామప్ప, లక్నారం, హుస్సేన్‌సాగర్, మీరాలం తటాకాలు అతి పెద్దవి.

తెలంగాణలో చాలా చెరువులకు సముద్రం (భీమసముద్రం, ఉదయసముద్రం) అనే పేర్లున్నయ్ అంటే వాటి విస్తీర్ణం, ఆయకట్టు ప్రాంతం ఎట్లాంటిదో మనం అర్థం చేసుకోవచ్చు. మరి ఈ రోజు ఆ చెరువులన్ని అదే ఆసంఖ్యలో ఉన్నయా? లేకుంటే ఏమైనయి? వాటిమీద ఎప్పుడైనా శ్రద్ధ కనబరిచినమా? చెరువులు, కుంటలు కబ్జాల పాలై బెస్తోల్లు రోడ్లమీద పడి చిన్నా చితక పనులు చేసుకుంటూ బొంబాయి, మద్రాసు వంటి పట్టనాలకు వలసపోయి బతుకుతుంటే వారిపట్ల ఇంకా వివక్ష చూపించడం ఎంతవరకు న్యాయం.

అనాదిగ చేపలు పట్టడమే వృత్తిగా బతుకుతున్న బెస్తలు కరువు కాలంలో కూడా ప్రభుత్వాలకు రకాలు కట్టి చెరువులను కాపాడుకుంటూ, సొసైటీలను బతికించుకుంటూ వచ్చింద్రు. అయితే తెలంగాణలో మెట్ట చెరువుల కారణంగా ఏడాది పొడవునా షికారి దొరకదు కాబట్టి బతుకు దెరువు నిమిత్తం ఇతర ప్రాంతాలకు వలసపోవలసి వచ్చింది. ఇదే సమయంలో స్థానికంగా ఉంటలేడన్న సాకుతో సభ్యత్వం తొలగించాలనడం అవివేకం, కుట్ర. అయినా షికారి సమయంలో ఎక్కడ ఉన్నా మళ్ళీ కూతవేటుతో పరుగెత్తుకుని వచ్చి షికారి చేస్తూ జీవనం గడుపుతున్న తరుణంలో స్థానిక అగ్రకుల నాయకులు ధనబలంతో, అధికార మదంతో బెస్తలను, మత్స్యసొసైటీలను చిన్నాభిన్నం చేస్తున్నరు. అనేక ఇబ్బందులకు గురిచేసి ఆయా జిల్లాల మత్స్యశాఖలను తమ గుప్పిట్లో పెట్టుకుని చెరువుల్లో సభ్యత్వం ఇవ్వాలంటు చేపలు పట్టుకోకుంట అడ్డుపడి నానా భీభత్సాన్ని సృష్టిస్తున్నరు. రాజకీయనాయకులు, పోలీసులు సైతం బెస్తల మొరను ఆలకించే పరిస్థితి లేదు. చెరువులు, కుంటలు, ఏర్లు ఎక్కడ నీల్లుంటే అక్కడ బుడ్డపర్కలు, సందమామలు, గెచ్చలు, తోలుగాల్లు, బుడ్డమట్టలు, జెల్లలు, రొయ్యల వంటి అనేక చిన్న సాపల్ని పట్టుకుంటు బతుకుతున్న క్రమంలో సొసైటీలుగా ఏర్పడి, ప్రభుత్వానికి రకాలు కట్టుకుంటూ బొచ్చెలు, రవ్వులు వంటి చేపపిల్లల రకాల్ని చెరువులో పెంచుతూ జీవనం కొనసాగిస్తున్నరు. అయితే మత్స్యశాఖ కమీషనర్ కార్యాలయంలో ఎక్కడ కూడ తెలంగాణకు సంబంధించిన చెరువుల పరిస్థితి, జీవన విధానానికి సంబంధించిన ఛాయాచిత్రాలు కనపడక పోవడం విడ్డూరం. తీరప్రాంతానికి సంబంధించిన స్టీమర్లు, సొరచేపల దృష్యాలే అదికం. అది ఎలా ఉన్న ఏడాదిపొడుగునా స్థిరంగా ఉంటూ వృత్తి జీవనం కొనసాగించే ఆంధ్ర ప్రాంతానికి, ఏడాదిలో నెలరోజులు కూడా షికారి దొరకని తెలంగాణ ప్రాంతానికి చాలా తేడా ఉన్నది. కాబట్టి ఆంధ్రప్రదేశ్ సహకార సంఘాల చట్టం 1964 లో కొన్ని సవరణలు చేసి తెలంగాణ ప్రాంతానికి కొన్ని విషయాలలో మినహాయింపు ఇవ్వాల్సిన అవసరం ఉన్నది.

"నీళ్ళు నిలిసి ఉన్న తావు కుంటగ జేసింది మనం
కంప కట్టె రాయి రప్ప తేటగ జేసింది మనం
నీటిలోన తిరుగాడె సాపపిల్లను బట్టి

ఒడ్డుమీద సాపలయ్యి తన్నుకొనుట ఏందనీ"

ఇక్కడ తీరప్రాంతం లేదు కనుక ఏడాది పొడగునా షికారి ఉండదు కాబట్టి ఒకే చోట ఉండి బతకడం సాధ్యం కాదు కాబట్టి చేపలు పట్టే బెస్త వృత్తిదారులు స్థానికంగా ఉండాలన్న నిబంధన (1964 క్లాజ్25) నుండి తెలంగాణ ప్రాంతానికి మినహాయింపునివ్వాలి. చెరువుకింద భూమి ఉన్నా లేకున్నా, చెరువులోని ప్రతిసభ్యునికి నీటిసంఘం ఎన్నికలలో ఓటుహక్కు కల్పించాలె. నీటి సంఘాల బాధ్యతలను మత్స్యసొసైటీలకే అప్పగించాలె.

పుట్టుకతోనే చేపలు పట్టే వృత్తిలో పడి అవమానాల్ని పొందిన బెస్తలకే వృత్తిఫలాలు అందేలా చర్యలు చేపట్టాలి. వృత్తిరిత్యా బెస్తవాళ్ళను ఎట్టి పరిస్థితిలోను బోగస్ సభ్యులు అనడానికి వీలు లేదు. బోగస్ సభ్యుల జాబితానుంచి బెస్తవారిని మినహాయించాలి. తెలంగాణలోని బెస్తవృత్తి దారులకు ప్రత్యేక ప్యాకేజి ప్రకటించాలి. కేంధ్ర సహకార సంఘంలో మత్స్యపారిశ్రామిక సహకార సంఘానికి సభ్యత్వం కల్పించాలి. వృత్తి పరీక్షలు నిర్వహించే ఫిషర్‌మెన్ పోస్టులలో బెస్తవారినే నియమించాలి. మత్స్యశాఖలో 60 శాతం ఉద్యోగాలు బెస్తవాళ్ళతోనే భర్తీ చేయాలె.

చెరువుకుంటలు ఏ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్నా ఆయా సొసైటీలకే వర్తింప చేయాలి. చెరువు కుంటల్ని పరిరక్షిస్తూ బెస్తవారిని ఆదుకోవాలె.

రాష్ట్రంలో చేపల వేటమీద ఆధారపడి దాదాపుగా 14 లక్షల కుటుంబాలకు పైనే జీవిస్తున్నారు. 4700 మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలు ఉన్నవి. వీరిలో బీసి. ఎ క్రమసంఖ్య ఒకటి లోని పదిహేను కులాలు మాత్రమే పుట్టుకతోనే చేపలు పట్టేవారుగా (బోనఫైడ్ ఫిషర్‌మెన్) గుర్తించడం జరిగింది. బెస్తలు అనేక గిరిజన సంప్రదాయాలు కలిగి ఉండడం మూలంగా వీరిని ఎస్.టి జాబితాలో చేర్చాలన్న ప్రతిపాదన కూడా బలంగా ఎప్పటినుండో ఉన్నది. అయితే క్రమంగా చేపల వేటలో ఎస్సీ, ఎస్టీలు, ఇతవ వెనుకబడిన కులాలు, అగ్రకులాల వారు సైతం మత్స్యకారులనే పేరుతో చేపల వేటలోకి ప్రవేశించి గంగపుత్రులైన బెస్తోల్లను ఎస్.టి జాబితాలో చేర్చాలన్న ప్రతిపాదనకు గండి కొడుతున్నరు. ఈ క్రమంలో ప్రభుత్వం వారు గుడ్డిగా అసలు వృత్తి దారులను పక్కన పెట్టి వృత్తికి సంబంధం లేని ఎస్సీ, ఎస్టీలకు సబ్సిడీ కింద వృత్తి పనిముట్లను అందిస్తున్నరు. ఎస్సీ, ఎస్టీలుగా, ఇతర బీసీ కులాలుగా వారు వాళ్ల కులాలకు సంబంధించిన, వృత్తులకు సంబంధించిన అన్ని రకాల లాభాలు పొందుతూ అదనంగా మత్స్యకారులుగాకూడ లబ్ది పొందుతూ రెండు రకాలుగా లాభం పొందుతున్నరు. అనాదిగా చేపలు పట్టడమే జీవనాధారంగా బతికే బెస్తలు అరకొర జీవితంతో పడరాని పాట్లు పడుతు కనీస సామాజిక చైతన్యం లేకుండా బతుకుతున్నరు.

పూర్తిగా గిరిజన సంప్రదాయం కలిగిన బెస్తలను ప్రభుత్వం ఎప్పుడో ఎస్.టి జాబితాలో చేర్చవలసి ఉండగా ఇప్పటివరకు ఆ విషయాన్ని జాప్యం చేయడం వలన బెస్తల

జీవన స్థితిగతులు అంతకంతకు దిగజారుతున్నాయి. పైగా వారికున్న బి.సి.ఎ. రిజర్వేషన్‌ను ఇతరులు దొంగచాటుగా తప్పుడు కుల ధృవీకరణ పత్రాలు పొంది బెస్తలకు అన్యాయం చేస్తూ వస్తున్నరు. క్రీమ్‌లేయర్ గుర్తించిన కులాలను ఏకంగ ఓసీలుగా గుర్తించవలసిన సంధర్భంలో వాళ్ళు సైతం బి.సి.'ఎ' రిజర్వేషన్ జాబితాలో చేర్చాలని పట్టుపడుతున్నరు. అయినా మన పాలకులు వాళ్ళకు హామీలు ఇస్తున్నరు. ఈ విధంగ ఈ జాబితాలోని కులాల అజ్ఞానాన్ని, అనైక్యతను ఆసరాగా చేసుకొని ఇతర వెనకబడిన వర్గాలవారు బి.సి.ఎ రిజర్వేషన్‌ను కొల్లగొట్టాలని చూస్తున్నరు. ఆ జాబితాలోని బెస్తలను అన్నిరంగాలలో అనగదొక్కే ప్రయత్నం చేస్తున్నరు.

తెలంగాణ విషయానికొస్తే రాష్ట్ర బౌగోళిక పరిస్థితుల దృష్టా ఎంతో తేడా మనకు కనిపిస్తుంది. ప్రధానంగా తెలంగాణ సముద్రతీరం లేని ప్రాంతం.

దురదృష్టవశాత్తు మనవాళ్లు కరువుకాలంలో ఇతర ప్రాంతాలకు వలసపోవడం మూలంగా సభ్యుల సంఖ్య తగ్గిన మాట వాస్తవం. కానీ బెస్తలు సరిపడా సభ్యులు ఉన్న తరువాత వేరెవరికీ చెరువుల్లో సభ్యత్వం ఇవ్వాల్సిన అవసరం లేదు.

సొసైటీల అస్తవ్యస్థ విధానానికి అధికారులే కారణమైతున్నరు.

గోరంత సమస్యను కొండంత చేసి లంచాలకు మరిగిన మత్స్యశాఖ అధికారుల అవినీతి భాగోతాన్ని నిరోదించక పోతే మత్స్య సొసైటీలు అడుక్కుతినే పరిస్థితి వస్తుంది. ఇక్కడ చెరువు కుంటలు సజావుగా సాగుతున్నయంటే అధికారుల భాగస్వామ్యం ఉండాలె. లేదంటే సొసైటీల మీద వచ్చె ఆదాయంలో అధికారులకు వాటాలు పంచాలె. అప్పుడుగాని ఏ సమస్యలు ఉండవు. లేదంటే రోజుకో ఉత్తర్వు, పూటకో రూలు పుట్టుకొచ్చి సొసైటీలు కోర్టుల సుట్టు తిరగవలసిందే. అప్పులు జేసి లాయర్లను బతికించవలసిందే.

ఈ మధ్య కాలంలో నల్లగొండ జిల్లాలోని ఎనిమిది రిజర్వాయర్లలో చేపలు పట్టడం ద్వారా నీరు కలుషితం అవుతుందన్న దురుద్దేశంతో చేపల వేట నిలుపుదల చేయాలని ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. అయితే ఏ మాత్రం అవగాహన లేకుండా తీసుకున్న ఈ నిర్ణయం వెనక ఎంత రాజకీయ అవినీతి క్రీడ సాగుతుందో చూస్తే మనది ప్రజాస్వామ్య దేశమేనా అనిపిస్తుంది. ఎందుకంటే నీటిలో చేపలను పెంచడం వలన ఫ్లోరిన్ వంటి విషపూరిత రసాయన వ్యర్థ పదార్థాలను హరించివేయడమే కాకుండా, బెస్తవాల్లు చేపల వేట చేసే క్రమంలో వలలు, ఇతరత్రా పరికరాల ద్వారా చెత్త చెదారాన్ని తొలగించి వేయడం జరుగుతుంది.

రిజర్వాయర్లలో ఉండే లోతైన నీటి కారణంగా చేపలు పట్టడం ద్వారా నీరు కలుషితం అయ్యే అవకాశమే లేదు. కేవలం కొందరి వ్యక్తుల స్వార్థ ప్రయోజనాల కోసం మత్స్యసంఘాల అభివృద్ధికి ఆటంకం కలిగించాలని చూడడం సరైనది కాదు. ఇంకా మీరు చేయగలిగితే

పట్టణాలలోని వ్యర్థపదార్థాలను, మున్సిపాలిటివారి చెత్త చెదారాలను, పరిశ్రమల నుండి వెలువడే విషపూరిత రసాయనాలను చెరువులు, రిజర్వాయర్ల పరిసర ప్రాంతాలలోకి చేరకుంట జాగ్రత్తలు తీసుకోవాలె. ఫెర్రో అల్లాయిస్ లాంటి విషపూరిత పరిశ్రమలు, ఖర్మాగారాలను నీటి వనరుల దరిదాపుల్లోకి రాకుంట చేయాలె. అంతేగాని రిజర్వాయర్లలో బెస్తోల్లు, ఇతర మత్స్యకారులు చేపలు పట్టడం మూలంగానే నీరు కలుషితం అవుతుందనడం అవివేకం.

అనేక కుట్రలు, కుతంత్రాలతో బెస్తలను వాళ్ళ కులవృత్తికి దూరం చేసి, వృత్తికి సంబంధం లేని వాళ్ళు రాజకీయ పలుకుబడిగల దళార్లు, ఇతరులు, ధనబలంతో, అధికార మదంతో మత్స్యసొసైటీలను చిన్నాభిన్నం చేస్తున్నరు.

బెస్తవృత్తిదారుల మీద పెత్తనం చెలాయించాలని చూస్తున్నరు. మత్స్యశాఖను తమ గుప్పిట్లో పెట్టుకుని చెరువుల్లో సభ్యత్వం ఇవ్వాలంటు చేపలు పట్టకుండ అడ్డుపడి నానా భీభత్సాన్ని సృష్టిస్తున్నరు.

బెస్తలు సముద్రాలు, చెరువులు, చేపలే తన ప్రపంచంగా ఇతర సమాజం చేత వెలివేయబడినట్లుగా బతుకుతూ అగ్రవర్ణపాలకుల కుట్రలను అర్థం చేసుకోలేక అనేక అవమానాలు పొందుతున్నరు. సామాజిక, రాజకీయ అణచివేతకు గురైతున్నరు. ఆర్థిక పరిపుష్టిని సాధించడంలో వెనకబడుతున్నరు. నీతికి న్యాయానికి కట్టుబడి సంఘజీవనం గడిపిన వారిలో ఆద్యులు. ఏప్రాంతంలో ఏపేరుతో పిలువబడుతున్న వాళ్ళంత ఒక్కజాతి బిడ్డలు ఆ గంగమ్మతల్లి ముద్దుబిడ్డలు, గంగపుత్రులు మన బెస్తోల్లు. జీసస్‌క్రీస్తు చరిత్రలో కూడ బెస్తల గురించిన అంశం ఉన్నదంటె మనది ఎంత ప్రాచీన జాతో అర్థం చేసుకోవచ్చు. మన చిన్నతనంలో సముద్రం మీదికి చేపల వేటకు వెళ్లినపుడు, రేడియోలోను, టీవీలలోను తుఫాను హెచ్చరికల కేంద్రం వారు “బెస్తవారిని సముద్రం పైకి వేటకు వెళ్ళరాదు” అని హెచ్చరించడం జరిగేది. ఆ తరువాత బెస్తవారు కాస్త జాలర్లుగా మారింది. ఇప్పుడు ఆ జాలర్లు కూడా పోయి మత్స్యకారులుగా మారింది. నోరున్నోనిదే కాలం అన్నట్టు–నిజాన్ని అబద్ధం చేయగలిగే వానిదే లోకం అన్నట్టు తయారయ్యింది.

సహకార సంఘాలు ఏర్పడిన నాటి నుంచి అన్నిరకాల సబ్సిడీలు ఇతరులే పొందుతూ నిజమైన బెస్త వృత్తిదారుల్ని దినసరి కూలీలుగా మార్చుతున్నరు.

మత్స్యశాఖ అనేది ఒకటి ఏర్పడిన నాటి నుంచి ఈనాటి వరకు వృత్తికి మూలమైన బెస్తలకు సంబంధించి ప్రత్యేకించి ఏ ఒక్క సంక్షేమ పథకం లేదంటే ఆశ్చర్యం లేదు.

ఆ విషయమై అడిగిన నాయకులు ఒక్కరు లేరు.

రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతి సంవత్సరం మత్స్య సంపద ఎగుమతుల ద్వారా 2600కోట్ల రూపాయల విదేశీ మారక ద్రవ్యం ఆదాయంగా వస్తున్నది. వీటిలో 57.4శాతం సముద్ర

చేపల ద్వారా లభిస్తే, భూబాగంలో మంచినీటిలో దొరికే చేపల ద్వారా దాదాపుగా 42.6 శాతం ఆదాయం లభిస్తున్నది. కాని నిధుల కేటాయింపులోను, ఖర్చుచేయడంలోను తెలంగాణ ప్రాంతానికి పూర్తిగా అన్యాయం జరుగుతున్నది.

అందుకే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితెనన్న బెస్తల బతుకుల్లో మార్పు వస్తుందని, కనీసం మా బాధలు చెప్పుకునే అవకాశం ఉంటుందని ఎదురు చూస్తున్నాము.

## ఆధునిక ఫూలేలు ఆవిర్భవిస్తేనే

# బహుజనుల బతుకుల్లో వెలుగు



**"ప్రతి గ్రామంలోనూ శూద్రులకు**
**పాఠశాలలు కావాలి. కాని అందులో**
**బ్రాహ్మణ ఉపాధ్యాయులు మాత్రం వద్దు.**
**దేశం అనే దేహానికి శూద్రులు ప్రాణం. రక్తనాళాల వంటివాళ్ళు.**
**అందుచేత ప్రభుత్వంవారు తమ ఆర్థిక రాజకీయ కష్టాల నుంచి**
**గడిచి గట్టెక్కడానికి ఎప్పుడూ ఆధారపడవలసింది**
**శూద్రుల మీదే కాని బ్రాహ్మల మీద కాదు" -మహాత్మ జ్యోతిరావు ఫూలే.**

అగ్రవర్ణ భావజాలంతో అట్టుడికి పోతున్న భారతీయ సమాజంలో 1827 ఏప్రియల్ 11న మహారాష్ట్రలోని పూనేలో జన్మించిన జోతీరావు ఫూలే నేటికి అనేక సామాజికోద్యమాలకు ఆధ్యుడుగా నిలిచిండు. బ్రాహ్మలు, మనువాదుల ఆగడాలను, ఆకృత్యాలను చూసి చలించి, మనుషుల విభజనకు కారణమైన మతాలను అవపోసన పట్టి అట్టడుగు సమాజానికి ఒక దిశానిర్దేశం చేసిన కులనిర్మూలనా పోరాట యోధుడు ఫూలే. అనునిత్యం అణగారిపోయిన దళితుల జీవితాలలో వెలుగులు చూడాలనుకున్న నిత్య కృషీవలుడు. అహర్నిశలు వారి అభివృద్ధి కోసం ఎన్నో అవమానాలను భరించిన మహనీయుడు జోతీరావు ఫూలే.

భారతరత్న డా॥బి.ఆర్. అంబేద్కర్ తనకున్న ముగ్గురు గురువులలో ఫూలే ఒకరని చెప్పడం, గాంధీజి స్వయంగా జోతీరావు ఫూలేని మహాత్ముడని పిలవడం మనం ఎంతగానో గర్వించదగిన అంశాలు.

మహాత్మ జోతీరావు ఫూలే తన జీవితంలోని సుఖ భోగాలను త్యాగం చేసి దళితుల జీవితాలలో వెలుగులు నింపడానికీ తానో దిక్సూచిగా నిలబడిన ధీరోదాత్తుడు.

మహాత్మ జోతీరావు ఫూలే 1890 నవబంబరు 28న భౌతికంగా ఈ సమాజానికి దూరమైనా శూద్రుల బతుకుల్లో నిరంతరం జ్ఞానదీపమై చీకట్లను చీల్చుతూనే ఉన్నడు. దాదాపు 125 సంవత్సరాల క్రితం చనిపోయిన ఫూలే మహనీయుని గురించి ఈనాడు మనం మాట్లాడుకుంటున్నామంటే ఈ సమాజం మీద అతని ప్రభావం ఎంత బలమైందో అర్థం చేసుకోవచ్చు. అయితే ఏ జాతి బాగుకోసమైతే ఫూలే ఉద్యమించాడో, ఏయే రూపాలలో తన నిరసనను వ్యక్తం చేశాడో వాటిపట్ల కనీస అవగాహన కూడా లేకుండా ఫూలే ఆశయాలను

సాధిస్తామని మనమంతా మొక్కుబడిగా మొత్తుకుంటున్నామేమో అనిపిస్తుంది చాలసార్లు. అయినా నా పిచ్చి కాకపోతే విగ్రహారాధనను ఖండించిన బుద్ధునికే విగ్రహాలు పెట్టిన ఈ లోకంలో, కులాలకు, మతాలకు అతీతంగా మానవీయ కోణంలో ఉద్యమించిన మహనీయులకు కుల మతాలను అంటగట్టి సంకుచిత స్వభావంతో మసలుకుంటున్న ఈ సమాజంలో మార్పును కోరుకోవడం కూడ అత్యాశే అవుతుందేమో!

తల్లికడుపులో పిండదశనుండి మనిషి ఆఖరి మజిలీ అయిన మరణం దాక, చనిపోయిన అనంతరం జరిపే ఖర్మకాండల దాకా బ్రాహ్మలు చేసే మోసాలను ఫూలే అనేక రూపాలలో అందరికీ అర్ధమయ్యే రీతిలో ప్రచారం చేసిండు. నోములు, వ్రతాలు, పూజావిధానాలలోని గుట్టును అద్భుతమైన పాటలు, నాటకాల రూపంలో ప్రదర్శన చేసిండు. చిరంజీవి, సర్వాంతర్యామి అని ప్రచారంచేసిన పరశురామునికి దమ్ముంటే నా ఇంటికి రమ్మని సవాలు చేసిండు. మానవ మనుగడను దెబ్బతీసి, మనుషుల మధ్య అంతరాలు సృష్టించే ఏ మతాన్నయినా ఫూలే నిరసించిండు. మూఢ నమ్మకాలను, అంధ విశ్వాసాలను ఎండగట్టిండు. ఎంతో సాహసంతో అగ్రవర్ణ కుట్రలను తిప్పి కొట్టిండు. దళితులకు ఆత్మస్థైర్యాన్ని కలిగించిండు. అయినా ఎక్కడేసిన గొంగడి అక్కడే అన్నట్టుగా మనం ఇప్పుడు ఎక్కడున్నమో, ఏంచేస్తున్నమో అర్థం గాని పరిస్థితి నెలకొని ఉంది.

మనం బతుకుతున్న తీరును ఒక్కసారి చూసుకుంటే మరి మనం ఫూలే వాదులమా! అంబేద్కర్ వాదులమా! లేదంటే పురాణ కాలక్షేపం చేస్తున్న పుణ్య పురుషులమా?

ఆ మహనీయుల మార్గంలో పయణిస్తూ మనం చేస్తున్నది ఏమిటో ఒక్కసారి వెనుదిరిగి చూసుకోవలసిన బాధ్యతైతే మన మీదే ఉన్నది.

మహాత్మ జోతీరావు ఫూలేని గురించి మాట్లాడాలంటే బ్రాహ్మణీయ భావజాలం గురించే మనం చర్చించాల్సి ఉంటది. నిచ్చెనమెట్ల కులవ్యవస్థ గురించే మాట్లాడవలసి ఉంటది. మరి ఎపుడో మూడువేల సంవత్సరాల క్రితం భారతదేశానికి వచ్చినటువంటి ఆర్యులు సృష్టించిన వేదాలు, పురాణాలు, ధర్మసూత్రాల ఆధారంగా ఏర్పడిన ఈ అపవ్యవస్థను గురించి ఇప్పుడు మాట్లాడుకోవలసిన అవసరం ఉందా? అని చాలామందికి అనిపించవచ్చు. ఎంతోమంది రాజులు, చక్రవర్తులు, ముస్లీం పాలకులు, బ్రిటీషువారి పాలన అనంతరం స్వాతంత్రం సిద్ధించి దాదాపు అరవై సంవత్సరాలు కావస్తున్న నేటి తరుణంలో కూడా ఇంకా వేదాలు, బ్రాహ్మలు, మనువాదుల గురించి మాట్లాడవలసిన ఆవశ్యకత ఉందా అనే సందేహం కూడా కలగవచ్చు. అయితే వాటిని గురించి మాట్లాడుకోవలసిన అవసరం ఉందనేదే నా కచ్చితమైన అభిప్రాయం. ఎందుకంటే నేటి సమాజంలో కూడా అదే వర్ణధర్మపాలన అన్ని రంగాలలో నిరాటంకంగా కొనసాగుతుందనేది జగమెరిగిన సత్యం. ఇది అనేక సంఘటనల ద్వారా ఎన్నోసార్లు రుజువైంది కూడా.

ఈ కరుడు గట్టిన బ్రాహ్మణీయ భావజాలానికి వ్యతిరేకంగా మొట్టమొదట చార్వాకులు, లోకాయతులు, వర్ధమాన మహావీరుడు, గౌతమ బుద్ధుడు, పూలే, అంబేద్కర్‌ల దాకా నిరంతరాయంగా రాజీలేని నిస్వార్థ పోరాటం కొనసాగింది. వీళ్ళ పోరాటమంతా ఎక్కడా శక్తి వంచన లేకుండా ఒకదానికొకటి కొనసాగింపుగా జరిగింది. అయితే ఇప్పటికీ ఈ పోరాటాలు కొనసాగుతూనే ఉన్నయి. కాకపోతే వాటి రూపాలు, పోరాట దృక్పథాలలోనే అనారోగ్యకర మార్పులు చోటు చేసుకుంటున్నయి. అంబేద్కరిజపు ఆరంభకుడు పూలే అన్న సత్యాన్ని కూడా విస్మరించి ఎవరికి తోచిన రీతిలో వాళ్ళు తలో దారిలో తలమునకలవుతున్నరు.

శత్రువు ముందు బలహీనపడి బానిసలకు బానిసలుగ బతుకుతున్నరు.

ఈ దురవస్థ నుండి మనం బయట పడాలంటే ఈరోజు పూలేని గురించి మనం మాట్లాడుకోవలసిన అవసరం కచ్చితంగా ఉన్నది. కొందరైనా ఆధునిక పూలేలుగా ఆవిర్భవించ వలసిన ఆవశ్యకత ఏర్పడింది.

ఆర్యులు మొట్టమొదట ఈ మానవ సమాజాన్ని బ్రాహ్మలు, క్షత్రీయులు, వైశ్యులు, శూద్రులు అనే నాలుగు వర్ణాలుగా సృష్టించింద్రని, వీళ్ళంతా ఎవరెవరు, ఏ విధంగా ఊడిపడ్డరో, నాటి సమాజంలో నాల్గవ వర్ణమైన శూద్రుల స్థానం ఏమిటో, చరిత్రకారులు, సామాజిక ఉద్యమ కారులైన పూలే అంబేద్కర్‌ల పుణ్యమాని బ్రాహ్మల కుట్రలు ఏమిటో మనం కూలంకషంగా తెలుసుకోగలిగినం. మన మహనీయుల చరిత్రల ఆధారంగా చూస్తే ఇపుడు అగ్రకులాలుగా చలామణి అవుతున్న చాలామంది అసలు అగ్రకులాలే కాదనే విషయం కూడా మనకు అర్థమైతుంది. అందుకే నేను పై మూడు వర్ణాలను ముగ్గురు వ్యక్తులుగా, మిగిలిన శూద్ర వర్ణాన్ని మొత్తం 30మందిగా ఉదహరించ దలుచుకున్నాను.

సహజంగా నక్కజిత్తులు, కుటిల ఎత్తుగడలతో కూడిన బ్రాహ్మలకు కాలక్రమేణా ఒక ఆలోచన వచ్చి శూద్రులనే పేర వీళ్ళందరిని (ఆ30 మందిని) ఒక తాటితో కట్టివేస్తే పైనున్న మా ముగ్గురిని కుసులకు కూలదోయడం ఖాయమని భావించిన బ్రాహ్మలు 30లో ఒక 10 మందిని పంచములనే పేర మరో వర్గంగా చీల్చి వేసింద్రు.

ఆ పదిమంది ఈ ఇరవై మంది ఒకే విధమైన ఆలోచనతో ఉండకుండా, వాళ్ళెపుడూ కలవకుండా జాగ్రత్త పడుతూ వచ్చింద్రు. ఒకరంటే ఒకరికి అసహ్య భావం కలిగేటట్టు చేయగలిగింద్రు. ఆ తర్వాత మళ్ళీ కొన్ని వందల సంవత్సరాల తర్వాత ఆ 10మంది కలిసిఉన్నా, ఈ 20మంది ఏకమైనా మా ముగ్గురిని చీల్చి చెండాడుతరనే విషయాన్ని గ్రహించిన బ్రాహ్మలు తమ సూక్ష్మబుద్ధితో అనేక కట్టుకథలు సృష్టించింద్రు.

కర్మ సిద్ధాంతాలను బోధించి శక్తిహీనుల్ని చేసింద్రు.

రాజ్యాధికారం ఎప్పుడు పై మూడు వర్ణాల చేతుల్లోంచి జారిపోకుండ జాగ్రత్త పడ్డరు. చాలాసార్లు బ్రాహ్మల ఆధిపత్యాన్ని ప్రశ్నించినందుకు క్షత్రీయులను కూడా కొన్ని విషయాలకు

దూరంగా ఉంచింద్రు. జంధ్యం, గాయత్రీ మంత్రాలలో ఏదో శక్తి దాగి ఉన్నట్టు అభూత కల్పనలు చేసి ఆ రహస్యాలను వేరెవరికి తెలియకూడదన్నట్టు నటించింద్రు. ఈ విషయం శివాజి పట్టాభిషేకం సమయంలో మనకు చాలా స్పష్టంగ కనిపిస్తది. వాస్తవానికి వాటిలో ఏమి లేదనే విషయాన్ని పూలే, అంబేద్కర్‌లు ఎన్నో సార్లు రుజువు చేసింద్రు. అనాదిగా రాజ్యాధికారం పై మూడు వర్ణాలలో ఎవరిదైనా నిర్ణయాధికారం మాత్రం బ్రాహ్మల చేతిలోనే ఉంచుకున్నరు. ఆ తర్వాత పంచములుగా పిలువబడుతున్న ఆ 10మందిని కూడ కలవకుండ మళ్ళీ వాళ్ళని అనేక నీచమైన పేర్లతో పిలుస్తూ అస్పృశ్యులుగా చిత్రీకరించింద్రు. వీళ్ళను గుర్తించుటకు గాను మెడలో నల్లని దారాలు ధరించాలని ఆజ్ఞాపించింద్రు. అర్థం లేని కఠిన నిబంధనలతో ఘోరాతిఘోరంగా శిక్షలు విధించింద్రు.

అదేవిధంగా శూద్రులుగా పిలువబడుతున్న 20మందిని ఇరవై తీర్లుగా వేరు చేయగలిగింద్రు. ఒకరినొకరు కలవకుండ కట్టుదిట్టమైన కథలు ప్రచారం చేసింద్రు.

అయితే ఈ శూద్రుల్లోని కొందరు అనుకరణ ప్రభావంతో బ్రాహ్మలు ధరించే జంధ్యం ధరించాలని ఆరాట పడ్డరు. మేము సైతం బ్రాహ్మలమేనని జబ్బలు చరుచుకున్నరు.

"జంధ్యం మెడకు వేసుకోవాల్న, భుజానికి వేసుకోవాల్న" అన్నంత ఆత్రంగ మిగతా శూద్రులను తక్కువగా చూడడం మొదలు పెట్టింద్రు.

ఈ విధంగ శూద్రవర్ణంలోని 20మంది ఒకరికంటె ఒకరు మేమే ఎక్కుంటె మేమె ఎక్కువని, ఎవరికి వారు బద్ధశత్రువులుగ తయారయ్యింద్రు. కాదుకాదు అనేక కుట్రలతో ఆ విధంగా తయారు చేయగలిగింద్రు బ్రాహ్మలు.

శూద్రులంత వారివారి కులవృత్తులలో తీరిక లేకుండ ఉండడంతో వాళ్ళను మిగతా సమాజానికి దూరంగ ఒంటరిగ బతికేటట్టు చేయగలిగింద్రు.

ప్రస్తుతం పంచములుగా మనం ఎస్సీ,ఎస్టీలను అనుకుందాం. శూద్రులుగా బీసీలను అనుకుందాం. పైనున్న మూడు వర్ణాలను ఓసీలుగా భావిద్దాం. అంటే ఎస్సీ, ఎస్టీలు 10మందిగాను, బీసీలు 20మందిగాను, ఓసీలు ముగ్గురని అనుకుంటే రాజ్యాధికారం సులభంగ ఎవరిచేతుల్లోకి వెళ్ళే అవకాశం ఉందని అడిగితే ఎవరైనా ఏంజెప్తరు. వెంటనే బీసీలకేనని సమాధానం ఇస్తరు.

కాబట్టి ఈ స్వతంత్ర భారతదేశంలో ప్రస్తుతం ఉన్న 100కోట్ల జనాభాలో బీసీలు 50గా, ఎస్సీ, ఎస్టీలు 30గా, ఓసీలు 20గా అంచనా వేద్దాం.

ఎట్ల చూసిన ఎవరి అవసరం లేకుండా రాజ్యాధికారాన్ని దక్కించుకునే అవకాశం ఎవరికుంది? ఎట్ల చూసినా ఒక్క బీసీలకే ఉంది. లేదంటే అటీటుగా ఎస్సీ,ఎస్టీలను కలుపుకుంటే ఓసీలకు కూడా ఉంది. అందుకే అధికారంలో ఉన్న ఎవరైనా ఎస్సీ, ఎస్టీల గురించి వాళ్ళ హక్కుల గురించి మాత్రమే మాట్లాడతరు తప్ప బీసీలను గురించి ఎవరూ

మాట్లాడరు. అందుకే ఎక్కడ కూడా ఎస్సీ, ఎస్టీలను బీసీలతో కలవనీయకుండ ఈ అగ్రవర్ణ పాలకులు జాగ్రత్త పడుతుంటరు. ఈ తంతూ వేల సంవత్సరాల బ్రాహ్మల ఎత్తుగడల్లో భాగంగానే కొనసాగుతుంది.

అంబేద్కర్ ఎంత ప్రయత్నం చేసినా అనేక సవరణలు చేయించి అగ్రవర్ణాలకు అనుకూలంగానే రాజ్యాంగం ఉండేలా తగు జాగ్రత్తలు పడ్డారని చెప్పక తప్పదు. వాళ్ళకు అణిగి మణిగి ఉండే వాళ్ళకోసం ఏవో కొన్ని చట్టాలను చేసి, కొన్ని హక్కుల్ని కల్పించారేమోనని కూడా అనిపిస్తుంది.

అది పురాణ కాలంలోనైనా, చరిత్రలోనైనా, ఇటు స్వతంత్ర భారతదేశంలోనైనా అత్యంత ఘోరంగా అణిచివేతకు గురైనది, నేటికీ గురైతున్నది బీసీలుగా ముద్రపడిన శూద్రవర్ణం వారే. ఎస్సీ,ఎస్టీలకు ఒక భావసారూప్యం లేకపోయినా రాజ్యాంగ పరమైన హక్కుల కోసమైనా వాళ్ళు ఒక్కటిగా కలిసి ఉండవలసిన అవసరం ఏర్పడింది. కాని బీసీలకు ఏ ప్రాతిపదిక లేదు. కాబట్టి వాళ్ళలో ఐక్యతను కలిగించే అంశాల జోలికి ఈ పాలకులు ఎప్పటికీ వెళ్ళరు.

ఎస్సీ,ఎస్టీ,బీసీలు కలవకుండా ఉండడం కోసమే, శూద్రులను ఎప్పటికప్పుడు విడదీయడం కోసమే రామాయణ, మహాభారత గాథలను సృష్టించారంటే అతిశయోక్తి కాదు.

ఆ కట్టుకథలు, పుక్కిటి పురాణాలకు చిత్రమైన సామెతలు, కల్పిత కథలను జోడించి అనేక కళారూపాల ద్వారా నేటికి ప్రదర్శిస్తూనే ఉన్నరు. ఏదేమైన శూద్రులంత ఒక్కటిగా కలవకుండ చేయగలుగుతున్నరు. శూద్రలేమో అతిశూద్రులుగా, దళితులుగా, బహుజనులుగా, ఆదివాసులుగా, గిరిజనులుగా, మాలలుగా, మాదిగలుగా, బెస్తలుగా, బోయులుగా, గౌడ్‌లుగా, యాదవులుగా ఇట్ల ఎవరికి వాళ్ళు వేరై రాజ్యాధికారం గురించి మాట్లాడటం అత్యంత బాధాకరమైన అంశం.

అగ్రవర్ణాలు ఆశించినట్టుగానే శూద్రులు నడుచుకోవడం చూస్తుంటే రక్తం మరుగుతుంది. అగ్రవర్ణాలకు చెందిన నాయకులు జాతియ నాయకులై ప్రపంచవ్యాప్తమవుతుంటే, శూద్రవర్ణాల బాగుకోసం ప్రపంచ దేశాలను మెప్పించిన జాతియ నాయకులను ఏకంగా కుల నాయకులను చేసి సంబరాలు చేయడం నిజంగా సిగ్గుచేటనిపిస్తుంది.

ఆ మహనీయుల ఆశలకు, ఆశయాలకు గండికొట్టి గంగిరెద్దుల్లా తలలూపుతూ, గానుగెద్దుల్లా తిరుగుతుండడం ఎవర్ని బాగుచేయడానికి? ఎవరిని బలిపెట్టడానికి?

అందుకే నేనేమంటున్నానంటే శూద్రలంతా అనేక పేర్లతో గుర్తింపు పొందుతూ రాజకీయాధికారం సాధించాలంటే అయ్యేపనికాదు. అందరూ కలిసికట్టుగా ఏకరూపంగా కదిలితేనే అది సాధ్యం అయితది.

అందుకు బహుజనులనో, బలమైన సామాజికవర్గమనో నూతన దృక్పథంతో ఉద్యమించవలసి ఉందనేది నా భావన.

సమాజంలోని మెజారిటీ ప్రజలందరూ బహుజనులుగా, ఒక బలమైన సామాజిక వర్గంగా  ఐక్యమైనపుడే ఏదైనా సాధ్యమవుతుందనేది నా ఆలోచన.

"నశూద్రాయ మతిం దద్యాత్" శ్లోక అర్థం మీ అందరికి తెలియనిది కాదు. శూద్రునికి చదువు చెప్పకూడదనేదే దీని భావం. ఇది ఎపుడో వేద కాలంలో ఆర్యులు అత్యంత బలవంతంగా శూద్రులమీద ప్రయోగించిన అస్త్రం. ఈ సూత్రం ఆధారంగానే వేల సంవత్సరాలు శూద్రులను అజ్ఞానాంధకారంలో ముంచింద్రు.

భారతదేశానికి ఆంగ్లేయులు, ముస్లీం పాలకుల రాకతో అనేక మూఢాచారాలు అరికట్టబడినయంటే ఎవరూ బాధపడాల్సిన అవసరం లేదు. అయితే ఇక్కడ ఒక విషయం ఏమిటంటే బ్రిటీషు వారు కొన్ని మూఢాచారాలను వ్యతిరేకించినప్పటికి చాలా విషయాలలో బ్రాహ్మణులకే మద్దతు పలికింద్రు. ఎందుకంటే భారతీయులు ఒక్కటైతే ప్రమాదమని ఈ దేశం నుండి తరిమేస్తరని వాళ్ళకు భయం. ఆఖరికి అగ్రవర్ణాల వారి ఆచారాలకు, సంప్రదాయాలకు బంగం కలుగుతుందనే బ్రిటీషువారి మీద తిరుగుబాటు ప్రకటించింద్రనేది పూలే అభిప్రాయం. దీంతో ప్రతి ఒక్కరు ఏకీభవించాల్సిన అవసరం ఉందని కూడ నాకు అనిపిస్తుంది. అదే విధంగా ప్రస్తుత విద్యా విధానాన్ని పరిశీలిస్తే కూడా మనకు చాలా విషయాలు, అగ్రవర్ణ కుట్రలు మనకు అర్థమైతయి.

ఇయ్యాల శూద్ర వర్ణాల వారి పిల్లలు ఆంగ్ల మాధ్యమంలోకి ప్రవేశించకుండా, తగిన సాంకేతిక పురోభివృద్ధిని సాధించకుండా అడ్డుకునే కుట్రల్లో భాగంగానే స్థానిక భాషలకు ప్రాధాన్యాన్ని కల్పించాలనే ఎత్తుగడలను వేస్తారేమో ఆలోచించాల్సిన అవసరం ఉన్నది.

మాతృభాషను తప్పనిసరి చేస్తు మనని మరింత అణగదొక్కే కుయుక్తులకు తెరదీశారేమో ఒక కంట కనిపెట్టవలసిన బాధ్యత మనపైనే ఉన్నది. అరకొర సదుపాయాలతో అనారోగ్యకరంగా దర్శనమిచ్చే ప్రభుత్వ విద్యా సంస్థల్లో నూటికి తొంబై శాతానికి పైగా చదువుకునేది శూద్రుల పిల్లలే. మరి వీళ్ళకు భోదించేవారు అగ్రవర్ణాల వారైనపుడు వారికి సరైన విద్య అందదనేది మహాత్మ జోతీరావు పూలే ఏనాడో చెప్పడం జరిగింది.

మరి శూద్రులలో ఇలాంటి కుట్ర పూరిత ఆలోచనలు ఎక్కడా కానరావు.

ఇట్ల ప్రతి రంగంలోనూ ఈ విధమైన వివక్ష కొనసాగుతుందనేది నూటికి నూరూపాళ్ళు నిజం. శూద్రులు మంచిగా చదువుకోగలిగే సమయానికి వాళ్ళను ఏదో విధంగా చదువులకు దూరం చేయడం ఈనాటిది కాదు. తరతరాలుగ కొనసాగుతనే ఉంది.

శూద్రులు బంగారం కొనగలిగే స్థాయికి చేరుకుంటే అది వారు కొనలేనంతగా కొరతను సృష్టించి ధరలను పెంచడం. శూద్రులు భూములు కొని చక్కని ఇండ్లు నిర్మించుకునే స్థితికి చేరుకుంటే అది వారికి అందని ద్రాక్షగా తయారు చేయడం.  ఇట్ల ప్రతి విషయంలోను జరుగుతనే ఉంది.

శూద్రులు తమ స్థాయికి వస్తున్నరంటే అగ్రవర్ణాలు భరించలేకపోవడం అంతట, అన్ని రంగాలలోను జరుగుతనే ఉంది. ఇదంతా చేయడానికి వాళ్ళకు ఒక పటిష్టమైన నిర్మాణం ఉంది. ముఖ్యంగా పాలనాధికారం వాళ్ళ చేతుల్లోనే ఉంటది. మీడియా వాళ్ళ తప్పుడు కూతలకు, అబద్దపు చేష్టలకు తగిన ప్రచారం కల్పిస్తనే ఉంటది.

మరి బహుజనులు మాత్రం  బతకడం కోసమే ఆలోచించాలి తప్ప, తమ జాతి భవిష్యత్తు కోసమో, దేశ భవిష్యత్తు కోసమో ఆలోచించే అవకాశాన్ని వాళ్ళకు కలగనీయరు.

ఏ శూద్రుడూనా విందులు, విలాసాలలో స్వేచ్ఛగా తిరిగే అంత సమయం లేకుండా చేయడమే అగ్రవర్ణ పాలకుల ప్రధాన ఎజెండా. బతుకంతా పోరాటాలు చేయడం తప్ప బహుజనుల బతుకెప్పుడూ వడ్డించిన విస్తరి కాదు. బహుజనులు కష్టపడి పోగుచేసుకున్న డబ్బును ప్రభుత్వం పన్నుల రూపంలో గుంజేసుకుంటది. ప్రపంచీకరణలో భాగమైన బహుళజాతి కంపెనీలు ఆకర్శనీయమైన ప్రకటనలతో ఇల్లు గుల్ల చేయడం జరుగుతుంది. వీటికితోడు బ్రహ్మోత్సవాలు, పుష్కరాలు, పూజలు, పునస్కారాలు, నోములు, వ్రతాలు లెక్కకు మించిన ఖర్చుతో, హంగూ ఆర్భాటాలతో పెళ్ళీలు ఇతర విందు వినోదపు ఖర్చులు చేసేలా మానసికంగా వారిని సిద్దం చేస్తరు. ఆర్థికంగా వారిని ఎదగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటరు. అంతే. తెల్లారి లేచి చూసుకుంటే ఎంగిలి విస్తరాకులు, ఎండిన రక్తమాంసాలు తప్ప ఏమీ కనపడవు. ఇది మొత్తంగా బహుజనుల బతుకు చిత్రం. సరిగ్గా ఇక్కడే మనం పూలేని సరైన రీతిలో అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉన్నది. పూలేని అనుసరించాల్సిన అవసరం ఉన్నది. పూలే మార్గంలోనే ఉద్యమాలు, పోరాటాలు చేయవలసిన ఆవశ్యకత ఉన్నది. కానీ నేటి తరం నాయకుల ఆలోచనా సరళి ఇందుకు భిన్నంగా ఉండడం మూలంగానే ఈరోజు అగ్రవర్ణాలు చాలా ధైర్యంగా ముందుకు పోగలుగుతున్నయి.

ఎందుకుంటే శూద్రుల అభ్యున్నతికి కృషిచేసిన గొప్ప నాయకుడిని ఇయ్యాల కేవలం బీసీల నాయకుడిగా చూస్తున్నం. ఇంక నాలుగు రోజులు పోతే పూలేది పూలు, పండ్లు, అమ్ముకొని బతికిన కుటుంబం కనుక ఆంధ్రప్రదేశ్‌లో అయితే పూలేది బంటు లేదా ముదిరాజ్ కులమనో ఇంకో రాష్ట్రంలో మరేదో కులమనో ప్రచారం చేసుకొని ఒక కులానికే పరిమితం చేసే ఈ అనాలోచిత కార్యక్రమాల వలన పై మూడు వర్ణాల నాయకులు బలవంతులైతున్నరు.

మా పదవులకు, పాలనకు ఇప్పట్లో ఏ ఢోకా లేదని హాయిగా నవ్వుకుంటున్నరు. అందుకే బహుజనుల విభజనకు దోహదం చేసే ఏ కార్యక్రమానికైనా అగ్రవర్ణాలు విరివిగా విరాళాలు ప్రకటిస్తరు.

ముఖ్యంగా గుళ్ళు గోపురాలకు, మందిరాలు, మసీదులకు గొప్ప గొప్ప దానాలు చేస్తరు. గమ్మత్తయిన విషయం ఏందంటే అడ్కతినేటోల్లు గుంపుగ పదిమంది ఉంటే అందరికి కలిపి ఒక్క రూపాయే వస్తదని, ఎవరికి వారు వేరువేరుగా పోతే పది రూపాయలు వస్తాయన్న

దిగజారుడు ఆలోచనలు చేస్తున్నారే తప్ప పదిమంది ఒక్కటైతే పది రూపాయలు డిమాండ్ చేయవచ్చన్న సంగతి మర్చిపోతున్నం. పైపెచ్చు ఎవరికి వారై వేరై పోతే బలహీనులని ఎవరూ లెక్క చేయరనే విషయాన్ని కూడ మనం అర్థం చేసుకోవడం లేదు.

ఈ సమాజంలో 50శాతం అనుకుంటున్న బీసీలు ఈ విధంగ 1శాతమై, ఆ ఒక్క శాతం కూడ కూలల పేర, కుటుంబాలు, ఇంటిపేర్ల పేర విడిపోయి ఎందుకు గొరగాకుండ ఉన్నరు. ఈ సంధర్భంగ నేను చెప్ప దలుచుకున్నదేందంటే అగమ్య గోచరంగా మారబోతున్న బీసీల పరిస్థితిని గురించి. మొన్నటికి మొన్న నాకు ఎదురైన ఒక చిన్న సంఘటనను మీ ముందు ఉంచే ప్రయత్నం చేస్తాను. హైద్రాబాద్‌లో ఒక సినిమాకు వెళ్ళినపుడు కింద లోక్లాస్‌లోను, పైన హైక్లాస్‌లోను జనం ఉన్నరు. కానీ మధ్యలో మిడిల్‌క్లాస్‌లో మాత్రం ఒక్కరు కూడ లేరు. మరి వీళ్ళంత ఎవరు? ఏమైపోయింద్రంటే నా దృష్టిలో వీరంతా దాదాపుగా బీసీలేనని నా ఉద్దేశ్యం. అందులో ఎలాంటి సందేహం లేదు.

నేను పైన చెప్పిన విధంగా 50శాతం అనుకున్న బీసీలలో 7శాతం లోక్లాస్‌లో కలిసిపోయింద్రు. 3శాతం హైక్లాస్‌లో కలిసిపోయింద్రు. మిగతా 40శాతం బీసీలు విందులు వినోదాలు, సినిమాలు, షికార్లకే దూరమై చావలేక బతకలేక మధ్యతరగతి బతుకు మారదనే నిర్లిప్తతతో కొట్టుమిట్టాడుతున్నరు. బీసీలు రాజకీయ, ఆర్థిక, ఆధ్యాత్మిక వనరులుగా మారింద్రు తప్ప వాళ్ళ బతుకుల్లో ఎలాంటి పురోగతి లేదు. మరి వీళ్ళ గురించి ఎవరు ఆలోచించాలి. ఏవిధమైన చట్టాలు చేస్తే వీళ్ళ బతుకులు బాగుపడతయో ఆలోచించేది ఎవరు?

ప్రధానంగ అగ్రవర్ణాలు బీసీలకు ఒక దృక్పథం లేకుండ చేయగలిగింద్రు.

బీసీ అనే పదానికి ఒక పట్టు లేకుండా చేయగలిగింద్రు. నిజంగా బీసీలంటే ఎవరు?

ఈబీసీల పేర అగ్రవర్ణాల వారు కూడా బీసీలలోను ఉంటరు. ఏ కులాన్నయిన బీసీలలో చేర్చవచ్చు. ఏ కులాన్నయినా బీసీలలోంచి తొలగించవచ్చు. బీసీలనే ఇండ్ల నించి, అండ్లకు, అండ్ల నించి ఇండ్లకు మార్చి వాళ్ళకు వాళ్ళకే పంచాదులు పెట్టి పబ్బం గడుపుకోవచ్చు. బీసి జాబితా అమీబా లెక్క ఎన్ని రకాలుగానైన మార్చుకోవచ్చు. దీనికి రాజ్యాంగ పరమైన ఏ ఆటంకాలు లేవు. ముఖ్యంగా ఈ అన్యాయాన్ని అడిగే నాధుడెవడు ఉండడు. నాయకుడెవడు ఉండడు. కుట్రలను గమనించినా కుక్కిన పేనోలిగ పడుంటరు. ఏదో ఆపదొచ్చినోడు నాలుగు రోజులు రోడ్లెక్కి ఆ తర్వాతబలహీనపడి పోవడం తప్ప, ఎంత మొత్తుకున్నా ఏ విధమైన ప్రయోజనం ఉండదు. అందుకే ముందుగా బీసీలు ఒక ఐడెంటిఫికేషన్ ఏర్పరచుకోవాలె. బీసీలను కులాలుగా గుర్తించి జనాభా ప్రాతిపదికన అన్ని రంగాలలో రాజ్యాంగ పరమైన రిజర్వేషన్‌లు సాధించాలె.

ముఖ్యంగా చట్టసభలలో బీసీల ప్రాతినిధ్యం పెరిగేటట్టు చూసుకోవాలె. అవసరమైతే అందుకు తగిన విధంగా రాజ్యాంగాన్ని సవరించుకునే దిశగా ఉద్యమాలు చేపట్టాలె.

బీసీలకు చట్టసభలలో రిజర్వేషన్‌లు లేనంత కాలం ఎన్ని చేసినా దండుగే..

వేదకాలంలో శూద్రులుగా అవమానాన్ని భరించిన ఎన్నో బీసి కులాలు కుమ్మరి, కమ్మరి, చాకలి, మంగలి, బెస్త, వడ్డెర, పిచ్చకుంట్ల వంటి అనేక బీసి కులాలకు అత్యాచార నిరోధ చట్టాన్ని వర్తింప చేయాల్సిన అవసరం ఉన్నది. బహుజనులు తమ పేరు చివర తోకల గురించి ఆలోచించకుండ, అందరు కలిసి సమిష్టి ఉద్యమం చేస్తే తప్ప వారిలో ఐక్యత సాధ్యం కాదు. బీసీలంటే గౌడ్‌లనో, ముదిరాజులనో, యాదవులనో ఇంకొకటనో చెప్పుతున్నామంటేనే బీసీలకు ఒక ప్రత్యేకమైన ఐడెంటిటీని ఇవ్వలేకపోతున్నామని అర్థం. మరి ఈ విధమైన దృక్పథంతో బీసీల ఐక్యతను సాధిస్తామని అనుకోవడం ఎంతవరకు సమంజసం? కుల ఐడెంటిటీతో రాజ్యాధికారాన్ని సాధించడం ఎలా సాధ్యం?

ముందు వెనుకబడిన కులాలను గుర్తించవలసిన అవసరం ఉన్నది. ఆర్థికంగ అభివృద్ధి చెందినవాళ్ళను తీసుకొచ్చి బీసీలలో కలపడం కన్నా దుర్మార్గం ఏముంటది. వై.యస్ రాజశేఖర్‌రెడ్డిహయాంలో క్రిమిలేయర్ కులాలుగ గుర్తించిన తానే ఒక కులాన్ని తీసుకొచ్చి బీసి. ఎ. జాబితాలో చేర్చడం కంటే దిగజారుడు రాజకీయాలు ఏం ఉంటయో అర్థం చేసుకొవచ్చు.

అందుకే నేటి బహుజన నాయకులంతా పునరాలోచించుకోవలసిన అవసరం ఉన్నది. వేల సంవత్సరాలు అనేక కుట్రలు, ఎత్తుగడలతో అణిచివేయబడిన శూద్రుల జీవితాలలో మార్పును తీసుకురావడం ఒక జీవిత కాలంలో జరిగే పనికాదు. కానీ పెరిగిన సాంకేతికతను మీడియా, సెల్‌ఫోన్, ఇంటర్‌నెట్ వంటి మాధ్యమాలను అత్యంత పకడ్బందీగ బహుజనుల అభివృద్ధికి, ఐక్యతకు తగిన ప్రణాళికను రూపొందించి ఉపయోగించుకోగలిగితే మన పోరాటాలు సఫలీకృతమై హక్కులు సాధించబడడమే కాకుండా అనుకున్న రాజ్యాధికార లక్ష్యాన్ని చేరుకోవడం అంత కష్టమేమి కాదు.

బీసీ,ఎస్సీ,ఎస్టీ, నాయకులంత వాళ్ళ వ్యక్తిగత స్వార్థాన్ని విడనాడి పార్టీలు, కులాలకు అతీతంగా నిస్వార్థంగా భవిష్యత్ తరాల బాగు కోసమని దీర్ఘకాలిక ప్రతిఫలాలను ఆశించి పోరాటం చేసినపుడు మాత్రమే ఒక బలమైన సామాజిక వర్గం, బహుజన సమాజం బాగుపడ్తది.

అప్పుడే మహాత్మ జోతీరావు పూలే ఆశయం సిద్దిస్తది.

# ఆదివాసీల కన్నీటి అలుగే పోలవరం

**పోలవరం ఇప్పుడో ఛిద్రమైన నేల. అభివృద్ధి మాటున అడవులను, కొండ గుట్టలను, విధ్వంసం చేసి చారిత్రక ఆనవాళ్ళను శాస్వతంగ మాయం చేస్తున్న దిక్కు మాలిన పరిపాలనకు నిలువెత్తు సాక్ష్యమే ఈ పోలవరం ఆర్డినెన్స్. ఆవివాసీల కన్నీటి అలుగుల్లో ఉరకలెత్తనున్న పోలవరం ఎప్పటికైనా జాతీయ సమస్యే. ఆదివాసీల ఇష్టాఇష్టాలతో సంబంధం లేకుండ పోలవరం ముంపు బాధితులను ముప్పుతిప్పలు పెడుతు ఉన్న ఫలంగ ఊర్లను ఖాలి చేయించడం ప్రభుత్వ దమననీతికి నిదర్శనం.**

భారత దేశంలో దాదాపు నాలుగు కోట్లకు పైగా ఉన్న భారతీయ ఆదివాసీ సముదాయాల విషయమై ఈ ప్రభుత్వాలు ఇప్పటివరకు చిత్తశుద్దితో ఆలోచించిన దాఖలాలు లేవు. ముఖ్యంగ సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించి నల్లమల అటవీ ప్రాంతంలోని చెంచులు కృష్ణానది పరివాహక ప్రాంతాలలో నివసిస్తుండ్రు. గోదావరి కొండల నడుమ సద్దలు, జొన్నల వంటి చిరుధాన్యాలు పండించే కొండరెడ్లది ప్రధానంగ పోడు వ్యవసాయం. విల్లంబులను సారించి వేటాడడం, చేపలు పట్టడం, నేలతల్లి దీవెనల కోసం పందులను, కోళ్ళను బలిచ్చి పండుగలు చేస్తరు. కోయలు ఖమ్మం, వరంగల్ ప్రాంతాలలోను, గోండులు ఛత్తీస్ఘడ్, ఆదిలాబాద్ ప్రాంతాలలోను అధికంగా ఉండడం మనం గమనించవచ్చు. ఈ ఆదివాసీ గిరిజన తెగల్లో నాయకపోడ్‌లు మిగతా సమూహాల కంటే కొంచెం అధికులుగా భావిస్తరు. సరే ఈ విషయాలు ఎట్లున్నా..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం 'పోలవరం' విషయంలో ఆదివాసీల బతుకు దుఃఖమయమై దిక్కుతోచని పరిస్థితి నెలకొని ఉన్నది.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్,ఛత్తీస్ఘడ్, ఒరిస్సా రాష్ట్రాల భూభాగం మిళితమైన ఈ పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని ఒక్క ఆంధ్రప్రదేశ్ తప్ప మిగతా అన్ని రాష్ట్రాల ప్రజలు తీవ్రంగ వ్యతిరేకించడం జరిగింది. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణలో ఒక్క ఎకరాకు నీరు వచ్చే అవకాశం లేదు. అయినప్పటికి ఇక్కడి వేలాది ఎకరాల సారవంతమైన భూమిని నీట ముంచుతూ ఖమ్మం జిల్లాలోని ఏడుమండాలలో దాదాపు 250 గ్రామాలను బలవంతంగ ఖాళీ చేయిస్తున్నరు. లక్షలాది గిరిజన ప్రజలను నిర్వాసితులుగ మార్చివేసే కుట్రలకు తెరతీసి పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగ అభివర్ణిస్తున్నరు. కాని అది ఎప్పటికైనా జాతీయ సమస్యేనన్న సంగతి మర్చిపోతున్నరు.

అలుపు లేని అరవయ్యేండ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత భారతదేశ చరిత్రలో తెలంగాణ 29వ రాష్ట్రంగ జూన్ 2న ఆవిర్భవించిన సంగతి మనందరికి తెలుసు. స్వతంత్ర సంబరాలు చవి చూడని ఈ నేలలో రాష్ట్ర సాధన సంబరాలు అంబరాన్ని తాకినయ్. స్వేచ్ఛా వాయువులు నిండిన ఈ ప్రాంతం గర్వంతో ఉప్పొంగింది. ఉరకలేసింది.

కాని ఖమ్మం జిల్లా ఆదివాసీల పరిస్థితి అందుకు భిన్నంగ, అగమ్యగోచరంగ మారింది. ఎన్.డి.ఎ. సర్కారు ఆగమేఘాల మీద చేసిన ఆర్డినెన్స్ పుణ్యమా అని ఆదివాసీల బతుకు చెట్టుకొకరు, పుట్టకొకరు అన్నచందంగ తయారయ్యింది. ఇదే సందర్భంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు పోలవరం మీద గొంతెత్తిన చాలా పార్టీలకు నోరు పడిపోయింది. మాట పెగలడం లేదు. పోలవరం ఆదివాసీ బతుకులకు శాపంగ మారింది. వారి జీవన చిత్రాన్ని ఛిన్నాభిన్నం చేసింది. అయ్యో పాపం ఆదివాసీలు అని సానుభూతిని వ్యక్తం చేసి, సప్పుడే జేయక చేతులు ముడుచుకోవడం తప్ప చేయగలిగేది ఏమి లేదన్నంతగ పరిస్థితి తయారైంది.

సరిగ్గ ఇదే సమయంలో ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు, వేదకుమార్ సారథ్యంలో కొంతమంది కవులు వివిధ సంఘాల నాయకులం కలిసి, పోలవరం వాస్తవ పరిస్థితిని సమీక్షించే క్రమంలో అక్కడికి పోవడం జరిగింది. ఆ పోలవరం పర్యటన బృందంలో నేను ఒకడిగా ముంపు బాధితులను కలిసి వారి ప్రస్తుత స్థితిని అడిగి తెలుసుకునే అవకాశం దొరికింది. పోలవరం బాధితులు చెప్పిన వివరాల ప్రకారం ఏ ఒక్కరు కూడ పోలవరం పరిసర ప్రాంతాలను విడిచి, ముఖ్యంగ తెలంగాణ రాష్ట్రాన్ని విడిచి సీమాంధ్రలో కలవడానికి సిద్ధంగ లేరు. ప్రభుత్వం చేసిన ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తూ ముక్తకంఠంతో నినదించిండ్రు.

భారత ప్రభుత్వం అసలు ఆదివాసీలను మనుషులుగా గుర్తించకుండ అడవిలో జంతువులుగానే భావిస్తుందని ఆవేదన వ్యక్తం చేసిండ్రు. ఆదివాసీల అమాయక చూపుల్లోంచి, కల్మశం లేని చిరునవ్వుల్లోంచి వచ్చీరాని తెలుగులో ప్రశ్నల బాణాల్ని సందించిండ్రు. ముంపు బాధితులను కనీసం సంప్రదించకుండ, వాళ్ళ ఇష్టా ఇష్టాలతో సంబంధం లేకుండ పోలవరం ప్రాజెక్టుకు రూపకల్పన చేసి అక్రమార్కులకు, అవినీతి పరులకు కొంత డబ్బును ముట్టజెప్పి చేతులు దులుపుకున్నరని చెప్పడం జరిగింది. ఏ విధమైన పునరావాసం చూపించకుండ ముంపు గ్రామాలను ఖాళీ చేయాలనే బలవంతపు ఉత్తర్వులను జారీ చేయడం సమంజసమేనా అంటూ వెలిబుచ్చిన వాళ్ళ ఆవేదనను అర్థం చేసుకోవల్సిన అవసరం ఉన్నది.

సీమాంధ్ర పాలకుల వత్తిడికి తలొగ్గి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ద్వార జరిగిన ఈ అనర్థం ఎన్నటికి పూడ్చలేనిది. ఇది రాజ్యాంగ స్ఫూర్తిని, ప్రజాస్వామిక విలువలను, మానవత్వాన్ని మంట గలిపిన దురదృష్టకరమైన సంధర్భం. అయితే పోలవరం ఆర్డినెన్స్‌ను తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముడిపెట్టి చూడటం కొందరి సీమాంధ్ర నాయకుల కుటిల రాజనీతిని తేటతెల్లం చేస్తుంది. ఇప్పటికీ తెలంగాణ పోరాట నేపథ్యాన్ని, రాష్ట్ర ఏర్పాటు అనివార్యతను గుర్తించకపోవడం సీమాంధ్ర నాయకుల రాజకీయ అవగాహన రాహిత్యాన్ని, అహంభావాన్ని బయటపెడుతుంది. ప్రజాస్వామ్య విలువల పట్ల వాళ్ళకున్న గౌరవాన్ని బహిర్గతం చేస్తుంది. తెలంగాణ ఏర్పాటు అనేది ఒక బలవంతుని అరాచకాల నుండి బలహీనున్ని రక్షించడం లాంటిదని, పోలవరం నిర్మాణం లక్షలాది మంది ఆదివాసీలు, నోరులేని మూగజీవుల అరణ్యరోదననే విషయాన్ని వాళ్ళు గ్రహించలేకపోవడం బాధాకరం.

ఏ ప్రభుత్వమైన ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తూ అభివృద్ధి పథంలో పయణించాలి తప్ప నాయకుల స్వార్థం కోసం వ్యక్తిగత ప్రతిష్ట కోసం లక్షలాది ప్రజల బతుకులను ముంచివేయడం భావ్యం కాదు. ఈ ఆర్డినెన్స్ ద్వార తెలంగాణకు బద్రాచల రాముడు మాత్రమే మిగిలిండు తప్ప, ఆ దేవాలయ భూములు మాత్రం సీమాంధ్రుల హక్కుగ రూపాంతరం చెందుతున్నయ్.

పోలవరం ముంపు బాధితులు పూర్తిగ సీమాంధ్ర ప్రాంతంలో విలీనం కావాల్సి ఉంది. అయితే తెలంగాణ ఉద్యోగస్థులకే బద్రత లేని సీమాంధ్రలో, చావు బతుకుల నడుమ కొట్టుమిట్టాడే తెలంగాణ రోగులకు సైతం వైద్యం దొరకని సీమాంధ్రలో, తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమించిన ఆదివాసీలకు నూతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో న్యాయం జరుగుతుందా అనేది పెద్దప్రశ్న.

అన్నింటికి మించి అడవిని ఇడిసి బతకలేని ఆదివాసీలకు ఆకలి వేట తప్ప ఆస్తులు కూడబెట్టడం, అక్రమంగ సంపాదించడం తెలియని ఆదివాసీలు తమ సంస్కృతికి దూరంగ బతికే అవకాశం ఏ కోశాన లేదనేది స్పష్టమైన అంశం. వలస కొంగల నోటికి చిక్కిన అమాయక చేపలైన ఆదివాసీలు తరతరాలుగ దోపిడికి గురైతనే ఉన్నరు. అడవి బిడ్డలెప్పుడు బతుకు పోరాటంలోనే మగ్గుతున్నరు.

భారత రాజ్యాంగం 1950లో ఆదివాసీలను హెడ్యూలు తెగలుగ గుర్తించింది. అయితే 1949లోనే హైద్రాబాద్ సంస్థానం "ఆదివాసీ ప్రాంత నియంత్రణ చట్టాన్ని" తీసుకొచ్చినప్పటికీ, ఈ ప్రాంతం బలవంతంగ సీమాంధ్రలో విలీనం చేయబడిన తర్వాత గత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1963లో ఈ చట్టాన్ని రద్దు చేసింది. 1970-71 ప్రాంతంలో ఆదివాసీల భూ బదిలీ చట్టాన్ని నిషేదించినప్పటికీ 1980 నాటికి ఆదివాసీల మొత్తం భూములు అక్రమార్కుల చేతుల్లోకి వెళ్ళిపోవడం సీమాంధ్ర ప్రభుత్వ పారదర్శకత ఏందో రుజువు చేస్తుంది. "అందరు శాఖాహారులే గాని రొయ్యల మూట మాయమైనట్టు" చట్టాలు ఎన్ని చేసినా ఆదివాసీలకు న్యాయం జరగలేదు. అమలుకు నోచుకోని ఆదివాసి చట్టాలవల్ల అనేకమంది భూ కబ్జాదారులు, వ్యాపారస్థులు అడవి బిడ్డలను ఇబ్బడి ముప్పడిగ దోచుకున్నరు. ఆదివాసీల అభివృద్దే లక్ష్యంగ ఏర్పాటు చేయబడిన ఐటిడిఎ పని విధానం కాగితాలకే పరిమితమైంది.

ఎప్పుడైన ఈ చెంచులు, గోండులు, నాయక్‌పోడ్‌ల వంటి ఆటవిక తెగలు, ఆదివాసీ బిడ్డలు అడవికి దూరంగ జీవించడం వాళ్ళకు సాధ్యమయ్యే పనికాదు. ప్రధానంగ ఇక్కడ మనం గమనించవలసిన అసలు విషయం ఏందంటే చాలా మటుకు ఆదివాసి గిరిజన గూడాలలో ఆదివాసీలు కాని వాళ్ళ ప్రాబల్యం పెరిగిపోయింది. ముఖ్యంగ వీరంత 1950 నుండి మొదలు 80వ దశకం దాక అనేక రూపాలలో వ్యాపారులుగ, వడ్డి వ్యాపారులుగ వచ్చి ఇక్కడ స్థిరపడ్డరు. పోడు వ్యవసాయం చేసుకునే గిరిజనులను అనేక రకాలుగ దోపిడి చేసింద్రు. క్రమంగ వాళ్ళు కష్టపడి చదును చేసిన భూముల్ని ఆక్రమించుకున్నరు.

ఆ విధంగ ఈ ప్రభుత్వాలు ముంపు బాధితులకు చెల్లించే నష్ట పరిహారం కూడ పెద్దమొత్తంలో గిరిజనేతురులైన భూకబ్జాదారుల చేతుల్లోకే వెళుతుంది తప్ప అసలు సిసలైన ఆదివాసీలకు అందుత లేదు. ఎవరైతే కోస్తా ప్రాంతం నుంచి వచ్చి ఇక్కడి ఆదివాసీల్లో మమేకమై వారిని నిత్యం నిలువెల్లా దోపిడి చేస్తూ బతికిండ్రో, అట్లాంటి దగాకోర్లే మళ్ళీ లక్షలాది రూపాయల నష్ట పరిహారానికి ఆశపడి తిరిగి వాళ్ళ ప్రాంతానికి వెళ్ళిపోవడానికి పూర్తి సంసిద్ధులుగ ఉన్నరు. అంతేగాని తరతరాలుగ ఇక్కడే ఉంటూ ఇక్కడి నేలను, గాలిని, నీటిని అన్నింటికి మించి ఈ అడవిని నమ్ముకొని ఈ రోజు ముంపు పేర గ్రామాలను ఖాలీ చేయాలంటె వాళ్ళ మనసు అంత సునాయసంగ అంగీకరించడం లేదు.

ఏ మట్టి తన స్వంతం అనుకున్నరో, ఏ గాలి తన ఊపిరి అనుకున్నరో, ఏ అడవిని తన కన్నతల్లి అనుకున్నరో అట్లాంటి నేలను విడిచి పోవాలంటే వాళ్ళకు అంతులేని దుఃఖం పొంగుకొస్తుంది. ఈ నోరు లేని అమాయక ఆదివాసీలు ఎప్పుడు ఎవరిని, ఏ ప్రభుత్వాన్ని మాకిది కావాలని అడిగింది లేదు. అడవిని నమ్ముకొని ఆకులు, అలములే జీవనాధరంగ బతుకుతరు. అటవీ ఉత్పత్తులను సేకరించి వ్యాపారాలు చేసే దళారులకు తమ శ్రమనంత ధారపోస్తరు. ఏ వస్తువును ఎట్ల మారకం చేయాల్నో తెలువని ఎడ్డిజీవులు వాళ్ళు. ఈ నాటికి వస్తుమార్పిడి విధానంతో అక్కడి సంతలు నడుస్తున్నయంటె ఆశ్చర్యం కలుగుతుంది.

ఇప్పుడైతే నాలుగు రాష్ట్రాల (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, ఒరిస్సా) గిరిజన తెగలు కోంట (కుంట) అనే గ్రామంలోని సంతలో కలుస్తరు. ఆ సంత విభిన్న గిరిజన సంస్కృతుల కలయిక. ఆ సంత ఆదివాసీల భాష, దుస్తులు, ఆభరణాలు వారి జీవనవిధానాన్ని మా కళ్ళకు కట్టింది. అదే సంతలో పోలవరం పరిరక్షణ పాదయాత్ర బృందం ఒక సభ నిర్వహించింది. అక్కడ పలువురు వక్తలు మాట్లాడటం జరిగింది. పాటలు పాడడం జరిగింది. కాని ఆ సంతలోని ఆదివాసీలు పోలవరం అని కలవరించడం మాత్రమే కనిపించింది.

వీళ్ళు ఎన్ని చేసిన, ఎంత ఎగిరినా అక్కడ జరిగేది జరుగుతుందనే ఒక నిరాశ, నిర్లిప్తత ప్రతి ఒక్కరిలో కనిపించింది. ఈ పాదయాత్రలు, సభలు, సమావేశాలు, ప్రసంగాలు, పాటలు, కథలు, కవితలు ఎన్ని రూపాలలో ఉద్యమాన్ని ఉధృతం చేసినా సీమాంధ్రులను నెత్తినెత్తుకున్న కేంద్రప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేదు.

ఆదివాసీ బిడ్డలను, వాళ్ళ మట్టి చరిత్రను కాపాడవలసిన ఈ ప్రభుత్వాలే రక్తం మరిగిన సింహాలై గిరిజనుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నయ్. అభివద్ధి పేర అడవిబిడ్డల్ని ఆగం జేస్తున్నయ్.

# తల్లి లేనిదే తనువు లేదు
# బతుకమ్మ లేనిదే బతుకు లేదు

బతుకమ్మ ఒక అద్భుతమైన, ఆధ్యాత్మిక భావన. ముఖ్యంగ బతుకమ్మకు ఒక రూపం లేదు. కాని సకలజీవరాశికి ఆమే ఒక రూపం. బతుకమ్మ కత్తిపట్టి యుద్ధం చేసింది కాదు, కలం పట్టి రాసింది కాదు. కాబట్టి ఒక గొప్ప చరిత్ర కూడ ఉండక పోవచ్చు. కాని బతుకమ్మే ఒక చరిత్ర నిర్మాణం. బతుకమ్మే బతుకు విలువ. బతుకమ్మ లేనిదే బతుకు లేదు. అదే బతుకమ్మ గొప్పతనం. హంగూ ఆర్భాటాల లేని అందమైన పూల జాతర మన బతుకమ్మ. ఆకాశంలో సింగుడు విరిసినట్టు, తెలంగాణ నేలనేలంతా రంగురంగుల పువ్వుల్లో ఉయ్యాలలూగే పాటల సెలయేరు మన బతుకమ్మ. ప్రపంచంలో ఎక్కడా కనిపించని కనుల పండుగ మన బతుకమ్మ.

మరి ఇంత గొప్ప అద్భుతమైన ఈ బతుకమ్మ సంప్రదాయం మన తెలంగాణలోనే ఎందుకు ఉంది. మిగతాచోట్ల ఎందుకు కనిపించదు. అంటే మన నేలకు, మన గాలికి, మన నీటికి, ఇక్కడి మనుషులకు ఏదో విశిష్ట గుణం ఉన్నది. ఎందుకంటె మొత్తం ప్రపంచంలోనే ఒక ప్రత్యేకత కలిగిన దేశం మన భారతదేశం. ఈ విధంగ మొత్తం దేశంలోనే ఒక ప్రత్యేకత కలిగిన ప్రాంతం మన తెలంగాణ. అనేక విశిష్టతలు కలబోసుకున్న మన తెలంగాణలో శ్రమైక జీవనసౌందర్యంతో సంతృప్తిని మించిన సంపద లేదని హాయిగ, ఆనందంగ పరవశిస్తుంది, పండగ జేస్తుంది. ఈ భూమ్మీద సకల జీవరాశి సల్లగ బతకాలని చేసే పండుగ బతుకమ్మ. ఎవరు ఏం సాధించాలన్న ముందు వాళ్ళు బతికుండాలని, బతుకు విలువను తెలియజెప్పే పండుగే బతుకమ్మ. పశువులు, పక్షులు, మనుషులు, జంతువులు, ఇట్ల సకల జీవి ఎవరికి వారు స్వార్థంతోనే బతుకుతుంటరు. వాళ్ళ బాగునే కోరుకుంటరు తప్ప పరుల సుఖాన్ని కోరుకోరు. ఎదుటివాళ్ళ బతుకులు బాగుపడాలని ఏనాడు అనుకోరు. కాని ఒక్క తెలంగాణలో మాత్రమే మిగతా సమాజమంతా కలకాలం ఏ బాధలు లేకుంట బతకాలని కోరుకుంటది. పగవాన్ని సైతం పసిగట్టి మౌనంగ భరిస్తది. ఇట్లాంటి అనేక సుగుణాలు గల అచ్చమైన, స్వచ్ఛమైన తెలుగునేల మన తెలంగాణ. అట్లాంటి ఈ నేల క్రమంగ వలస పాలకుల స్వార్థానికి బలై, బతుకు ఛిద్రమై ఆనవాళ్ళు కోల్పోయింది. నేను బతికితే చాలు ఎదుటోడు ఎట్లబోతే మనకేం సంబంధం అనుకునే అమానవీయ కోణంలోకి నెట్టివేయబడింది. చివరికి తను బతకడం కోసం ఎవరిని చంపడానికైన, దేన్ని విధ్వంసం చేయడానికైన సిద్ధమనే స్థితికి చేరుకుంది. చెట్టు-పుట్ట, గుండు-గుట్ట, వాగు-వంక, చెరువు-

కుంట, పసులు, పక్షులు, మనుషులు, మానవసంబంధాలు ఏది మిగల్లే. సకల జీవరాశిని అద్భుతమైన అందమైన ప్రకృతిని పతనావస్థలోకి నెట్టివేసింఁడ్రు. సకలజీవరాశి సల్లగ బతకాలని పండుగ జేసిన ఈ నేల వలస పాలకుల పుణ్యమాని తన ఉనికిని, సహజ స్వభావాన్ని కోల్పోయింది. గొప్ప సంస్కృతి, సంప్రదాయాలు విలసిల్లిన ఈ ప్రాంతం అనేక అవమానాలకు గురైంది. అల్లకల్లోలమైంది. అనేక తండ్లాటల్లో ఆగమాగమై సొమ్మసిల్లింది. సరిగ్గ ఇట్లాంటి సమయంలోనే దోపిడి, వివక్షలకు వ్యతిరేకంగ ఒక బలమైన ఉద్యమం పుట్టింది. పడినా లేచే కెరటం లెక్క విజృంభించింది. విప్లవించింది. తీరం చేరింది. గమ్యాన్ని ముద్దాడింది. అదే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమం. పార్టీలు, ప్రజాసంఘాలు, కవులు, కళాకారులు, మేథావులు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యక్తులు, శక్తులు అనేక రూపాల్లో పోరాటాన్ని హోరెత్తించింఁడ్రు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించింఁడ్రు. ఈ మహోద్యమంలో, ఈ బృహత్తర పోరాటంలో జాగృతి బతుకమ్మ పాత్ర ఎంతో ఘననీయమైనది.

తెలంగాణ ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొంటున్న తరుణంలో స్త్రీలు ఆదిశక్తులై కదిలివచ్చింది బతుకమ్మలు, బోనాలతోనే. ఉద్యమ సమయంలో స్త్రీకి బతుకమ్మ ఒక ఆయుధమయ్యింది. తెలంగాణ సంస్కృతిని అవమానించిన సీమాంధ్ర పాలకులకు బోనమెత్తిన తెలంగాణ పల్లెను చూసి గుండె జల్లుమన్నది. బతుకమ్మ వైభవాన్ని, పోరాట స్ఫూర్తిని భరించలేకపోయింది. వాళ్ళ వెకిలి చేష్టలతో ఎన్నో తీర్ల అవమానించే ప్రయత్నం చేసింఁడ్రు. ఉద్యమ కెరటమై ఉవ్వెత్తున ఎగసిన బతుకమ్మను చూసి చాలమంది చాలా రకాలుగ మాట్లాడుకున్నరు. అనేక విధాలుగ విమర్శించింఁడ్రు. కాని ఆ మాటల్లో వాస్తవం లేదు. వాళ్ళ వాదనలో పసలేదు. ఎందుకంటె మాకు ఫలాన పండుగ లేదని, మాకు నోములు లేవని, మేము ఫలానా పూజ చేయమని అనడం సహజం. అదేవిధంగ మాకు బతుకమ్మ లేదని చెప్పడమే తప్ప కావాలని వేరెవరో బలవంతంగ ఆయా సంప్రదాయాల నుంచి తప్పించడం అనేది ఉండదు. ఎప్పుడైన తరతరాలుగ ఆచరిస్తున్నయే సంప్రదాయాలుగ మిగిలిపోవడం జరుగుతుంది. ఒక్క మాటలో ఆచరిస్తే ఆచారం-సంక్రమిస్తె సంప్రదాయం. ఇది మన వ్యవస్థ నిర్మాణం. మన సంస్కృతీ-సంప్రదాయాలను గౌరవించి, ఆచరించడం తప్ప అది మాకు లేదు అనుకోవడంలో అర్థమే లేదు. అయితే సమాజంలోని కొన్ని వర్గాల ప్రజలు ఇతరుల స్వేచ్ఛకు ఆటంకం కల్పించలేదని మాత్రం చెప్పలేను. ముఖ్యంగా బడుగు బలహీన వర్గాలను బానిసలుగా చూడలేదని కూడా చెప్పలేను. పై విషయాలకు సంబంధించి అనేక వైరుధ్యాలు ఉన్నమాట వాస్తవమే. కానీ వాటిని మనం పటాపంచలు చేయవలసిన అవసరం ఉన్నది. దాన్ని ఎవరు చేసినా సంతోషమే. ఆ పని ఇయ్యాల తెలంగాణ జాగృతి చేసిందని చెప్పవచ్చు. చేయడమే కాదు తెలంగాణ ఉద్యమంతో పాటు అడుగంటి పోతున్న బతుకమ్మ పండుగకు ప్రపంచ వ్యాప్తంగ గొప్ప గుర్తింపును తీసుకొచ్చింది. ప్రతి ఒక్కరిచేత బతుకమ్మ పండుగ

చేయించింది. తెలంగాణ సంస్కృతికి, ఉద్యమానికి ఊపిరినిచ్చింది. ఇదట్ల ఉంచితే బతుకమ్మ పండుగ పుట్టుపూర్వోత్తరాలు ఏందో చూద్దాం.

ప్రాచీన కాలంలో తొలి దైవం స్త్రీ. ఆదిమ కాలంలో వ్యవసాయం కనిపెట్టింది స్త్రీ. భూమిలో పడి మొలకెత్తిన గింజల ద్వార ఆహారాన్ని సముపార్జించుకునే దిశలో ఎంతో పురోగతిని సాధించడం జరిగింది. భూమికి ఉన్న సహజ గుణాలు ఎన్నో స్త్రీలో ఉన్నయని, తనకు గల ఓర్పు, సహనంతో తన ఒడిలో పిల్లల్ని పెంచి పెద్దజేస్తుందని, కంటికి రెప్పలా వారిని కాపాడుతుందనే భావన మొదలయ్యింది. ఈ విధానాన్ని బౌద్ధం కూడా అనుసరించింది. ''మహాయాన బౌద్ధం'' తారాదేవిని ఆరాదించింది. తమిళనాడులో క్రైస్తవులు "కురుమారియమ్మ"ను భక్తి పారవశ్యంతో కొలుస్తారు. కాశి, ప్రయాగ వంటి సుప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు గంగాభవానిని కొలిచే పుణ్య తీర్థాలుగ వెలుగొందుతున్నయి. స్త్రీ దేవతలు ప్రపంచమంతట కనిపిస్తరు. స్త్రీ బిడ్డల్ని కాపాడినట్టు ప్రపంచాన్ని స్త్రీ దేవతలు కాపాడుతరని నాటి సమాజం బలంగ విశ్వసించింది. అందుకే గ్రామ గామాన గంగమ్మ పేరుతో ఉత్సవాలు, జాతరలు పెద్ద ఎత్తున చేయడం జరుగుతుంది.

ముఖ్యంగ గ్రామ దేవతలు ఏడుగురు అక్కచెల్లెల్లని జానపదుల భావన. పోషమ్మ, మైసమ్మ, బాలమ్మ, ఎల్లమ్మ, ముత్యాలమ్మ, మహంకాళమ్మ, పెద్దమ్మలు. ఈ పేర్లనే జానపదులు తన సంతానానికి పెట్టుకోవడం జరుగుతుంది. ఈ దేవతలకు జంతువులను బలిస్తూ, కల్లు సాకబోయడం, బోనాలు సమర్పించడం కోసం పండుగలు జాతర్లు చేస్తరు. పోతురాజును గ్రామాన్ని కాపాడే రాజుగా కొలుస్తరు. పోషమ్మను వెయ్యికండ్ల దేవతగ కొలుస్తరు. పోషమ్మను పార్వతీదేవి కూతురుగా వర్ణించిండ్రు. శివుడు ప్రజలే నాకు సంతానమని భావించిండనే అనేక కథలు ప్రచారంలో ఉన్నయి. పార్వతిని చితిమీద వేస్తే పోషమ్మ ఆ చితిలోనే పుట్టిందని చెప్పే కథలు ప్రచారంలో ఉన్నయి.

కాకతీయుల కాలంలో ఎల్లమ్మను ఏకవీరగ కొలిచిండ్రు. ముఖ్యంగ జలజీవులైన గంగమ్మబిడ్డలు. బెస్తలు నడి ఎండాకాలంలో గంగమ్మ పండుగలు చేయడం జరుగుతుంది. పంచభూతాలలో ఒకటైన గంగ సకలజనులకు పంచప్రాణమైన గంగ కోసం పూజలు చేసి బెస్తలు చెరువు–కుంటలు నిండాలని, కరువు లేని కాలం కావాలని వేడుకుంటరు.

ఈ విధంగ ఆశ్వయుజ మాసంలో వచ్చే ఒక అమావాస్యను పితృ అమావాస్యగ భావించడంతో క్రమంగ అది పెత్రామాసగా మారింది. దీనినే మహాలయ అమావాస్య అనికూడ అంటం. అనాదిగ పితృదేవతలకు తర్పణాలు వదిలే పెద్దల పండుగగ పెత్రామాసను జరుపుకోవడం మన ఆచారంగ మారిందని అంటరు.

గౌరువర్ణం అంటే పసుపు రంగు. ఆ పసుపునే గౌరమ్మకు ప్రతీకగా తీసుకొని

పసుపుల పుట్టిన గౌరమ్మని నోములు, వ్రతాలు, పూజలు చేయడం మనం చూస్తున్నం. అంతే కాకుంట గౌరమ్మను మట్టిల పుట్టిందని, వుష్కల పుట్టిందని ఎవరు ఎట్ల నమ్మితే అట్ల అనేక కథల్ని పూజా విధానాన్ని ప్రచారం చేస్తూ ఆ సంప్రదాయంలో మమేకమై సంఘంలో మనుగడ సాగిస్తున్నరు.

ముఖ్యంగ దేవుణ్ణి పురుష రూపంలో కొలవడం కంటే స్త్రీ రూపంలో కొలవడం ఒక విశిష్ఠమైన సంప్రదాయం. సృష్టికి ప్రతిరూపం అమ్మ. అమ్మకు ప్రతిరూపం బతుకమ్మ. బతుకమ్మ అంతులేని ఆత్మవిశ్వాసం కలబోసుకున్న ఒక అధ్భుతమైన రూపం.

## బతుకమ్మ పుండుగ

బతుకమ్మ పండుగ పెత్రామాస రోజు "ఎంగిలిపువ్వు బతుకమ్మ" గా తర్వాత తొమ్మిదవ రోజున "సద్దుల బతుకమ్మ"గా ప్రసిద్ధి చెందింది. కాలక్రమంలో బతుకమ్మ దసర పండుగలను కలుపుతు అనేక కథలను సృష్టించింద్రు. అయినా బతుకమ్మ పండుగకు ఒక ప్రత్యేకత ఉన్నది. ఈ పండుగను పేద, గొప్ప, కులము, మతము వంటి వాటితో సంబంధం లేకుండ అందరు ముఖ్యంగ స్త్రీలు గుంపుగ ఒక చోట చేరి నడుమ అందమైన పూలతో పేర్చిన బతుకమ్మలను ఉంచి ఆడుతూ, పాడుతూ ఆనందాన్ని పొందుతరు. ప్రకృతిలో దొరికే సహజమైన తంగెడు, జిల్లెడు, గుణుగు, సోంపు వంటి గడ్డిపూలతో పేర్చడానికి ముందు తాంబాలంలో పెద్దపెద్ద ఆముదం ఆకులు గాని, గుమ్మడి ఆకులు గాని, ఆనకాయ ఆకులు గాని వెడల్పుగా పరిచి బతుకమ్మను అందంగ పేర్చుతరు. ప్రతి వరుసకు నడుమ బతుకమ్మ కడుపులో కేవలం తంగెడు పూల రెమ్మలను మాత్రమే నింపుతరు. ఎక్కడ ఒక్క తంగెడు మొగ్గకూడ ఉండకుండ జాగ్రత్త పడతరు. ఇదంత ఎందుకంటే బతుకమ్మను నీళ్ళలో నిమజ్జనం చేసినప్పుడు చాలా సేపటి వరకు నీటిమీదనే తేలుతూ తెప్పబొయ్‌నట్టు పోతుంటే ఆ ఆనందాన్ని మాటల్లో చెప్పలేం.

నాకు చిన్నప్పటి నుంచి బతుకమ్మ పండుగతో ఎంతో అనుబంధం ఉంది. మేము ముగ్గురం అన్నదమ్ములం. మా తోడ ఒక్క చెల్లె. నేను ఇంట్లో పెద్దవాన్ని కావడంతో చిన్నప్పటినుంచి ఇంటి పని, వంట పనులతో పాటు వ్యవసాయ పనుల్లో ఎంతో సహాయంగా ఉండేవాణ్ని. బతుకమ్మను మా అమ్మ పేర్చినంత అందంగ, ఎత్తుగ వేరేవాళ్ళు పేర్చలేరేమో అన్నంత గొప్పగుండేది. బతుకమ్మ పూల వరుసలు ఖచ్చితంగా బేసి సంఖ్యలోనే ఉండాలని చెప్పేది. ఏడు, తొమ్మిది, పదకొండు వరుసలు పేర్చేది. ప్రతి బతుకమ్మకు తోడు బతుకమ్మ ఉండేది. ఒక పెద్ద తాంబాలంలో పెద్ద పెద్ద ఆందపాకులు తెచ్చి అడుగున వేసి రాలిపోయిన తంగేడు పూరెమ్మలను అడుగున పోసి పసిడి వన్నెల తంగెడు పువ్వు వరుసతో బతుకమ్మను పేర్చడం మొదలు పెట్టేది. ఆ తర్వాత ఎన్నో రోజులుగా శెల్కలన్ని తిరిగి తిరిగి ఏరుకొచ్చిన సోంపు (గడ్డిపువ్వు)ను రకరకాల రంగులతో అద్ది పేర్చేది. ఇప్పుడైతే పువ్వ కొనుక్కొని రావడమో

లేదంటె నడుమ గంపలుబెట్టి సుట్టు కాయితాల పూలను పేర్చే స్థాయికి కూడ దిగజారుతున్నట్టు అనిపిస్తుంది. ఎందుకంటె మరి పెద్దగ కనపడాలె. మరి వాస్తవానికి పువ్వుకూడ ఎక్కడ దొరికే పరిస్థితి లేదనుకో అయితే, అట్లా కాకుండ కేవలం స్వచ్ఛమైన గడ్డిపూలను తెచ్చి ఒక పెద్ద బతుకమ్మను పేర్చి పైన పసుపు ముద్దతో గౌరమ్మను చేసి పత్తితో చేసిన హారం ఒకటి వేసేది. దీపము అగరొత్తులతో బతుకమ్మ అందంగా ముస్తాబై ఉండేది. సద్దరొట్టెలు, బెల్లంతో చేసిన మలీద ముద్దలు ఫలారం కోసమని చేతులో పట్టుకునేది. పెద్ద బతుకమ్మ మా అమ్మ ఎత్తుకునేది. చిన్న బతుకమ్మను నేను పట్టుకునేది. నా బతుకమ్మ బుర్రకాయ చిప్పలోనుంచి మొదలై పెరిగి పెరిగి పెద్ద ప్లేట్ దాకా వచ్చింది. తర్వాత మా తమ్ములు, ఆఖరిగా మా చెల్లె రావడంతో బతుకమ్మను మేము పట్టుకునే భాగ్యం పోయింది. ఆయా సంధర్భాలలో పిల్లలు లేని వాల్లు, ముఖ్యంగ ఆడపిల్లలు లేని వాల్లు బతుకమ్మ పండుగనాడు ఎంతో బాధపడడం నేను చూసిన. మేము పెద్దయింతర్వాత బతుకమ్మ పండుగ ముందల సద్దజొన్న శేండ్లు తిరిగి సోంపు ఏరుకొచ్చే వాళ్ళం. పొద్దుగూకంతల సుట్టు పక్కల వాళ్ళతో కలిసి వాకిట్ల గుసోని పువ్వు మడతబెట్టి ఇస్తుంటే మా అమ్మ వాటిని అందంగా కట్టి తాంబాలంలో, గంపలోపెట్టి ఉంచేది. పండగ రేపనంగ లెక్కలేనంత జిల్లెడు పువ్వు, గునుగుపూలు, తంగెడు పూలు తెచ్చేవాళ్ళం. బతుకమ్మ పండుగ రోజు పొద్దున్నే తల స్నానం చేసి సాపనిండ పువ్వు పరిసి, అందరం కలిసి తంగెడు పువ్వు ఏరి సాపసుట్టు పేర్చేది. ఎక్కడ ఒక్క తంగెడు కాయ (పచ్చిమొగ్గలు) ఉండేది కాదు. అంతా విరబూసిన పువ్వే. ఇప్పుడు బతుకమ్మలు అట్ల లేవు. ఎందుకంటే మేము ఆరోజు బతుకమ్మను తప్పకుంట చెర్లోనే, నీలల్లనే వేసి సాగదోలే వాళ్ళం.

ఇట్ల ఎంతో హాయిగ ఆనందంగ ఆట పాటలతో బతుకమ్మ ఆడేది. అయితే మా ఊళ్ళో కొంచెం పెద్ద కులం అనుకునే వాళ్ళు (రెడ్లు, కోమట్లు, కంసాలి) వేరుగా ఆడేవారు. మిగతా వాళ్ళు మరోచోట ఆడేవారు. కొందరు అసలు ఆడే వాళ్ళు కాదు. ఎందుకంటే మాకు బతుకమ్మ పండుగ లేదు అనేవాళ్ళు. రెడ్లు మరియు ఇతరులు ఆడే దగ్గర సప్పిడి పాటలతో సప్పగ సాగేది. చీరలు, నగలు చూసి మురిసిపోవడం తప్ప ఆటపాటలు తక్కువ. అదే మా అమ్మలక్కలు ఆడే దగ్గర భూమికి తగిలేటట్టు వంగి లయబద్ధంగ అడుగులేస్తూ హుషారుగా పాటలు పాడేవాళ్ళు. ఇది నాకు బాగా గుర్తున్న విషయం. అందుకే నేను రాసిన బతుకమ్మ పాటలో వాళ్ళ అడుగులకు అనుగుణంగనే బాణీని తయారు చేసుకున్న.

ఏ ఆడంబరాలు లేకుంట కేవలం పూలతోని బతుకమ్మలను పేర్చి ఆశువుగ అనేక పాటల్ని పాడుకుంట బతుకమ్మ పండుగను చేసుకునేది. కాలక్రమంలో ఇక్కడ ఈ పండుగ దగ్గర కూడ బాపని పంతులు దస్తి ఏసిండు. కట్నాలు వసూలు చేసుడు మొదలు పెట్టిండు. బాపనాయిన వస్తెనే, పూజ మొదలు పెడితెనే బతుకమ్మ ఆడాలని ఎదురు చూసే స్థితికి వచ్చింద్రు. మళ్ళా ఆ బాపనాయిన అందరి దగ్గరికి పోడు. దీంతో బతుకమ్మలు వేరు పడ్డయ్. కొందరు బతుకమ్మలను పేర్చడమే బందు పెట్టింద్రు. కాని వాళ్ళందరు ఆడ్తందుకు, పాడ్తందుకు

చెరువు కాడికి వచ్చేది. బతుకమ్మ విషయమై ప్రచారంలో ఉన్న అనేక కథల్లో ప్రధానంగ గంగ పెట్టిన శాపం వల్లనే భూమ్మీద సుక్క నీళ్ళు దొరకవని, గౌరిదేవి రూపంలో ఉన్న పార్వతీదేవిని బతుకమ్మగా ఆడి ఆడి గుడిమీద పారేసిపోతరని గంగ శపించినట్టు జానపదులు నమ్ముతరు. నిజానికి ఆ సమయంలో చెరువుల్లో నీళ్ళు ఉండకపోవడం చూస్తే ఆ కథలు నిజమేనేమో అనిపిస్తుంది. అందుకే వానల కోసం పూజలు చేస్తరు. గంగ పొంగి పరవళ్ళు తొక్కాలని పండుగ జేస్తరు. ఏదేమైన ఒక విశిష్ట జానపద సంప్రదాయం తెలంగాణ నేలనేలంత పండు వెన్నెలై పరుచుకుంది.

జానపదులకు గల విశిష్ట సాంప్రదాయాలలో ఒకటైన భాషా సౌకుమార్యంతో ఏ భాషలోనైనా పదాలు క్రమంగ వాటి అసలు రూపం నుంచి మరో కొత్త రూపాన్ని సంతరించుకుంటయి. అయితే తెలంగాణలోని శీతోష్ణస్థితి, వాతావరణ పరిస్థితులు, వివిధ సామాజిక పరిస్థితులకు అనుగుణంగ ఈ నేలకు పాట ఒక నేపథ్యంగ ఉన్నది. ముఖ్యంగ 'తిలింగ' తెలంగాణ అయినట్టు అనేక పదాలు వాటి వ్యుత్పత్తి రూపం నుంచి మరొక రూపంలోకి మారినయి. మరొక విషయం ఏందంటే ఎక్కలగాణ అంటే ఒక్కరు పాడే పాటని, యమలగాణ అంటే ఇద్దరు పాడే పాటని, ఇట్ల తెలంగాణ లోని గాణ శబ్దానికి పాడటం అనే అర్థాన్ని ఇవ్వడం జరిగిందని, భాషా పరిశోధకులు తేల్చేసింద్రు. ఈ విధంగ అందరు కలిసి పాడే పాటని బృందగానం అంటున్నం. ఇట్ల తెలంగాణలో ఈ పాటల పూదోట వికసించింది. అది ఒక బతుకమ్మ బొడ్డెమ్మతోనే కాకుండ ప్రతి పనిలో (కలుపులు, కోతలు, ఇసుర్రాయి, పెళ్ళీలు, పండుగలు, జాతర్లు) పాట మమేకమై ఉంది.

చావు పుట్టుకలకు సంబంధం ఉన్నదీ ఉయ్యాల. ఆనందానికి దుఃఖానికి ఆత్మబందువీ ఉయ్యాల. ఆడితే ఉయ్యాల పాడితే ఉయ్యాల అదే మన ఉయ్యాల పాటల్లోని సొగసు. బతుకమ్మ పాటల్లోని మాధుర్యం గొప్పతనం.

ఇక్కడ మనం చెప్పుకోవాల్సింది ఉయ్యాలకు, మనిషి పుట్టుకకు ఏదో విడదీయలేని అనుబంధం ఉంది. విద్యా, వైద్య సదుపాయాలు లేక మూఢనమ్మకాలు రాజ్యమేలుతున్న కాలంలో నాటి ప్రజలు కొన్నింటిని ప్రగాఢంగ విశ్వసించేవారు. ఆ ప్రజల విశ్వాసం చెక్కుచెదరకుండ ఉన్న కొన్ని సంప్రదాయాలు, ఆచారాలే నేటి పండుగలు, జాతర్లు, తిరునాళ్ళు ఇతర వేడుకలుగా మన సంస్కృతిలో భాగమై సమాజాన్ని ప్రభావితం చేస్తున్నయ్.

ఈ భూమ్మీద ప్రతిది బతకాలె. సుఖశాంతులతో జీవించాలె. ఈ సమాజం అందంగ ఆనందంగ బతకడానికి ఎవరెవరు ఏ విధంగ మసలుకోవాలో నేర్పించే అనేక పదాల అల్లికే మన బతుకమ్మ పాటలు. దాదాపుగా ఈ పాటలన్ని ఉయ్యాలో, కోల్, వలలో, సందమామ వంటి పునరావృతాలు, మకుటాలతో సుదీర్ఘంగ సాగుతుంటయి.

పూర్వం కాశ్మీర దేశాన్ని పరిపాలించే ధర్మాంగుడను రాజు ఆదిశేషున్ని పూజించగ

అతడే తన ఇంట పాముగ జన్మించిన కథను ఇతి వృత్తంగ తీసుకొని అల్లిన కథలు పాటలు బతుకమ్మ పాటల్లో మనకు బాగా వినపడతయి. వాస్తవానికి మనిషికి పాము జన్మించడం మళ్ళీ ఆ పాము మనిషి రూపంలోకి మారడం వంటి సంఘటనలు ఎక్కడ ఎప్పుడు జరగలేదు. జరగవు కూడ. అయితే శాస్త్ర జ్ఞానం లేని రోజుల్లో ఇలాంటి కథలకు బహుళ ప్రాచుర్యం, ఆదరణ ఉండేది. అందులో భాగంగానే బాలనాగమ్మ చరిత్ర, వీరబ్రహ్మగారి చరిత్ర, సావిత్రి సత్యవంతుల చరిత్ర, సీతాదేవి చరిత్ర వంటి అంశాలే కాకుండ రైలు ప్రమాదాలు, ప్రముఖుల చావులు, పార్టీల నాయకుల మీద కూడ ఉయ్యాల పాటలు కైగట్టి ఆశువుగా పాడడం జరిగింది. కాని ఇలాంటి అంశాల మీద లెక్కలేనన్ని పరిశోధనలు జరిగి శాస్త్ర సాంకేతిక రంగం ఎంతగానో అభివృద్ధి చెంది మానవుడు చంద్రమండలానికి వెళ్ళి తిరిగివస్తున్న ఈ సమయంలో మనిషి వేసే తప్పటడుగులు చూస్తుంటే బాధ కలుగుతుంది. కథల్ని అర్థం చేసుకొని అందులోని వాస్తవ కోణాన్ని ఆలోచించాల్సిన అవసరం ఉన్నది. చెప్పేవానికి వినేవాడు లోకువన్నట్టు ఎవ్వరు ఏంచెప్పినా అదే వాస్తవం అనుకుంటే పొరపాటు.

ప్రకృతి అణువణువులో అద్భుతమైన సంగీతం ఉన్నది. శాస్త్రీయ సంగీతానికి పునాది జానపద సంగీతం. జానపదుల పని పాటల్లో వారికి తెలియకుంటనే పైకి ఉబికి వచ్చే అప్రయత్న సంగీతమే పాటలు. శ్రమను, అలసటను మరిపింపజేసేవే జానపదాలు. ఈ జానపదాలు ఏడుపు, నవ్వు, కొలుపులు, శోకాలు, లాలిపాటలు, జోల పాటలు కోకొల్లలుగ ఉన్నయి. చేపలకు ఎవరు ఈత నేర్పలేరన్నట్టుగ, జానపదులకు ఎవరు పాటలు నేర్పవలసిన అవసరం లేదు. .

భిన్నత్వంలో ఏకత్వాన్ని నిరూపించే మూడు శక్తులు మాట, పాట, ఆట. అవే శబ్దం, నాదం, లయ. సాహిత్యం, సంగీతం, నృత్యం. వాస్తవానికి జానపదులు అదృశ్య వాగ్గేయకారులు. అద్భుత లయకారులు. జానపదులు అనేక పనుల్లో నిమగ్నమై పండుగలు, పబ్బాలు, శుభకార్యాలు, నోములు, పూజలు, పుట్టుకలు, చావులు, కష్టాలు, సుఖాలు, బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం నిత్యజీవితంలో వాళ్ళకు ఎదురయ్యే ఎన్నో సంఘటనలే జానపదుల గేయాలకు వస్తువులు.

వాళ్ళ పదాలలోని యతి, ప్రాసలు లయను సృష్టిస్తయ్. అందుకే జానపదులకు లయ ప్రాణం. అందుకే వాళ్ళు ఎప్పుడు లయతప్పరు. జానపదుల జీవితాల్లోను, వాళ్ళ పాటల్లోను హాస్యం, శృంగారం పాలు అధికంగ ఉంటుంది. బతుకమ్మ పాటల్లో కూడ మనకు అదే కనిపిస్తుంది. ఈ విధంగ బతుకమ్మ తెలంగాణ జీవన సారంగ మిగిలింది.

బతుకమ్మను నీటిలోనే ఎందుకు నిమజ్జనం చేయాలంటె నిజమైన బతుకెప్పుడు నీటిలోనే కలుస్తుంది. నీటిలోనే కరుగుతుంది. అమ్మ కడుపులోని బిడ్డకు ఊపిరి ఉమ్మనీరే. నీరు తల్లి ఒడి. ఉమ్మనీరు మొదలు జీవి అంతిమ ఘడియల దాక నీటి మీదనే ఆధారపడి

ఉంటడు. బతకడానికి నీరు కావాలె. బాగు పడడానికి నీరు కావాలె. నీరు లేకపోతే బతుకు ఎడారైతది. వలసపాలకుల కుట్రలతో నెర్రెలుబట్టిన తెలంగాణ గోసను, నీటి విలువను అర్థం చేసుకున్న మన ప్రభుత్వం చెరువులను బాగుచేసే పనిలో పడ్డది. బతుకును సవరించుకొని, భవిష్యత్తును నిర్దేశించుకునే మార్గాన్ని అన్వేషిస్తుంది.

ఇట్లాంటి ఒక అద్భుతమైన పండుగను క్రమంగ ఈ వలసాంధ్ర పాలకులు అనేక విధాలుగ అవమానించిండ్రు. అందుకే ఈ రోజు మనం సాధించుకున్న మన తెలంగాణ రాష్ట్రంలో బోనాలు, బతుకమ్మలను రాష్ట్ర పండుగలుగ గుర్తించుకొని అంగరంగ వైభవంగ వేడుకలు నిర్వహించుకున్నం. ఈ వేడుకల్లో తెలంగాణ ప్రజలు మాటలకందని అనుభూతిని, ఆనందాన్ని వ్యక్తం చేసిండ్రు. అయితే కొందరిలో మాత్రం ఎంగిలిపువ్వు బతుకమ్మ, సద్దుల బతుకమ్మ ఈ రెండు రోజులేగా బతుకమ్మ ఆడేది మిగతా రోజులల్లో వాకిళ్ళలో చిన్నపిల్లలను కూర్చోబెట్టి వాళ్ళ చుట్టూ చప్పట్లు కొడుతూ బతుకమ్మ పాటలు పాడే వాళ్ళమని అనుకున్నరు. కాని ఈసారి తెలంగాణ రాష్ట్రంలో తొలి బతుకమ్మ పండుగ కాబట్టి ప్రభుత్వం ఈ విధంగ చేసిందని, ఇట్ల జరగడం కూడ మంచిదేనని అనుకున్నరు. సీమాంధ్ర పాలనలో ఎదుర్కొన వివక్షకు ఇది చెంపదెబ్బ లాంటి సమాధానమని సంబూరపడ్డరు.

బతుకమ్మ. నిండు నూరేళ్ళు చల్లగ బతుకమ్మ. ఇది దీవెన.

పుట్టినోల్లు పుట్టినట్టే పోయి పుట్టెడు దుఃఖాన్ని మిగిలిస్తుంటె సర్వస్వం కోల్పోయినట్టయ్ నువ్వయిన బతుకమ్మ అని చేతులెత్తి దీనంగ ఆకాశాన్ని అర్థిస్తడు. శూన్యంలోకి చూసి సృష్టిని కలగంటడు. ఇది ఆకాంక్ష.

బతుకమ్మ అని మనం అంటే ఇంకొకడు వ్యంగ్యంగ, వెటకారంగ వాని విజ్ఞానాన్ని కలెగలిపి, ఏదో అద్భుతాన్ని కనుగొన్నట్టు బతుకయ్య అంటూ వెక్కిరిస్తడు. నిజమే అమ్మ ఉన్నప్పుడు అయ్య కచ్చితంగ రావల్సిందే. అండ్ల ఎట్లాంటి అనుమానం లేదు. కాని ఇక్కడ అమ్మ మాత్రమే కావాలె. ప్రకృతికి ప్రతిరూపమైన అమ్మ బతికితే అందరు బతికినట్టే. కాబట్టి అమ్మని బతుకించుకోవాలె. ఆడపిల్లని బతకనియ్యాలె. పువ్వుల్లో పెట్టి చూసుకొని పెంచి పెద్దజెయ్యాలె. అప్పుడే ఈ పుడమి పులకరిస్తది. అందుకనే బతుకమ్మ అన్నరు.

“ఆడది లేని ఇల్లు అడవితో సమానమన్నరు”. తల్లి లేనిదే తనువెక్కడినించి ఊడిపడ్తది. అందుకనే  బతుకమ్మ అన్నరు.

అన్నం పెట్టమని అడిగితే సున్నం బెట్టేటోనికి అమ్మ విలువ ఎట్ల అర్థమైతది?

అందుకనే వాడు బతుకయ్య అంటడు. అర్థంలేని హాస్యాన్ని పండిస్తందుకు తల్లిని, పెండ్లాన్ని ఒక్కటిజేసి మాట్లాడ్తడు. నిజాయితీ లేని బతుకులు ఎన్ని ఏశాలేస్తే మటుకు ఏం ఉంటది? పువ్వులోలె రెండ్రోజులు బతికినా చాలు. పురుగులై ఎన్నేండ్లు బతికితే మటుకు ఏం ప్రయోజనం. అదే మన బతుకమ్మ ఈ సమాజానికి అందించిన స్ఫూర్తి, సందేశం.

## రచయిత పరిచయము



పూర్తిపేరు : అంబటి వెంకట నరసింహా
కలం పేరు : అంబటి వెంకన్న
తల్లి దండ్రులు : మణెమ్మ – గురువయ్య,
కులం : బెస్త (బి.సి.ఎ)
పుట్టిన తేది : 12–04–1974,
విద్యార్హతలు : ఎం.ఎ. ఇంగ్లీష్, బి.ఎడ్., ఎం.ఎ జానపద కళలు
చిరునామా : 7–1–155/డి9/7, శ్రీనగర్ కాలనీ, పానగల్‌రోడ్, నల్లగొండ. 9966376072
వివాహం : ఫిబ్రవరి 08, 1996
భార్య : సరోజ
పిల్లలు : వెన్నెల, వేకువ

**ప్రచురించిన పుస్తకాలు :** కదురు, తుంగు, జిల్లెడుపూలు, మబ్బులు, గోగుమల్లెలు, వడిసెల

**పాటల సీడీలు :** తెలంగాణ బతుకమ్మపాటలు, తెలంగాణ గౌడ్ కల్లుపాట, జంభూరాజ్జెం, సందమామలు, బెస్తోల్ల పోరుబాట, సర్దార్ సర్వాయి పాపన్న పాటలు, తెలంగాణ దేవులాట, జైజై తెలంగాణ

**సినిమా పాటలు :** జైబాలాజి,

**నటుడిగా :** కోహినూర్, పౌరుడు, హుష్‌కాకి, నైవేద్యం నాటికలు జైబోలోతెలంగాణ సినిమా

**అంబేద్కర్ ఫెలోషిప్ అవార్డు:** 2006లో భారతీయ దళిత సాహిత్య అకాడమీ ఢిల్లీ వారి చేత